www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
శనివారం | 9-3-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 64 సంచిక (Issue) : 324
శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, మాఘమాసం, బహుళపక్షం; తిథి: చతుర్దశి సా. 6.19 తదుపరి అమావాస్య; నక్షత్రం: ధనిష్ఠ ఉ. 7.56, శతభిషం తె.4:56 వరకు; వర్జ్యం: మ. 2.14-3.38; దుర్ముహూర్తం: ఉ. 6.32-8.06; అమృతఘడియలు: రా. 10.38-12.02; రాహుకాలం: ఉ. 9.00-10.30; సూర్యోదయం: 6.32; సూర్యాస్తమయం: 6.21 | విజయవాడ సిటీ**
Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

హరోంహర!



శైవక్షేత్రాలు కిటకిట

కమనీయంగా ఆదిదంపతుల కల్యాణం

శ్రీశైలంలో మహారుద్రాభిషేకం, పాగాలంకరణ 12

జనసంద్రమైన శ్రీగిరి, కోటప్పకొండ, పంచారామాలు

శ్రీశైలంలో శుక్రవారం అర్ధరాత్రి వైభవంగా సాగిన పాగాలంకరణ



అద్దంలా తెలంగాణ

తెలంగాణలో అద్దంలా మెరిసి పోతున్న భద్రాచలం-పర్ణశాల ఆర్అండ్‌బీ రోడ్డు



అధ్వానంగా ఆంధ్రా..

భద్రాచలం-పర్ణశాల మార్గంలో ఏపీలోని అల్లూరి జిల్లా ఎటపాక మండలం చింతల గూడెం వద్ద రోడ్డు దుస్థితి

ఒకటే రోడ్డు.. అటు అలా ఇటు ఇలా

భద్రాచలం-పర్ణశాల మార్గంలో రెండు రాష్ట్రాల అనుసంధాన రోడ్డు దుస్థితి ఇదీ

మరమ్మతునూ పట్టించుకోని జగన్ సర్కారు

అల్లూరి జిల్లాలో దారంతా గుంతలమయం

ఈ ఫొటోల్లో ఉన్న రోడ్లను చూశారా..! ఒకవైపు చిన్న గతుకన్నదీ లేకుండా 4 లేన్ల రహదారి అద్దంలా మెరిసిపోతోంది. మరోవైపు తారు కొట్టుకుపోయి పెద్ద గొయ్యిలా తయారైంది. తెలంగాణ, ఆంధ్రాను అనుసంధానం చేసే రోడ్డు ఇది. తెలంగాణలో ఎంతో నాణ్యతగా, ఏపీలో చాలా అధ్వానంగా ఉంది. తెలంగాణలో

మిగతా 11వ పేజీలో...

అలల వంతెన చెల్లాచెదురు..! 12

మరో మూడు ముక్కలైన ఫ్లోటింగ్ బ్రిడ్జి



మీ కలలకు మా రెక్కలు!

ఆడబిడ్డలకు టీడీపీ ప్రత్యేక పథకం

యువతుల ఉన్నత విద్యకు భరోసా 11

ఇంటర్ పూర్తయ్యాక పైచదువులకు రుణం

ప్రభుత్వ పూచీకత్తు.. వడ్డీ కూడా చెల్లింపు

అధికారంలోకి రాగానే అమలు చేస్తాం

మహిళా దినోత్సవాన చంద్రబాబు ప్రకటన



పత్తికొండ నియోజకవర్గంలో 'కలలకు రెక్కలు' బ్రోచర్‌ను విడుదల చేస్తున్న నారా భువనేశ్వరి

'బంగారు' బాటలో ముడుపులు

ఏపీలో నాయకులకు, తెలంగాణలో అధికారులకు లంచాలివ్వడంలో ఓ డిస్టిలరీ కొత్త పుంత

షాపుల నుంచి బంగారం కొన్నట్లు రికార్డుల సృష్టి

ఆయా దుకాణాలకు చెక్కులు ఇచ్చి.. నగదుగా వెనక్కి!

చెక్కులను నగదుగా మార్చినందుకు 6% కమీషన్

మిగతా సొమ్ము నేతలు, అధికారులకు లంచం

కొన్న బంగారాన్ని డీలర్లకు గిఫ్ట్‌గా ఇచ్చినట్టు రికార్డులు

ఇలా ఒక్క ఏడాదిలో రూ.360 కోట్ల లావాదేవీలు

నగల దుకాణ యజమానులకు ఇచ్చిన కమీషన్ పోను

నాయకులు, అధికారులకు రూ.340 కోట్ల సమర్పణ

అధిక భాగం ఆంధ్రప్రదేశ్‌లోని ఓ 'బిగ్‌షాట్'కే!

తెలంగాణలో అధికారులకు ముట్టింది 15 కోట్లే

ఓ అధికారి భార్య ఆస్పత్రి పెట్టుకోవడానికి 'సర్దుబాటు'

ఐటీ అధికారుల దాడులతో వెలుగులోకి దందా 11



బాకారాయుళ్లకే బదిలీలు!

కొత్త పోస్టులు సృష్టించి మరీ భజనపరులకు అందలాలు

గత సీఎస్ శర్మ కాదన్నారు.. ప్రస్తుత సీఎస్ చేసేశారు

సజ్జల ఓఎస్డీకి సానుకూల బదిలీ

రాష్ట్రంలో అరాచక పోస్టింగులు

సీఎం జగన్ మార్క్ ట్రాన్స్‌ఫర్లు

సెంట్రల్ నుంచి స్టేట్ సర్వీస్‌లోకి

జిల్లా కేడర్ నుంచి రాష్ట్ర కేడర్‌కు

ప్రెసిడెన్షియల్ ఆర్డర్‌కు విరుద్ధంగా వైసీపీ సర్కారు బదిలీల బంతాట

ఉద్యోగులకేమో మొండిచేయి

తల్లడిల్లుతున్న 2 వేల మంది 12

రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా వింత వింత పోస్టింగులతో తన భజనపరులను సీఎం జగన్ కీలకమైన పోస్టుల్లో కూర్చోబెడుతున్నారు. ప్రెసిడెన్షియల్ ఆర్డర్‌కు విరుద్ధమైనా, నిబంధనలంటూ లేని మార్గాల్లో కూడా తన వారిని అందలం ఎక్కిస్తున్నారు. ఇదేసమయంలో తెలంగాణ, ఏపీ రాష్ట్రాల సీఎస్‌లు కలిసి నిర్ణయించిన నిబంధనల ప్రకారం ఉద్యోగులను ఏపీ నుంచి తెలంగాణకు పంపడానికి మాత్రం సర్కారుకు మనసు రావడం లేదు. ఫలితంగా 2 వేల మంది ఉద్యోగులు 'పిల్లలక్కడ.. మేమిక్కడ' అంటూ తల్లడిల్లుతున్నారు.

నేడే పొత్తుపొడుపు

టీడీపీ-జనసేన-బీజేపీ దోస్తీపై అధికారిక ప్రకటన!

బీజేపీ-జనసేనకు 8 లోక్‌సభ, 30 అసెంబ్లీ స్థానాలు

సీట్ల సంఖ్యపై ఐదు నిమిషాల్లోనే నిర్ణయం

ఎంపీ స్థానాలు తమకు కీలకమన్న అమిత్ షా

గౌరవప్రద సంఖ్యలో కేటాయించాలన్న బీజేపీ

జగన్ పాలనకు తెర దించడమే ఉమ్మడి లక్ష్యం

23 ఎంపీ సీట్లు ఖాయమని బీజేపీ అంచనా

వైసీపీ పాలనపై కీలక వర్గాల నుంచి నివేదిక

అరాచక పాలనకు మద్దతివ్వకూడదని నిర్ణయం

ఏపీని అగ్రస్థానంలో నిలిపే దిశగా కార్యాచరణ

(న్యూఢిల్లీ - ఆంధ్రజ్యోతి)

తెలుగుదేశం - జనసేన - బీజేపీ మధ్య పొత్తు ఖరారైంది. శనివారం అధికారిక ప్రకటన చేయడమొక్కటే మిగిలింది. బీజేపీ పెద్దల ఆహ్వానం మేరకు ఢిల్లీకి వెళ్లిన టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు, జనసేన అధిపతి పవన్ కల్యాణ్ గురువారం రాత్రి కేంద్ర హోంమంత్రి అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాతో భేటీ అయిన సంగతి తెలిసిందే. అత్యంత విశ్వసనీయ సమాచారం ప్రకారం... సుమారు గంటన్నరపాటు జరిగిన ఈ భేటీలో తొలి ఐదు నిమిషాల్లోనే సీట్ల సర్దుబాటు అంశం కొలిక్కి వచ్చింది. ఆ తర్వాత.. ఏపీలో పరిస్థితులు, పోరాట వ్యూహం, 'కూటమి' విజయం సాధించిన తర్వాత తీసుకోవాల్సిన నిర్ణయాలపైనే చర్చ జరిగింది. ఎన్నికల్లో కలిసికట్టుగా పోటీ చేసి... ఏపీలో జగన్ సాగిస్తున్న ఐదేళ్ల



మిగతా 11వ పేజీలో..

ఎన్నికల వేళ.. వంటగ్యాస్ 100 కట్! 2



నారీశక్తిపై భారం తగ్గించేందుకే!

మహిళా దినోత్సవాన మోదీ ప్రకటన

పెట్రోలు, డీజిల్ రేట్లు యథాతథం

5 రాష్ట్రాల ఎన్నికల టైంలోనూ..

ఆగస్టులో గ్యాస్‌పై 200 తగ్గింపు

నాడు 3చోట్ల బీజేపీకి భారీ విజయం

రాజ్యసభకు సుధామూర్తి



నామినేట్ చేసిన రాష్ట్రపతి ముర్ము

మీ నియామకం నారీశక్తికి నిదర్శనం

ప్రధాని మోదీ శుభాకాంక్షలు 2

మహిళా దినోత్సవ కానుక: సుధ

రేపటి నుంచి గ్రానైట్ పరిశ్రమల మూత

జగన్ సర్కారు దెబ్బకు 50 కోట్లకు మునిగిపోయాం

భూసర్వే రాళ్లు తయారుచేశాం

ఇప్పటికి ఒక్కటీ కొనలేదు

విద్యుత్ చార్జీలు పెంచేశారు

రాయల్టీ తగ్గించినా అమలేదీ?

ఇచ్చిన హామీలు నెరవేర్చండి

సీఎంకు యజమానుల వినతి 12



పుట్టపర్తి శంఖారావం సభకు హాజరైన జనం, ప్రసంగిస్తున్న లోకేశ్

అభివృద్ధి, సంక్షేమంపై చర్చకు సిద్ధమా?

సమయం, స్థలం ఖరారు చెయ్.. జగన్‌కు లోకేశ్ సవాల్

విజయసాయి, సజ్జలను పంపుతానంటే కుదరదు.. జగనే రావాలి

ఆయన చెడ్డీ వేసుకున్నప్పుడే అభివృద్ధిని బాబు పరిచయం చేశారు

ఎన్నో పరిశ్రమలూ తెచ్చారు.. వాటిని నాశనం చేసిన ఘనత జగన్‌దే

చెత్తపైనా పన్నువేసిన సైకో.. ప్రజలే తరిమికొట్టాలి: టీడీపీ యువనేత

పుట్టపర్తి, కదిరి నియోజకవర్గాల్లో సభలు.. నేడు విరామం 11

హైదరాబాద్‌కు లోకేశ్.. రేపు ఉరవకొండలో పునఃప్రారంభం

దొంగల ప్రభుత్వాన్ని ఇంటికి పంపాలి

టీడీపీని గెలిపిద్దాం

చంద్రబాబును సీఎం చేద్దాం: భువనేశ్వరి 3

అహో.. ఏఐ టీచరమ్మ!

కేరళలోని ఓ స్కూల్లో టీచర్ బొమ్మ అద్భుతాలు

» 'కృత్రిమ మేధస్సు టీచరమ్మ' దేశంలోనే తొలిసారి

తిరువనంతపురం, మార్చి 8: ఇప్పటికే కొన్ని కంపెనీలు కృత్రిమ మేధస్సు (ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్-ఏఐ) ద్వారా యాంకర్లు, మోడళ్లను ప్రవేశపెట్టి ఔరా అనిపించాయి. అక్షరాస్యత శాతంలో ముందుండి.. విద్యారంగంలోనూ అద్భుతాలు సృష్టిస్తున్న కేరళలో ఓ 'ఏఐ టీచరమ్మ' వచ్చేసింది! తరగతి గదిలోకొచ్చి కరచాలనం చేస్తూ విద్యార్థులందరినీ పరిచయం చేసుకోవడమే కాదు.. వినసొంపైన స్వరంతో చక్కగా పాఠం కూడా చెప్పింది. అనంతరం విద్యార్థులడిగిన సందేహాలన్నింటినీ అంతే చక్కగా నివృత్తి చేసింది. 'అటల్ టింకరింగ్ ల్యాబ్ ప్రాజెక్టు'లో భాగంగా మేకర్‌ల్యాబ్స్ ఎడ్యుటెక్ సహకారంతో ఈ 'టీచరమ్మ కాని టీచరమ్మ'ను రూపొందించారు. చక్కని హెయిర్ క్రాఫ్, చీరకట్టులో మెడలో బంగారు నగల మాదిరిగా మైక్రో ఫోన్స్, స్పీకర్లు తగిలించుకొని తిరువనంతపురం కల్లంబలం ప్రాంతంలోని కేటీసీటీ పాఠశాలలో అడుగుపెట్టిన ఈ 'టీచర్ బొమ్మ'కు 'ఐరిస్' అని పేరు పెట్టారు. ఈ



ఐరిస్.. అన్ని భాషల్లోనూ పాఠాలు చెప్పగలదు. కుడి, ఎడమ చేతులతోనూ బాణాలు వేసే నైపుణ్యం గల సవ్యసాచి మాదిరిగా.. ఏ వైపు నుంచి సందేహాలు వ్యక్తమైతే ఆ వైపునకు తలను బొంగరంలా తిప్పుతూ అర్థమయ్యేలా వివరించనూ గలదు. అయితే ఈ 'ఐరిస్'తో ఓ చిక్కుంది! స్కూల్ పిల్లలు అంటేనే అల్లరికి చిరునామా. తరగతి గదిలో గోల గోల చేస్తుంటారు. అయితే విద్యార్థుల అల్లరితో తరగతి గది గందరగోళంగా ఉంటే మాత్రం ఈ ఏఐ టీచరమ్మ పాఠాలు చెప్పదట!! విద్యార్థులంతా ఈ ఐరిస్ టీచింగ్‌ను తెగ ఆసక్తిగా విన్నారు! కారణం.. ఈ టీచరమ్మను కోపమే రాదు.. పిల్లలపై విసుక్కోదట కూడా! అందునా హోం వర్క్ ఇవ్వదట! ఏఐ టీచర్‌ను రూపొందించడం దేశంలోనే తొలిసారి అని చెబుతున్నారు. తరగతి గదిలో విద్యార్థులకు ఐరిస్ పాఠాలు చెబుతున్న దృశ్యాలు నెట్‌లో వైరల్ అవుతున్నాయి. అయితే.. ఈ ఐరిస్, స్కూల్లోని టీచింగ్ స్టాఫ్‌కు సపోర్టివ్ సిస్టమ్‌గానే ఉంటుందని స్కూల్ ప్రిన్సిపల్ మీరా సురేశ్ చెప్పారు.

ఏడాదికి మూడుసార్లు సీఏ పరీక్షలు

» ఫౌండేషన్, ఇంటర్‌లకు అవకాశం

న్యూఢిల్లీ, మార్చి 8: ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా(ఐసీఏఐ) సీఏ ఫౌండేషన్, ఇంటర్ పరీక్షలను ఏడాదికి మూడుసార్లు నిర్వహించాలని నిర్ణయించింది. గురువారం నిర్వహించిన ఐసీఏఐ సమావేశంలో ఈమేరకు నిర్ణయం తీసుకున్నారు. ఏటా జనవరి, మే/జూన్, సెప్టెంబరు నెలల్లో ఈ పరీక్షలను నిర్వహించాలని నిర్ణయించారు. ఈ ఏడాది నుంచే దీన్ని అమలు చేస్తారు. గతంలో ఏటా జనవరి, మే/జూన్ నెలల్లో మాత్రమే వీటిని నిర్వహించేవారు. విద్యార్థులకు సౌలభ్యంగా ఉండేందుకు ఏడాదికి మూడుసార్లు నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నట్లు ఐసీఏఐ ఒక ప్రకటనలో వెల్లడించింది. ఆయా పరీక్షల మధ్య వ్యవధిని కూడా రెండు నెలలు తగ్గించినట్లు ప్రకటించింది. తద్వారా విద్యార్థులు ఎక్కువ కాలం వేచి చూడకుండా పరీక్షలు రాసే అవకాశం లభిస్తుందని వెల్లడించింది.

లోకం తీరు



రాజ్యసభకు సుధామూర్తి

నామినేట్ చేసిన రాష్ట్రపతి ముర్ము



న్యూఢిల్లీ/బెంగళూరు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ విద్యావేత్త, రచయిత్రి, ఇన్ఫోసిస్ ఫౌండేషన్ మాజీ చైర్‌పర్సన్ సుధామూర్తి(73)ని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రాజ్యసభకు నామినేట్ చేశారు. ఈ విషయాన్ని ప్రధాని మోదీ శుక్రవారం 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. 'సామాజిక, విద్యారంగంలో, దాతృత్వంలో సుధామూర్తి సేవలు స్ఫూర్తిదాయకం. పెద్దల సభలో ఆమె ఉనికి నారీశక్తికి తిరుగులేని నిదర్శనం. ఆమె పదవీకాలం ఫలప్రదమవ్వాలి' అని ఆకాంక్షించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజున సుధామూర్తిని రాజ్యసభకు ఎంపిక చేయడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. 2006లో పద్మశ్రీ అవార్డు అందుకున్న ఆమెకు.. నిరుడు పద్మభూషణ్ పురస్కారం కూడా లభించింది. మహిళా దినోత్సవాన తనను రాజ్యసభకు ఎంపిక చేయడం రెట్టింపు విస్మయానికి గురిచేసిందని సుధామూర్తి అన్నారు. ప్రస్తుతం థాయ్‌లాండ్‌లో ఉన్న ఆమె.. 'చాలా సంతోషంగా ఉంది. నా కృషిని మోదీ గుర్తించారు. ఆయనకు ధన్యవాదాలు. ఇది మహిళాదినోత్సవం సందర్భంగా ప్రధాని నాకు ఇచ్చిన కానుక. పేదల కోసం పనిచేసేందుకు పెద్ద వేదిక దొరికినందుకు ఆనందంగా ఉంది' అని అన్నారు.

ఎస్‌బీఐ వినతిపై 11న సుప్రీం విచారణ

న్యూఢిల్లీ, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల బాండ్ల వివరాలు వెల్లడించేందుకు మరింత సమయం కావాలన్న ఎస్‌బీఐ అభ్యర్థనపై ఈ నెల 11న సుప్రీంకోర్టులో విచారణ జరగనుంది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్ నేతృత్వంలోని ఐదుగురు జడ్జీల ధర్మాసనం విచారణ జరపనుంది. ఎన్నికల బాండ్ల వివరాలను ఈ నెల 6వ తేదీలోపు కేంద్ర ఎన్నికల సంఘానికి సమర్పించాలని ఎస్‌బీఐని ఇంతకుముందు సుప్రీంకోర్టు ఆదేశించింది. అయితే జూన్ 30 వరకు గడువు పెంచాలని కోరుతూ ఎస్‌బీఐ పిటిషన్ వేసింది. దీనిపైనే సోమవారం ధర్మాసనం విచారణ జరపనుంది. కాగా, సకాలంలో వివరాలు ఇవ్వకుండా ఎస్‌బీఐ కోర్టు ధిక్కరణకు పాల్పడిందని అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రీఫామ్స్(ఏడీఆర్), కామన్ కాజ్ అనే స్వచ్ఛంద సంస్థలు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశాయి.

ఇంకా జైల్లోనే ఉన్నట్లనిపిస్తోంది: సాయిబాబ

న్యూఢిల్లీ, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): తానింకా జైల్లోనే ఉన్నట్లనిపిస్తోందని మాజీ ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబ అన్నారు. జైల్లో తాను పడిన కష్టాలను గుర్తు చేసుకొని ఆయన భావోద్వేగానికి గురయ్యారు. మావోయిస్టులతో సంబంధాల కేసులో నిర్దోషిగా విడుదలైన ఆయన.. శుక్రవారం ఢిల్లీలో మీడియాతో మాట్లాడారు. 'నాకు మీరు (మీడియా) మద్దతు ఇచ్చినందుకు.. ఆస్పత్రికి వెళ్లే బదులు.. ముందే మీతో మాట్లాడాలనే వచ్చాను. నేనింకా జైలు గదిలో మగ్గుతున్నట్లే ఉంది. నా తరఫున కేసులో పోరాడిన న్యాయవాదులందరికీ కృతజ్ఞతలు. అందులో ఒకరు ఫీజు కూడా తీసుకోలేదు. విచారణ సందర్భంగా కొందరు పోలీసు అధికారులు నా న్యాయవాదులను బెదిరించారు' అని అన్నారు. తనపై ఉగ్రవాదిగా ముద్ర వేశారని సాయిబాబ కన్నీళ్లు పెట్టుకున్నారు. కాగా, సాయిబాబను నిర్దోషిగా ప్రకటిస్తూ బాంబే హైకోర్టు ఇచ్చిన తీర్పుపై మహారాష్ట్ర సర్కారు సుప్రీంకోర్టును ఆశ్రయించింది. 11వ తేదీన ఈ పిటిషన్‌పై విచారణ జరగనుంది.

శరద్ పవార్ మనుమడి షుగర్ ఫ్యాక్టరీ జప్తు

ముంబయి, మార్చి 8: ఎన్‌సీపీ వ్యవస్థాపకుడు శరద్ పవార్ సోదరుని మనుమడు రోహిత్ పవార్‌కు చెందిన చక్కెర కర్మాగారాన్ని శుక్రవారం ఈడీ అటాచ్ చేసింది. ఔరంగాబాద్ జిల్లాలోని కన్నాడ్ గ్రామంలో ఉన్న సహకార చక్కెర కర్మాగాన్ని జప్తు చేసింది. ఈ కర్మాగారానికి చెందిన 161.30 సెంట్ల స్థలం, ప్లాంటు, యంత్రాలు, భవనాలను తన ఆధీనంలోకి తెచ్చుకుంది. వీటి విలువ సుమారు రూ.50 కోట్లు ఉంటుంది. 38 ఏళ్ల రోహిత్ ప్రస్తుతం కర్జాత్-జమ్‌ఖేడ్ నియోజకవర్గం ఎమ్మెల్యేగా కూడా ఉన్నారు. అజిత్ పవార్ పార్టీ నుంచి నిష్క్రమించిన తరువాత శరద్ వర్గం ఎన్‌సీపీలో ఆయన బలమైన నేతగా ఎదిగారు. మనీలాండరింగ్‌కు పాల్పడ్డారన్న ఆరోపణలపై ఈడీ ఆయనపై కేసు నమోదు చేసింది. రేషన్ కుంభకోణంలోనూ పాత్ర ఉందన్న ఆరోపణలపై ఇంతకుముందు విచారణ జరిపింది కూడా. మహారాష్ట్ర సహకార బ్యాంకులో రూ.25వేల కోట్ల కుంభకోణం జరిగిందన్న ఆరోపణలపై కూడా జనవరి నెలలో రోహిత్‌ను పది గంటల పాటు విచారించింది. ఫిబ్రవరి నెలలోనూ ప్రశ్నించింది.

డిబ్రూగఢ్ జైలు సూపరింటెండెంట్ అరెస్టు

డిబ్రూగఢ్, మార్చి 8: విధి నిర్వహణలో నిర్లక్ష్యం చూపారన్న కారణంతో అస్సాంలోని డిబ్రూగఢ్ సెంట్రల్ జైలు సూపరింటెండెంట్‌ను శుక్రవారం రాష్ట్ర పోలీసులు అరెస్టు చేశారు. ఆ జైలులోని ఖలిస్థాన్ అనుకూల ఉగ్రవాదులు స్పై కెమెరా సహా ఇతర ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్లను సంపాదించుకోగలిగినా తగిన విధంగా స్పందించలేదని పేర్కొంటూ ఈ చర్యలు తీసుకున్నారు. 'వారిస్ పంజాబ్ దే'కు చెందిన అమృత్‌పాల్ సింగ్ సహా పది మందిని పంజాబ్‌లో అరెస్టు చేసిన జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఎస్ఏ) వారిని గత నెలలో ఈ జైలుకు డిటెన్యూలుగా పంపించింది. జైలులో ఉండగానే వారు స్మార్ట్ ఫోన్, సిమ్‌కార్డు, కీప్యాడ్ ఫోన్, స్పై కెమెరా పెన్, పెన్‌డ్రైవ్, బ్లూటూత్ హెడ్‌ఫోన్లను సంపాదించుకోగలిగారు. .

జాయింట్ డిక్లరేషన్‌పై ఈపీఎఫ్‌వో ఉపశమనం

న్యూఢిల్లీ, మార్చి 8: ఉద్యోగుల భవిష్య నిధి(ఈపీఎఫ్) పథకానికి సంబంధించి ఈపీఎఫ్‌వో తాజాగా కొన్ని మార్పులు చేసింది. ఈ పథకం నిబంధనల ప్రకారం నెలకు రూ.15 వేల వేతనం పైగా అందుకుంటున్న ఉద్యోగులు మూల వేతనంపై 12 శాతం కంట్రిబ్యూషన్‌గా చెల్లించాల్సి ఉంటుంది. అయితే.. ఇప్పుడు కొందరు ఉద్యోగులకు సంబంధించి ఈ డిక్లరేషన్ ఫాం సమర్పణలో ఈపీఎఫ్‌వో కొంత ఉపశమనం కల్పించింది. ఈ మేరకు జనవరి 30న ఒక సర్క్యులర్‌ను జారీ చేసింది. తాజా సర్క్యులర్ ప్రకారం.. అధిక పింఛను కోరుకోని ఉద్యోగులు, అధిక పింఛను కోరుకుని కూడా డిక్లరేషన్ సమర్పించాలన్న నిర్దిష్ట సమయానికి(గత ఏడాది అక్టోబరు 31) ముందే సదరు సంస్థలో ఉద్యోగం మానేసిన వారు, మరణించిన ఉద్యోగుల విషయంలో డిక్లరేషన్ అవసరం లేదని స్పష్టం చేసింది.

రోడ్డు పక్కన నమాజ్ చేస్తున్న వ్యక్తిని తన్నిన ఎస్సై

» సస్పెండ్ చేసిన అధికారులు.. ఉత్తర ఢిల్లీలో ఘటన

న్యూఢిల్లీ, మార్చి 8: రోడ్డు పక్కన నమాజ్ చేస్తున్న వ్యక్తిని ఓ ఎస్సై కాలితో తన్నిన సంఘటన ఉత్తర ఢిల్లీలో చోటుచేసుకుంది. దీనిపై స్పందించిన పోలీసు ఉన్నతాధికారులు వెంటనే ఆ ఎస్సైని సస్పెండ్ చేశారు. శుక్రవారం మధ్యాహ్నం రెండు గంటల సమయంలో ఇంద్రలోక్ మెట్రో స్టేషన్ వద్ద ఉన్న మసీదు.. అసర్ కీ నమాజ్ కోసం వచ్చిన భక్తులతో నిండిపోయింది. స్థలం లేకపోవడంతో కొందరు రోడ్డు పక్కన నమాజ్ చేయడం ప్రారంభించారు. ఇది గమనించిన అక్కడి పోలీసు అవుట్ పోస్టు ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్న ఆ ఎస్సై.. నమాజ్ చేయడానికి వంగొని ఉన్న వ్యక్తిని కాలితో తన్నారు. మరో వ్యక్తి తలపై కొట్టారు. ఈ సంఘటన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారడంతో ఆగ్రహం వ్యక్తం చేసిన స్థానికులు రాస్తారోకో చేశారు. నార్త్ జోన్ డీసీపీ ఎం.కె.మీనా సంఘటన స్థలానికి వచ్చి ఆందోళనకారులతో మాట్లాడారు. వీడియోను పరిగణనలోకి తీసుకొని ఆ ఎస్సైని సస్పెండ్ చేసినట్టు తెలిపారు.

వంటగ్యాస్ రూ.100 తగ్గింపు

ఎన్నికల వేళ కేంద్రంలోని బీజేపీ సర్కార్ కీలక నిర్ణయం..మహిళా దినోత్సవాన మోదీ ప్రకటన

» 'ఉజ్వల్' లబ్ధిదారులకు రూ.503కే

» తగ్గింపు ధర తక్షణమే అమల్లోకి

» పెట్రోలు, డీజిల్ రేట్లు యథాతథం

న్యూఢిల్లీ, మార్చి 8: లోక్‌సభ ఎన్నికల వేళ ప్రధాని మోదీ మహిళలకు ఓ వరం ప్రకటించారు. వంటగ్యాస్ (ఎల్‌పీజీ) సిలిండర్ ధరను రూ.100 తగ్గిస్తున్నట్లు తెలిపారు. ఇది తక్షణమే.. శుక్రవారం అర్ధరాత్రి నుంచే అమల్లోకి వచ్చింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని నారీశక్తిపై భారం తగ్గించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రధాని శుక్రవారం 'ఎక్స్'లో వెల్లడించారు. 'ఇవాళ మహిళా దినోత్సవాన ఎల్‌పీజీ సిలిండర్ ధరను రూ.100 తగ్గించాలని మా ప్రభుత్వం నిర్ణయించింది. మహిళల సాధికారత, వారి జీవన సౌలభ్యం మా లక్ష్యం. వీటికి అనుగుణంగానే ఈ నిర్ణయం తీసుకున్నాం' అని పేర్కొన్నారు. అయితే పెట్రోలు, డీజిల్ ధరల్లో మాత్రం ఎలాంటి మార్పూ లేదు. రికార్డు స్థాయిలో గత 23 నెలలుగా వీటి ధరలు నిలకడగా ఉండడం గమనార్హం. కాగా.. గత ఆరు నెలల్లో ఎల్‌పీజీ సిలిండర్ ధర తగ్గించడం ఇది రెండోసారి. గత ఆగస్టులో ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలకు ముందు సిలిండర్ ధరను రూ.200 తగ్గించారు. అలాగే ఉజ్వల యోజన (పీఎంయూవై) లబ్ధిదారులకు సిలిండర్‌పై రూ.300 వరకు సబ్సిడీ ప్రకటించారు. ఇది బీజేపీకి బాగా లబ్ధి చేకూర్చింది. రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్‌లలో భారీ విజయానికి తోడ్పడిందని రాజకీయ వర్గాలు అంటున్నాయి. దీనిని దృష్టిలో ఉంచుకునే మోదీ ఇప్పుడు మరో వంద రూపాయలు తగ్గించారని వ్యాఖ్యానిస్తున్నాయి. అంతే కాదు.. ఉజ్వల యోజన లబ్ధిదారులకు రూ.300 సబ్సిడీని వచ్చే ఏడాది మార్చి వరకు పొడిగించాలని కేంద్ర కేబినెట్ గురువారమే నిర్ణయం తీసుకుంది. వాస్తవానికి మోదీ హయాంలో గత తొమ్మిదేళ్లలో వంటగ్యాస్ ధర ఆకాశాన్నంటింది. 2020 నుంచి ఉజ్వల లబ్ధిదారులను మినహాయించి మిగతావారికి ఎల్‌పీజీ సబ్సిడీ ఇవ్వడం కేంద్రం ఆపేసింది. నిరుడు ఆగస్టులో 14.2 కిలోల సిలిండర్ ధర అత్యధికంగా రూ.1,102గా ఉండేది. దీనిపై కాంగ్రెస్, ఇతర విపక్షాలు దేశవ్యాప్తంగా పెద్దఎత్తున ఆందోళన చేశాయి. కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో రూ.500కే సిలిండర్ ఇస్తామని కాంగ్రెస్ ప్రకటించి విజయం సాధించింది కూడా. ఈ నేపథ్యంలోనే కేంద్రం గత ఆగస్టులో సిలిండర్ ధరను రూ.200 తగ్గించింది. దరిమిలా ఢిల్లీలో రూ.903కే సిలిండర్ అందుతోంది. ఇప్పుడు రూ.వంద తగ్గడంతో వినియోగదారులకు రూ.803కే అందనుంది. ఉజ్వల లబ్ధిదారులకు మాత్రం రూ.503కే లభిస్తుందని కేంద్ర పెట్రోలియం మంత్రి హర్‌దీప్ సింగ్ పూరి 'ఎక్స్'లో వెల్లడించారు. కాగా.. వంటగ్యాస్ సిలిండర్ ధరను రూ.100 తగ్గించడంతో కేంద్ర ఖజానాపై రూ.12 వేల కోట్ల భారం పడనుంది.



నేషనల్ క్రియేటర్స్ అవార్డుల కార్యక్రమంలో మోదీ

మినీ స్కర్టులతో కోణార్క్ శిల్పాలు

» ఇప్పటి ఫ్యాషన్ ఏనాడో చూపిన భారత్

» నేషనల్ క్రియేటర్స్ అవార్డుల వేదికపై మోదీ

ఆధునిక వస్త్ర శైలిని శతాబ్దాల క్రితమే ప్రపంచానికి భారత్ పరిచయం చేసిందని ప్రధాని మోదీ అన్నారు. ఫ్యాషన్ రంగంలో ఆధునిక పోకడగా భావించే మినీ స్కర్టుల ధారణను కోణార్క్‌లోని శిల్పాల్లో చూడొచ్చునని ఆయన వ్యాఖ్యానించారు. ఢిల్లీలోని భారత్ మండపంలో శుక్రవారం జరిగిన ప్రప్రథమ నేషనల్ క్రియేటర్స్ అవార్డుల ప్రధానోత్సవంలో మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు. 'కోణార్క్‌లో శతాబ్దాలకాలం నాటి విగ్రహాలు మినీ స్కర్టులు, చేతిలో పర్సుతో ఉండటం చూస్తారు' అని మోదీ తెలిపారు. యువ కంటెంట్ క్రియేటర్ జాన్వీ సింగ్‌కు హెరిటేజ్ ఫ్యాషన్ ఐకాన్ అవార్డును ఈ కార్యక్రమంలో భాగంగా మోదీ అందించారు. అవార్డు ప్రదానం తర్వాత జాన్వీతో మోదీ భారతీయ ప్రాచీక కళాత్మకతపై ఆసక్తికరమైన సంభాషణ సాగించారు. భారతీయ వారసత్వం, సంస్కృతి ఏమిటనేది వస్త్ర రంగంలో ప్రపంచానికి తెలిపే కంటెంట్‌ను తయారుచేయాలని జాన్వీ సహా అవార్డులు అందుకున్న విజేతలందరినీ మోదీ కోరారు.

ఉష్ణోగ్రతలు

కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం
కర్నూలు	40.4	25.5
తిరుపతి	39.2	23.4
నంద్యాల	39.0	27.0
అనంతపురం	39.0	25.0
విజయవాడ	36.5	24.6
ఒంగోలు	33.9	25.5
బాపట్ల	32.0	22.7

ప్రారంభమైన హెచ్ 1బీ వీసా ప్రక్రియ

ముంబై, మార్చి 8: యూఎస్ ఫెడరల్ ఏజెన్సీ ఈ ఏడాది జనవరిలో లాటరీ వ్యవస్థలో పెద్ద మార్పులను ప్రతిపాదించింది. మరోవైపు తాజా మీడియా సమావేశంలో వైట్ హౌస్ ప్రెస్ సెక్రటరీ కరీన్ జీన్ పియర్ మాట్లాడుతూ, గ్రీన్‌కార్డ్, హెచ్ 1బీ వీసా దరఖాస్తుల బ్యాక్‌లాగ్, చట్టపరమైన ఇమ్మిగ్రేషన్ వ్యవస్థలోని సమస్యల పరిష్కారానికి అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ కట్టుబడి ఉన్నారని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో 2025 ఆర్థిక సంవత్సరానికి హెచ్ 1బీ వీసా రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రకటన వెలువడింది. ఆ ప్రక్రియను క్రమబద్ధీకరించడానికి, సహకారాన్ని పెంపొందించడానికి 'ది యూఎస్ సిటిజన్‌షిప్ అండ్ ఇమ్మిగ్రేషన్ సర్వీసెస్' (యూఎస్‌సీఐఎస్)... 'మైయూఎస్‌సీఐఎస్' సంస్థాగత ఖాతాలను ప్రారంభించాలని సూచించింది. తాజా ప్రకటన ప్రకారం.. మార్చి 6న హెచ్ 1బీ రిజిస్ట్రేషన్లు ప్రారంభమయ్యాయి. మార్చి 22తో ముగుస్తాయి. ఎంపికైన దరఖాస్తుదారులను మార్చి 31న ప్రకటిస్తారు. ఏప్రిల్ 1 ఎంపికైన దరఖాస్తులను సమర్పించాల్సి ఉంటుంది.

17న ముంబైలో కాంగ్రెస్ ర్యాలీ

కేంద్రంలో అధికారంలోకి వస్తే 30 లక్షల ఉద్యోగాల భర్తీ

» వ్యవసాయ ఉత్పత్తుల మద్దతు ధరకు చట్టబద్ధత

» కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్



న్యూఢిల్లీ, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): భారత్ జోడో న్యాయ్ యాత్ర ముగింపు సందర్భంగా కాంగ్రెస్ అధ్వర్యంలో ఈ నెల 17న ముంబైలో భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ తెలిపారు. ఈ ర్యాలీకి ఇండియా కూటమిలోని భాగస్వామ్య పక్షాలను కూడా ఆహ్వానించనున్నట్లు తెలిపారు. ఏఐసీసీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో లోక్‌సభ ఎన్నికల అభ్యర్థుల తొలి జాబితాను ప్రకటించే ముందు ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక వ్యవసాయ ఉత్పత్తుల మద్దతు ధరలకు చట్టబద్ధత కల్పించేందుకు కట్టుబడి ఉందన్నారు. సమగ్ర కుల గణన చేపడతామన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక జాబ్ క్యాలెండర్ ప్రకటించి 30 లక్షల కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేస్తామన్నారు. కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లో తమ పార్టీ ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగాలను భర్తీ చేస్తున్నామని తెలిపారు. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన మూణ్నెళ్లలోపే 35 వేల ప్రభుత్వ ఉద్యోగాలను యువతకు ఇచ్చినట్టు తెలిపారు. 25 ఏళ్లలోపు డిప్లొమా అభ్యర్థుల కోసం రైట్ టు అప్రెంటిస్ చట్టం తెచ్చి నెలకు రూ.8,500 చొప్పున ఏడాదికి లక్ష రూపాయలు ఇస్తామని తెలిపారు.

ఐటీ ట్రైబ్యునల్‌లో నిరాశ

తమ బ్యాంకు ఖాతాలపై ఐటీ శాఖ చర్యలు తీసుకోకుండా స్టే విధించాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ చేసిన వినతిని శుక్రవారం ఇన్‌కమ్ ట్యాక్స్ అప్పిలేట్ ట్రైబ్యునల్ తిరస్కరించింది. దీనిపై హైకోర్టులో అప్పీలు చేయడానికి వీలుగా పది రోజుల గడువు ఇవ్వాలన్న విజ్ఞప్తిని కూడా నిరాకరించింది. 2018-19 అసెస్‌మెంట్ ఇయర్‌కు సంబంధించిన రిటర్నులను సకాలంలో సమర్పించలేదన్న కారణంతో తొలుత రూ.103 కోట్ల క్లెయిమ్ చెల్లించాలని ఆదాయపు పన్ను విభాగం కాంగ్రెస్‌ను ఆదేశించింది. తరువాత దాన్ని రూ.105 కోట్లకు సవరించింది. రూ.30కోట్ల వడ్డీతో కలిసి రూ.135 కోట్లు చెల్లించాలని ఆదేశించింది. ఫిబ్రవరి 16న ఆ పార్టీకి చెందిన బ్యాంకు ఖాతాలను స్తంభింపచేసింది. దీనిపై ట్రైబ్యునల్‌ను ఆశ్రయించగా ఖాతాల స్తంభనలో కొంత వినహాయింపు ఇచ్చింది. అయినా ఐటీ శాఖ తమ ఖాతాల నుంచి రూ.65 కోట్లను విత్‌డ్రా చేసుకుందని ఆరోపిస్తూ కాంగ్రెస్ ట్రైబ్యునల్‌ను ఆశ్రయించింది.

బీజేపీ హఠావో.. బేటీ బచావో..

మోదీ ప్రభుత్వ హయాంలో శ్రామిక శక్తిలో మహిళల భాగస్వామ్యం 20% తగ్గిందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ అన్నారు. శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆయన ఎక్స్(ట్విటర్)లో 'బీజేపీ హఠావో.. బేటీ బచావో' అని పిలుపునిచ్చారు. మహిళారెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారని బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ మీద వచ్చిన ఆరోపణలపై మోదీ ఎందుకు మౌనంగా ఉన్నారని మహిళలు ప్రశ్నిస్తున్నారని జైరాం రమేశ్ పేర్కొన్నారు.

చైనా సరిహద్దులకు భారీగా బలగాలు



» ఎల్ఏసీ వెంబడి 10వేల మంది మోహరింపు

న్యూఢిల్లీ, మార్చి 8: పొరుగు దేశాలను రెచ్చగొట్టడం, అవి ప్రతీకార చర్యలకు పాల్పడితే బెదిరింపులకు దిగడం చైనాకు అలవాటుగా మారింది. గత నాలుగేళ్లుగా వాస్తవ నియంత్రణ రేఖ(ఎల్ఏసీ) వద్ద డ్రాగన్ దేశం భారీగా దళాలను మోహరించింది. ఇప్పుడు భారత్ కూడా బలగాలను పెంచుతుండటం దానికి కంటగింపుగా మారింది. భారత్ చర్యలు సరిహద్దుల్లో ఉద్రిక్తతలను తగ్గించడంలో ఏమాత్రం తోడ్పడవని చైనా విదేశాంగ శాఖ తాజాగా వ్యాఖ్యలు చేసింది. కాగా, సరిహద్దులను పటిష్ఠం చేసేందుకు భారత్ వేలాది మంది సైనికులను మోహరించింది. గతంలో పశ్చిమ సరిహద్దులో మోహరించిన 10వేల మంది సైనికులతో కూడిన ఒక యూనిట్‌ను చైనాతో సరిహద్దులో కొంత భాగానికి కాపలాగా నియమించినట్లు సీనియర్ అధికారి ఒకరు వెల్లడించారు. వివాదాస్పద చైనా సరిహద్దు కోసం తొలుత నియమించిన 9వేల మంది సైనికుల బృందం ఇప్పుడు కొత్తగా ఏర్పాటు చేసిన పోరాట కమాండ్ పరిధిలోకి రానుంది. ఈ ఏకీకృత దళం ఉత్తరాఖండ్, హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రాల నుంచి చైనాను విభజించే 532 కిలోమీటర్ల పొడవైన సరిహద్దును కాపాడుతుంది.

రష్యాకు మానవ అక్రమ రవాణా

గుట్టును రట్టు చేశామన్న సీబీఐ


న్యూఢిల్లీ, మార్చి 8: అధిక వేతనాలు ఆశ చూపి భారత యువకులను రష్యాకు తరలించి ఉక్రెయిన్‌పై యుద్ధంలో పాల్గొనేలా చేసిన మానవ అక్రమ రవాణా ముఠా గుట్టును రట్టు చేశామని సీబీఐ ప్రకటించింది. దళారుల మాటలు నమ్మి రష్యా సైన్యంలో సహాయకుని ఉద్యోగాల్లో చేరిన ఇద్దరు భారతీయులు ఉక్రెయిన్‌తో జరుగుతున్న పోరులో ప్రాణాలు కోల్పోయారు. ఈ నేపథ్యంలో దర్యాప్తు చేపట్టిన సీబీఐ.. ఢిల్లీ, ముంబై, చెన్నై సహా దేశంలోని 13 ప్రాంతాల్లో సోదాలు నిర్వహించింది. కొన్ని ప్రైవేట్ వీసా కన్సల్టెంగ్ ఏజెన్సీలు, దళారులపై మార్చి 6న కేసు నమోదు చేసింది. పలువురు నిందితులను అదుపులోకి తీసుకుంది. దళారుల మాటల నమ్మి 35 మందికి పైగా భారతీయులు రష్యా వెళ్లారని సీబీఐ తెలిపింది. ఢిల్లీకి చెందిన ఓ కన్సల్టెన్సీ స్టూడెంట్ వీసాలతో 180 మంది భారతీయులను ఇటీవల రష్యా పంపింది. ఈ అంశంపై కూడా సీబీఐ దర్యాప్తు చేస్తోంది.

విమానం టైరు ఊడి నేలపై

» అయినా సురక్షితంగా విమానం ల్యాండింగ్

» అమెరికాలో ఘటన.. ఎయిర్‌పోర్టులో కార్లు ధ్వంసం

వాషింగ్టన్, మార్చి 8: విమానం టేకాఫ్ అయిన కొద్దిసేపట్లోనే ఓ టైరు ఊడి నేలపై పడింది. టైరు తాకిడికి విమానాశ్రయం పార్కింగ్‌లో నిలిపి ఉంచిన పలు కార్లు ధ్వంసమయ్యాయి. విమానాన్ని మరో ఎయిర్‌పోర్టుకు మళ్లించి సురక్షితంగా దింపటంతో దాంట్లోని 249 మంది ప్రయాణికులు బతుకుజీవుడా అనుకుంటూ బయటపడ్డారు. ఈ ఘటన గురువారం అమెరికాలో జరిగింది. శాన్‌ఫ్రాన్సిస్కో అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి యునైటెడ్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన బోయింగ్ 777 విమానం జపాన్‌కు బయల్దేరింది. గాలిలోకి ఎగిరిన కొన్ని సెకన్లలోనే విమానం టైర్లలో ఒకటి ఊడిపోయింది. ఎయిర్‌పోర్టు సిబ్బంది వాహనాలను నిలిపి ఉంచే ప్రదేశంలో ఆ టైరు పడటంతో పలు కార్లు ధ్వంసమయ్యాయి. విషయం తెలిసిన అధికారులు విమానాన్ని లాస్‌ఏంజెల్స్‌కు మళ్లించారు. అక్కడ విమానం సురక్షితంగా ల్యాండ్ అయ్యింది. ఈ ఘటనపై యునైటెడ్ ఎయిర్‌లైన్స్ స్పందిస్తూ.. విమానానికి ఇరువైపులా ఆరు జతల టైర్లు ఉన్నాయని, ఒకటి ఊడినా తక్షణ ప్రమాదం ఏమీ లేదని తెలిపింది. కాగా, ఈ ఏడాది జనవరిలో అమెరికాలోని పోర్ట్‌ల్యాండ్‌లో టేకాఫ్ అయిన 'బోయింగ్ 737 మాక్స్ 9' విమానం నుంచి ఓ తలుపు సైజు ప్యానెల్ ఊడి పడిపోయింది.



ఊడిపడిన విమానం టైరు

ఫిబ్రవరి మండింది!

గత నెలలో రికార్డు ఉష్ణోగ్రతలు



విశాఖపట్నం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): పసిఫిక్ మహా సముద్రంలో గతేడాది ప్రారంభమైన ఎల్‌నినో ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరి నెలల్లో గరిష్ఠ స్థాయికి చేరింది. దీనిని కొందరు వాతావరణ నిపుణులు సూపర్ ఎల్‌నినోగా పేర్కొంటున్నారు. ఎల్‌నినో కారణంగానే 2023 అత్యంత వేడి సంవత్సరంగా నమోదైంది. ఎల్‌నినో కొనసాగుతున్నందున ఈ ఏడాది జనవరితోపాటు ఫిబ్రవరిలో కూడా ప్రపంచవ్యాప్తంగా రికార్డుస్థాయి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని ప్రైవేటు వాతావరణ సంస్థ స్కైమెట్ వెల్లడించింది. ప్రపంచవ్యాప్తంగా 1991-2020 మధ్య నమోదైన ఉష్ణోగ్రతల సగటును పరిగణనలోకి తీసుకుంటే ఈ ఏడాది ఫిబ్రవరిలో 0.81 డిగ్రీల ఉష్ణోగ్రత అధికంగా నమోదైంది. గతంలో 2016 ఫిబ్రవరిలో సగటు కంటే 0.12 డిగ్రీలు ఎక్కువగా నమోదు కాగా, ఈ ఏడాది ఆ రికార్డును అధిగమించిందని స్కైమెట్ పేర్కొంది. ప్రపంచ వ్యాప్తంగా గతేడాది మొదలైన వేడి వాతావరణం 2024లో కూడా కొనసాగుతూనే ఉంది. దీంతో ఫిబ్రవరిలో రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు నమోదైనట్లు యూరప్‌లోని కోపర్నికస్ క్లైమేట్ చేంజ్ సర్వీస్ తెలిపింది. గతంలో 2015 చివరిలో పసిఫిక్ సముద్రంలో సూపర్ ఎల్‌నినో ఏర్పడడంతో 2016 అత్యంత వేడి సంవత్సరంగా నమోదైంది. గతేడాది ప్రారంభంలో పసిఫిక్ మహా సముద్రం ఉపరితల ఉష్ణోగ్రతలు అత్యంత వేడిగా మారినందున 2023ను సూపర్ ఎల్‌నినో సంవత్సరంగా నిపుణులు పేర్కొంటున్నారు. సూపర్ ఎల్‌నినో ప్రభావంతో గతేడాది జూలైలో తొలుత అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అప్పటి నుంచి ఫిబ్రవరి వరకు వరుసగా తొమ్మిదో నెలలో రికార్డు ఉష్ణోగ్రతలు నమోదుకావడం కూడా రికార్డని వాతావరణ శాఖ రిటైర్డు అధికారి ఒకరు పేర్కొన్నారు. వాతావరణం వేడెక్కడానికి ఎల్‌నినోతోపాటు మానవ ప్రేరితమైన కారణాలు కూడా ఉన్నాయని వివరించారు.

నైజీరియాలో 287 మంది విద్యార్థుల కిడ్నాప్

అబుజా, మార్చి 8: నైజీరియాలో మిలిటెంట్లు గురువారం 297 మంది పాఠశాల విద్యార్థులను సామూహికంగా కిడ్నాప్ చేశారు. తల్లిదండ్రుల నుంచి భారీగా సొమ్ము గుంజడానికే ఈ దుశ్చర్యకు పాల్పడ్డారు. కదున రాష్ట్రంలోని కురిగ టౌన్‌లో ఉన్న ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను తుపాకులతో బెదిరించి తమ వెంట తీసుకెళ్లారు. ఉదయం పాఠశాల ప్రారంభమయిన కొద్దిసేపటికే ఈ సంఘటన జరిగింది. ఇందుకు తమదే బాధ్యత అంటూ ఏ ముఠా కూడా ఇంతవరకు ప్రకటన విడుదల చేయలేదు. వారం రోజుల క్రితమే బోర్నో రాష్ట్రంలోని చిబోక్ టౌన్‌లో 200 మంది విద్యార్థినిలను ఇస్లామిక్ తీవ్రవాదులు కిడ్నాప్ చేశారు. అది మరువక ముందే మళ్లీ సామూహిక కిడ్నాప్ జరగడం గమనార్హం. మహిళలను, పిల్లలను కిడ్నాప్ చేయడం 2014 నుంచి నైజీరియాలో పెద్ద సమస్యగా మారింది. ముఖ్యంగా వాయువ్య, మధ్య రాష్ట్రాల్లో ఈ సమస్య అధికంగా ఉంది. ఇక్కడ డజన్ల కొద్దీ ఉన్న సాయుధ ముఠాలు గ్రామాలపై పడి కిడ్నాప్‌లు చేస్తుంటాయి. దారిన వెళ్లే ప్రయాణికులను కూడా విడిచిపెట్టవు. భారీగా సొమ్ము ముట్టచెప్పితే తప్ప వారిని విడుదల చేయవు. దేశంలో శాంతి భద్రతలు ప్రమాదకరంగా ఉన్నాయన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.


జస్టిస్ సందీప్ మెహతా, జస్టిస్ సాంబాజీ శివాజీ షిండే

శ్రీవారి సేవలో జస్టిస్ సందీప్ మెహతా

తిరుమల, మార్చి 8(ఆంధ్రజ్యోతి): సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ సందీప్ మెహతా శుక్రవారం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆలయంలోకి వెళ్లిన ఆయన ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకుని తర్వాత గర్భాలయంలోని మూలమూర్తిని దర్శించుకున్నారు. రాజస్థాన్ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి, ప్రస్తుత మహారాష్ట్ర రియల్ ఎస్టేట్ అప్పిలేట్ ట్రిబ్యునల్ చైర్‌పర్సన్ జస్టిస్ సాంబాజీ శివాజీ షిండే కూడా శ్రీవారిని దర్శించుకున్నారు.

ఘనంగా వేగ జ్యువెలర్స్ తొలి వార్షికోత్సవం


వేగ జ్యువెలర్స్ తొలి వార్షికోత్సవం సందర్భంగా కేక్ కట్ చేస్తున్న ఈషా రెబా

విజయవాడ, మార్చి 8: విజయవాడలోని వేగ జ్యువెలర్స్ తొలి వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఈ వేడుకల్లో సినీనటి ఈషా రెబ్బా ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ.. తమను ఆదరించి, విశ్వసించి విజయాల్లో భాగస్వాములైన ప్రతి ఒక్కరికీ సంస్థ అధినేతలు వనమా నవీన్, వనమా సుధాకర్ ధన్యవాదాలు తెలిపారు. ఈ శుభ తరుణంలో తమను ప్రోత్సహిస్తున్న ఖాతాదారులకు ప్రత్యేక రాయితీలు కల్పిస్తున్నామన్నారు. బంగారు/వజ్రాభరణాల తయారీ/తరుగు చార్జీల పైన 50శాతం వరకు తగ్గింపు, వజ్రాభరణాలు క్యారట్ ధర రూ.54,000 మాత్రమేనని తెలిపారు. పోల్కీ జ్యువెలరీ పై ఎలాంటి తయారీ/తరుగు చార్జీలు ఉండబోవని ఈ సందర్భంగా నవీన్, సుధాకర్ వెల్లడించారు. ఈ ప్రత్యేక ఆఫర్లు ఈ నెల 18వ తేదీ వరకు అందుబాటులో ఉంటాయని తెలిపారు. అంతేకాకుండా ఈ ఆఫర్ సమయంలో తమ షోరూంకు వచ్చిన ఖాతాదారులకు లక్కీ డ్రా నిర్వహిస్తున్నామని, ఈ నెల 19 సాయంత్రం 6 గంటలకు డ్రా తీస్తామని ప్రకటించారు.

డ్వాక్రా మహిళలకు తాయిలాలు

- 500 మందికి చీరలు పంచిన ఎమ్మెల్సీ దువ్వాడ
- పిడుగురాళ్లలో ఎమ్మెల్యే కాసు చేతుల మీదుగా పాస్టర్లు, సేవకురాళ్లకు నూతన వస్త్రాల పంపిణీ


డ్వాక్రా మహిళలకు ఇచ్చిన చీరలతో ఎమ్మెల్సీ దువ్వాడ, పేడాడ

టెక్కలి/ పిడుగురాళ్ల, మార్చి 8: ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో అధికార పార్టీ నేతలు బరితెగించారు. ఓటర్లకు బాహాటంగానే తాయిలాలు పంచుతూ వైసీపీని గెలిపించాలని కోరుతున్నారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని వైసీపీ ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ శుక్రవారం శ్రీకాకుళం జిల్లా టెక్కలిలోని తన కార్యాలయంలో డ్వాక్రా మహిళలకు చీరలు పంపిణీ చేశారు. నియోజకవర్గ మహిళా ప్ర జా ప్రతినిధుల సన్మానం పేరిట 500 మంది డ్వాక్రా మహిళలకు చీరలు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ అభ్యర్థి పేడాడ తిలక్, వైసీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు చింతాడ మంజు పాల్గొన్నారు. అలాగే పల్నాడు జిల్లా పిడుగురాళ్లలో గురువారం రాత్రి గురజాల నియోజకవర్గ పాస్టర్ల కుటుంబసభ్యుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. పాస్టర్లు, సేవకురాళ్లకు ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి, స్థానిక వైసీపీ నేతలు నూతన వస్త్రాలు పంపిణీ చేశారు.

‘అమృత’ హస్తం అందించండి!

- బ్లడ్ కేన్సర్‌తో బాధపడుతున్న బీటెక్ విద్యార్థిని మూడు నెలలుగా మంచానికే పరిమితం
- బోన్ మ్యారో చికిత్స చేయాలంటున్న వైద్యులు
- వైద్యానికి 60 లక్షల ఖర్చవుతుందని వెల్లడి
- నిరుపేద తల్లిదండ్రులకు తలకు మించిన భారం
- కూతుర్ని బతికించండంటూ కన్నీటి వేడుకోలు


చికిత్స పొందుతున్న దేవి అమృత, దేవి అమృత (ఫైల్)

విజయవాడ, మార్చి 8: ప్రపంచమంతా మహిళా దినోత్సవం జరుపుకొంటున్న వేళ.. ఆ యువతి మృత్యువుతో అలుపెరుగని పోరాటం చేస్తోంది..! 20 ఏళ్ల ప్రాయంలోనే బ్లడ్ కేన్సర్ రూపంలో చేరువైన మృత్యువుకు ఎదురొడ్డి పోరాడుతోంది. మహాలక్ష్మిలా నట్టింట తిరగాల్సిన బిడ్డ మూడు నెలలుగా మంచానికే పరిమితం కావడంతో నిరుపేద తల్లిదండ్రులు తల్లడిల్లిపోతున్నారు. వైద్యానికి లక్షల్లో ఖర్చవుతుందని వైద్యులు తేల్చడంతో... తమ బిడ్డను బతికించుకోవడం కోసం దాతల ఆపన్న హస్తం కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు. విజయవాడలోని కేదారేశ్వరపేటకు చెందిన బీటెక్ విద్యార్థిని కొర్లగంటి దేవి అమృత విషాదగాథ ఇది.

ఒక్కసారిగా తిరగబడిన జీవితం

విజయవాడకు చెందిన కొర్లగంటి ప్రసాద్, స్వప్న దంపతులకు ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. నిరుపేద కుటుంబానికి చెందిన ప్రసాద్ ఓ ప్రైవేటు కంపెనీలో పనిచేసుకుంటూ.. పిల్లలను ఉన్నత చదువులు చదివిస్తున్నాడు. మరో రెండు మూడేళ్లలో పిల్లలిద్దరూ వారి కాళ్లపై వారు నిలబడతారని ఆశిస్తున్న తరుణంలో కుమార్తె దేవి అమృతను కేన్సర్ భూతం కాటేసింది. మాటిమాటికీ కళ్లు తిరిగి పడిపోతుంటే తొలుత చదువుల ఒత్తిడి అనుకున్నారు. వైద్య పరీక్షలు చేయిస్తే అది ప్రాణాలు తోడేసే బ్లడ్ కేన్సర్ అని తేలడంతో ఆ కుటుంబం కుప్పకూలిపోయింది.

రోజుకు రూ.90 వేల వరకూ ఖర్చు

అమృతకు బ్లడ్ కేన్సర్ అని తేలడంతో అప్పటి నుంచి హైదరాబాద్‌లోని బసవ తారకం కేన్సర్ హాస్పిటల్‌లో వైద్య సేవలందిస్తున్నారు. అయితే ఆమెకు బోన్‌మ్యారో చేయాలని, దానికి రూ.60 లక్షల వరకూ ఖర్చు చేయాల్సివస్తుందని.. లేకపోతే ఆమె బతకడం కష్టమని వైద్యులు చెప్పారు. నిరుపేద కుటుంబానికి చెందిన ఆ తల్లిదండ్రులు తమ స్థాయికి మించి ఇప్పటివరకూ రూ.15 లక్షల వరకూ అప్పులు చేసి వైద్యానికి ఖర్చుచేశారు. బోన్‌మ్యారోకు ముందు 28 రోజుల్లో 17 సార్లు ఓ డ్రగ్ (బ్లినసిటో 38, 5ఎంసీజీ) ఇవ్వాలని, దీంతోపాటు ఇతర మందులకు రోజుకు రూ.90 వేల వరకూ ఖర్చు అవుతుందని వైద్యులు చెప్పారని ఆమె కుటుంబసభ్యులు వెల్లడించారు. దాతలు ఎవరైనా ముందుకొచ్చి సాయమందిస్తే తమ బిడ్డ ప్రాణాలను కాపాడవచ్చని అమృత తల్లిదండ్రులు ప్రాధేయపడుతున్నారు. పూర్తి వివరాల కోసం 95158-23254 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని కోరుతున్నారు. ఆన్‌లైన్ ద్వారా నగదు పంపాలనుకునేవారు కొర్లగంటి వరుణ్‌కుమార్ పేరుతో ఉన్న యూటీఐబీ బ్యాంకు ఖాతా నంబరు 92301006298715 (ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూటీఐబీ 0002763)కు పంపాలని వేడుకుంటున్నారు.

దొంగల ప్రభుత్వాన్ని ఇంటికి పంపాలి

టీడీపీని గెలిపిద్దాం... చంద్రబాబును సీఎం చేద్దాం: భువనేశ్వరి

- కర్నూలు జిల్లాలో రెండో రోజు ‘నిజం గెలవాలి’

గూడూరు, పత్తికొండ, మార్చి 8: రాష్ట్రంలో నియంత పాలన సాగిస్తున్న దొంగ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపాలని టీడీపీ అధినేత చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి ప్రజలకు పిలుపునిచ్చారు. నిజం గెలవాలి యాత్రలో భాగంగా శుక్రవారం ఆమె కర్నూలు జిల్లాలో రెండో రోజు గూడూరు మండలంలోని పెంచికలపాడు గ్రామంలో, పత్తికొండలో పర్యటించారు. చంద్రబాబు అరెస్టుతో మనోవేదనకు గురై మృతి చెందిన టీడీపీ కార్యకర్తల కుటుంబాల ఇంటికి వెళ్లి ఆర్థిక సహాయం అందజేశారు. ముందుగా గూడూరులోని పడమర బీసీ కాలనీలో బోయ గౌరన్న ఇంటికి వెళ్లి ఆయన చిత్రపటానికి పూలమాలతో నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి రూ.3 లక్షలు ఆర్థిక సాయం అందజేశారు. అనంతరం అదే కాలనీలోని షేక్షావలి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను ఓదార్చి రూ.3 లక్షల ఆర్థిక సాయం అందజేశారు. టీడీపీ కార్యకర్త మహబూబ్ బాషా ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను ఓదార్చి రూ.3 లక్షల ఆర్థిక సాయం అందజేశారు. మహబూబ్ బాషా కుమారుడుని ఎన్టీఆర్ ట్రస్టు నుంచి ఉచితంగా చదివిస్తానని భువనేశ్వరి హామీ ఇచ్చారు. మధ్యాహ్నం కోడుమూరు మండలంలోని నాగార్జునగౌడ్ సతీమణి రాజేశ్వరికి ధైర్యం చెప్పి ఓదార్చారు. బాధిత కుటుంబానికి రూ.3 లక్షల చెక్కును అందజేశారు. కాగా, పత్తికొండలో యువతీ యువకులతో ముఖాముఖి మాట్లాడుతూ... ‘ఓటు మీ భవిష్యత్‌ను నిర్ణయిస్తుంది. ఉద్యోగ అవకాశాలు, ఆర్థిక వ్యవస్థను మెరుగుపరచే నాయకుడిని ఎన్నుకునేందుకు మీ ఓటును వినియోగించుకోవాలి. ప్రస్తుతం అధికారంలో ఉన్న ప్రభుత్వం రాష్ట్రాన్ని దోచుకోవడమే ధ్యేయంగా పాలన సాగిస్తోంది. ఉద్యోగ అవకాశాలు లేక యువత నిరుత్సాహంతో ఉంది. ఇలాంటి తరుణంలో తిరిగి రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు నడిపించుకోవాలంటే టీడీపీ, జనసేన ప్రభుత్వం రావాలి. రాష్ట్ర ప్రజలతోపాటు, యువత టీడీపీకి మద్దతు ఇచ్చి టీడీపీ ప్రభుత్వం ఏర్పాటుకు సహకరించాల్సిన సమయం ఆసన్నమైంది’ అంటూ టీడీపీ పరిపాలనా కాలంలో సీమలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలను ఆమె ప్రస్తావించారు. సీమ ప్రాంతంలో వలసల నివారణ టీడీపీతోనే సాధ్యమని, టీడీపీ అధికారంలోకి వస్తే మిషన్ రాయలసీమ కింద వలసల నివారణకు కృషి చేస్తామని చెప్పారు. ఆయా కార్యక్రమాల్లో జిల్లా టీడీపీ అధ్యక్షుడు బీటీ నాయుడు, జిల్లా టీడీపీ నాయకుడు విష్ణువర్ధన్ రెడ్డి, కోడుమూరు నియోజక వర్గ టీడీపీ అభ్యర్థి బొగ్గుల దస్తగిరి, పత్తికొండ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కేఈ శ్యాంబాబు, ఎమ్మెల్సీ అనురాధ, ఆదోని ఇన్‌చార్జి మీనాక్షినాయుడు, కేవీ సుబ్బారెడ్డి, గుమ్మనూరు జయరాం, పలువురు నాయకులు ఉన్నారు.


గూడూరులో మహబూబ్ బాషా కుటుంబానికి రూ.3 లక్షల చెక్కును అందజేస్తున్న నారా భువనేశ్వరి

10న గ్రూప్-1 హాల్‌టికెట్లు

అమరావతి, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-1 స్ర్కీనింగ్ పరీక్ష హాల్ టికెట్లను ఈ నెల 10న విడుదల చేయనున్నట్టు ఏపీపీఎస్సీ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపింది. ఏపీపీఎస్సీ వెబ్‌సైట్ నుంచి అభ్యర్థులు డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించింది. ఈ నెల 17న ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లలో పరీక్ష జరుగుతుంది. ఇందుకోసం రాష్ట్రవ్యాప్తంగా 18 జిల్లాల్లో కేంద్రాలు ఏర్పాటుచేశారు.

కేజీబీవీల్లో అడ్మిషన్లకు దరఖాస్తులు

అమరావతి, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో 6, 11 తరగతుల్లో ప్రవేశాలకు ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు సమగ్రశిక్ష ఎస్పీడీ బి.శ్రీనివాసరావు ఓ ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరానికి దరఖాస్తులను ఈ నెల 12 నుంచి స్వీకరిస్తామన్నారు. ఏప్రిల్ 11 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని.. 7, 8, 9 తరగతుల్లో మిగిలిపోయిన సీట్ల కోసం కూడా దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. https://apkgbva. apcfss.in వెబ్‌సైట్ ద్వారా వచ్చిన దరఖాస్తులను మాత్రమే పరిగణనలోకి తీసుకుంటామని స్పష్టంచేశారు.

‘సింహాద్రి’ నాలుగో యూనిట్‌లో ఉత్పత్తికి అంతరాయం

పరవాడ, మార్చి 8: అనకాపల్లి జిల్లా పరవాడ మండలంలో గల సింహాద్రి సూపర్ థర్మల్ విద్యుత్ కేంద్రం (ఎన్టీపీసీ)లోని నాలుగో యూనిట్‌లో గురువారం రాత్రి విద్యుదుత్పత్తికి అంతరాయం ఏర్పడింది. ఈ యూనిట్‌కు సంబంధించిన బాయిలర్ ట్యూబులకు రంధ్రాలు ఏర్పడడంతో ఉత్పత్తి అర్థాంతరంగా నిలిచిపోయింది. అధికారులు యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు ప్రారంభించారు. మిగతా ఒకటి, రెండు, మూడు యూనిట్‌లలో ఉత్పత్తి యథావిధిగా కొనసాగుతుందని అధికారులు తెలిపారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

దారితప్పిన న్యాయమూర్తి!

పశ్చిమబెంగాల్‌లో ఒక సిట్టింగ్ జడ్జ్ తీసుకున్న నిర్ణయం ఇప్పుడు దేశవ్యాప్త చర్చ అయింది. కలకత్తా హైకోర్టు న్యాయమూర్తిగా రాజీనామా చేసిన అభిజిత్ గంగోపాధ్యాయ ఆ వెంటనే భారతీయ జనతాపార్టీలో చేరిపోవడంతో, ఆయన ఇంతకాలమూ ముప్పుతిప్పలు పెట్టిన మమతాబెనర్జీ పార్టీ ఇప్పుడు ఎదురుదాడి ఆరంభించింది. రాజీనామా చేస్తాను, రాజకీయాల్లో చేరతాను అని ఆయన ఓ మాటన్నప్పుడే ఆ పార్టీ ఏమిటో టీఎంసీ నాయకులు ముందే చెప్పేశారు. రాజకీయాల్లో చేరి ప్రజలకు సేవచేయాలనుకుంటున్న ఆ మాజీ న్యాయమూర్తికి ఆగస్టువరకూ పదవీకాలం ఉన్నప్పటికీ, అప్పటికి లోక్‌సభ ఎన్నికలు ముగిసిపోతాయి కనుక ఇలా త్వరపడివుంటారు. న్యాయమూర్తిగా సమాజానికి చేస్తున్న సేవ ఆయనకు అంత సంతృప్తికలిగించలేదేమో!

న్యాయమూర్తిగా తాను పక్షపాతాలు, రాగద్వేషాలకు అతీతంగానే తీర్పులు ఇచ్చానని చెప్పుకున్నప్పటికీ, ఆ స్థానంలో ఉండగా ఆయనమీద చేయలేని విమర్శలను ఇప్పుడు టీఎంసీ యథేచ్ఛగా చేస్తున్నది. రాష్ట్రంలోని వేలాదిమంది నిరుద్యోగుల పొట్టగొట్టిన తమరిని ఎక్కడనుంచి పోటీచేసినా ఓడించడమే నా లక్ష్యం అంటూ తృణమూల్ అధినేత మమతాబెనర్జీ ఆయనకు ఓ సవాల్ విసిరారు. బోధన, బోధనేతర సిబ్బంది నియామకాలకు సంబంధించి ప్రధానంగా ఆయన ఇచ్చిన ఆదేశాలు వేలాదిమంది యువత భవిష్యత్తును ప్రభావితం చేసిన మాట నిజం. ఆయన ఆదేశాల మేరకు అనేక ఎఫ్ఐఆర్‌లు నమోదవుతూ, మంత్రులు, ఎమ్మెల్యేల ఇళ్ళమీద దాడులు జరుగుతూ అధికారపక్షం తీవ్రంగా అప్రదిష్టపాలైంది, మూడోసారి అధికారంలోకి రావడం మమతాబెనర్జీకి గగనతరమైపోయింది. ఈ వ్యవహారంలో కనీసం పద్నాలుగు కేసులను సీబీఐ విచారణకు ఆదేశించి అవినీతి వ్యతిరేక యోధుడిగా సామాన్యుల్లో ఎంతో మంచి పేరు తెచ్చుకున్నారు ఆయన. పశ్చిమబెంగాల్‌ను సమూలంగా ప్రక్షాళించాలన్న తపనవల్ల కాబోలు, తీర్పులు చెప్పడానికే ఆయన పరిమితం కాలేదు. కేసులకు సంబంధించి విలేకరులతో మాట్లాడుతూ, చానెళ్ళకు ఇంటర్వ్యూలు ఇస్తూ తృణమూల్ నాయకులమీద విమర్శలు చేసేవారు. మమతాబెనర్జీ మేనల్లుడు అభిషేక్ బెనర్జీ విపరీతంగా ఆస్తులు కూడబెడుతున్నారని ఓ ఇంటర్వ్యూలో అన్నందుకు, కోర్టు రూముల్లో ఉండాల్సిన సిట్టింగ్ జడ్జికి చానెళ్ళతో ఏమి పని అంటూ సుప్రీంకోర్టు ఆగ్రహించి, ఆ కేసును మరొకరికి అప్పగించినా తృణమూల్ నేతలమీద ఆయన వీరంగం తగ్గలేదు. ఈ రాష్ట్రంలో ఏ చిన్నపనికావాలన్నా లంచం ఇవ్వాల్సిందేనా? అంటూ అమాయకంగా, ధర్మాగ్రహంతో ఆయన వేసే ప్రశ్న ప్రతిపక్షాలకు ఆయుధంగా ఉపకరించేది, అధికారపక్షాన్ని ఆత్మరక్షణలో పడవేసేది.

రాజకీయపార్టీకి తొత్తుగా వ్యవహరిస్తున్నావంటూ తోటి న్యాయమూర్తిని మొన్న జనవరిలో తప్పుబట్టిన అభిజిత్ గంగోపాధ్యాయ ఇప్పుడు తానే ఓ రాజకీయపార్టీలో చేరిపోయారు. పాపపంకిలమైపోయిన రాష్ట్రాన్ని తృణమూల్‌నుంచి విముక్తిచేయాలని సంకల్పించారు. న్యాయమూర్తులు రాజీనామా చేసి రాజకీయపార్టీలో చేరడం గతంలోనూ లేకపోలేదు. కానీ, న్యాయమూర్తిగా నిన్నటివరకూ ఎంతో క్రియాశీలతను ప్రదర్శించిన ఓ వ్యక్తి మర్నాడే హఠాత్తుగా రాజకీయనాయకుడి అవతారం ఎత్తడం చాలామందిని విస్మయంలో పడవేసింది. రాజకీయాల్లోకి రావాలన్న కోరిక అంతబలంగా ఉన్నప్పుడు కొద్దికాలం ఓపికపట్టినా బాగుండేది. అసెంబ్లీ ఎన్నికల్లో మమతను దించేస్తానంటున్న ఆయనకు ఆ సహనం లేనట్టుంది. ఇంతకాలమూ ఆయన నిజంగానే న్యాయంపక్షాన నిలబడినా, ఆ తీర్పులకు ఇకపై ప్రజల్లో విలువ ఉంటుందా? ఒక న్యాయమూర్తిగా అధికారపక్ష నేతలమీద, రాష్ట్రంలో అవినీతిమీదా ఆయన చేసిన వ్యాఖ్యలకు ఇకపైనా అంతే ప్రాధాన్యం ఉంటుందా? ఈ చర్యతో ఆయన తన గతకాలపు గౌరవాన్ని, విశ్వసనీయతను కూడా ప్రశ్నించేందుకు వీలుకల్పించారు. ఆయన ఇచ్చిన అన్ని తీర్పులనూ పునఃసమీక్షించాలని అధికారపక్షం అందుకే ధైర్యంగా అడగగలుగుతోంది. న్యాయమూర్తుల నైతిక నియమావళిని ఉల్లంఘించారా లేదా అన్నది అటుంచితే, తృణమూల్ నాయకుడు అభిషేక్ బెనర్జీ సుప్రీంకోర్టులో చేసిన వాదనలకు ఇప్పుడు బలమైన పునాది ఏర్పడినట్టయింది. తనపై రాజకీయ దురుద్దేశాలతో వ్యాఖ్యలు చేసిన ఈ న్యాయమూర్తి మీద నిర్దిష్టమైన చర్యలు తీసుకోవాలన్న అభిషేక్ అభ్యర్థనను గతనెలలో తిప్పికొట్టిన సుప్రీంకోర్టుకు ఇప్పుడు ఏమి అనిపించివుంటుందో?

భారత ప్రజాస్వామ్య ఉత్సవం

భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) మరికొద్ది రోజుల్లో 18వ లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించనున్నది. దేశవ్యాప్తంగా గౌరవనీయ ప్రధానమంత్రి పర్యటనలకు సౌకర్యంగా ఉండేలా నిర్ణయించారని గతంలో ఎన్నికల షెడ్యూల్‌ను విమర్శించడం జరిగింది. మరి 18వ లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ హేతుబద్ధంగా ఉంటుందా, ఉండదా అనేది త్వరలోనే తెలుస్తుంది.

ఎన్నికల నిర్వహణలో చాలా లోపాలు ఉన్నాయి. మొదటిది– పోలింగ్ దశల సంఖ్య. ఎన్నికల నిర్వహణ మూడు కంటే ఎక్కువ దశలలో నిర్వహించకూడదు. ఒక రాష్ట్రంలోని సమస్త నియోజకవర్గాలలో పోలింగ్‌ను ఒకే రోజున నిర్వహించాలి. పెద్ద రాష్ట్రాలలో పోలింగ్‌ను రెండు రోజులలో పూర్తి చేయాలి. 2019లో పోలింగ్ తేదీలు ఏప్రిల్ 11 నుంచి మే 19 దాకా 39 రోజుల పాటు వ్యాపించి ఉన్నాయి. బిహార్ (40 సీట్లు), ఉత్తరప్రదేశ్ (80 సీట్లు), పశ్చిమ బెంగాల్ (42 సీట్లు) రాష్ట్రాలలో పోలింగ్‌ను 7 దశలలో నిర్వహించారు. ఇంచుమించు బిహార్, బెంగాల్‌లలో ఉన్నన్ని సీట్లు ఉన్నప్పటికీ తమిళనాడు, పుదుచ్చేరి (39+1)లో పోలింగ్‌ను ఒక రోజే నిర్వహించారు. కేవలం 29 నియోజకవర్గాలు ఉన్న మధ్యప్రదేశ్‌లో పోలింగ్‌ను నాలుగు విడతలుగా నిర్వహించారు. తమిళనాడులో కంటే ఉత్తరప్రదేశ్‌లో సీట్లు చాలా ఎక్కువగా ఉన్నాయి. మరి ఆ పెద్ద రాష్ట్రంలో పోలింగ్ 7 వేర్వేరు తేదీలలో జరిగింది.



■ పి. చిదంబరం

'పళని' పలుకు

పోలింగ్ నిర్వహణ ఇలా ఎందుకు ఉన్నది? భద్రతాపరమైన అంశాలను అధికారులు ఎత్తి చూపుతున్నారు. కేంద్ర సాయుధ పోలీసు బలగాలను ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి తరలించేందుకు తగు సమయం అవసరమని ఈసీఐ అధికారులు అంటున్నారు. అయితే ఇది సహేతుకమైన కారణంగా కనిపించడం లేదు. ఎన్నికల తేదీలను ప్రకటించిన తరువాత ఒక రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాలలోను పోలీసులు, సిఎపిఎఫ్‌ను మోహరిస్తారు. పోలింగ్ రోజున మొదటి దశ నియోజకవర్గాలలో పోలింగ్ జరుగుతుండగా ఇతర నియోజకవర్గాలలో ఎన్నికల ప్రచారం కొనసాగుతూ ఉంటుంది. శాంతి భద్రతల పరిరక్షణకు ఆ నియోజకవర్గాలలో పోలీసులు, సిఎపిఎఫ్ సిబ్బందిని మోహరిస్తారు. పోలింగ్ ముందు రోజు, పోలింగ్ తర్వాతి రోజు పోలీసుల పహరా ఉండదు. అంతేకాకుండా బీజేపీ ప్రకారం బిహార్, ఉత్తరప్రదేశ్‌లలో డబుల్ ఇంజిన్ ప్రభుత్వమున్నది; శాంతిభద్రతల పరిస్థితి గణనీయంగా మెరుగుపడింది. అయినప్పుడు ఆ రెండు రాష్ట్రాలలో హింసాకాండ, చోటుచేసుకోగలదనే భయమెందుకు? నాయకులు, పార్టీ కార్యకర్తలు, రాష్ట్రంలోని ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వెళ్లేందుకు వీలుగానే పోలింగ్‌ను పలు దశల్లో నిర్వహించడం జరుగుతుందనే అనుమానం సర్వత్రా వ్యక్తమవుతోంది. అయినప్పటికీ బహుళ దశ పోలింగ్ వల్ల పలు ప్రతికూల పర్యవసానాలు ఉన్నాయి. పోలింగ్ తేదీలు భిన్నంగా ఉంటే 'నిశ్శబ్ద సమయాలు' సైతం భిన్నంగా ఉంటాయి. నియోజకవర్గం–ఎలో నిశ్శబ్ద దినాలు, పోలింగ్ రోజున నాయకులు పొరుగు నియోజకవర్గం–బిలో ప్రచారంలో పాల్గొంటాడు. ఆ నేత ప్రసంగాల సందేశం టీవీ, రేడియో, వార్తాపత్రికలు, సామాజిక మాధ్యమాల ద్వారా నియోజకవర్గం–ఎ ఓటర్లకు చేరుతుంది. మరో ముఖ్య విషయం బహుళ– దశ పోలింగ్‌లో పోలింగ్ అనంతరం సంభావ్య ఫలితాలపై అంచనాలు రెండో దశ, తదనంతర దశల పోలింగ్ జరగనున్న నియోజకవర్గాలలో ఓటింగ్ తీరుతెన్నులను ప్రభావితం చేసే అవకాశమున్నది.



పోరాట స్ఫూర్తితో కూడిన, నానా సందడితో ఉల్లాసకరమైన, ఉత్సాహపూరితమైన ఎన్నికల వాతావరణాన్ని పునరుద్ధరించేందుకు ఈసీఐ వివిధ చర్యల ద్వారా ప్రయత్నించాలి. ప్రజాస్వామ్య వ్యవస్థలు ఒక పండుగ జరుపుకోవాల్సిన అవసరమున్నది. ఎన్నికలు కాక ఆ పండుగ మరేమవుతుంది?

రాష్ట్రాలలో ఈసీఐకి ప్రాతినిధ్యం వహిస్తున్న ముఖ్య ఎన్నికల అధికారులు (సీఈఓ) ఎన్నికల నియమ నిబంధనలను అమలుపరచడంలో నిష్పాక్షికంగా వ్యవహరించడంలేదు. రాష్ట్ర స్థాయి ఎన్నికల అధికారులు చూపుతున్న వివక్షపై ఈసీఐ దృష్టి పెట్టవలసిన అవసరమున్నది. ఉదాహరణకు 2019 సార్వత్రిక ఎన్నికలలో తమిళనాడులోని పంచాయత్‌లు, మునిసిపాలిటీలలో పోస్టర్లు, ఫ్లెక్స్ బోర్డ్‌లు, బ్యానర్లు, జెండాలను ప్రదర్శించడాన్ని సీఈఓ నిషేధించారు. ప్రతి అభ్యర్థి కేవలం ఒకే ఒక్కసారి మాత్రమే రోడ్ షోలు నిర్వహించేందుకు మాత్రమే అనుమతించారు. ప్రచారకర్తలు ఏ ప్రదేశాలలో ఓటర్లనుద్దేశించి ప్రసంగించాలో కూడా నిర్ణయించారు. అభ్యర్థి వెంట మూడు వాహనాలు మాత్రమే ఉండాలని నిర్దేశించారు. ఒక బహిరంగ సభ లేదా ర్యాలీని నిర్వహించనున్నప్పుడు ఆ సభ లేదా ర్యాలీకి ముందు రోజు, తరువాత రోజు మాత్రమే స్థానిక ప్రాంతంలో జెండాల ప్రదర్శనను సీఈఓ అనుమతించారు. ఈ ఆంక్షలను కఠినంగా అమలుపరిచారు. ఇతర రాష్ట్రాల పట్టణాలు, నగరాలలో ఎన్నికల కోలాహలం ఉధృతంగా ఉండగా ఇక్కడ ఈ ఆంక్షలు ఏమిటని తమిళనాడు ప్రజలు ఆశ్చర్యానికి లోనయ్యారు. ఈ వివక్షకు స్వస్తి చెప్పాలిసిన అవసరమున్నది. దేశవ్యాప్తంగా ఒకే విధమైన నియమనిబంధనలు అమలయ్యేలా భారత ఎన్నికల సంఘం చర్యలు చేపట్టాలి.

బహిరంగ ప్రచార కార్యక్రమాలపై విధిస్తున్న ఈ అనుచిత ఆంక్షల వల్ల ఎన్నికల మౌలిక స్వభావానికి తీవ్ర విఘాతం వాటిల్లుతోంది. ఎన్నికలు ప్రజాస్వామ్య ఉత్సవాలు కావా? ఈ పండుగలను జరుపుకోవడంలో ప్రజలపై కఠిన ఆంక్షలు విధించడమంటే ప్రజాస్వామ్య స్ఫూర్తిని హరించివేయడం మినహా మరేమీ కాదు. గత సార్వత్రిక ఎన్నికలలో తమిళనాడులో ప్రచార పర్వంలో అధిక భాగం అంత్యక్రియల వాతావరణం నెలకొని వుందనడంలో అతిశయోక్తి లేదు. ఆ ఆంక్షలు ఎన్నికలను నైరాశ్యంలో ముంచెత్తాయి. పార్టీ కార్యకర్తలు మౌనంగా ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేసుకోవడం జరిగింది.

ఎన్నికలలో అత్యంత ముఖ్యమైన విషయాన్ని చివరగా ప్రస్తావించదలుచుకున్నాను. డబ్బు, ఎన్నికలలో అది నిర్వహించే పాత్రే ఆ అంశమని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. అప్రతిష్ఠాకర ఎన్నికల బాండ్ల పుణ్యమా అని భారతీయ జనతా పార్టీకి ఎన్నికలకు అవసరమైన నిధులను అపారంగా సమకూర్చుకున్నది. ఈ లోక్‌సభ ఎన్నికలలో ఆ ధనరాశులను ఆ పార్టీ తప్పక వినియోగించుకుంటుంది. గౌరవనీయ ప్రధానమంత్రి ప్రసంగించే ఒక ర్యాలీ నిర్వహణకు కోట్ల రూపాయల వ్యయమవుతుంది. సభా వేదికపై ప్రధానమంత్రితో పాటు అభ్యర్థులు ఉంటారు. అయితే ఆ ర్యాలీ నిర్వహణా వ్యయాన్ని ప్రతి అభ్యర్థీ ఏదో ఒక మేరకు భరిస్తున్నట్టుగా ఎన్నికల సంఘం పరిగణించడం లేదు. ఇది సరైన వైఖరి అని నేను భావిస్తున్నాను. అయితే తమిళనాడులో గత లోక్‌సభ ఎన్నికల సందర్భంగా సభా వేదికపై ప్రధాన నాయకుడితో పాటు అభ్యర్థులు ఆ సభా నిర్వహణ వ్యయంలో సమానస్థాయిలో గానీ లేదా ఏదో ఒక స్థాయిలో గానీ భరించినట్టుగా ఎన్నికల సంఘం పరిగణించింది. ఆ వ్యయాన్ని ఆ అభ్యర్థి మొత్తం ఎన్నికల వ్యయంలో భాగంగా లెక్క కట్టింది. ఇదొక విధమైన వివక్ష. ఈసీఐ ఈ వివక్షకు స్వస్తి చెప్పాలి.

ఎన్నికల ప్రచారాలు సందడి లేకుండా, అజ్ఞాతంగా జరగడం వల్లే అసహ్యకరమైన ఓటుకు నోటు ఉదంతాలు చోటు చేసుకుంటున్నాయని చెప్పవచ్చు. అయితే ఓటర్లు తాము ఎవరికైతే ఓటు వేయదలుచుకున్నారో వారికే ఓటు వేస్తున్నారు. అయితే పార్టీలు, అభ్యర్థులు ఓట్ల కోసం నోట్లను పంపిణీ చేస్తుండడం వల్ల ఎన్నికల వ్యయం విపరీతంగా పెరిగిపోతోంది. అభ్యర్థులు, వారి పార్టీలు బహిరంగంగా మరింత ధనాన్ని ఖర్చు పెట్టేందుకు అనుమతించాలి. ఎన్నికల ప్రచారం బహిరంగంగా, సందడితో జరిగే పక్షంలో ఓటుకు నోటు అవినీతి కాలక్రమేణా సంపూర్ణంగా సమసిపోగలదు. పోరాట స్ఫూర్తితో కూడిన, నానా సందడితో ఉల్లాసకరమైన, ఉత్సాహపూరితమైన ఎన్నికల వాతావరణాన్ని పునరుద్ధరించేందుకు ఈసీఐ వివిధ చర్యల ద్వారా ప్రయత్నించాలి. ప్రజాస్వామ్య వ్యవస్థలు ఒక పండుగ జరుపుకోవాల్సిన అవసరమున్నది. ఎన్నికలు కాక ఆ పండుగ మరేమవుతుంది?

(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)

కుబేర కల్యాణానికి కాదేదీ అనర్హం!

ఈ నెల 1న 'ది హిందూ' ఆన్‌లైన్ ఎడిషన్‌లో విలేఖరి జాగృతి చంద్ర రాసిన వార్త ఒకటి ఉంది. దాని శీర్షిక: 'అనంత్ అంబానీ ప్రీ వెడ్డింగ్ వేడుకల సందర్భంగా జామ్‌నగర్ విమానాశ్రయానికి తాత్కాలికంగా అంతర్జాతీయ హోదా'. జామ్‌నగర్‌లో సైనిక దళాలు నిర్వహిస్తున్న ఆ చిన్న విమానాశ్రయాన్ని ఫిబ్రవరి 25, 2022 నుంచి మార్చి 5 దాకా పది రోజుల పాటు 'అంతర్జాతీయ విమానాశ్రయం'గా ప్రకటించడం ఎలా జరిగిందో ఆ వార్త విపులీకరించింది. బిల్‌గేట్స్, మార్క్ జుకెర్‌బర్గ్, ఇవాంకా ట్రంప్, ఇంకా పలువురు మాజీ ప్రధానమంత్రులు మొదలైన ప్రముఖులు ముకేశ్ అంబానీ, నీతా అంబానీల కనిష్ఠ పుత్రుడు అనంత్ వివాహ ముందస్తు వేడుకలకు హాజరయ్యారు. అంబానీ కుటుంబం వారికి స్వాగతం చెప్పేందుకు వీలుగా జామ్‌నగర్ విమానాశ్రయానికి అంతర్జాతీయ హోదా కల్పించారని ఆ వార్త పేర్కొంది. కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య, ఆర్థిక, హోం మంత్రిత్వ శాఖలు తమ ఆధ్వర్యంలోని వనరులను వినియోగించి ఆ ఎయిర్‌పోర్ట్‌లో కస్టమ్, ఇమ్మిగ్రేషన్, క్వారంటైన్ (సిఐక్యూ) సదుపాయాన్ని కల్పించాయి (ది హిందూ.కామ్).

ఈ వార్తను చదివిన తరువాత దానిపై సామాజిక మాధ్యమాలలో వ్యాఖ్యలను కూడా చూశాను. అంబానీలకు సానుకూలంగా తన విచక్షణాధికారాలను వినియోగించిన పాలకుల మద్దతుదారులు ప్రభుత్వ చర్యను పూర్తిగా సమర్థించారు. 2011లో నాటి కాంగ్రెస్ ప్రభుత్వం పాకిస్తానీ సందర్శకుల సౌకర్యార్థం చండీగఢ్ విమానాశ్రయానికి తాత్కాలికంగా అంతర్జాతీయ హోదా కల్పించలేదా అని ప్రశ్నించారు (చండీగఢ్‌లో ప్రపంచ కప్ క్రికెట్ టోర్నమెంట్ సెమీ ఫైనల్ మ్యాచ్ జరుగుతున్న సందర్భమది, ఒక ప్రైవేట్ వివాహ వేడుక కాదు). అంబానీలు లక్షలాది భారతీయులకు జీవనాధారాలను కల్పించారు గనక వారి కుటుంబ వేడుకకు విచ్చేస్తున్న వీఐపీలకు సముచిత గౌరవం, భద్రత కల్పించాల్సిన అవసరముందని కూడా ఈ సమర్థకులు వ్యాఖ్యానించారు.

ప్రభుత్వ చర్యను విమర్శించిన వారిలో ఒకరు ఇలా వ్యాఖ్యానించారు: 'అంబానీలు, అదానీలకు భారత్‌లో జీవితం స్వర్గతుల్యంగా ఉన్నది. అయితే నా బోటి మిగతా వారందరికీ మాత్రం అది నరకప్రాయమే'. మరో విమర్శకుడు ఇలా పేర్కొన్నాడు: 'మహా కుబేరులతో మన దేశం ఇప్పుడు ఒక కొత్త రష్యాలా ఉన్నది'. మరొక విమర్శకుడు సరదాగా ఇలా వ్యాఖ్యానించారు: 'వసుధైవ కుటుంబకం' (ప్రపంచమంతా ఒకే కుటుంబం) అన్న మహా సూక్తిని ఇలా తిరిగిరాయవలసి ఉంది: 'నేను, నా సంపన్న స్నేహితులు, వారి మిత్రులు అంతా ఒకే కుటుంబం'. ఈ వ్యాఖ్యలో నిజం ఎంతో ఉన్నది మరి.

ముకేశ్ అంబానీ కుమారుడి ప్రీ వెడ్డింగ్ వేడుకలపై సామాజిక మాధ్యమాలలో ఒక వ్యాఖ్యను నిశితంగా పరిశీలిద్దాం. అదిలా పేర్కొంది: సకల దేశాల నుంచి ప్రముఖులను ఆహ్వానించడం ద్వారా అపార సంపద్వంతుడైన యువకుడు తన ప్రైవేట్ జూను ప్రపంచానికి చూపదలుచుకున్నాడు. అతడి లక్ష్యానికి తోడ్పడేందుకే జామ్‌నగర్ విమానాశ్రయ హోదాను పెంచారు'. జామ్‌నగర్‌లో, ఒక ఏనుగు ముందు నవ్వులు చిందిస్తూ ఉన్న ఇవాంకా ట్రంప్ ఛాయాచిత్రాలు ఆ వ్యాఖ్యకు విశ్వసనీయతను కల్పించాయి. ప్రస్తావిత ప్రైవేట్ జూను 'రాధా కృష్ణ టెంపుల్ ఎలిఫెంట్ వెల్ఫేర్ ట్రస్ట్' నిర్వహిస్తోంది. పేరు చూస్తే అదొక మతాభినివేశ ధార్మిక సంస్థ అనిపిస్తుంది. అయితే ఆ పేరు ఒక మేలి ముసుగు మాత్రమే. సైనిక దళాలు నిర్వహించే ఒక విమానాశ్రయానికి 'అంతర్జాతీయ హోదా' కల్పించడానికి మించిన లజ్జాకర విషయాన్ని ఆ ట్రస్ట్ నామధేయం కప్పిపుచ్చుతోంది. వన్యప్రాణుల సంరక్షణ చట్టం–2021కి చేసిన ఒక సవరణ ఆ ట్రస్ట్ ఏర్పాటుకు, దాని కార్యకలాపాలకు వెసులుబాటు కల్పించింది. ప్రైవేట్ జూల నేర్పాటు చేసేందుకు ఏనుగు లాంటి మనుగడ ముప్పులో ఉన్న వన్య ప్రాణులను పట్టుకుని ఇతర ప్రాంతాలకు రవాణా చేసేందుకు, విక్రయించేందుకు ఆ చట్ట సవరణ అనుమతిస్తోంది. సవరణకు పూర్వం ఉన్న చట్టం వన్య ప్రాణుల సంబంధిత వ్యాపార లావాదేవీలు నిర్వహించడంపై ఆంక్షలు విధించింది. అయితే సవరణ అనంతరం పట్టుకున్న సజీవ వన్య ప్రాణులకు ఆ ఆంక్షల నుంచి మినహాయించింది. మరింత స్పష్టంగా చెప్పాలంటే ఏనుగును ఒక వ్యాపార సరుకుగా పరిగణించేందుకు చట్ట సవరణ అనుమతించింది. ఈ సవరణ ఒక అసంగత విషయం. దీనిని పార్లమెంటే సరిదిద్దాల్సి వుంది.



అంబానీలు, అదానీలతో మోదీ సర్కార్ సాన్నిహిత్యాన్ని ప్రతిపక్ష రాజకీయవేత్తలు తరచు విమర్శిస్తుంటారు. జామ్‌నగర్ విమానాశ్రయానికి అంతర్జాతీయ హోదా, వన్యప్రాణుల సంరక్షణ చట్టానికి సవరణ విషయాన్ని వారు ఉపేక్షిస్తున్నారు. అంబానీలు తమ వ్యాపార ప్రయోజనాలకు అనుగుణంగా రాజ్యవ్యవస్థ వ్యవహరించేలా ప్రభుత్వాధినేతలను ప్రభావితం చేయగలుగుతున్నారని ఆ రెండు విషయాలు స్పష్టం చేశాయి. వ్యాపార విషయాలలోను, కుటుంబ వ్యవహారాలలోను అదానీలు, అంబానీలు 'మోదీ సర్కార్‌కి గ్యారంటీ'ని సంపూర్ణంగా పొందుతున్నారు.



■ రామచంద్ర గుహ

గతానుగతం

అధికారంలో ఉన్నవారు తమ రాజకీయ ప్రయోజనాలకు తోడ్పడుతున్న సంపన్నులను సంతోషపెట్టేందుకే ఆ అసంగత సవరణను రద్దు చేయలేదు. దీని పర్యవసానాలు ఏమిటో ఇప్పుడు మనం చూస్తున్నాం. జూన్ 2022లో 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌'లో వెలువడిన ఒక వార్త ప్రకారం దొంగ సర్టిఫికెట్లతో వన్యప్రాణులను అక్రమంగా రవాణా చేస్తున్నట్టు ఎనిమిది కేసులు ఒక్కనెలలోనే రికార్డయ్యాయి. ఏనుగులను అరుణాల్‌ప్రదేశ్ అడవుల నుంచి జామ్‌నగర్‌లోని అంబానీ ప్రైవేట్ జూకు తరలిస్తున్నారని కూడా ఆ వార్త పేర్కొంది.

ఆ ఎనిమిది కేసులు ఒక ఆరంభం మాత్రమే. 'రాధాకృష్ణ టెంపుల్ ఎలిఫెంట్ వెల్ఫేర్ ట్రస్ట్'వారు కాపాడి, ఆశ్రయం కల్పించిన ఏనుగులు ఇప్పుడు 200కి పైగా ఉన్నాయని గత నెలలో అనంత్ అంబానీ గొప్పగా చెప్పుకున్నారు. ఈ ఏనుగులలో అత్యధికం ఈశాన్య రాష్ట్రాల నుంచి జామ్‌నగర్‌కు రవాణా చేయడం జరిగిందని 'నార్త్ ఈస్ట్ నౌ' అనే వెబ్‌సైట్ పేర్కొంది. ఆ ఏనుగులను చట్ట విరుద్ధంగా పట్టుకుని, తరువాత దళారుల తోడ్పాటులో కొనుగోలు చేయడం జరిగింది.

'నార్త్ ఈస్ట్ నౌ'లో వెలువడిన మరొక వార్త జంతు హక్కుల పరిరక్షణ సంఘం రాసిన ఒక లేఖను ఉటంకించింది. 'గున్న ఏనుగులను వాటి సహజ నైసర్గిక పరిసరాల నుంచి 3400 కిలోమీటర్ల దూరంలో ఉన్న జామ్‌నగర్‌కు ట్రక్కులలో రవాణా చేయడం పట్ల ఆ జంతు హక్కుల ఉద్యమకారులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. తమ సహజావాసాల నుంచి బలవంతంగా దూరం కాబడిన వన్య ప్రాణులకు పునరావాసం కల్పించే చర్యలను తాను స్వాగతిస్తున్నానని, అయితే ఈశాన్య రాష్ట్రాల నుంచి అంబానీ ప్రైవేట్ జూకు వందలాది ఏనుగులను తరలించే కార్యకలాపాలు జంతువుల అక్రమ రవాణా సంఘాలు మళ్లీ క్రియాశీలమయ్యేందుకు ప్రేరణ అవుతున్నాయని నా మిత్రుడైన ఒక జంతు హక్కుల కార్యకర్త అన్నాడు.

ఒకప్పుడు అడవులలో పట్టుకున్న ఏనుగులను దేవాలయాలకు అప్పగించేవారు. ఇప్పుడు వాటిని జామ్‌నగర్‌లోని ప్రైవేట్ జూకు తరలిస్తున్నారు. అంబానీ జూను ఒక వ్యక్తిగత 'తపాలా బిళ్లల సేకరణ' లాంటిదేనని ప్రముఖ పర్యావరణవేత్త రవి చెల్లం వ్యాఖ్యానించారు. వన్య ప్రాణుల సంరక్షణకు అంబానీల హాబీ ఏ విధంగాను తోడ్పడదని ఆయన నిష్కర్షగా అన్నారు.

వన్యప్రాణి శాస్త్రవేత్తలు, సంరక్షణవాదులు మూడు ప్రశ్నలను లేవనెత్తుతున్నారు వీటికి అంబానీలకు సహకరిస్తున్న ప్రభుత్వ నాయకులు, అధికారులు, ప్రభుత్వేతర వ్యక్తులు ఆ ప్రశ్నలకు సమాధానమిచ్చి తీరాలి. అవి : (1) అడవులలో తిరుగాడేందుకు ఇష్టపడే ఏనుగులను వందల సంఖ్యలో వాటి సహజావాసానికి విరుద్ధమైన పారిశ్రామిక ప్రాంతానికి తరలించడమెందుకు? (2) ఇందుకు వెసులుబాటు కల్పించేందుకు సమాంతర క్రమబద్ధీకణ వ్యవస్థను ఎందుకు సృష్టించారు? (3) సహజపరిసరాలలోనే అటువంటి సంరక్షణ సదుపాయలను సృష్టించేందుకై రాష్ట్ర అటవీ శాఖ అధికారులతో కలిసి ఎందుకు కృషి చేయకూడదు? ఇవి చాలా ముఖ్యమైన ప్రశ్నలు. అయితే అంబానీలు కానీ, వారి సన్నిహిత రాజకీయ నాయకులు కానీ సమాధానమివ్వడానికి శ్రద్ధ చూపుతారని నేను భావించడం లేదు.

నా చిన్నతనంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని 'టాటా/బిర్లా సర్కార్' అని వామపక్షాలు పరిహసించేవి. అయితే తమ పలుకుబడి, ప్రాభవం సమున్నతంగా ఉన్న కాలంలో కూడా జేఆర్‌డి టాటా గానీ, ఘన్ శ్యామదాస్ బిర్లా గానీ స్వీయ కుటుంబ సభ్యుల వివాహ వేడుకలకు గానీ, ప్రీ వెడ్డింగ్ వేడుకలకు గానీ తమ ఫ్యాక్టరీలకు సమీపంలో ఉన్న విమానాశ్రయాలకు అంతర్జాతీయ హోదా కల్పించాలని జవహర్‌లాల్ నెహ్రూనుగానీ, ఇందిరాగాంధీనిగానీ ఎన్నడూ కోరలేదు.

అయితే ఇప్పుడు పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. ఆర్థికవేత్త అరవింద్ సుబ్రమణియన్ వాదించినట్టు పారిశ్రామికవేత్తలు అందరికీ సమానావకాశాలు కల్పించడానికి బదులు భారత రాజ్యవ్యవస్థ ఇటీవలి సంవత్సరాల్లో '2 ఎ తరహా' 'కళంకిత పెట్టుబడిదారీ విధానాన్ని' ప్రమోట్ చేసింది. అదానీలు, అంబానీలు ప్రభుత్వ విధానాల కారణంగా స్వల్ప కాలంలోనే లక్షల కోట్ల రూపాయల విలువైన ఆస్తులను సమకూర్చుకోగలిగారు. నౌకాశ్రయాలు, విమానాశ్రయాలు, ఇంధన రంగం, పెట్రో కెమికల్స్, టెలి కమ్యూనికేషన్స్ తదితర రంగాలలో గుత్తాధిపత్యం సాధించుకోవడాకి ఆ రెండు పారిశ్రామిక సంస్థలకు ప్రభుత్వ విధానాలు విశేషంగా తోడ్పాటునిచ్చాయనడంలో సందేహం లేదు. అంబానీలు, అదానీలతో మోదీ సర్కార్ సాన్నిహిత్యాన్ని ప్రతిపక్ష రాజకీయవేత్తలు తరచు విమర్శిస్తుంటారు. అయితే జామ్‌నగర్ విమానాశ్రయానికి అంతర్జాతీయ హోదా, వన్యప్రాణుల సంరక్షణ చట్టానికి సవరణ విషయాన్ని వారు ఉపేక్షిస్తున్నారు. అంబానీలు తమ వ్యాపార ప్రయోజనాలకు అనుగుణంగా రాజ్యవ్యవస్థ వ్యవహరించేలా ప్రభుత్వాధినేతలను ప్రభావితం చేయగలుగుతున్నారని ఆ రెండు విషయాలు స్పష్టం చేశాయి. ఇప్పుడు బాగా ప్రచారంలో ఉన్న ఒక నుడికారం ప్రకారం వ్యాపార విషయాలలోను, కుటుంబ వ్యవహారాలలోను అదానీలు, అంబానీలు 'మోదీ సర్కార్‌కి గ్యారంటీ'ని సంపూర్ణంగా పొందుతున్నారు సుమా!

(వ్యాసకర్త చరిత్రకారుడు)

యాభై గ్రీష్మాల పౌర హక్కుల సంఘం

ఆంధ్రప్రదేశ్ పౌర హక్కుల సంఘానికి, ప్రస్తుత పౌర హక్కుల సంఘానికి ఇప్పుడు యాభై సంవత్సరాలు నిండుతున్నాయి. నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఈ పౌర హక్కుల సంఘం ఆవిర్భావం అనే పరిణామం 1960వ దశకం చివరి కాలంలోనూ, 1970లలోనూ ముందుకొచ్చిన వివిధ ఉద్యమాలతో, ప్రత్యేకించి రైతాంగ ఉద్యమాలు, ఆదివాసీ ఉద్యమాలతో సన్నిహితంగా ముడిపడి వున్న పరిణామం. ఆ ఉద్యమాలపై కొనసాగిన రాజ్యహింసతో ముడిపడిన పరిణామం. 1975 జూన్‌లో దేశవ్యాప్తంగా ఎమర్జెన్సీ పాలనని ప్రకటించిన తర్వాత సంఘం ముఖ్యులు అనేకమంది నిర్బంధానికి గురయ్యారు. ఎమర్జెన్సీ పాలన ముగిశాక, పౌర హక్కుల సంఘాన్ని పునరుద్ధరించే ప్రయత్నాలు మొదలయ్యాయి. 1979లో వరంగల్ నగరంలో రాష్ట్ర మహాసభలని నిర్వహించడంతో ఈ ప్రయత్నాలు నిర్మాణ రూపం తీసుకున్నాయి. ఈ మహాసభలలో కన్నబిరాన్‌ని అధ్యక్షునిగా ఎన్నుకున్నారు. కన్నబిరాన్ అధ్యక్షునిగా ఎన్నికవడం, సంస్థ చరిత్రలో కీలక పరిణామమని నేను అనుకుంటాను. వరంగల్ మహాసభలకు ముందు, ఎమర్జెన్సీ ఎత్తివేసిన వెనువెంటనే పౌర హక్కుల సమస్యలపైన పెద్ద ఎత్తున కదలిక ముందుకొచ్చింది. రాజకీయ ఖైదీల విడుదల చేయాలి, ఎమర్జెన్సీలో కొనసాగిన అక్రమ నిర్బంధాలు, చిత్రహింసలపై విచారణ జరిపించాలనే డిమాండ్లతో ఆందోళనలు సాగాయి. ఆంధ్రప్రదేశ్‌లో మార్క్సిస్టు– లెనినిస్టు పార్టీల కార్యకర్తలని బూటకపు ఎదురు కాల్పుల పేరిట కాల్చి చంపడంపై న్యాయ విచారణ డిమాండ్ కీలకంగా ముందుకొచ్చింది. కార్యకర్తలని చట్టవ్యతిరేకంగా హతమార్చిన ఘటనలపై తార్కుండే కమిటీ ఒక నివేదికను ప్రచురించింది. ఎమర్జెన్సీ పాలన కాలంలో జరిగిన ఈ ఎన్‌కౌంటర్ హత్యలపై ఓపీడీఆర్ సంస్థ ఒక వివరమైన నివేదికను ప్రచురించింది. రాష్ట్రంలో కొనసాగిన చట్టవ్యతిరేక ప్రభుత్వ హత్యలపై విచారణకు భార్గవ కమిషన్ ఏర్పాటైంది. ఆ కమిషన్ విచారణ మధ్యలోనే నిలిచిపోయింది. 1979లో జరిగిన ఏపీసీఎల్‌సీ రెండవ మహాసభలకు ఈ సంఘటనలు ఒక ముఖ్యమైన పూర్వరంగంగా ఉన్నాయి. మెరుగైన జీవితం కోసం 'ప్రజలు పోరాడే హక్కును' గుర్తించడం ఆ మహాసభలలో ఆమోదించిన ప్రణాళికలో ఒక ముఖ్య అంశం. ఆ హక్కును ప్రభుత్వం లేదా సంపన్న వర్గాలు కాలరాస్తున్నప్పుడు పౌర హక్కుల సంఘం పాత్ర ప్రాధాన్యతని సంతరించుకుంటుంది. పోరాడే హక్కును పౌరహక్కుల సంఘం బలపరుస్తుంది, దానిని ప్రచారం చేస్తుంది.

ఎమర్జెన్సీ అనంతర కాలం, ఆంధ్రప్రదేశ్‌లో వివిధ ఉద్యమాలు ముందుకు వచ్చిన కాలం. ప్రత్యేకించి తెలంగాణలో రైతాంగ ఉద్యమం పెల్లుబికిన కాలం. ఈ రైతాంగ ఉద్యమం ప్రభుత్వ నిర్బంధానికి లక్ష్యంగా మారింది. 1980ల నాటికి సిరిసిల్ల, జగిత్యాల ప్రాంతాలను, ఇంకా వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాలలో అనేక ప్రాంతాలను కల్లోలిత ప్రాంతాలుగా ప్రకటించారు. దానితో వివిధ రూపాలలో ప్రజలపై తీవ్ర నిర్బంధం అమలు జరిగింది. అరెస్టులు, అక్రమ నిర్బంధాలు, చిత్రహింసలు నిత్య కృత్యాలుగా మారాయి. ఆంధ్రప్రదేశ్ పౌర హక్కుల సంఘం వీటిపై ఆందోళనలు చేపట్టింది. మార్చి 1977 తర్వాత ఒక మూడు సంవత్సరాల స్వల్ప కాలం పాటు బూటకపు ఎదురు కాల్పుల హత్యలకి విరామం పాటించినా, 1980ల మధ్య కాలం నుండి ఈ హత్యలు మళ్లీ ఊపందుకున్నాయి. బొజ్జా తారకం, 'పోలీసులు అరెస్టు చేస్తే' అనే చిన్న కరపత్రం రాయడానికి నేపథ్యం ఇదే. ఆ తర్వాత ఇదే పేరుతో తారకం ఒక పుస్తకాన్ని రాశారు. ఆ పుస్తకానికి విస్తృతమైన ఆదరణ లభించింది. బెల్చీ, పిప్రా, పరస్ బిగా, భాగల్పూర్ ఘటనలపైన తారకం రాసిన కరపత్రాలు విస్తృతంగా ప్రచారమయ్యాయి. 1981 ఏప్రిల్ 20న ఇంద్రవెల్లిలో ఆదివాసులపైన జరిగిన దారుణ హత్యాకాండ అత్యంత హేయమైన ప్రభుత్వ చర్యలలో ఒకటి. దీనిపై ఏపీసీఎల్‌సీ విస్తృత ప్రచారాన్ని నిర్వహించింది. ఎమర్జెన్సీ అనంతర కాలంలో తిరిగి మొదలైన ఎన్‌కౌంటర్ హత్యలు మరింత బాహాటమైన హత్యలుగా మారిపోయి, విస్తృతమయ్యాయి. ఎమర్జెన్సీ రోజులలో మాదిరిగా అవి అడవులలో జరగలేదు. అవి పల్లెలకీ, పట్టణాలకీ విస్తరించాయి. హైదరాబాద్ నగరంలో కూడా ఆ హత్యలు జరగడం మొదలైంది. మధుసూదన్ రాజ్ హత్య దానికొక ఉదాహరణ. రవీందర్ రెడ్డి, పర్సయ్య అనే ఇద్దరు కార్యకర్తలను మేజిస్ట్రేట్ ముందు హాజరుపర్చిన తర్వాత, దారుణంగా కాల్చి చంపిన సంఘటన నాకు గుర్తుకొస్తున్నది. వాళ్ళు పోలీసుల చేతిలో ఆయుధాలని గుంజుకోబోయారనీ, పోలీసులు ఆత్మరక్షణార్థం వాళ్ళని కాల్చి చంపాల్సి వచ్చిందనీ కట్టుకథని అల్లారు. ఈ సంఘటనపై కన్నబిరాన్, బాలగోపాల్, నేను సభ్యులుగా ఒక నిజ నిర్ధారణ కమిటీని పౌర హక్కుల సంఘం ఏర్పాటు చేసింది. ఆ నిజ నిర్ధారణ కమిటీ నివేదికని తయారు చేసే బాధ్యతను బాలగోపాల్ స్వీకరించారు. ఆ నివేదికని తాను ఖచ్చితంగా, సమగ్రంగా రూపొందించారు. దీనితో, ఆ తర్వాత కాలంలో రిపోర్టులని రాసే బాధ్యత ఎక్కువగా తనపైనే పడింది. హక్కుల ఉద్యమ విస్తృతిలో బాలగోపాల్ కృషి గురించి ఎంత చెప్పినా అది తక్కువే అవుతుంది.



వివిధ రూపాలలో ప్రజల ప్రాథమిక హక్కులను కాలరాసే దాడులు ముమ్మరమౌతున్న రాజకీయ నేపథ్యంలో పౌర హక్కుల సంఘం తన 50వ వార్షికోత్సవాన్ని జరుపుకుంటున్నది. హిందుత్వ మతవాద శక్తులు మెజారిటేరియన్ ఫాసిస్టు పాలనని నెలకొల్పడానికి పూనుకుంటున్న సమయంలో సీఎల్‌సీ లాంటి పౌర హక్కుల సంఘాలు కీలకమైన పాత్రని నిర్వహించాల్సి ఉంటుంది. ప్రజల ప్రాథమిక హక్కులని దృఢంగా బలపరిచి, వాటిని విస్తృతంగా ప్రచారం చేయాలి.

గ్రామీణ పేదలపైన, ఆదివాసుల పైన రాజ్యహింస పెరిగిపోతూవున్న నేపథ్యంలో, రాజ్యమే ప్రధానంగా హక్కులని ఉల్లంఘిస్తున్న విషయాన్ని వెలుగులోకి తేవడమే పౌర హక్కుల సంఘం కృషిలో ప్రధానమైంది. ఇతరేతర శక్తులు, వ్యక్తుల ఆధ్వర్యంలో ఉల్లంఘనలని, హక్కులని హరిస్తున్న సంఘటనలని అది పట్టించుకోలేదని దీనర్థం కాదు. అయితే, ఒక సమగ్రమైన అవగాహన, దృక్పథం మాత్రం తర్వాత కాలంలో చర్చలు, ఆచరణలోనే రూపొందింది. కారంచేడు సంఘటనని ఒక మలుపుగా చెప్పుకోవచ్చు. ఎనభైలలో కుల అణచివేతకు వ్యతిరేకంగా, పితృస్వామ్య ఆధిపత్యానికి వ్యతిరేకంగా ముందుకు వచ్చిన సామాజిక ఉద్యమాల ప్రశ్నలు, రాజ్య హింస, ఇతర రూపాలలో ప్రయివేటు హింస, ఆధిపత్య రూపాలని గుర్తించడం, పర్యవసానంగా సంస్థలో జరిగిన చర్చలు, ఈ నేపథ్యంలోనే హక్కుల ఉద్యమాల పాత్ర, పరిధి గురించిన అవగాహన విస్తృతమైంది.

వివిధ రూపాలలో ప్రజల ప్రాథమిక హక్కులను కాలరాసే దాడులు ముమ్మరమౌతున్న రాజకీయ నేపథ్యంలో పౌర హక్కుల సంఘం తన యాభైయవ వార్షికోత్సవాన్ని జరుపుకుంటున్నది. హిందుత్వ మతవాద శక్తులు మెజారిటేరియన్ ఫాసిస్టు పాలనని నెలకొల్పడానికి పూనుకుంటున్న సమయంలో సీఎల్‌సీ లాంటి పౌర హక్కుల సంఘాలు కీలకమైన పాత్రని నిర్వహించాల్సి ఉంటుంది. ప్రజల ప్రాథమిక హక్కులని దృఢంగా బలపరిచి, వాటిని విస్తృతంగా ప్రచారం చేయాలి. అదే సమయంలో మనం సాధించిన అనుభవాలని అవలోకించుకొని, హక్కుల ఉద్యమాన్ని అభివృద్ధి చేసే విధంగా సమీక్షించుకోవాలి. పాఠాలను నేర్చుకోవాలి.

● బి.ప్రదీప్, ఐఎఫ్‌టియు

(1979–83 మధ్య ఆంధ్రప్రదేశ్ పౌర హక్కుల సంఘం ప్రధాన కార్యదర్శి)

వేయిస్తంభాల ఆలయానికి కొత్త శోభ

కాకతీయుల నిర్మాణాల్లో అత్యంత ప్రముఖమైనది హన్మకొండలోని వేయి స్తంభాల ఆలయం. కళ్యాణ మంటపం, ప్రధానాలయాన్ని కలిపి మొత్తం వేయి స్తంభాలతో నిర్మించిన కారణంగా ఈ ఆలయం ఆ పేరిట ప్రసిద్ధిచెందింది. శిధిల స్థితిలో ఉన్న కళ్యాణ మండపం పునర్నిర్మాణ పనులు 2005 జూలై 13న ప్రారంభమయ్యాయి. 18 నెలల్లో దీనిని పూర్తి చేయాలని అప్పుడు లక్ష్యంగా పెట్టుకున్నారు. కానీ, దాదాపు రెండు దశాబ్దాలపాటు ఆ పనులు కొనసాగి, ఎట్టకేలకు పునర్నిర్మాణం పూర్తయి, శుక్రవారం ప్రారంభోత్సవంతో మళ్ళీ పర్యాటకులకు అందుబాటులోకి వచ్చింది.

కల్యాణ మండపం పునర్నిర్మాణానికి అప్పటి కేంద్రప్రభుత్వం భారతీయ పురాతత్వ సంస్థ (ఏఎస్ఐ)కి రూ.3.80 కోట్లు మంజూరు చేసింది. పనులు మొదలై, శిలలను తొలగించినప్పుడు పునాది మొత్తం నీటితో ఉండి, ఇసుకపైనే ఈ భారీ శిలను నిలిపినట్టు ప్రత్యక్షంగా తెలుసుకోగలిగారు. పాత కల్యాణ మంటపం శిలలను ఒక్కొక్కటిగా తొలగించి, ఒక్కో శిలకు ఒక్కొక్క నెంబర్ ఇచ్చారు. 163 రాతి పిల్లర్లు (దూలాలు) ఉండగా వీటిలో నాలుగు అతి పెద్దవి. 8 మీటర్ల వెడల్పు ఉన్న ఈ పిల్లర్లు ధ్వంసం కావడంతో అమ్మవారిపేట సమీపంలోని క్వారీ వద్ద ఆ భారీ శూలాలను రూపొందించారు. తర్వాత రెండున్నరేళ్ల పాటు పనులు సాగలేదు. తిరిగి 2010లో మళ్లీ పనులు మొదలయ్యాయి, 2011లో నిర్మాణ వ్యయం అంచనాను రూ. 7.50 కోట్లకు పెంచారు. తమిళనాడుకు చెందిన స్థపతి శివకుమార్ ఆధ్వర్యంలో 50 మంది బృందం ఈ పనుల్లో పాల్గొన్నారు. మీటరు మందంతో డంగు సున్నం, గ్రాన్యువల్ ఫైల్స్‌తో కూడిన లేయర్‌ను నిర్మించారు. దీనిపై ఏడు వరుసలు రాతి నిర్మాణంతో ప్రదక్షిణ పథం నిర్మించారు. అనంతరం నాలుగు వరుసలు ఉండే కక్షాసనం నిర్మించారు. ఆపై రాతిగోడ నిర్మాణం పూర్తి చేశారు. నిర్మాణంలో ఉన్న శిలలను పట్టి ఉంచేలా ముఖ్యమైన శిలలకు స్టెయిన్‌లెస్ స్టీల్ పట్టీలను అమర్చారు. గతంలో కాకతీయులు కరిగించిన ఇనుమును పోసిన పోతల్లోనే ఈ స్టెయిన్‌లెస్ స్టీలు పట్టీలు అమర్చారు. 2015 ఆగస్టు నాటికి పైకప్పు మినహా మంటపం పునరుద్ధరణ పనులన్నీ పూర్తయ్యాయి. మరోసారి నిధుల కొరత ఏర్పడటంతో కొన్ని సంవత్సరాలు పనులు నిలిచిపోయాయి. స్థానిక ప్రజల ఉద్యమాలు, నిరసనలతో వాటిని తిరిగి ప్రారంభించి ఇటీవలే ఈ కల్యాణ మండపం పనులను పూర్తిచేశారు. దీని పునర్నిర్మాణ వ్యయం రూ. 13.10 కోట్లకు చేరింది. 1163 సంవత్సరంలో కాకతీయ చక్రవర్తి రుద్రదేవుడు నిర్మించిన ఈ వేయి స్తంభాల ఆలయం తిరిగి 860 సంవత్సరాల అనంతరం పూర్తి స్థాయిలో పర్యాటకులకు అందుబాటులోకి వచ్చింది. ఈ ఆలయ మరమ్మత్తులకు అప్పటి 7వ నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్ కూడా ఒక లక్ష రూపాయలు అందచేశారట. నీటి పాయపై, ఇసుక పునాది మీద భారీ శిల్పాలతో కళ్యాణ మండపం నెలకొల్పిన తీరు కాకతీయుల చాతుర్యానికి అద్దం పడుతుంది. అద్భుత శిల్ప కళకు వేయి స్తంభాల దేవాలయం ప్రతీతి.



– కన్నెకంటి వెంకటరమణ
జాయింట్ డైరెక్టర్ సమాచార, పౌర సంబంధాల శాఖ, హైదరాబాద్



శివోహం

జిల్లాలో కిక్కిరిసిన శైవక్షేత్రాలు

- భక్తులతో కిటకిటలాడిన కృష్ణానది ఘాట్లు
- యనమలకుదురులో మహాశివరాత్రి శోభ
- ప్రభ మహోత్సవంలో నింగినంటిన వెలుగులు
- అర్ధరాత్రి దాటాక ఆది దంపతుల కల్యాణం
- ఇంద్రకీలాద్రిపై శివాలయానికి పోటెత్తిన భక్తులు

ధమధమ ధమరుకనాదాలు.. నమోనమో నమఃశివాయః నినాదాలు.. భేరీశబ్దాలు.. శంఖారావాలు.. ఆనంద తాండవాలతో ఆధ్యాత్మిక సౌరభాలు వెల్లివిరిశాయి. మహాశివరాత్రి శోభను మరింత ద్విగుణీకృతం చేస్తూ జిల్లాలోని శైవక్షేత్రాలు అపర కైలాసాన్ని తలపించాయి. శుక్రవారం వేకువజామునే కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు శివాలయంలో పరమేశ్వరుని దర్శించి తరించారు. యనమలకుదురులోని శ్రీరామలింగేశ్వరస్వామి దర్శనానికి భక్తులు అశేషంగా తరలిరాగా, సాయంసంధ్యవేళ సాగిన ప్రభ మహోత్సవం, అర్ధరాత్రి దాటాక జరిగిన కల్యాణోత్సవంతో సంబరాలు అంబరాన్ని తాకాయి. ఇక ఇంద్రకీలాద్రిపై కొత్తగా నిర్మించిన మల్లేశ్వరాలయానికి భక్తులు పోటెత్తారు. వన్‌టౌన్‌లోని పాత శివాలయం, ముక్త్యాలలోని ముక్తేశ్వరస్వామి ఆలయం, కూడలి సంగమేశ్వరస్వామి ఆలయం, వెల్వడంలోని బాలకోటేశ్వరస్వామి ఆలయం వంటి శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడగా, దుర్గాఘాట్, పవిత్ర సంగమం సహా పలు ఘాట్లు కిక్కిరిసి కనిపించాయి.



యనమలకుదురులో భారీ ప్రభలు (ఇన్‌సెట్‌లో) బేతాళ నృత్యాలు



పాత శివాలయంలో శివుడికి అభిషేకం



యనమలకుదురు శివాలయంలో దీపాలను గొడుగు రక్షణలో తీసుకెళ్తూ..



దుర్గగుడిలో భక్తుల రద్దీ



కరకట్ట వద్ద కృష్ణానదిలో పుణ్యస్నానాలు

కేడీ షీటర్లు

వారంవారం కౌన్సెలింగ్‌కు రౌడీషీటర్ల డుమ్మా

- వైసీపీ నాయకుల వెంట ప్రచార కార్యక్రమాల్లో ప్రత్యక్షం
- రాజకీయ ఒత్తిళ్లతో నోరు మెదపని పోలీసులు
- ఎన్నికల వేళ నాయకులకు అండగా..
- ప్రచార కార్యక్రమాల్లో వారిదే హడావిడి

ఎవరైనా నాయకులను నిలదీస్తే దాడులు



రాజకీయాల్లో రౌడీషీటర్ల ప్రమేయం పెరిగిందా.. అంటే అవుననే సమాధానం వస్తోంది. సాధారణ ఎన్నికలు సమీపిస్తున్న వేళ వారంవారం పోలీస్ కౌన్సెలింగ్‌కు డుమ్మా కొడుతూ.. నాయకుల ప్రచార కార్యక్రమాల్లో ప్రత్యక్షమవుతున్నారు.

విద్యాధరపురం, మార్చి 8 : రౌడీషీటర్లుగా రికార్డులకెక్కిన వారు.. వారి పరిధిలోని పోలీస్ స్టేషన్లకు నిర్దేశిత సమయంలో హాజరై తాము నేరాలకు పాల్పడడం లేదంటూ చెప్పుకోవాలి. మరోవైపు స్టేషన్ సీఐ లేదా ఏసీపీ స్థాయిలో వీరికి కౌన్సెలింగ్ ఇస్తారు. అయితే, ఇటీవల కాలంలో రౌడీషీటర్లు అసలు పోలీసుస్టేషన్ల వైపే చూడట్లేదు. అధికార పార్టీ నేతల వెంట ప్రచార కార్యక్రమల్లో తలమునకలుగా తిరుగుతున్నారు. విజయవాడ సెంట్రల్ నుంచి వైసీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న వెలంపల్లి శ్రీనివాస్ ప్రచార కార్యక్రమంలో రౌడీషీటర్లదే హడావిడి. ఎవరైనా సమస్యలపై వెలంపల్లిని నిలదీస్తే.. వారిపై ఈ రౌడీషీటర్లు దాడికి దిగుతున్నారు. దీంతో తమకు అండగా ఉంటారన్న ఉద్దేశంతో మిగిలిన వైసీపీ నేతలు సైతం రౌడీషీటర్లను తమ ప్రచార కార్యక్రమాల్లో తిప్పుకొంటున్నారు.

కౌన్సెలింగ్‌కు డుమ్మా..

నేతల అండ చూసుకుని వారంవారం హాజరుకావాల్సిన కౌన్సెలింగ్‌కు చాలామంది రౌడీషీటర్లు డుమ్మా.. కొడుతున్నారు. వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఏడుగురు రౌడీషీటర్లు, 12 మంది సస్పెక్ట్ షీటర్లు, మరో 24 మంది నేరస్థులు ఉన్నారు. గవర్నర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో ఐదుగురు రౌడీషీటర్లు ఉండగా, సస్పెక్ట్ షీటర్లు, నేరస్థులు కలిపి 43 మంది ఉన్నారు. సూర్యారావుపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో ఐదుగురు రౌడీషీటర్లు, 28 మంది సస్పెక్ట్ షీటర్లు, 60 మంది నేరస్థులు ఉన్నారు. భవానీపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో 30 మంది రౌడీషీటర్లు, 99 మంది సస్పెక్ట్ షీటర్లు, 57 మంది నేరస్థులు ఉన్నారు. కృష్ణలంక పోలీస్‌స్టేషన్ పరిధిలో 30 మంది రౌడీషీటర్లు, 65 మంది సస్పెక్ట్ షీటర్లు, 60 మంది నేరస్థులు ఉన్నారు. కొత్తపేట పోలీస్‌స్టేషన్‌లో 52 మంది రౌడీషీటర్లు, 42 మంది సస్పెక్ట్ షీటర్లు, 100 మంది నేరస్థులు ఉన్నారు. కాగా, వన్‌టౌన్, కొత్తపేట పోలీస్ స్టేషన్లకు కలిపి వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ ప్రాంగణంలో ప్రతి ఆదివారం పోలీసు అధికారులు రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటర్లు, నేరస్థులకు కౌన్సెలింగ్ ఇస్తున్నారు. దీనికి కొత్తపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని అధికార పార్టీకి చెందిన పలువురు రౌడీషీటర్లు హాజరు కావట్లేదు. రాజకీయ ఒత్తిళ్లతో పోలీసులు చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నారు. దీంతో ఆ రౌడీషీటర్లు రెచ్చిపోయి గొడవలకు దిగుతున్నారు. రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటర్లు, నేరస్థులపై ఎప్పటికప్పుడు సమాచారం సేకరించి, పంపించాల్సిన ఇంటెలిజెన్స్ విభాగం రాజకీయ ఒత్తిళ్లతో పూర్తిగా పడకేసింది. దీంతో పాటు రౌడీషీటర్లను అదుపులో ఉంచాల్సిన టాస్క్‌ఫోర్స్ సిబ్బంది కూడా నిద్రపోతున్నారు. ఇదే కొనసాగితే ఎన్నికల్లో రౌడీషీటర్ల ప్రమేయం మితిమీరే అవకాశం లేకపోలేదు.



టేకు చెట్టు.. కొల్లగొట్టు..

- ఒక సెంటర్‌లో వాహనాలు ఉంటాయి. సాయంత్రానికి కూలీలతో అడవుల్లోకి వెళ్తాయి. ఎర్రచందనం చెట్లు నరికి లారీల్లో రహస్య గోడౌన్‌కు చేరుస్తారు... పుష్ప చిత్రంలో సీన్ ఇది.
- ఒక సెంటర్‌లో కూలీలంతా గూడి ఎగూడుతారు. ఒక నాయకుడు వచ్చి వారిని అడవుల్లోకి తీసుకెళ్తాడు. దీపాల వెలుగులో టేకుచెట్లను నరికిస్తాడు. ఇలా నరికి కలపను కొండపల్లిలోని టింబర్ డిపోకు తరలిస్తారు... జిల్లాలో టేకు 'పుష్ప'ల స్టైల్ ఇది.

..మైలవరం రేంజ్ పరిధిలోని అటవీ ప్రాంతంలో ఉన్న టేకు చెట్లను వైసీపీ నేతలు నేలమట్టం చేస్తున్నారు. వీరితో అటవీ శాఖ అధికారులు చేతులు కలిపి సంపదను సర్వనాశనం చేస్తున్నారు.

మైలవరం అడవిలో వైసీపీ నేతల అరాచకాలు

- అధికారుల సహకారంతో టేకు చెట్ల నరికివేత
- అనుమతి ఒకచోట.. నరికేది మరోచోట..
- చేతులు మారుతున్న లక్షలాది రూపాయలు
- కొండపల్లిలోని టింబర్ డిపోకు వెళ్తున్న సరుకు

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : మైలవరం రేంజ్ పరిధిలోని అటవీ భూముల్లో టేకు చెట్లను పగలు, రాత్రి తేడా లేకుండా ఇష్టానుసారంగా నరికేస్తున్నారు. ఈ తతంగమంతా అధికార పార్టీ నేతల కనుసన్నల్లోనే జరుగుతోంది. వారికి అటవీ శాఖ అధికారులు సహకరిస్తున్నారు. వైసీపీ నేతలు ఇచ్చిన ముడుపులు తీసుకుని అటవీ సంపదను మాఫియాకు కట్టబెడుతున్నారు. అధికారం చేతిలో ఉండటంతో తమను అడిగేవారు లేరని వైసీపీ నేతలు కూలీలతో టేకు చెట్లను ఇష్టానుసారంగా నరికిస్తున్నారు.

అనుమతి తీసుకున్నట్టుగా..

అటవీ ప్రాంతం రేంజ్, సెక్షన్, బీట్, కంపార్టుమెంట్లుగా ఉంటుంది. ఒక రేంజ్ పరిధిలో రెండు, మూడు సెక్షన్లు ఉంటాయి. ఒక్కో సెక్షన్ పరిధిలో ఉండే ప్రాంతాన్ని బట్టి బీట్లు ఉంటాయి. ఒక్కో బీట్ పరిధిలో 2 వేల నుంచి 3 వేల వరకు హెక్టార్ల అటవీ ప్రాంతం ఉంటుంది. ఈ ప్రాంతాన్ని కంపార్టు మెంట్లుగా వి భజి స్తారు. ఉదాహ రణకు రెండు గ్రామాల మధ్య అటవీ ప్రాంతం ఉంటే అది ఒక కంపార్ట్‌మెంట్ అవుతుంది. ఈ రేంజ్ పరిధిలో మొత్తం పది బీట్లు ఉన్నాయి. ఈ బీట్లు, కంపార్ట్‌మెంట్ల పరిధిలో కొన్ని సర్వే నెంబర్లలో గిరిజనులకు పట్టాలు ఇచ్చారు. ఆ భూముల్లో వారు కొన్నాళ్ల క్రితం టేకు మొక్కలు నాటారు. ఇప్పుడు అవి భారీగా పెరిగాయి. ఇలా పట్టాలు ఇచ్చిన భూముల్లో కాకుండా అటవీ శాఖకు చెందిన భూముల్లోనూ భారీ టేకు చెట్లు ఉన్నాయి. వీటినే వైసీపీ నేతలు నరికేస్తున్నారు.



మైలవరంలో ఇష్టానుసారంగా నరికిన టేకు చెట్లు

కీలక అధికారి సహకారంతో..

రేంజ్ పరిధిలో ఉన్న ఒక కీలక అధికారి మాఫియాతో చేతులు కలిపి ఈ వ్యవహారాన్ని సాగిస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. నరికిన టేకు కలపను రాత్రిపూట రహస్యంగా లారీల్లో కొండపల్లిలో ఉన్న ఓ టింబర్ డిపోకు తరలించి ముక్కలు చేయిస్తున్నారని సమాచారం. దీనిపై సంబంధిత రేంజ్ అధికారులను వి వరణ కోరగా, అటువంటిదేం లేదని చెబుతున్నారు. అనుమతి ఇచ్చిన సర్వే నెంబర్లలోనే భూమి యజమానులు టేకు చెట్లను నరుకుతున్నారని తెలిపారు. ఈ టేకు చెట్ల నరికివేత వ్యవహారంపై ఉన్నత స్థాయి విచారణ చేయాలని రేంజ్ పరిధిలోని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

నిబంధనలకు తిలోదకాలు

అటవీ శాఖ నిబంధనల ప్రకారం ఒక సర్వే నెంబర్‌లో ఉన్న ఇతర చెట్లను అయినా, టేకు చెట్లను అయినా నరకాలంటే అనుమతి తప్పనిసరి. యజమానులు ముందుగా జిల్లా అటవీశాఖ అధికారికి దరఖాస్తు చేసుకోవాలి. ఈ దరఖాస్తులు రేంజ్ కార్యాలయానికి వెళ్తాయి. రేంజ్ అధికారులు వాటిని పరిశీలించి సంబంధిత బీట్, సెక్షన్ అధికారులకు పంపుతారు. అసలు దరఖాస్తుదారుడి సర్వే నెంబర్‌లో టేకు చెట్లు ఉన్నాయా, లేదా, ఎన్ని చెట్లు ఉన్నాయి, ఎంతెంత పరిమాణంలో ఉన్నాయి అనే వివరాలను తెలుసుకుంటారు. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి అనుమతులు ఇస్తారు. దరఖాస్తుదారుడు ఒక్కో చెట్టుకు రూ.100 చొప్పున చలానాను అటవీ శాఖకు చెల్లించాల్సి ఉంటుంది. టేకు మాఫియాతో కలిసి అటవీ శాఖ అధికారులు ఈ నిబంధనలకు నీళ్లు వదిలేస్తున్నారు. ఒకటి, రెండు సర్వే నెంబర్లలో ఉన్న చెట్లను నరుక్కోవడానికి అనుమతులు ఇస్తున్నారు. ఇలా అనుమతులు తీసుకున్న మాఫియా ఆ సర్వే నెంబర్లలో ఉన్న చెట్లను వదిలేసి అటవీ శాఖకు చెందిన సర్వే నెంబర్లలో ఉన్న చెట్లను నరికేస్తున్నారు.

అనుభవించు రాజా

పర్యాటకాభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ)కు ఆయనొక ఇల్లరికపు అల్లుడు. రిటైర్ అయిన ఉద్యోగే.. అయినా అతిథ్యానికి అలవాటుపడి బెర్మ్ పార్కులో తిష్ట వేశాడు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఎంచక్కా కాటేజీతో పాటు ఫలహారం, ఆహారం, స్నాక్స్, కాఫీల పేరిట రాచభోగాలు అనుభవిస్తున్నాడు. ఏడాదిన్నరగా పర్యాటక కాటేజీలోనే తిష్టవేసిన ఈ అధికారి కారణంగా ఏపీటీడీసీ లక్షల రూపాయల ఆదాయాన్ని కోల్పోతోంది. ఏపీటీడీసీ ఉన్నతాధికారికి ఇష్టుడైన ఈ అధికారి ఇక్కడ ఆడిందే ఆట.. పాడిందే పాట..

హరిత బెర్మ్ పార్కులో ఓ అధికారికి రాచభోగాలు

- ఏడాదిన్నరగా ఇక్కడే తిష్ట
- కాఫీ, టిఫిన్, స్నాక్స్, లంచ్, డిన్నర్ అన్నీ ఇక్కడే..
- పదవీ విరమణ చెందిన వ్యక్తికి వాటర్ ఫ్లీట్ బాధ్యతలు
- భారీగా నష్టపోతున్న ఏపీటీడీసీ



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : పర్యాటకాభివృద్ధి సంస్థలో చాలాకాలం కిందట పదవీ వి రమణ చేసిన ఒక వ్యక్తి ఏడాదిన్నర కిందట మళ్లీ వచ్చాడు. ఉన్నతాధికారితో సన్నిహిత సంబంధం ఉండటంతో ఈ పోస్టులోకి వచ్చినట్టు తెలుస్తోంది. వాటర్ ఫ్లీట్ విభాగాన్ని ఈయన పర్యవేక్షిస్తున్నాడు. వాటర్ ఫ్లీట్ అభివృద్ధికి కృషి చేయాల్సిన ఈ అధికారి పర్యాటక ఆతిథ్యంపై మనసు పారేసుకున్నాడు. హరిత బెర్మ్‌పార్కులో నివాసం ఏర్పాటు చేసుకున్నాడు. ఏడాదిన్నరగా కాటేజీలోనే ఉంటున్నాడు.

- మిగతా 6లో

బడ్జెట్ దందా!

బడ్జెట్ కేటాయింపుల కోసం ఈవోల తిప్పలు

- ఆలయాల స్థాయిని బట్టి రూ.10వేల నుంచి రూ. 5 లక్షల వసూలు
- అన్ని స్థాయిల అధికారులకు మామూళ్లు

- 6లో..

జ్యుడీషియల్ రిమాండ్ ఖైదీ మృతి

- 6లో..


దుర్గానాగేశ్వరస్వామి


సంగమేశ్వరస్వామి


పంచముఖ అమృత లింగేశ్వర స్వామి


పూల అలంకరణలో మల్లేశ్వరాలయం ముఖద్వారం


ముక్తేశ్వర స్వామి


మల్లేశ్వరస్వామికి నూతన వస్త్రాలు..

హర హర మహాదేవ

మహా శివరాత్రి పర్వదినాన ఉమ్మడి కృష్ణాజిల్లాలో శివాలయాలు శివనామస్మరణతో హోరెత్తాయి. శుక్రవారం తెల్లవారుజాము నుంచే పలు ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించారు. పితృదేవతలకు తర్పణాలు సమర్పించారు. భక్తులతో స్నాన ఘాట్లు కిటకిటలాడాయి. ఆలయాల వద్ద ఎటువంటి అవాంఛనీయ ఘటనలు ఎదురుకాకుండా అధికారులు పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేశారు.

- పెదకళ్లేపల్లిలో పోటెత్తిన శైవాలయాలు
- వేలాదిగా భక్తుల పుణ్యస్నానాలు

మోపిదేవి, మార్చి 8 : పెదకళ్లేపల్లికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఉత్తర వాహిని కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించేందుకు శుక్రవారం తెల్లవారుజాము 4 గంటల నుంచే బారులుతీరారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పితృదేవతలకు పిండ తర్పణాలు గావించారు. మహిళలు పసుపు, కుంకుమతో వాయినాలు అందుకున్నారు. కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించి పితృదేవతలకు గంగిరెద్దులతో పొగిడించారు. స్నానఘాట్లు కిటకిటలాడాయి. దుర్గానాగేశ్వరస్వామి దర్శనానికి భక్తులు తరలివచ్చారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఈవో ఎన్.ఎస్.చక్రధరరావు, ఉద్యోగులు క్యూ లైన్లు ఏర్పాటు చేశారు. తెల్లవారుజాము 2 గంటల నుంచే భక్తులకు స్వామి దర్శనం కల్పించారు. దేవస్థానం ఆధ్వర్యంలో పులిహోర ప్రసాదం, మంచినీరు, మజ్జిగ పంపిణీ చేశారు. అవనిగడ్డ డీఎస్పీ మురళీధర్ చల్లపల్లి, అవనిగడ్డ సీఐలు నాగ ప్రసాద్, త్రినాథ్‌ల ఆధ్వర్యంలో ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేశారు. పలు స్వచ్ఛంద సంస్థలు భక్తులకు విశేష సేవలు అందించాయి.

శివనామస్మరణతో మార్మోగిన ఐలూరు

తోట్లవల్లూరు : తోట్లవల్లూరు మండలం ఐలూరు శివనామస్మరణతో మార్మోగింది. జిల్లా నలుమూలల నుంచి 80వేల మంది భక్తులు తరలివచ్చారు. కృష్ణానదిపాయలో జల్లు స్నానాలు ఆచరించారు. పితృదేవతలకు పిండప్రదానాలు సమర్పించారు. రామేశ్వరస్వామిని, రఘునాయకస్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ రామేశ్వరస్వామికి పట్టువస్త్రాలు సమర్పించారు. విఐపీ దర్శనం రూ. 100, విశిష్ట దర్శనం రూ. 10, శీఘ్రదర్శనం రూ.20 ధర నిర్ణయించగా భక్తులను క్యూలైన్‌లో పడిగాపులు పడ్డారు. ఉచిత దర్శనానికి క్యూ లైన్‌లో భక్తులు నరకయాతన అనుభవించారు. కృష్ణానదిపాయ వద్ద సుమారు 4 వేలమంది భక్తులు స్నానాలు ఆచరించి శ్రీమద్ భ్రమరాంబ చెన్నమల్లిఖార్జునస్వామిని దర్శించుకున్నారు.

భోళా శంకరుడికి త్రికాల అర్చనలు

వన్‌టౌన్ : మహా శివరాత్రి పర్వదినం పురస్కరించుకుని వన్‌టౌన్ శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. భోళాశంకరుడికి కైమోడ్పులు సమర్పించారు. హరోం హర సాంబ సదాశివ అంటూ భక్తజనం అర్చనలలో పాల్గొన్నారు. వేకువజామునుంచే అభిషేకాలు ప్రారంభమయ్యాయి.

దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో..

ఇంద్రకీలాద్రి మల్లేశ్వరాలయంలో స్వామివారిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. దుర్గమ్మవారిని, మల్లేశ్వరస్వామిని ప్రధాన ప్రభుత్వ కార్యదర్శి కేఎస్ జవహర రెడ్డి దర్శించుకున్నారు. ఈవో రామారావు ఆయనకు సాదర స్వాగతం పలికారు. భక్తులు ఆర్జిత సేవల్లో పాల్గొన్నారు.

మంగళగిరి భక్త మార్కండేయ ట్రస్ట్ ఆధ్వర్యంలో చేనేత మగ్గాలపై వారం రోజుల పాటు ప్రత్యేకంగా నేసిన పట్టువస్త్రాలను స్వామివారికి సమర్పించారు. మంగళవాయిద్యాలు, వేదమంత్రాల నడుమ మల్లేశ్వరస్వామికి అభిషేకాదులను నిర్వహించి శ్వేత పట్టు వస్త్రాలను సమర్పించారు.

ఘాట్ల వద్ద భక్తుల స్నానాలు..

ఘాట్లలో నీరు లేకపోవడంతో అధికారులు జల్లు స్నానాలు ఏర్పాటు చేశారు. భక్తులు కాస్త ఇబ్బందులకు గురయ్యారు. పాత శివాలయంగా పేరున్న భ్రమరాంబ మల్లేశ్వరాలయానికి భక్తులు పోటెత్తారు.

కూడలి సంగమేశ్వరాలయంలో..

నందిగామ రూరల్ : దాములూరు కూడలి గ్రామంలో సంగమేశ్వర స్వామి ఆలయంలో కల్యాణోత్సవ తిరునాళ్లలో భాగంగా తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈవో వాసిరెడ్డి భూపాల్, చైర్మన్ కనగాల వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో సంగమం ప్రాంతంలో భక్తులు జల్లుస్నానాలు ఆచరించి స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. సంగమతీరాన పితృదేవతలకు తర్పణ పూజలు చేశారు. వాసవీ క్లబ్ సభ్యులు భక్తులకు మంచి నీరు, మజ్జిగ పంపిణీ చేశారు. ఎమ్మెల్సీ మొండితోక అరుణ్‌కుమార్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను, మాజీ ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్‌లు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. సీఐ హనీష్ పర్యవేక్షణలో ఎస్ఐలు బందోబస్తు నిర్వహించారు. అంబారుపేట, పల్లగిరి గట్టు, నందిగామ గ్రామాలలో ఓంకారేశ్వర స్వామి, రాఘవాపురం కోటరాయగుట్టపై మల్లేశ్వరస్వామి ఆలయాలలో రుద్రాభిషేకం, పుష్పార్చన కార్యక్రమాలను నిర్వహించారు. గోళ్లమూడి, సోమవరం, పల్లగిరి, దాములూరు గ్రామాలలోని శివాలయాలలో స్వామి వారికి రుద్రాభిషేకం నిర్వహించారు.

కమనీయం.. గంగా, పార్వతి, మల్లేశ్వరుల కల్యాణం



వన్‌టౌన్, మార్చి 8 : దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానంలో మహాశివరాత్రి సందర్భంగా అర్ధరాత్రి లింగోద్భవ అభిషేకాలను నిర్వహించారు. భక్తులు హరోం హర అంటూ నినాదాలు చేశారు. సంప్రదాయం మేరకు లింగోద్భవం అనంతరం గంగా, పార్వతి, మల్లేశ్వరుల కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. మూడురోజుల క్రితం అమ్మవారు, స్వామివార్ల ఉత్సవమూర్తులను వధూవరులుగా అలంకరించారు. అప్పటి నుంచి వివిధ హోమాలు మూలమంత్ర హవనాలు మండపూజలు నిర్వహించారు. శివరాత్రి కల్యాణోత్సవం సందర్భంగా పార్వతీదేవి, మల్లేశ్వరుల వంశ శోభితాన్ని వర్ణిస్తూ పండితులు ఎదురుకోల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇదే సమయంలో పాతశివాలయంలోనూ లింగోద్భవం అనంతరం భద్రకాళి, వీరభద్రస్వామి, భ్రమరాంబా మల్లేశ్వరుల కల్యాణాన్ని వేడుకగా నిర్వహించారు.

శివ భక్తులతో పోటెత్తిన ముక్త్యాల..

జగ్గయ్యపేట రూరల్ : ముక్త్యాల గ్రామం శుక్రవారం భక్తులతో పోటెత్తింది. తెలుగు రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. భవానీ ముక్తేశ్వరస్వామికి అర్చకులు విశేషపూజలు నిర్వహించగా భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈవో జయప్రకాష్‌బాబు ఏర్పాట్లను పర్యవేక్షించగా వంశపారంపర్య ధర్మకర్త వెలగపూడి లక్ష్మణ ఇందిరాదత్ కేసీపీ సౌజన్యంతో భక్తులకు ప్రసాదం, తాగునీటిని పంపిణీ చేశారు.

కోటిలింగాల క్షేత్రంలో..

ముక్త్యాల సమీపంలో కామాక్షి సమేత పంచముఖ అమృతలింగేశ్వర స్వామి ఆలయంలో విశేషపూజలు, అభిషేకాలు చేశారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఈవో బొగ్గవరపు రవీంద్ర బాబు అన్ని ఏర్పాట్లు చేశారు.

కమనీయం రామలింగేశ్వరుని కళ్యాణం

నలభైకి పైగా ప్రభల ఏర్పాటు

పెనమలూరు : యనమలకుదురు రామలింగేశ్వర స్వామి, పార్వతీదేవి అమ్మవార్ల కళ్యాణం శుక్రవారం కన్నుల పండువగా జరిగింది. వేలమంది భక్తులు హాజరయ్యారు. తెల్లవారు జాము నుంచే స్వామి దర్శనానికి భక్తులు పోటెత్తారు. ఉదయం 11గంటలకు గ్రామ మంటపం వద్ద దేవస్థాన ప్రభకు ఎడ్లు కట్టి ఊరేగించడానికి వేలం పాట నిర్వహించారు. రాధాకృష్ణ కోలాటాలు, భజనలు, కోయ నృత్యాలు, భేతాళ వేషాలు, హిరాణీ నృత్యాలు, మేళతాళాలతో గ్రామ ప్రభను అత్యంత వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు. నేడు స్వామివారి గ్రామోత్సవం నిర్వహించనున్నట్టు ఈవో గంగాధర్ తెలిపారు.

ప్రభలకు రూ.2.5 లక్షల విరాళం

ఆలయ పరిసరాల్లో ఏర్పాటు చేసిన 24 ప్రభలకు గ్రామ టీడీపీ నాయకులు అనంతనేని చంద్రశేఖర్ ఆజాద్ రూ.2.5లక్షలను మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్ చేతుల మీదుగా అందజేశారు. స్వామి దర్శనానికి పోటెత్తిన భక్తులకు టీడీపీ కృష్ణా జిల్లా ఉపాధ్యక్షుడు వెలగపూడి శంకర బాబు, మొక్కపాటి శ్రీనివాస్‌లు ప్రసాదాలను పంపిణీ చేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీసుశాఖ భారీ బందోబస్తు ఏర్పాటు చేసింది.


పితృదేవతలకు పిండ ప్రదానాలు


సీతానగరం వద్ద కృష్ణానదిలో భక్తుల స్నానాలు


ముక్త్యాల వద్ద భక్తుల పుణ్యస్నానాలు


తోట్లవల్లూరు మండలం ఐలూరులో జల్లు స్నానాలు


కూడలి సంగమేశ్వరాలయం వద్ద ..


కళాకారుల నాట్యాభినయం

రామలింగేశ్వరునికి నృత్య నీరాజనం

కూచిపూడి : మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత పసుమర్తి రామలింగశాస్త్రి పర్యవేక్షణలో కూచిపూడి శ్రీ సిద్ధేంద్ర నాట్య కళావేదికపై శుక్రవారం సాయంత్రం కళాకారులు నాట్యాంశాలు ప్రదర్శించి రామలింగేశ్వరునికి నాట్య నీరాజనాలు అందించారు. నాట్య ప్రదర్శనలు అర్ధరాత్రి వరకు కొనసాగాయి. మహాశివరాత్రి రోజున జాగారం చేసి భక్తిపాటలు ఆలపించటం ఆనయవాతీగా వస్తోంది. బాలత్రిపుర సుందరిదేవి పాలకమండలి, నాట్యాచార్యులు, గ్రామస్థులు తమ సహకారం అందించారు.

అనుభవించు రాజా

(5వ పేజీ తరువాయి)

ఏసీ సూట్‌లో ఆతిథ్యం, డన్‌లప్ పరుపుపై శయనం, లేవగానే బ్రేక్‌ఫాస్ట్, మధ్యాహ్నా భోజనం, రాత్రి భోజనం అన్నీ అక్కడే. వాకింగ్‌కు వచ్చినప్పుడల్లా కాఫీ తప్పనిసరి. కోరినపుడు స్నాక్స్ సాఫ్ట్‌డ్రింక్స్. ఒక్కటేమిటి అతిథి మర్యాదలన్నీ ఆయనకే. ఇదే సూట్ పర్యాటకులు బుక్ చేసుకుంటే ఏపీటీడీసీకి రోజుకు రూ.2,500 నుంచి రూ.3 వేల ఆదాయం వస్తుంది. మొత్తంగా నెలకు అక్షరాలా రూ.లక్ష ఆదాయం వస్తుంది. కానీ, సదరు అధికారి చెల్లించే మొత్తం మాత్రం రూ.5 వేలు. ఏడాదిన్నరగా ఆయన వల్ల రూ.15 లక్షల నుంచి రూ.18 లక్షల వరకూ ఏపీటీడీసీ ఆదాయాన్ని కోల్పోయింది.

ఇష్టానుసారంగా బోట్ల కొనుగోలు

ఏపీటీడీసీకి ఇల్లరికపు అల్లుడిగా వచ్చిన ఈ అధికారి బోటింగ్ విభాగాన్ని నిర్వీర్యం చేస్తున్నాడు. ఇటీవల ఉత్తర భారతదేశం నుంచి సెకండ్ హ్యాండ్ బోట్లను రహస్యంగా కొనుగోలు చేయటంలో ఈ అధికారి పాత్రే ప్రధానంగా ఉంది. సముద్రంలో ఓడలకు కట్టే బోట్లను రెండింటిని కొన్నారు. వాటిని ఇక్కడ స్పీడ్ బోట్లుగా తిప్పుతారని చెబుతున్నారు. పోర్టు ఎన్‌వోసీలు, ఇరిగేషన్ శాఖ అనుమతులు లేకుండా బోట్లను నడిపిస్తున్న ఈ వాటర్ ఫ్లీట్ బాస్ పర్యాటకుల ప్రాణాలను కూడా ఫణంగా పెడుతున్నాడు. తన అడుగులకు మడుగులొత్తే వారికి ఏపీటీడీసీలో పోస్టింగ్‌లు ఇప్పించుకుంటున్నారు. పదవీ విరమణ చెందిన వారికి కూడా రీ అపాయింట్‌మెంట్లు ఇస్తున్నాడు. ఇలా పోస్టింగ్‌లు తెచ్చుకున్న వారంతా గతంలో పలు ఆరోపణలు ఎదుర్కొన్నవారే.

చర్యలు లేవా?

ఏపీటీడీసీలో సదరు అధికారితో పాటు ఇలాంటి ఎంతోమంది ఉన్నారు. పొరుగు రాష్ట్రం నుంచి వచ్చి ఇక్కడ తిష్టవేసిన వారున్నారు. తిరిగి వెళ్లటానికి ససేమిరా అంటున్నారు. కన్సల్టెంట్ల ముసుగులో లక్షలాది రూపాయలు ఏపీటీడీసీ నుంచి అప్పనంగా తింటున్నారు. ఇలాంటి వారందరినీ కూర్చోబెట్టి మేపుతుండటంతో సంస్థకు అంతులేని భారమవుతోంది.

దేవదాయశాఖలో.. బడ్జెట్ దందా!



- బడ్జెట్ కేటాయింపుల కోసం ఈవోల తిప్పలు
- ఆలయాల స్థాయిని బట్టి రూ.10 వేల నుంచి 5 లక్షలు వసూలు
- అన్ని స్థాయిల అధికారులకు మామూళ్ల పంట

(విజయవాడ - ఆంధ్రజ్యోతి)

ఆర్థిక సంవత్సరం మారుతుందంటే దేవదాయశాఖలో కొందరు అధికారులకు కాసుల వర్షం కురుస్తుంది. ప్రతియేటా ఆర్థిక సంవత్సరం ప్రారంభంలో శాఖ పరిధిలోని ఆలయాలు, సత్రాలు బడ్జెట్ కేటాయింపులు చేయించుకోవాల్సి ఉంటుంది. 2024-2025 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ కేటాయింపులు ప్రస్తుతం నడుస్తున్నాయి. బడ్జెట్ కేటాయింపులకు కొందరు ఉన్నతాధికారులు వసూళ్ల దందాకు తెరలేపారు. ఆలయాలు, సత్రాల స్థాయిని బట్టి రూ.10 వేల నుంచి సుమారు రూ.5 లక్షల వరకు ముక్కుపిండి వసూలు చేస్తున్నారు. అడిగిన మేరకు డబ్బు ఇవ్వని కార్యనిర్వాహక అధికారుల(ఈవో)ను ఇబ్బందులకు గురిచేస్తూ పలు కారణాలతో ఫైళ్లను తిరస్కరిస్తున్నట్టు పలువురు కార్యనిర్వాహక అధికారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆలయాల స్థాయిని బట్టి అధికారి

దేవదాయశాఖ కమిషనర్ పరిధిలో కోటి రూపాయలు, ఆపైన ఆదాయం ఉన్న ఆలయాలు, సత్రాలు ఉంటాయి. ఇలాంటివి రాష్ట్రవ్యాప్తంగా 300 నుంచి 400 వరకు ఉన్నాయి. రీజనల్ జాయింట్ కమిషనర్ (ఆర్‌జేసీ) పరిధిలో శ్రీకాకుళం నుంచి కృష్ణాజిల్లా వరకు రూ.కోటిపైన ఆదాయం ఉన్న ఆలయాలు, సత్రాలు ఉంటాయి. ఇలాంటివి 100 వరకు ఆర్‌జేసీ పరిధిలో ఉన్నాయి. డిప్యూటీ కమిషనర్ స్థాయిలో ఉమ్మడి కృష్ణా, ఉమ్మడి గోదావరి జిల్లాల్లోని ఏడాదికి రూ.2 లక్షల నుంచి రూ.25 లక్షల మేరకు ఆదాయం వచ్చే ఆలయాలు, సత్రాలు ఉంటాయి. ఇలాంటివి సుమారు 500కు పైగా ఉన్నాయి. ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్(ఏసీ) పరిధిలో ఏడాదికి రెండు లక్షల రూపాయల వరకు ఆదాయం వచ్చే ఆలయాలు, సత్రాలు సుమారు వెయ్యి వరకు ఉంటాయి.

బడ్జెట్‌తో కాసుల పంట

ఆయా ఆలయాలు, సత్రాలకు సంబంధిత అధికారులు ఈ ఏడాది ఏప్రిల్ 1వ తేదీ నుంచి ప్రారంభం కానున్న 2024-2025 ఆర్థిక సంవత్సరానికిగాను బడ్జెట్‌ను కేటాయించాల్సి ఉంటుంది. బడ్జెట్ కేటాయింపులో ఆలయాలు, సత్రాల స్థాయిని బట్టి సంబంధిత అధికారులు రూ. 10 వేలు నుంచి రూ.5 లక్షల వరకు వసూలు చేస్తున్నట్టు ఈవోలు ఆరోపిస్తున్నాయి. జీతాలకే డబ్బులు సరిపోని ఆలయాల నుంచి కూడా ముక్కుపిండి డబ్బులు వసూలు చేస్తున్నారని వారు వాపోతున్నారు. ఆర్‌జేసీ లేనందున డీసీకి పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈయనపై ఏసీబీ కేసు నడుస్తోంది. కేసు పెండింగ్‌లో ఉన్నందున బడ్జెట్ శాంక్షన్స్‌తోపాటు ఆర్థికపరమైన లావాదేవీలు ఏవీ ఆయన జరపకూడదని నిబంధనలు ఉన్నా బడ్జెట్ కేటాయింపులు ఆయన చేతుల మీదుగా జరిగిపోతున్నాయి. పైస్థాయి అధికారులు, పలువురు మంత్రుల అండదండలు ఉండటంతో దేవదాయశాఖలో ఆయన చెప్పిందే వేదంగా నడుస్తోందని పలువురు ఉద్యోగులు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. ఆయన తర్వాత స్థాయిలో విధులు నిర్వహించే అధికారిపై కూడా బడ్జెట్ దందా ఆరోపణలు వినిపిస్తున్నాయి. తన పరిధిలోని ఆలయాల బడ్జెట్ ఆమోదానికి కాసులు లేనిదే సంతకం పెట్టడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. తనిఖీల పేరిట ఆలయాలు, సత్రాలకు వెళ్లినపుడు పట్టు వస్త్రాలు, రూ.10వేల వేల నగదు సమర్పించుకుంటేనే అన్ని సక్రమంగా ఉన్నట్టు సంతకం చేస్తారని దేవదాయశాఖ సిబ్బంది చెబుతున్నారు. అధికారపార్టీలోని ఓ కీలక నాయకుడు అండతో ఈ అధికారి ఎవ్వరినీ లెక్కచేయరన్న ఆరోపణలు ఉన్నాయి. ఒక్క బడ్జెట్ ఆమోదం ద్వారానే సుమారు రూ.కోటి వరకు ఈ అధికారి ఆర్జించారన్న ప్రచారం నడుస్తోంది.

జ్యుడీషియల్ రిమాండ్ ఖైదీ మృతి



విజయవాడ, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : విజయవాడలోని జిల్లా కారాగారంలో శిక్ష అనుభవిస్తున్న ఖైదీ అనుమానాస్పదంగా మృతి చెందిన సంఘటన శుక్రవారం జరిగింది. విజయవాడ కొత్తపేట గొల్లగుంటవాగు ప్రాంతానికి చెందిన బాలగంగాధర్ తిలక్(37)ను వన్‌టౌన్ ట్రాఫిక్ పోలీసులు సితార సెంటర్ వద్ద డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో పట్టుకుని గురువారం కోర్టులో హాజరుపరిచారు. తిలక్‌కు న్యాయాధికారి రూ.10 వేల జరిమానాతోపాటు జైలుశిక్ష విధించారు. పోలీసులు అదేరోజు సాయంత్రం జైలుకు తరలించారు. శుక్రవారం ఉదయం తిలక్ వాంతులు చేసుకుని, కింద పడిపోయాడు. వెంటనే స్పందించిన జైలు సిబ్బంది అతడిని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కొద్దిసేపటికి తిలక్ ప్రాణాలు కోల్పోయినట్టు వైద్యులు ధ్రువీకరించారు. అనంతరం అతడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. తిలక్ కొంత కాలంగా అనారోగ్యంతో ఉన్నట్టు కుటుంబసభ్యులు చెబుతున్నారు. అతడికి కామెర్ల వ్యాధి ఉన్నట్టు తెలిసింది. తమ కుమారుడికి పోస్టుమార్టం చేయవద్దని తల్లిదండ్రులు పట్టుబట్టారు. సీపీఎం కార్పొరేటర్ బోయి సత్తిబాబు మార్చురీ వద్ద ఆందోళన చేశారు. మృతుడి కుటుంబానికి రూ.50లక్షల పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. మృతుడి కుటుంబసభ్యులతో ఆర్డీవో భవానీశంకర్ మాట్లాడి పరిస్థితిని తెలుసుకున్నారు. దీనిపై గవర్నరుపేట పోలీసులు కేసు నమోదు చేశారు.


వరల్డ్ రికార్డ్ కోసం పాడుతున్న రుగ్వేదం పద్మశ్రీ

నాన్‌స్టాప్‌గా 4 గంటలు

- యువగాయని రుగ్వేదం పద్మశ్రీ రికార్డు

విజయవాడ కల్చరల్, మార్చి 8 : అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని స్వరలయ సంస్థ ఆధ్వర్యంలో ప్రముఖ యువగాయని రుగ్వేదం పద్మశ్రీ నాన్‌స్టాప్‌గా 116 మంది తెలుగు సినీ నేపథ్య గాయనీమణులు ఆలపించిన గీతాలను ఏకగళంతో ఆలపించి ప్రపంచ రికార్డు నెలకొల్పింది. గాంధీనగర్‌లోని వెలిదండ్ల హనుమంతరాయ గ్రంథాలయంలో శుక్రవారం సాయంత్రం 4 గంటల పాటు గాయని పద్మశ్రీ తన మధుర గాత్రంతో శ్రోతలను అలరిస్తూ ఈ రికార్డు సాధించింది. హైగ్రేంజ్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్, చాంపియన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్‌ల ప్రతినిధులు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. త్వరలో ఈ రికార్డులు ఆమెకు అందించి సత్కరించనున్నట్టు పేర్కొన్నారు. విదేశాల్లోను కూడా తెలుగు పాటలను వినిపించి కీర్తి గడించిన ఈ యువ గాయని ఓ కళాశాలలో ఇంటర్మీడియట్ సెకండియర్ చదువుతోంది. ప్రముఖ సంగీత విద్వాంసులు ఎస్‌సీహెచ్ బుచ్చయాచార్యులు వద్ద కర్ణాటక సంగీతంలో మెళకువలపై సాధన చేస్తోంది. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు వై.సుబ్రమణ్యం, కార్యదర్శి ఎస్ఆర్ ప్రభాకర్, మోహన్‌రాంప్రసాద్‌లు పాల్గొన్నారు.

పోలాటితిప్ప మడ అడవుల్లో విస్తృతంగా నాటుసారా

1700లీ. బెల్లపు ఊట, 30 లీ. సారా ధ్వంసం

మచిలీపట్నం టౌన్ : మండలంలో పోలాటితిప్ప గ్రామంలోని మడ అడవుల్లో నాటుసారా స్థావరాలపై స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శుక్రవారం విస్తృత దాడులు చేశారు. 1700 లీటర్ల బెల్లపు ఊట, 30 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. సారా తయారు చేసినా, అమ్మినా చట్ట రీత్యా చర్యలు తీసుకుంటామని మచిలీపట్నం ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ జి. సత్యనారాయణ తెలిపారు.

తోపుడు బండ్లు పంపిణీ

గవర్నర్‌పేట, మార్చి 8: టీడీపీ సెంట్రల్ ఇన్‌చార్జి బొండా ఉమా మహేశ్వరరావు ఆర్థిక సహాయంతో శుక్రవారం సూర్యారావుపేటలోని టీడీపీ 23వ డివిజన్ కార్యాలయం వద్ద పేద మహిళలకు జీవనోపాధి కోసం నాలుగు తోపుడు బండ్లు పంపిణీ చేశారు. బొండా ఉమాతో పాటు విజయవాడ పార్లమెంటు టీడీపీ ఇన్‌చార్జి కేశినేని శివనాథ్ (చిన్ని), డివిజన్ కార్పొరేటర్ నెలిబండ్ల బాలస్వామి, డివిజన్ నేతలు చింతా దుర్గారావు, కటిక కోటి పాల్గొన్నారు.





మాట్లాడుతున్న గద్దె అనురాధ



కలలకు రెక్కలు పోస్టర్లను ఆవిష్కరించిన బొండా సుజాత



లెనిన్ భవన్ వద్ద జెండాను ఆవిష్కరిస్తున్న కొరగంజి దుర్గాంబ

సమాజాన్ని మార్చే శక్తి మహిళలదే

గవర్నర్‌పేట, మార్చి 8: సమాజాన్ని మార్చే శక్తి మహిళలకే ఉంటుందని, దానికి నిబద్ధతతో కూడిన పురుష బలం తోడుండాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్ఫూర్తి కుటుంబం ట్రస్ట్, స్త్రీ శక్తి సోషల్ స్ఫూర్తి విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం సివిల్ కోర్టుల సమీపంలోని కేవీఎల్ రావు భవన్‌లో స్త్రీ శక్తి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఆర్ రెడ్డి ఇంజనీరింగ్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ దీప్తి ప్రసన్న మాట్లాడుతూ మహిళ తన కుటుంబాన్ని నడుపుకుంటూనే సమాజం పట్ల అవగాహన కలిగి ఉంటుందని అన్నారు. రంగరాయ మెడికల్ కాలేజీ ప్రొఫెసర్ డాక్టర్ నజియా ఫరా, ఉపాధ్యాయిని ఎం. పుష్పలత, డాక్టర్ హేమలత ప్రసంగించారు. కార్యక్రమాలను సంస్థ ప్రతినిధులు జి. ప్రమీల, మేకా రజనీకాంత్ పర్యవేక్షించారు. కార్యక్రమానికి హాజరైన మహిళలందరికీ డాక్టర్ నజియా, డాక్టర్ గిరిజ బృందం వైద్య పరీక్షలు నిర్వహించారు.

గవర్నర్‌పేట: ఎంజీ రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణాజిల్లా గ్రంథాలయ సంస్థచైర్‌పర్సన్ టి. జమలపూర్ణమ్మను సరస్వతీ సామ్రాజ్యం సంస్థ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. శాలువా కప్పి, జ్ఞాపికను అందజేశారు.

మహిళా దినోత్సవంలో వక్తలు

పటమట: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ కార్పొరేటర్ దేవినేని అపర్ణ ఆధ్వర్యంలో ఫన్‌టైమ్స్‌లో వేడుకలు ఘనంగా నిర్వహించారు. మహిళలకు వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతుల ప్రదానం చేశారు. ఈ సందర్భంగా గద్దె అనురాధ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో మహిళలు చంద్రబాబు వెంట ఉండాలన్నారు. చెన్నుపాటి ఉషారాణి, కొలసాని నాగమణి,శశికళ, మాధవి, అట్లూరి సుమబిందు, మహ్మద్ లీనా, సలిమిశెట్టి రాజామణి పాల్గొన్నారు.

పటమట: వాకర్స్ అసోసియేషన్ ఆఫ్ పటమట ఆధ్వర్యంలో అసోసియేషన్ అధ్యక్షుడు పరుచూరి అజయ్‌కుమార్ అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఆవిర్భావం గురించి వివరించారు. అసోసియేషన్‌లో మహిళల కోసం కొత్తగా వాప్ మహిళా వాకర్స్ అసోసియేషన్ అనే కొత్త విభాగం ఏర్పాటు చేశారు. వీరి చేత ముఖ్య అతిథి జిల్లా వాకర్స్ గవర్నర్ చిన్నం రామకృష్ణ ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం జిల్లా వ్యవసాయశాఖ అధికారులు డీఎం కె.నాగమల్లికను, డీడీఏ ఎస్. నాగమణెమ్మను సన్మానించారు. అసోసియేషన్ గౌరవాధ్యక్షులు వీవీ.రామారావు, అసోసియేషన్ సెక్రటరీ ఎన్‌వీ.రెడ్డి, కోశాధికారి సీహెచ్. శ్రీనివాస్, తోటలక్ష్మి, అనిత శోభారాణి, హరిబాబు, మహిళా సభ్యులు పాల్గొన్నారు.

అజిత్‌సింగ్‌నగర్: అజిత్‌సింగ్‌నగర్‌లోని టీడీపీ సెంట్రల్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో బొండా ఉమా సతీమణి బొండా సుజాత హాజరై కేక్ కట్ చేసి నియోజకవర్గ మహిళలకు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం మహిళల సాధికారతపై రూపొందించిన కలలకు రెక్కలు అనే కరపత్రాలు, వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. బొండా ఉమా, నియోజకవర్గ తెలుగు మహిళా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వన్‌టౌన్: జనసేన అధికార ప్రతినిధి పోతిన మహేశ్, ఆయన సతీమణి విజయలక్ష్మిల ఆధ్వర్యంలో కృష్ణా పెన్నా రీజియనల్ కో ఆర్డినేటర్, 44వ డివిజన్ జనసేన అధ్యక్షురాలు మల్లెపు విజయలక్ష్మి అధ్యక్షతన మహిళా దినోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. 22 డివిజన్ల నుంచి మహిళలు పాల్గొన్నారు. తిరుపతి అనూష, బొమ్ముగోవింద లక్ష్మి, ఎన్ ఎస్ ప్రియదర్శిని, సయ్యద్ ముబీనా పాల్గొన్నారు. ఈ సందర్భంగా 150 మంది మహిళలకు శాలువా కప్పి సత్కరించి, మొక్కలు పంపిణీ చేశారు.

● మహిళాదినోత్సవం సందర్భంగా శుక్రవారం వన్‌టౌన్‌లోని లెనిన్ భవన్ వద్ద జరిగిన కార్యక్రమంలో మహిళా సమాఖ్య జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మహిళా సమాఖ్య సీనియర్ నాయకురాలు కొరగంజి దుర్గాంబ మాట్లాడారు. దాసరి భవన్ వద్ద కొరగంజి దుర్గాంబ జెండాను ఆవిష్కరించారు. ఓర్సు భారతి, డీ సీతారావమ్మ, డి రమణమ్మ, చింతాడ పార్వతి పాల్గొన్నారు.

విద్యాధరపురం: టీడీపీ పశ్చిమ కార్యాలయంలో సీనియర్ నాయకుడు ఎంఎస్ బేగ్ ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరిగాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా తెలుగు మహిళ అధ్యక్షురాలు చెన్నుపాటి ఉషారాణి మాట్లాడుతూ, జనసేన- టీడీపీ ప్రభుత్వం వస్తే మహిళలకు జరిగే మేళ్లను వివరించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. సుకాసి సరిత,షేక్ నసీమా, లక్కు శాంతి, కుప్పల అరుణశ్రీ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శివరాత్రి వేడుకలు

చిట్టినగర్, మార్చి 8: శివరాత్రి సందర్భంగా నగరంలోని శివాలయాలు శివనామస్మరణతో మార్మోగాయి. పాలఫ్యాక్టరీ చనమోలు వెంకట్రావ్ ఫ్లైఓవర్ సమీపంలో విజయదుర్గా రామలింగేశ్వర పంచముఖ ఆంజనేయస్వామి దేవాలయంలో రామలింగేశ్వరస్వామికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. ● సాయిరాం థియేటర్ సమీపంలోని నాగమ్మ సత్రం వద్ద ఉన్న వీరాంజనేయస్వామి ధ్యానమందిరంలోని కాశీ అన్నపూర్ణాదేవి సమేత కాశీవిశ్వేశ్వరస్వామికి, చిట్టినగర్ మహాలక్ష్మిఅమ్మవార్ల దేవస్థానంలోని కాశీవిశ్వేశ్వరస్వామికి, వాగు సెంటర్‌లో భ్రమరాంబ మల్లేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. ● కేబీఎన్ ఎదురుగా ఉన్న కొత్తపేట గంగానమ్మ ఆలయంలో శంభులింగేశ్వరస్వామికి పూజలు అభిషేకాలు చేశారు.

గవర్నర్‌పేట: లెనిన్ సెంటర్‌లోని ఓంశ్రీ షిర్డి నాగ సాయిబాబా-నాగమానసాదేవి మందిరంలో మహా శివ లింగం వద్ద శివరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మహాశివునికి అభిషేకాలు, మహాశివ లింగానికి విభూతితో అభిషేకాలు నిర్వహించారు. పూలతో అలంకరణ చేశారు. సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు స్వామిని దర్శించుకుని విభూది అభిషేకం చేశారు. మందిర వ్యవస్థాపకుడు సుధా స్వామి ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. చల్లపల్లి బంగ్లా సమీపంలోని శ్రీ కాశీ విశ్వేశ్వర ఆలయంలో స్వామి దర్శనానికి భక్తులు పోటెత్తారు.

సత్యనారాయణపురం: ముత్యాలంపాడులోని శ్రీ పార్వతీసమేత రామలింగేశ్వరస్వామి దేవాలయంలో మహాశివ రాత్రి వేడుకలు ఆలయకమిటీ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. భక్తులు స్వామవారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

● కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో ఆలయకమిటీ అధ్యక్షుడు కొల్లూరి రామకృష్ణ పర్యవేక్షణలో స్వామివారికి ఉదయం 3గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకూ అభిషేకాలు, సాయంత్రం దివ్యకల్యాణమహోత్సం, రాత్రి లింగోద్భవ కాలమందు మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అన్నాభిషేకం చేశారు. ● ముత్యాలంపాడు శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, బిల్వార్చన జరిగింది. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది.

త్రిశక్తిపీఠంలో అర్ధనారీశ్వరిగా కాళీమాత

కృష్ణలంక : త్రిశక్తిపీఠంలోని కాళీమాత అర్ధనారీశ్వరి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. పుట్టమన్నుతో శివలింగం తయారుచేసి 365 లింగాలకు అభిషేకం నిర్వహించారు. ఈ నెలంతా సూర్యనమస్కారాలతో పాటు విష్ణుమూర్తి, శివకేశవులను పూజించారు. అనంతరం వేదపారాయణం జరిగింది. లింగార్చన నిర్వహించిన పండితులు మార్తా సూర్యప్రకాశశర్మ, జంధ్యాల ఆంజనేయశర్మ, శిష్టా ప్రసాద్ శర్మలు పూజలు చేశారు. సాయంత్రం భారతీ రాఘవేంద్ర నృత్య కేంద్రం వారిచే కూచిపూడి నృత్య ప్రదర్శన నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు జి.పుల్లయ్య, కొప్పురావూరి జగదీష్ కుమార్, ఆధ్యాత్మిక సలహాదారు విజయ్‌కిరణ్ పాల్గొన్నారు.

భారతీనగర్: గురునానక్ కాలనీలోని శివాలయంలో రామలింగేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు జరిగాయి. స్వామికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం స్వామివారి కల్యాణమహోత్సవం ఆలయ కమిటి సభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది.



విజయదుర్గా ఆలయంలో , లెనిన్ సెంటర్‌లో, కాశీవిశ్వేశ్వరస్వామి దేవాలయంలో, త్రిశక్తిపీఠంలో

భక్తులకు పాలు, బిస్కెట్లు పంపిణీ

కృష్ణలంక, మార్చి 8 :మహాశివరాత్రి సందర్భంగా కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించి వచ్చిన భక్తులకు పాలు, టీ, కాఫీ, బిస్కెట్లను తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గద్దె మాట్లాడుతూ దాదాపు పదేళ్ల నుంచి భక్తులకు మహాశివరాత్రి పర్వదినం రోజున పాలు, బిస్కెట్లు పంపిణీ చేయడం అప్పటి కార్పొరేటర్ గొరిపర్తి నర్సింహారావు వున్నప్పటి నుంచి ఆనవాయితీగా వస్తుందన్నారు. ఇప్పుడు నర్సింహారావు జ్ఞాపకార్థం ఆయన సోదరుడు, టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ నాయకులు గొరిపర్తి నామేశ్వరరావు ఫ్రెండ్ సర్కిల్ ఆధ్వర్యంలో వీటిని పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. టీడీపీ నాయకులు వేములపల్లి రంగారావు, గొరిపర్తి నామేశ్వరరావు, గుండు శ్రీనివాసరావు, కేశనం భావన్నారాయణ, ఆర్.రమాదేవి, పెరుమాళ్ల గురునాథం, పోదూరి పవన్, జనసేన నాయకులు కోడూరి కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.



శంకరమఠం వద్ద కేసరి, పులిహోర పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గద్దె

కేసరి, పులిహోర పంపిణీ

ది రిటైల్ రైస్ అండ్ జనరల్ మర్చంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కృష్ణలంక శంకరమఠం వద్ద మహాశివరాత్రి సందర్భంగా భక్తులకు తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ కేసరి, పులిహోర ప్రసాదాన్ని వితరణ చేశారు. అసోసియేషన్ నాయకులు తడికమళ్ల సురేష్‌బాబు, వైవీవీ సత్యనారాయణమూర్తి, తాడువాయి సత్యనారాయణ, వి.శేషగిరిరావు, నల్లమల్ల ప్రసాద్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు. అనంతరం అసోసియేషన్ నాయకులు యనమలకుదురులోని శివాలయం వద్ద ప్రసాదాన్ని వితరణ చేశారు.

అన్నదానం

పటమట:పటమటలంక పుట్టరోడ్‌లో తాటి నరసింహారావు, నర్రా కిషోర్‌ల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే గద్దె రామ్మోమన్, టీడీపీ నాయకులు బొప్పన భవకుమార్‌లు ఈ అన్నదానం కార్యక్రమాన్ని ప్రారంభించారు.

టీడీపీలో చేరికలు

పాయకాపురం, మార్చి 8 : టీడీపీ సెంట్రల్ కార్యాలయంలో శుక్రవారం పైడి శ్రీను ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున టీడీపీలో చేరారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బొండా ఉమామహేశ్వరరావు టీడీపీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంలో ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో అధికారంలోకి వచ్చేది టీడీపీ ప్రభుత్వమేనని, అన్ని వర్గాలకు సమన్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. వైసీపీ నుంచి పార్టీలోకి చేరిన నాయకులకు, స్వచ్ఛందంగా టీడీపీలోకి వచ్చిన 70 మంది నాయకులను అభినందించారు. సాంబశివరావు, కృష్ణమోహన్, సోమేశ్వరరావు, నాగమణి, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు. 63వ డివిజన్ వడ్డెర కాలనీలో ఏర్పాటు చేసిన సభలో వంద మంది శుక్రవారం టీడీపీలో చేరారు. బొండా ఉమా వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

పోతిన మహేశ్‌కు ఓటు వేసి గెలిపించాలి

విద్యాధరపురం, మార్చి 8: పోతిన మహేశ్‌కు ఓటు వేసి గెలిపించాలని 40 డివిజన్ జనసేన బూత్ కన్వీనర్ పులిచేరి రమేష్ శుక్రవారం 22వ బూత్ పరిధిలో ఓటర్ల వెరిఫికేషన్ చేశారు. నంది హేమంత్, ఫణికుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రానున్న ఎన్నికల్లో పోతిన మహేశ్‌ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

వైసీపీ, బీజేపీలను ఓడించండి

పాయకాపురం, మార్చి 8: ఐదేళ్లల్లో వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిందిని, ప్రజలపై భారాలు మోపిన వైసీపీ ప్రభుత్వాన్ని, వైసీపీకి అండదండలుగా ఉన్న బీజేపీ ప్రభుత్వాన్ని రానున్న ఎన్నికల్లో ఓడించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు కోరారు. సీపీఎం చేపట్టిన మార్పు కోసం సీపీఎం కార్యక్రమం శుక్రవారం పాయకాపురం శాంతినగర్ ప్రాంతంలో జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ పన్నుల భారాలు మోపిన తీరును ప్రజలకు వివరించారు.

మాస్టర్‌మైండ్స్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ 23వ వార్షికోత్సవం రేపు

పాయకాపురం, మార్చి 8 : పాయకాపురం రాజీవ్‌నగర్‌లోని మాస్టర్ మైండ్స్ స్కూల్ వద్ద ఆదివారం పాఠశాల 23వ వార్షికోత్సవం నిర్వహించనున్నట్లు స్కూల్ చైర్మన్ పెంట్యాల అనిల్ కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. సంతోష్ తరంగా పేరుతో నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో ప్రముఖ టీవీ యాంకర్ దీప్తి, బాలివుడ్ నటి మౌబాని సోర్కర్‌లు పాల్గొనున్నారని తెలియజేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో చదువుల్లో, సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటల పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతుల ప్రధానం చేయనున్నామని వివరించారు.

కుక్కల నుంచి రక్షణ కల్పించండి

వన్‌టౌన్, మార్చి 8: పశ్చిమలోని 51, 52 డివిజన్లలోని పోతిన చిన్న వీధి, నామాల వారి వీధి, పోతిన అప్పన్న వీధులలో స్వైర విహారం చేస్తున్న కుక్కల బారి నుంచి స్థానిక ప్రజలను కాపాడాలని సీపీఐ నగర కార్యదర్శి జి. కోటేశ్వరరావు నగరపాలక సంస్థ వెటర్నరీ విభాగ అధికారులను శుక్రవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. నగర పాలక సంస్థ అధికారుల నిర్లక్ష్యం కారణంగా పదేళ్ల బాలుడు చీపుళ్ల సుదర్శన్ కుక్కల దాడిలో తీవ్రంగా గాయపడ్డాడని తెలిపారు. అధికారులు తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలన్నారు.



అన్సారీకి వినతిపత్రం అందజేస్తున్న ముస్లిం విద్యార్థి సంఘం నాయకులు

విద్యార్థుల సమస్యలకు పరిష్కారం చూపండి

లబ్బీపేట, మార్చి 8: రాష్ట్రంలో విద్యార్థుల సమస్యలను పరిష్కరించే విధానాలను కాంగ్రెస్ పార్టీ తమ మేనిఫెస్టోలో చేర్చాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ స్టూడెంట్ ఆఫ్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ నాయకులు పీసీసీ ప్రధాన కార్యదర్శి తూర్పు 21 డివిజన్ కాంగ్రెస్ కమిటీల ఇన్‌చార్జ్ షేక్ అబ్దుల్ అన్సారీని కలిసి వినతి పత్రం అందజేశారు. లబ్బీపేటలోని అన్సారీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అబ్దుల్ హఫీజ్ మాట్లాడుతూ రాష్ట్ర జనాభాలో 15శాతం ఉన్న ముస్లిం జనాభాలో 12శాతం రిజర్వేషన్లు ఉండేవిధంగా మేనిఫెస్టోలో చేర్చాలని తెలిపారు. అనంతరం అన్సారి మాట్లాడుతూ విద్యార్థులు తమ దృష్టికి తీసుకువచ్చిన అంశాలను కాంగ్రెస్ మేనిఫెస్టోలో చేర్చే విధంగా మేనిఫెస్టో కమిటీ చైర్మన్ పల్లం రాజుకు వివరిస్తామని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో ఓటు హక్కు కలిగిన ప్రతి విద్యార్థి కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసే విధంగా చైతన్య పరచాలని వారికి సూచించారు. విద్యార్థి సంఘం నాయకులు ముజాహిద్, అమీర్ ఫాహెద్, ఇజాజ్, కాంగ్రెస్ నాయకులు జునైద్, షేక్ బాజీ, యాసీన్, బషీర్ పాల్గొన్నారు.

గన్నవరంలో నాలుగు దుకాణాల్లో చోరీ

గన్నవరం, మార్చి 8 : దొంగలు గురువారం అర్ధరాత్రి గన్నవరంలో హల్‌చల్ చేశారు. దావాజీగూడెం రోడ్డులో మూడు షాపుల్లో, బస్టాండ్ సమీపంలోని రెస్టారెంట్‌లో దొంగతనాలకు పాల్పడ్డారు. పలు షాపుల్లో సీసీ కెమేరాలు ఉండటంతో వాటికి చిక్కారు. క్వాలిటీ చికెన్ షాపు, ఎదురుగా ఉన్న పాలబూత్, దాని పక్కనే ఉన్న జ్యూస్, ఐస్ క్రీమ్‌షాపులో నలుగురు వ్యక్తులు తాళాలు పగులకొట్టి లోపలకి వెళ్లారు. ఆయా షాపుల్లో నగదు కొంచం మాత్రమే ఉండటంతో యజమానులు ఊపిరిపీల్చుకున్నారు. క్రైమ్ పోలీసులకు సమాచారం ఇవ్వటంతో సీసీ కెమేరాల ఫుటేజ్‌ని పరిశీలించారు. విజయవాడకు చెందిన యువకులు దొంగతనానికి పాల్పడి నట్లు గుర్తించారు. వీరిలో ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నట్టు సీఐ ప్రసాద్ తెలిపారు.

ఆడబిడ్డల ఉజ్వల భవిష్యత్ కోసం మీ కలలకు రెక్కలు

జగ్గయ్యపేట, మార్చి 8: మహిళా దినోత్సవం రోజున చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఆడబిడ్డల కోసం 'మీ కలలకు రెక్కలు' అనే పథకాన్ని తీసుకురాబోతున్నట్టు విజయవాడ పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు నెట్టెం రఘురాం, మాజీ ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య అన్నారు. నెట్టెం నివాసంలో శుక్రవారం కరపత్రాలను విడుదల చేశారు. తెలుగు మహిళ అధ్యక్షురాలు రామలక్ష్మి, మాజీ జడ్పీటీసీ సభ్యురాలు రాణి గుగ్లోతు రమాదేవి పాల్గొన్నారు.

'ప్లానింగ్'లో పీజీ

దిక్సూచి



విజయవాడలోని స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్(ఎస్‌పీఏవీ)- పీజీ ప్రోగ్రామ్‌లలో డైరెక్ట్ అడ్మిషన్స్‌కు నోటిఫికేషన్ విడుదల చేసింది. ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఆర్కిటెక్చర్ అండ్ ప్లానింగ్ విభాగాల్లో 12 రెగ్యులర్ సీట్లు; డిజైన్ విభాగంలో 13 రెగ్యులర్ సీట్లు, 12 సెల్ఫ్ ఫైనాన్స్ సీట్లు ఉన్నాయి.

ఆర్కిటెక్చర్: ఈ విభాగంలో మాస్టర్ ఆఫ్ ఆర్కిటెక్చర్, మాస్టర్ ఆఫ్ బిల్డింగ్ ఇంజనీరింగ్ అండ్ మేనేజ్‌మెంట్, మాస్టర్ ఆఫ్ అర్బన్ డిజైన్, మాస్టర్ ఆఫ్ డిజైన్ ప్రోగ్రామ్‌లు ఉన్నాయి. మాస్టర్ ఆఫ్ ఆర్కిటెక్చర్ ప్రోగ్రామ్‌లో సస్టయినబుల్ ఆర్కిటెక్చర్, ల్యాండ్ స్కేప్ ఆర్కిటెక్చర్, ఆర్కిటెక్చరల్ కన్జర్వేషన్ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి.

అర్హత: మాస్టర్ ఆఫ్ ఆర్కిటెక్చర్, మాస్టర్ ఆఫ్ అర్బన్ డిజైన్, మాస్టర్ ఆఫ్ డిజైన్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి బ్యాచిలర్స్ డిగ్రీ ఇన్ ఆర్కిటెక్చర్ పూర్తి చేసి ఉండాలి. మాస్టర్ ఆఫ్ బిల్డింగ్ ఇంజనీరింగ్ అండ్ మేనేజ్‌మెంట్‌కు(బీఈ/బీటెక్)(సివిల్ ఇంజనీరింగ్/బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ టెక్నాలజీ/కన్‌స్ట్రక్షన్ ఇంజనీరింగ్ అండ్ మేనేజ్‌మెంట్/కన్‌స్ట్రక్షన్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్) ఉత్తీర్ణులై ఉండాలి. మాస్టర్ ఆఫ్ డిజైన్ ప్రోగ్రామ్‌కు బ్యాచిలర్స్ డిగ్రీ(ఇంజనీరింగ్/ప్లానింగ్) ఉత్తీర్ణతతోపాటు సీడ్ వ్యాలిడ్ స్కోర్, ఏడాది అనుభవం ఉన్నవారు; బ్యాచిలర్స్ డిగ్రీ(ఫైన్ ఆర్ట్స్/డిజైన్) ఉత్తీర్ణతతోపాటు సీడ్ వ్యాలిడ్ స్కోర్, రెండేళ్ల అనుభవం ఉన్నవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు.

ప్లానింగ్: ఈ విభాగంలో మాస్టర్ ఆఫ్ ప్లానింగ్ ప్రోగ్రామ్ ఉంది. ఇందులో ఎన్విరాన్‌మెంటల్ ప్లానింగ్ అండ్ మేనేజ్‌మెంట్, అర్బన్ అండ్ రీజనల్ ప్లానింగ్, ట్రాన్స్‌పోర్ట్ ప్లానింగ్ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి బ్యాచిలర్స్ డిగ్రీ(ప్లానింగ్/ ఆర్కిటెక్చర్) లేదా (బీఈ/బీటెక్)(సివిల్ ఇంజనీరింగ్/ప్లానింగ్) ఉత్తీర్ణులై ఉండాలి. ఎన్విరాన్‌మెంటల్ ప్లానింగ్, అర్బన్ అండ్ రీజనల్ ప్లానింగ్ స్పెషలైజేషన్‌లకు మాస్టర్స్ డిగ్రీ(జాగ్రఫీ/ఎకనామిక్స్/సోషియాలజీ) పూర్తిచేసిన అభ్యర్థులు; ట్రాన్స్‌పోర్ట్ ప్లానింగ్ స్పెషలైజేషన్‌కు మాస్టర్స్ డిగ్రీ(ఎకనామిక్స్/స్టాటిస్టిక్స్/ఆపరేషన్స్ రీసెర్చ్) ఉత్తీర్ణులు కూడా అప్లయ్ చేసుకోవచ్చు.

అడ్మిషన్ ప్రక్రియ: అకడమిక్ ప్రతిభ ఆధారంగా అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేస్తారు. వీరికి ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్ నిర్వహిస్తారు. సంస్థ నిర్ణయం మేరకు ఇందులో అర్హత పొందినవారికి సంబంధించి స్టేట్‌మెంట్ ఆఫ్ పర్పస్ పరిశీలన, పోర్ట్‌ఫోలియో అసెస్‌మెంట్, ఇంటర్వ్యూలు నిర్వహించి అడ్మిషన్స్ ఇస్తారు.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.2,000; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1,000
- **ఆఫ్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 5
- **వెబ్‌సైట్:** www.spav.ac.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/Op0mxNDలో చదవండి.



సింహం నక్కల మీదకు వస్తే వార్ అవదురా లఫూట్



నందమూరి బాలకృష్ణ దర్శకుడు బాబీ కాంబినేషన్‌లో రూపొందుతున్న చిత్రం ఫస్ట్ గ్లింప్స్‌ను మహా శివరాత్రి సందర్భంగా విడుదల చేశారు. యాక్షన్ సీక్వెన్స్‌తో రూపొందించిన ఈ గ్లింప్స్‌లో బాలకృష్ణ కూల్‌గా, ప్రశాంతంగా కనిపిస్తూనే తనదైన శైలిలో పవర్‌ఫుల్ డైలాగ్‌తో అదరగొట్టారు. కొంతమంది గూండాలు తన వైపు పరిగెత్తుకుని వస్తుంటే బాలయ్య కూల్‌గా ఆల్కహాల్ తాగుతుండడం ఆకట్టుకుంది. 'ఏంట్రా వార్ డిక్లేర్ చేస్తున్నావా' అని వచ్చిన వాళ్లలో ఒకడు అడిగితే 'సింహం నక్కల మీదకు వస్తే వార్ అవదురా.. ఇట్స్ కాల్డ్ హంటింగ్' అంటూ పవర్‌ఫుల్ డైలాగ్ చెప్పి బాలకృష్ణ వేట మొదలుపెట్టడం గూస్ బంప్స్ తెప్పించేలా ఉంది. ఈ గ్లింప్స్ బాలకృష్ణ అభిమానుల్ని, సినీ ప్రియుల్ని విశేషంగా ఆకట్టుకుంటూ సోషల్ మీడియాలో సంచలనం సృష్టిస్తోంది. బాలీవుడ్ నటుడు బాబీ డియోల్ ఇందులో ఓ ముఖ్య పాత్ర పోషిస్తున్నారు. ఈ చిత్రానికి సంగీతం: ఎస్.ఎస్. థమన్, ఫొటోగ్రఫీ: విజయ్ కార్తిక్, ఎడిటింగ్: నిరంజన్, సమర్పణ: శ్రీకర్ స్టూడియోస్, నిర్మాతలు: సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య.

భైరవుడై.. రక్షకుడై...



నాగ్ అశ్విన్ దర్శకత్వంలో ప్రభాస్ కథానాయకుడిగా తెరకెక్కుతోన్న ప్రతిష్ఠాత్మక చిత్రం 'కల్కి 2898 ఏడీ'. మే 9న ప్రేక్షకుల ముందుకు రానుంది. శుక్రవారం ఈ చిత్రం నుంచి ప్రభాస్ పాత్రను యూనిట్ పరిచయం చేసింది. భైరవగా సరికొత్త లుక్‌లో ప్రభాస్ అలరించారు. భవిష్యత్తులో కాశీ నగరంలో జరిగే కొన్ని సంఘటనల నేపథ్యంలో సాగిన ప్రత్యేక వీడియో సినిమాపై ఆసక్తిని పెంచింది. కాశీ ప్రజలను విలన్ల నుంచి కాపాడే రక్షకుడిగా ప్రభాస్ కనిపించారు. వైజయంతీ మూవీస్ బేనర్‌పై సి. అశ్వనీదత్ భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రభాస్‌కు జోడీగా దీపికా పదుకొనే నటిస్తున్నారు. కమల్‌హాసన్ ప్రతినాయక పాత్రలో అలరించనున్నారు. అమితాబ్‌బచ్చన్ కీలకపాత్ర పోషిస్తున్నారు. ప్రస్తుతం ఇటలీలో ప్రభాస్, దిశా పటానీపై ఓ పాటను చిత్రీకరిస్తున్నారు.

ధనుష్ కుబేర



జాతీయ అవార్డు చిత్రాల దర్శకుడు శేఖర్ కమ్ముల రూపొందిస్తున్న తాజా చిత్రానికి టైటిల్ నిర్ణయించారు. ధనుష్, నాగార్జున కాంబినేషన్‌లో రూపుదిద్దుకుంటున్న ఈ సినిమాకు 'కుబేర' అని పేరు పెట్టారు. మహా శివరాత్రి సందర్భంగా సినిమా టైటిల్ వెల్లడించి, ఫస్ట్ లుక్ విడుదల చేశారు. సునీల్ నారంగ్, పుస్కుర్ రామ్‌మోహన్‌రావు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. అత్యంత సంపన్నుడైన దేవుడు కుబేరుడు. ఆయన పేరునే ఈ సినిమాకు పెట్టారు. కానీ విడుదల చేసిన పోస్టర్‌లో ధనుష్ లుక్ టైటిల్‌కు భిన్నంగా ఉంది. చిరిగిన బట్టలతో అన్నపూర్ణా దేవి నుంచి శివుడు భిక్ష తీసుకుంటున్న పెయింటింగ్ ముందు ధనుష్ నిలబడి కనిపించారు. దీంతో ఆయన పాత్ర ఎలా ఉంటుందో అనే ఆసక్తి పెరిగింది. అలాగే మరో కీలక పాత్ర పోషిస్తున్న నాగార్జున లుక్ ఎలా ఉంటుందా అని అభిమానులు ఎదురు చూస్తున్నారు. రష్మిక ఈ చిత్రంలో కథానాయికగా నటిస్తున్నారు.

కాశీలో శివశక్తి



తమన్నా ప్రధాన పాత్ర పోషిస్తున్న చిత్రం 'ఓదెల 2'. 'ఓదెల రైల్వేస్టేషన్' చిత్రానికి ఇది సీక్వెల్. ఇటీవలే కాశీలో చిత్రీకరణ ప్రారంభమైంది. అశోక్‌తేజ దర్శకత్వంలో డి. మధు నిర్మిస్తున్నారు. ఇందులో తమన్నా శివశక్తి అనే పాత్ర పోషిస్తున్నారు. శివరాత్రి సందర్భంగా ఆమె ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను మేకర్స్ విడుదల చేశారు. నాగా సాధువు అవతారంలో తమన్నా సరికొత్తగా కనిపించారు. ఈచిత్రంలో హెబ్బా పటేల్, వశిష్ఠ ఎన్ సింహ కీలకపాత్రలు పోషిస్తున్నారు.

అదిగో కన్నప్ప



పరమశివుని భక్తుడు కన్నప్ప జీవితగాథ ఆధారంగా తెరకెక్కుతోన్న చిత్రం 'కన్నప్ప'. మంచు విష్ణు టైటిల్ పాత్ర పోషిస్తున్నాడు. శివరాత్రి సందర్భంగా ఈ చిత్రం నుంచి కన్నప్ప పాత్రధారిగా విష్ణు ఫస్ట్‌లుక్‌ను యూనిట్ విడుదల చేసింది. విల్లు ఎక్కుపెట్టిన భంగిమలో శక్తిమంతంగా కనిపించి ఆకట్టుకున్నారు. 'గొప్ప శివభక్తుని పాత్రలో నటించడం అదృష్టంగా భావిస్తున్నా. ఇదిగో మీ కన్నప్ప.. హర హర మహదేవ్' అని విష్ణు సోషల్ మీడియా వేదికగా స్పందించారు. ఈ చిత్రానికి ముఖేశ్ కుమార్ దర్శకుడు. మోహన్‌బాబు ఈ చిత్రాన్ని నిర్మించడంతో పాటు కీలకపాత్ర పోషిస్తున్నారు. ప్రభాస్ పరమశివుని పాత్ర పోషిస్తున్నారు. శరత్‌కుమార్, మోహన్‌లాల్ ఇతర పాత్రల్లో నటిస్తున్నారు.

ఎనిమిది భాగాలుగా హాఫ్ లయన్



ప్రకాశ్ ఝా

దివంగత మాజీ ప్రధాని పీవీ నరసింహారావు జీవితం ఆధారంగా ప్రముఖ ఓటీటీ సంస్థ 'ఆహా' 'హాఫ్ లయన్' పేరుతో వెబ్‌సిరీస్‌ను ప్రకటించిన విషయం తెలిసిందే. వినయ్ సీతాపతి రచన 'హాఫ్ లయన్' పుస్తకం దీనికి ఆధారం. ప్రకాశ్ ఝా దర్శకత్వంలో ఆహా స్టూడియోస్, అప్లాజ్ ఎంటర్టైన్‌మెంట్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఈ సిరీస్ గురించి ఓ ఇంటర్వ్యూలో ప్రకాశ్ ఝా మాట్లాడుతూ 'పీవీ నరసింహారావు ప్రధానిగా తీసుకున్న సాహసోపేత నిర్ణయాలు నన్ను బాగా ప్రభావితం చేశాయి. ఉమ్మడి ఆంధ్ర ముఖ్యమంత్రిగా, కేంద్ర మంత్రిగా, ప్రధానిగా ఆయన జీవితంలోని కీలకఘట్టాలను స్పృశిస్తూ ఈ సిరిస్ సాగుతుంది. 'తెలుగువాళ్లు గర్వించే వ్యక్తి పీవీ, ఆయన బయోపిక్ చేద్దాం' అని నిర్మాత అల్లు అరవింద్ నన్ను కలిశారు. అలా ఈ ప్రాజెక్ట్ మొదలైంది' అని చెప్పారు. ఈ సిరీస్ ఎనిమిది ఎపిసోడ్లుగా ఉంటుంది, ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పూర్తయింది అని ఆహా సహ వ్యవస్థాపకులు అజిత్ ఠాకూర్ చెప్పారు. హిందీ, తెలుగు, తమిళ భాషల్లో ఈ సిరీస్ తెరకెక్కిస్తున్నాం, త్వరలో నటీనటుల ఎంపిక ప్రారంభించి, ఈ ఏడాది ద్వితీయార్థంలో చిత్రీకరణ ప్రారంభిస్తామని ఆయన చెప్పారు.







సూప్స్‌తో శుభవేళ



రెగ్యులర్ సూప్స్ కాకుండా విభిన్నమైన సూప్స్ చేసుకుంటే మజా ఉంటుంది. మష్రూమ్ వెజిటబుల్ సూప్, చికెన్ వెజిటబుల్ సూప్, గుమ్మడికాయ-పాలకూర సూప్, బ్రొకొలి బఠానీల సూప్‌లను ఇంట్లోనే సులువుగా చేసుకోవచ్చు ఇలా..

మష్రూమ్ వెజిటబుల్ సూప్

కావాల్సిన పదార్థాలు

అలివ్ నూనె- అర టేబుల్ స్పూన్, వెజిటబుల్ స్టాక్- అరటేబుల్ స్పూన్, బటన్ మష్రూమ్స్- 1 కప్పు, క్యారెట్స్- 2 (ముక్కలుగా తరగాలి), పెద్ద ఉల్లిపాయలు- 1 (సన్నగా తరగాలి), సెలరీ స్టాక్స్- 2 (ముక్కలుగా తరగాలి), జుకిని- 1 (ముక్కలుగా తరగాలి), వెల్లుల్లి రెబ్బలు- 4 (మెత్తగా చేసుకోవాలి), తాజా తులసి ఆకులు- 1 టేబుల్ స్పూన్, ఎండిన సోంపు మొక్కలు- 1 టీస్పూన్, కారం మిరియాలు- కొద్దిగా, తరిగిన కొలార్డ్- 1 గుత్తి, టమోటాలు-2 (ముక్కలుగా తరగాలి), క్యాన్డ్ వైట్ బీన్స్- 2 కప్పులు, ఉప్పు- రుచికి తగినంత, గ్రౌండ్ పెప్పర్- రుచికి తగినంత, బ్రొకొలి- కప్పు, కాలే ఆకులు- 2 టేబుల్ స్పూన్, బీన్స్- టేబుల్ స్పూన్

తయారీ విధానం

గిన్నెలో ఆలివ్ నూనె వేసి మీడియమ్ హీట్‌లో ఉంచుకోవాలి. ఇందులోకి మష్రూమ్స్, ఉల్లిపాయలు, క్యారెట్స్, సెలరీ, జుకిని వేయాలి. గరిటెతో కదుపుతూ కనీసం ఆరేడు నిముషాలు కుక్ చేయాలి. వెజిటేబుల్ ముక్కలు అడుగుకి అంటేప్పుడు ఇందులోకి తగినంత వెజిటబుల్ స్టాక్ వేయాలి. ఇందులోకి వెల్లుల్లి, తులసి ఆకులు, సోంపు మొక్కలు, మిరియాలు వేసి పది నిముషాల పాటు గరిటెతో కదుపుతూ కుక్ చేయాలి. కాలే ఆకులు వేసి కుక్ చేయాలి. ఆకులు మెత్తగా అయ్యాక టమోటాలు, వెజ్ స్టాక్, బీన్స్ కలిపి వేయాలి. ఇందులోకి కప్పు నీళ్లు పోసి కలపాలి. హీట్ మెల్లగా తగ్గించటం కోసం సిమ్‌లో ఉంచి కనీసం ఇరవై నిముషాల పాటు కుక్ చేయాలి. చివరగా ఉప్పు, పెప్పర్ చల్లుకుని క్రీమీ సూప్‌ను తాగటమే తరువాయి. ఎంతో రుచికరంగా ఉంటుంది.

గుమ్మడికాయ పాలకూర సూప్

కావాల్సిన పదార్థాలు

ఆలివ్ ఆయిల్- 1 టేబుల్ స్పూన్, ఉల్లిపాయ ముక్కలు- 2 కప్పులు, గోధుమ పిండి- 2 టీస్పూన్స్, సోడియమ్ తక్కువగా ఉండే వెజిటబుల్ స్టాక్- కొద్దిగా, గుమ్మడికాయ గుజ్జు- 4 కప్పులు, శుభ్రపరచిన లేత పాలకూర- 1 కట్ట, మెత్తగా నలిపిన వెల్లుల్లి పాయ పేస్ట్- అర టీస్పూన్, బ్లాక్ బీన్స్- అర టీస్పూన్, రాయితో దంచిన జీలకర్ర పొడి- అర టీస్పూన్, ఉప్పు- పావు టీస్పూన్, రాయితో దంచిన వైట్ పెప్పర్- పావు టీస్పూన్, జాజికాయపొడి- చిటికెడు


తయారీ విధానం

ప్యాన్‌లో ఆయిల్ నూనె వేసి ఇందులో ఉల్లిపాయ ముక్కలు మీడియం హీట్ వరకూ వేయించాలి. ఇందులో గోధుమ పిండి వేసి



కలపాలి. రెండు నిముషాల పాటు కలుపుతూ కుక్ చేయాలి. మిశ్రమం థిక్ అయ్యేంత వరకూ కలిపి.. ఆ తర్వాత వెజిటబుల్ స్టాక్, గుమ్మడికాయ గుజ్జు, పాలకూర, ఉల్లిపాయ ముక్కలు, జీలకర్ర, ఉప్పు, పెప్పర్ వేసి కలపాలి. ఆ తర్వాత మంటను సిమ్‌లోకి ఉంచి పదిహేను నిముషాల పాటు కుక్ చేయాలి. కుక్ అవుతున్నంత సేపు గరిటెతో కదుపుతూ ఉండాలి. ఇందులో ఉడకబెట్టిన బ్లాక్ బీన్స్ వేసి పదిహేను నిముషాల పాటు మిశ్రమాన్ని కుక్ చేయాలి. గరిటెతో కదుపుతూనే ఉడికించాలి. క్రీమీగా వచ్చేంత వరకూ కుక్ చేసిన తర్వాత సిమ్‌లో ఉంచి నిముషం పాటు కుక్ చేసి దించేసుకోవాలి. దీన్ని బ్రౌన్ రైస్‌లోకి కలుపుతూ తినొచ్చు.

బ్రొకొలి, బఠాణీల సూప్



కావాల్సిన పదార్థాలు

బ్రొకొలి ముక్కలు- 1 కప్పు, ఫ్రోజెన్ బఠాణీలు-1 కప్పు, స్వీట్ పొటాటో- 1 (చిన్నది అయితే సరిపోతుంది. దీని తొక్క తీసేసి క్యూబ్స్‌గా కట్ చేసుకోవాలి), ఎల్లో ఆనియన్- అర్థ భాగం, వెల్లుల్లి రెబ్బలు- 2 (మెత్తగా చేత్తో నలపాలి), లో ఫ్యాట్ కొబ్బరి పాలు- కప్పు, సోడియం తక్కువగా ఉండే వెజిటబుల్ స్టాక్- 1 కప్పు

తయారీ విధానం

గుంత ప్యాన్‌లో నూనె వేసిన తర్వాత ఉల్లిపాయ ముక్కలను నాలుగైదు నిముషాల పాటు వేయించాలి. ఇందులోకి వెజిటబుల్స్ అన్నీ వేసి కలపాలి. ఇవన్నీ మెత్తగా అయ్యేంత వరకూ కుక్ చేయటానికి వీలుగా వెజిటబుల్ స్టాక్ వేయాలి. బాగా మెత్తగా అయిన తర్వాత ఇందులోకి కొబ్బరి పాలు వేసి సిమ్‌లో ఉంచి మూడు నిముషాల పాటు కలుపుతూ ఉండాలి. చివరగా వేడి వేడిగా సర్వ్ చేసుకుంటే భలే ఉంటుంది.

చికెన్ వెజిటబుల్ సూప్

కావాల్సిన పదార్థాలు

చికెన్ బ్రోత్-425 ఎమ్.ఎల్., స్కిన్‌లెస్ బోన్‌లెస్ చికెన్- 1 బ్రెస్ట్ హాఫ్స్, నీళ్లు- 5 కప్పులు, క్యారెట్స్- 3 (సన్నగా తరగాలి), ఉల్లిపాయ- 1 (ముక్కలుగా తరగాలి), స్టాక్స్ సెలరీ- 3 (సన్నగా తరగాలి), ఉప్పు- తగినంత, పెప్పర్- తగినంత

తయారీ విధానం

పెద్ద సాస్‌ప్యాన్‌ను బాగా హీట్ చేయాలి. ఇందులో



నాలుగు కప్పుల నీళ్లు పోయాలి. దీంతో పాటు చికెన్ బ్రోత్ వేసి కలపాలి. బాగా వేడి చేయాలి. ఇందులో క్యారెట్ ముక్కలు, ఉల్లిపాయ ముక్కలు, సెలరీ ముక్కలతో పాటు చికెన్ బ్రెస్ట్ వేసి కలపాలి. మెల్లగా మంటను తగ్గిస్తూ పోవాలి. సిమ్‌లో ఉంచాక పదిహేను నిముషాల పాటు కుక్ చేయాలి. కూరగాయలు సాఫ్ట్ అయ్యేంత వరకూ చూడాలి. ఇంకో బౌల్‌లో చికెన్ బ్రెస్ట్‌ను ఉడబెట్టి దీన్ని ఫోర్క్ సాయంతో చిన్న పీస్‌లుగా చేసుకోవాలి. కూరగాయలు మెత్తగా అవుతాయి. సిమ్‌లో మరో ఐదు నిముషాలు ఉంచిన తర్వాత చివర్లో ఉప్పు, పెప్పర్ చల్లుకుని కలిపిన తర్వాత దించేయాలి.

యోగా

నడుము నొప్పికి 'నో'


ఎక్కువ మందిని వేధించే సమస్య వెన్ను నొప్పి. ఎక్కువ సమయాల పాటు కూర్చుని పని చేసే వారిలో, వెన్ను, నడుములోని కండరాల మీద ఒత్తిడి పడడం మూలంగా ఈ సమస్య వేధిస్తూ ఉంటుంది. అయితే ఈ సమస్యను కొన్ని యోగాసనాలతో పరిష్కరించుకోవచ్చు. అవేంటంటే...

సుప్త మత్స్యేంద్రాసనం



శరీరాన్ని మెలితిప్పే ఈ ఆసనంలో, కటి, వెన్ను విప్పారి కండరాలు స్వాంతన పొందుతాయి. ఈ ఆసనం కోసం కాళ్లు చాపి నేల మీద కూర్చోవాలి. ఎడమ కాలిని మడిచి, కుడి కాలి మీదుగా అవతల వైపు నేల మీద ఆనించాలి. నడుము పైభాగాన్ని వెనక్కి తిప్పి, ఎడమ చేతిని వెనక వైపు నుంచి, కుడి చేతిని మోకాలి కింది నుంచి తిప్పి రెండు చేతులూ కలిపి పట్టుకోవాలి. ఈ భంగిమలో 30 సెకన్ల పాటు ఉండాలి.

భుజంగాసనం



వెన్ను, భుజాల్లోని నొప్పిని మటుమాయం చేసే ఆసనమిది. నేల మీద బోర్లా పడుకుని, ముంజేతులు చాపి, మోచేతులు నేల మీద ఆనించి ఉంచాలి. మోచేతుల మీద బరువు మోపుతూ నెమ్మదిగా ఛాతీని పైకి లేపి, ఈ భంగిమలో 30 సెకన్లు ఉండాలి.

ఉష్ట్రాసనం



మోకాళ్ల మీద కూర్చోవాలి. చేతులను నడుము వెనక ఉంచాలి. ఈ భంగిమలో మోచేతులు వెనక వైపుకు తిరిగి ఉండాలి. ఈ భంగిమలో వీలైనంత వెనక్కి వంగాలి. తలను ఆకాశం వైపు తిప్పాలి. ఈ ఆసనంతో నడుము, వెన్నులో బిగదీసిన కండరాలు సడలి, నొప్పులు తగ్గుతాయి.

మేకప్

స్వెట్ ప్రూఫ్

ఎండలు దంచేస్తున్నప్పుడు వేడి, చమట సహజం. ఇలాంటి వాతావరణంలో మందంగా మేకప్ వేసుకుంటే అందం కాస్తా అడుగంటిపోతుంది. కాబట్టి చమటతో చెదిరిపోని మేకప్ ఇలా వేసుకోవాలి.

- **మార్నింగ్ స్కిన్ కేర్:** వేసవిలో మేకప్ కోసం చర్మాన్ని ముందు నుంచీ సిద్ధం చేసుకోవడం కీలకం. అందుకోసం మార్నింగ్ స్కిన్ కేర్ రొటీన్‌ను అనుసరించాలి. సున్నితమైన క్లీన్సర్, హైడ్రేటింగ్ టోనర్, తర్వాత మాయిశ్చరైజర్, ఆ పైన 30 ప్లస్ ఎస్‌పిఎఫ్ కలిగిన సన్‌స్క్రీన్ అప్లై చేసి, ఇవన్నీ చర్మంలో ఇంకిపోయేవరకూ 30 నిమిషాల పాటు ఆగి ఆ తర్వాతే మేకప్ మొదలుపెట్టాలి.
- **స్వెట్ ప్రూఫింగ్:** తేలికగా ఉండే, పోర్ మినిమైజింగ్ ప్రైమర్‌ను ఈ కాలంలో వాడుకోవాలి. దీంతో ముఖ చర్మం నునుపుగా మారి మేకప్ సమంగా పరుచుకుంటుంది. అలాగే మేకప్ ఎక్కువ సమయం పాటు చెదిరిపోకుండా ప్రైమర్ నియంత్రిస్తుంది.
- **తక్కువ ఫౌండేషన్:** హెవీడ్యూటీ కన్‌సీలర్లు, ఫౌండేషన్లు ఈ కాలానికి పనికి రావు. ఇవి కరిగి



పోయి, మేకప్‌ను పాడు చేస్తాయి. కాబట్టి తేలిక పాటి ఫౌండేషన్‌ను ఎంచుకుని, వీలైనంత తక్కువ పరిమాణంలో అప్లై చేసుకోవాలి. లాంగ్ వేరింగ్, స్వెట్ ప్రూఫ్ కలిగిన ఫౌండేషన్ వేసవికి అనువైనది. లేదంటే ఫౌండేషన్‌కు బదులుగా టింటెడ్ మాయిశ్చరైజర్ లేదా సీసీ క్రీమ్ కూడా అప్లై చేసుకోవచ్చు.
- **పౌడర్ ఇలా:** చమటకు చెరిగిపోని మ్యాటి పౌడర్‌ను వాడుకోవాలి. వేసవి వేడికి చర్మం పాడవకుండా కాపాడే ఎస్‌పిఎఫ్ ఫార్టిఫైడ్ మ్యాటి ఫార్ములా పౌడర్‌ను ఎంచుకోవాలి.
- **వాటర్‌ప్రూఫ్:** ఐలైనర్, మస్కారాలు వాటర్‌ప్రూఫ్ ఎవి అయి ఉండాలి.
- **బ్లాటింగ్ పేపర్స్:** చమటతో మేకప్ చెదిరిపోకుండా ఉండడం కోసం బ్లాటింగ్ పేపర్స్ అందుబాటులో ఉంచుకోవాలి. సాధారణంగా పేపర్ టవల్, టిష్యూ, న్యాప్కిన్‌లతో ముఖం మీద పట్టే చమటను అద్దుకుంటూ ఉంటారు. కానీ వీటితో ఫౌండేషన్ చెదిరిపోయే ప్రమాదం ఎక్కువ.

నవ్య 'స్మార్ట్ పేజీ'లో ఆసక్తికర కథనాల కోసం... ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్‌ఎల్ https://ejyothy.com/QItfI7Uలో చదవండి.

మావిచిగురు కూర

ఆమ్రాతకస్య నవతామ్రరుచః ప్రవాళాః
ఖండీకృతా లవణామిశ్రిత పిండితాష్టా!
బాహ్లీక ధూప నజూషో ఘృత దుగ్ధసిద్ధాః
సందీపయన్తి పవనస్య సుఖాయమేతె!

'మావిచిగురు తినగానే కోయిల పలికేనా... కోయిలగొంతు వినగానే మావి చిగురు తొడిగేనా'... దేవులపల్లి కృష్ణశాస్త్రి పాట వినని తెలుగు వారుండరు. మామిడి లేత ఆకులు కోయిలకే కాదు మనకూ మనోల్లాసాన్నీ, ఆరోగ్యాన్నీ కలిగిస్తాయి. ఆ మావిచిగురుతో కమ్మని వంటకాల గురించి క్షేమశర్మ తన 'క్షేమ కుతూహలం' గ్రంథంలో వివరించాడు.

రాగి రంగులో ఉండే లేత మామిడాకుల్ని చక్కగా కడిగి, సన్నని ముక్కలుగా తరగాలి. తగినంత ఉప్పు వాటి మీద చల్లి, పైపైన దంచి, అందులో కొద్దిగా ఇంగువ వేసి బాగా పిసికి ముద్దగా చెయ్యాలి. ఒక బాండీలో రెండు మూడు చెంచాల నెయ్యి తీసుకుని తాలింపు గింజలు వేగించి,

కఫపిత్తహరో హృద్యో సుఖవైరస్యనాశినై!
వహ్ని సంజననో రుచ్యో చూతజో పుష్పపల్లవౌ!
మామిడి పూలు, చిగురు పెరుగుపచ్చడి కఫాన్ని, పైత్యాన్ని తగ్గిస్తుందన్నాడు క్షేమశర్మ. గుండెకి మేలు చేస్తుందన్నాడు. కడుపులో జఠరాగ్నిని ప్రజ్వరిల్లజేసి నోటికి రుచిని తెలియజేస్తుందని, అన్నహితవు కలిగిస్తుందనీ పేర్కొన్నాడు. ఫిబ్రవరి, మార్చి నెలల్లో మామిడి పూలు, చిగురు మనకు బాగా దొరుకుతాయి.

అందులో ఈ ముద్దని వేసి బాగా కలియబెట్టాలి. కొద్ది కొద్దిగా పాలు పోస్తూ కలియబెడుతుంటే మృదువుగా మారి, కూర ముద్దగా దగ్గరకొస్తుంది. ఈ దశలో మీకు కావల్సిన సుగంధ ద్రవ్యాల్ని లేదా పరిమళ ద్రవ్యాల్ని కలిపి మరింత రుచికరంగా దీన్ని చేసుకోవచ్చు. ఇది వాత వ్యాధుల్ని తగ్గించటానికి, అజీర్తిని పోగొట్టడానికి ఉపయోగపడుతుంది. కారం కోసం మిరియాల పొడిని కలిపితే ఈ మావిచిగురు కూర కఫాన్ని తగ్గించి, గొంతు శ్రావ్యంగా అయ్యేలా చేస్తుంది.

పెరుగుపచ్చడి...

'ముకుళః సహకార శాఖినః శత ఖండీ కృత సైంధవాన్వితః!



మామిడిని 'మాంగీఫెరా ఇండికా' అని పిలుస్తారు. దీని చిగురుకు షుగరు వ్యాధిపైనా, వైరస్ వ్యాధులపైనా పని చేసే గుణం ఉందని పరిశోధకులు చెబుతున్నారు. ఇది విషదోషాలను హరిస్తుంది. ట్యూమర్లను కరిగిస్తుంది. వాపుల్ని తగ్గిస్తుంది. కడుపులో నులిపురుగుల్ని పారద్రోలుతుంది. కొవ్వుని కరిగిస్తుంది. బీపీని తగ్గించే గుణం కూడా వీటికుందంటున్నారు. వాతాన్ని, పైత్యాన్ని హరిస్తుందంటే ఇన్ని బాధలూ తగ్గుతాయని అర్థం. వేరికోజ్ వీన్సుతో బాధపడేవారికి ఇది మంచి ఔషధం. అలసటని తగ్గించి శక్తినిస్తుంది. 'పూవుం దేనియం దడిసిన మావిచిగురు'... అంటే మామిడి పూలలోని తేనెతో తడిసిన మావిచిగురు చాలా కమ్మగా ఉంటుందని కవులు కీర్తించారు.

దధిమథమరీచ సంస్కృతష్షి రజామరుచిం చినత్తి హి!

మామిడి పూలతోపాటు లేత ఆకుల్ని, సన్నని కొమ్మల్ని కూడా ఓ వంద ముక్కలుగా... అంటే చాలా చిన్నచిన్న ముక్కలుగా తరిగి ఓ పళ్లెంలో పోసి, దాని మీద తగినంత ఉప్పు చల్లి, బాగా పిసకాలి. పైన చెప్పినట్టే నేతి తాలింపులో వేసి కాసేపు మగ్గనివ్వాలి. మగ్గిన తరువాత కొద్దిగా పెరుగు, తగినంత మిరియాల పొడి కలిపి పొయ్యి మీంచి దించేయాలి. పెరుగు కలిపిన తరువాత ఎక్కువ వేడి తగలకుండా ఉంటే మంచిది. ఇలా తయారు చేసిన మామిడి చిగుళ్ల, పూల పెరుగుపచ్చడి చాలా కమ్మగా ఉంటుంది.

● గంగరాజు అరుణాదేవి

నాన్నకిచ్చిన మాట కోసం...

సాధారణ విద్యార్థి నుంచి అత్యున్నత స్థానాలకు చేరడం వరకూ... ఆద్యంబిందు గీతది స్ఫూర్తిమంతమైన ప్రయాణం. మధ్యలో ఆపేసిన చదువును ఇద్దరు పిల్లల తల్లయ్యాక... తండ్రి కోరిక మేరకు కొనసాగించారు. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఛార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) బెంగళూరు శాఖకు తొలి మహిళా ఛైర్మన్ అయ్యారు. తాజాగా ఆ సంస్థ సదరన్ ఇండియా రీజనల్ కౌన్సిల్ ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టారు. ఆ పదవికి ఆరున్నర దశాబ్దాల తరువాత ఎన్నికైన మహిళగా చరిత్ర సృష్టించిన గీత 'నవ్య'తో ప్రత్యేకంగా సంభాషించారు...



"ప్రాథమిక స్థాయి నుంచి ఇంటర్ వరకూ నా చదువంతా ప్రభుత్వ విద్యా సంస్థలలోనే సాగింది. మా నాన్న మాధవరావ్ ఆద్యంబిందు మునిసిపల్ కమిషనర్‌గా పని చేసేవారు. మా అమ్మ అమ్మణ్ణి సర్వే శాఖలో ఉద్యోగి. మేము నలుగురు అక్కచెల్లెళ్ళం, మా అందరికన్నా పెద్ద మా అన్నయ్య. నాన్న ఉద్యోగరీత్యా ఎక్కడ పని చేసినా... మా చదువు చిత్తూరులోనే సాగింది. నేను సాధారణ విద్యార్థిని. చదువు మీద అంతగా ధ్యాస ఉండేది కాదు. ఇలా గడుస్తున్న సమయంలో... నా చదువు తీరును ఇంటర్‌లో మా అధ్యాపకుడు ధనశేఖర్ గమనించారు. "రాజుగారి గుర్రం గాడిద అవుతోంది" అని మందలించారు. ఆ మాటలు నాకు సూటిగా తగిలాయి. అవి నాలో ఎంతో మార్పు తెచ్చాయి. కష్టపడి చదివాను. బీకామ్ పూర్తి చేశాను. ఆ తరువాత నేను ఛార్టర్డ్ అకౌంటెన్సీ (సీఏ) చెయ్యాలని నాన్న పట్టుపట్టారు. దాంతో అనుభవం ఉన్న ఛార్టర్డ్ అకౌంటెంట్ దగ్గర చేరాను. కానీ కనీసం అయిదేళ్ళు చదవాల్సి ఉండడంతో... మధ్యలోనే వదిలేస్తానని నా కుటుంబానికి తేల్చి చెప్పాను. కానీ మధ్యలో వెనకడుగు వద్దంటూ మా నాన్న ఒత్తిడి చేశారు. చివరకు పరీక్షలు రాయడానికి చెన్నై వెళ్ళాను. అక్కడే చంద్రకాంత్‌తో స్నేహం ఏర్పడి... ప్రేమగా మారింది. 1995లో మేము వివాహం చేసుకున్నాం. రెండేళ్ళకు కవలలు జన్మించారు. కానీ సీఏ పరీక్ష పూర్తి చేయలేకపోయాను.



తొలి మహిళగా...

ఇదిలా సాగుతూ ఉండగా... నాన్న అనారోగ్యానికి గురికావడంతో ఆపరేషన్ అవసరమయింది. "నువ్వు సీఏ పూర్తి చేస్తానని మాట ఇస్తేనే ఆపరేషన్ థియేటర్లోకి వెళ్తాను" అంటూ నాతో ప్రమాణం చేయించుకున్నారు. ఆ మాటను పాటిస్తూ... నా భర్త సహకారంతో సీఏ పూర్తి చేశాను. 2008లో 'ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఛార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా' (ఐసీఏఐ) బెంగళూరు శాఖలో... ఛార్టర్డ్ అకౌంటెంట్‌గా నా పేరు రిజిస్టర్ చేసుకున్నాను. అప్పటి నుంచి నా జీవితం ఎప్పటికప్పుడు కొత్త మలుపులు తిరుగుతోంది. 2010లో ఐసీఏఐ బెంగళూరు శాఖకు తొలి మహిళా కోశాధికారిగా ఎన్నికయ్యాను. అనంతరం మూడేళ్ళపాటు వైస్-ఛైర్‌పర్సన్‌గా ఉన్నాను. ఆ తరువాత... 2017లో తొలి మహిళా ఛైర్మన్ అయ్యాను. ఆ శాఖ ఏర్పడ్డాక... 75 ఏళ్ళలో ఆ హోదాను ఒక మహిళ అందుకోవడం అదే మొదటిసారి. దేశవ్యాప్తంగా 173 ఐసీఏఐ శాఖలు... అయిదు రీజియన్లలో ఉన్నాయి. చెన్నై కేంద్రంగా సదరన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రీజనల్ సెంటర్ 1947లో ప్రారంభమయింది. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, కేరళ, తెలంగాణ రాష్ట్రాలతోపాటు పుదుచ్చేరిలోని శాఖలు దీనికి అనుబంధంగా ఉంటాయి. ఈ పరిధిలో సుమారు 85 వేలమంది ఛార్టర్డ్ అకౌంటెంట్లు ఉన్నారు. వారిలో మహిళలు సుమారు 30 శాతం ఉంటారు. ఐసీఏఐ సదరన్ ఇండియా రీజనల్ కౌన్సిల్‌కు తొలి మహిళా ఛైర్మన్‌గా... స్వాతంత్ర్య సమరయోధురాలు ఆర్.శివభోగం 1955 నుంచి మూడేళ్ళపాటు వ్యవహరించారు. 66 ఏళ్ళ తర్వాత ఎన్నికల ద్వారా అత్యధిక ఓట్లతో.... రెండవ మహిళా ఛైర్మన్‌గా నేను ఎన్నికయ్యాను.

నకిలీలను కట్టడి చేశా...

ఐసీఏఐ దేశ ఆర్థిక ప్రగతికి మార్గదర్శకంగా పనిచేసే సంస్థ. దేశవ్యాప్తంగా వర్తకులు, వాణిజ్య సంస్థలు ఎదుర్కొనే జీఎస్‌టీ లాంటి కీలకమైన అంశాలపై మేము సలహాలు ఇస్తుంటాం. అధికారులకు, ట్రేడర్లకు మధ్య నెలకొనే ప్రతి సమస్యకు పరిష్కారం చూపడమే సీఏల కీలక బాధ్యత. ప్రస్తుతం సదరన్ రీజనల్ ఛైర్మన్ హోదాలో... ఈ ఆరు రాష్ట్రాల పరిధిలోనూ సీఏ కోర్సులు పూర్తి చేసిన వారిని ప్రాక్టీస్ దిశగా ప్రోత్సహించడంతో పాటు వాణిజ్య పరిశ్రమల సమాఖ్యలు, ట్రేడర్లకు ప్రాంతాల వారీగా ఎప్పటికప్పుడు మారుతున్న పన్నుల విధానాలపై అవగాహన కల్పించడం కీలకమని నేను భావిస్తున్నాను. అందుకోసం ఏడాది పొడవునా కార్యక్రమాలు నిర్వహించాలనుకుంటున్నాను. నేను బెంగళూరు శాఖకు ఛైర్మన్‌గా ఉన్నప్పుడు... సీఏల పేరుతో ప్రాక్టీస్ చేసే నకిలీ వ్యక్తులను కట్టడి చేశాను. ఏడాదిపాటు బెంగళూరులో చేపట్టిన అవగాహన సదస్సులు దేశమంతటా ప్రచారానికి దోహదం చేశాయి. నా కుటుంబ విషయాలకు వస్తే... కవలలైన మా అమ్మాయిలు షమిత హళ్ళి, సహిత హళ్ళి కేవలం మూడేళ్ళలోనే సీఏ కోర్సు పూర్తి చేశారు. సహిత ఆస్ట్రేలియాలో ఎంఎన్‌సీ కంపెనీలో పని చేస్తోంది. షమిత బెంగళూరులోనే ఓ ప్రముఖ కంపెనీలో కీలక బాధ్యతలు నిర్వహిస్తోంది. సమాజంలో ఆడపిల్లలు బాగా చదువుకోవాలి. సొంతంగా జీవనం సాగించే శక్తి కలిగి ఉండాలి. దానికి నా జీవితమే ఉదాహరణ అని నేను పాల్గొనే ప్రతి సభలోనూ చెబుతుంటాను. నా ద్వారా కొద్ది మందయినా స్ఫూర్తి పొందాలనేది నా ఆశయం."

● హిందూపురం రవి, బెంగళూరు

వారంటీ, సర్వీస్ సెంటర్లపై సమగ్ర వివరాలివ్వాల్సిందే..

నాలుగు రంగాలకు కేంద్రం ఆదేశాలు

న్యూఢిల్లీ: ఆటోమొబైల్, కన్స్యూమర్ డ్యూరబుల్స్, మొబైల్ అండ్ ఎలక్ట్రానిక్స్, వ్యవసాయ యంత్రాల తయారీ రంగ కంపెనీలు తాము విక్రయించే ఉత్పత్తులపై వారంటీతో పాటు సర్వీసింగ్ సెంటర్లకు సంబంధించి వినియోగదారులకు సమగ్ర వివరాలు అందించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ ఉత్పత్తుల మరమ్మతులకు సంబంధించి ఫిర్యాదులు పెరిగిన నేపథ్యంలో వినియోగదారుల ప్రయోజనార్థం ప్రభుత్వం ఈ నిర్దేశకాలు జారీ చేసింది. ఉత్పత్తుల మరమ్మతులకు సంబంధించి వినియోగదారులను ఇబ్బందికి గురి చేస్తున్న ప్రస్తుత, కొత్త ఆందోళనలను పరిష్కరించేందుకు వినియోగదారుల వ్యవహారాల కార్యదర్శి రోహిత్ కుమార్ సింగ్ ఈ నాలుగు రంగాల ప్రతినిధులతో ఇదివరకే భేటీ అయ్యారు.

ఫారెక్స్ నిల్వల్లో భారీ వృద్ధి

ముంబై: భారత విదేశీ మారక (ఫారెక్స్) నిల్వల్లో భారీ వృద్ధి నమోదైంది. ఆర్‌బీఐ శుక్రవారం విడుదల చేసిన డేటా ప్రకారం.. ఈ నెల 1తో ముగిసిన వారంలో ఫారెక్స్ నిల్వలు మరో 655 కోట్ల డాలర్ల మేర పెరిగి మొత్తం 62,562.6 కోట్ల డాలర్లకు చేరుకున్నాయి. అంతక్రితం వారంలోనూ నిల్వలు 297 డాలర్లకు పైగా పెరిగాయి. 2021 అక్టోబరులో ఫారెక్స్ నిల్వలు ఆల్‌టైం రికార్డు గరిష్ఠ స్థాయి 64,500 కోట్ల డాలర్లకు పెరిగాయి. కానీ, అంతర్జాతీయ ప్రతికూల పరిణామాలతో రూపాయి విలువ క్షీణతకు అడ్డుకట్ట వేసేందుకు ఆర్‌బీఐ మార్కెట్లోకి విరివిగా డాలర్లను విడుదల చేయాల్సి రావడంతో ఫారెక్స్ నిల్వలు మళ్లీ తగ్గుతూ వచ్చాయి.

- మొబైల్ టెలికాం సేవలకు ఉపయోగపడే ఎనిమిది బ్యాండ్ల స్పెక్ట్రమ్‌ను ప్రభుత్వం మే 20వ తేదీ నుంచి వేలం వేయనుంది. టెలికాం శాఖ (డాట్) శుక్రవారం దీనికి సంబంధించి నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ ఎనిమిది బ్యాండ్ల స్పెక్ట్రమ్ కనీస ధరను రూ.96,317.65 కోట్లుగా నిర్ణయించారు.
- ఇండియా యమహా మోటార్ (ఐవైఎం).. తిరుపతిలో బ్లూ స్క్వేర్ ఔట్‌లెట్‌ను ప్రారంభించింది. ఈ కొత్త ఔట్‌లెట్‌తో దేశవ్యాప్తంగా కంపెనీ బ్లూ స్క్వేర్ షోరూమ్స్ సంఖ్య 300కు చేరింది. ఈ షోరూమ్‌లో కంపెనీ తన ప్రీమియం మోటార్ సైకిళ్లను విక్రయించటంతో పాటు యాక్సెసరీస్, విక్రయానంతర సేవలను అందించనుంది.
- రిలయన్స్ రిటైల్‌కు చెందిన ట్రెండ్స్.. తెలంగాణలోని నాగర్ కర్నూలు జిల్లా కల్వకుర్తిలో కొత్త షోరూమ్‌ను ప్రారంభించింది. ద్వితీయ, తృతీయ శ్రేణి పట్టణాల్లో కార్యకలాపాల విస్తరణలో భాగంగా ఈ షోరూమ్‌ను ఏర్పాటు చేసింది.

'ఎన్నికల'పై ఎఫ్ఎంసీజీ కంపెనీల ఆశలు

రూ.5-10 ప్యాకెట్లకు పెరగనున్న డిమాండ్

ఉత్పత్తి, పంపిణీ పెంచుతున్న కంపెనీలు



న్యూఢిల్లీ: కొద్ది రోజుల్లో లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్ రాబోతోంది. ఇందుకు అవసరమైన ఖర్చుల కోసం రాజకీయ పార్టీలు, పోటీపడే అభ్యర్థులు ఇప్పటికే సిద్ధమయ్యారు. వీరి ప్రచార సభలు, ర్యాలీలకు వచ్చే జనానికి మంచినీళ్ల ప్యాకెట్లు, చిన్న చిన్న బిస్కెట్ ప్యాకెట్లు, శీతల పానీయాల వంటి చిరుతిళ్లు, కానుకలు పంచేందుకు పార్టీలు సిద్ధమై పోయాయి. ఈ డిమాండ్‌ను సొమ్ము చేసుకునేందుకు ఎఫ్ఎంసీజీ కంపెనీలూ సిద్ధమయ్యాయి. రూ.5 లేదా రూ.10 ధర ఉండే చిన్న చిన్న ప్యాకెట్లు, బాటిళ్లతో సిద్ధమవుతున్నాయి.

ఉత్పత్తి పెంపు: సాధారణ రోజుల్లో రూ.5 లేదా రూ.10 ప్యాకెట్లకు పెద్దగా డిమాండ్ ఉండదు. ఎన్నికల సమయంలోనే వీటికి డిమాండ్. ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, బిహార్, పశ్చిమ బెంగాల్, తమిళనాడు సహా తెలుగు రాష్ట్రాల్లో రాజకీయాలు ఇప్పటికే వేడెక్కాయి. దీంతో ఆయా రాష్ట్రాల్లో ఈ చిన్న ప్యాకెట్లు, బాటిళ్లకు డిమాండ్ క్రమంగా పెరుగుతోంది. ఎన్నికల నోటిఫికేషన్ వస్తే ఇది మరింత పెరగనుంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని కంపెనీలు ఈ ప్యాకెట్ల ఉత్పత్తి, పంపిణీ 10 శాతం వరకు పెంచేశాయి. కంపెనీల సేల్స్ రిప్రజెంటేటివ్‌లు గ్రామీణ ప్రాంతాల్లో సైతం పెద్దఎత్తున పర్యటిస్తూ కిరాణా షాపుల్లో వీటి కొరత లేకుండా స్టాకులు పెంచుతున్నారు.'ర్యాలీలు ఎక్కువగా జరిగే హిందీ రాష్ట్రాల్లో చిన్న ప్యాకెట్లలో లభించే బిస్కెట్లు, స్నాక్స్‌కు ఇప్పటికే గిరాకీ పెరిగింది. దీంతో మామూలు రోజుల కంటే ఎన్నికల సమయంలో ఈ చిన్న ప్యాకెట్ల నిల్వలను 8 నుంచి 10 శాతం వరకు పెంచబోతున్నాం' అని ఒక కంపెనీ ఉన్నతాధికారి చెప్పారు. చిన్న చిన్న ప్యాకెట్లలో హెయిర్ ఆయిల్, షాంపూలు, పానీయాలు అమ్మే కంపెనీలదీ ఇదే పరిస్థితి.

చిన్న మొత్తాల పొదుపు రేట్లు యథాతథం

ఏప్రిల్-జూన్ త్రైమాసికానికీ ప్రస్తుత రేట్లే వర్తింపు



న్యూఢిల్లీ: వచ్చే ఆర్థిక సంవత్సరం (2024-25)లో తొలి త్రైమాసికానికి చిన్న మొత్తాల పొదుపు పథకాల వడ్డీ రేట్లను యథాతథంగా కొనసాగిస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ నెల 31తో ముగియనున్న ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2023-24) నాలుగో త్రైమాసికానికి ప్రకటించిన వడ్డీ రేట్లు.. 2024-25 తొలి త్రైమాసికంలోనూ (ఏప్రిల్ 1 నుంచి జూన్ 30 వరకు) యథాతథంగా కొనసాగుతాయని కేంద్ర ఆర్థిక శాఖ శుక్రవారం విడుదల చేసిన నోటిఫికేషన్‌లో పేర్కొంది. ప్రస్తుతం సుకన్య సమృద్ధి పథకంపై చెల్లించే వడ్డీ 8.2 శాతంగా ఉండగా.. మూడేళ్ల టర్మ్ డిపాజిట్‌తో పాటు పబ్లిక్ ప్రావిడెండ్ ఫండ్ (పీపీఎఫ్) వడ్డీ రేటు 7.1 శాతంగా.. పొదుపు ఖాతాలోని సొమ్ముపై చెల్లించే వడ్డీ 4 శాతంగా ఉంది. అలాగే, కిసాన్ వికాస్ పత్రాలపై 7.5 శాతం, నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్ (ఎన్ఎస్‌సీ)పై 7.7 శాతం వడ్డీ లభించనుంది. ప్రస్తుత త్రైమాసికంలో లాగే వచ్చే క్వార్టర్‌లోనూ నెలవారీ ఆదాయ పథకంపై 7.4 శాతం వడ్డీ రాబడి సమకూరనుంది. మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా కేంద్రం ప్రతి మూడు నెలలకు ఒకసారి చిన్న మొత్తాల పొదుపు రేట్లను సవరిస్తుంటుంది. 2022 మే నుంచి ఆర్‌బీఐ రెపో రేటును పలు విడతల్లో మొత్తం 2.5 శాతం పెంచింది. దాంతో రెపో రేటు 6.5 శాతానికి చేరుకుంది. తత్ఫలితంగా బ్యాంక్‌లు రుణాలతో పాటు పలు డిపాజిట్ పథకాలపై చెల్లించే వడ్డీ రేటును సైతం పెంచాయి. అయితే, ఆర్‌బీఐ గత ఐదు సమీక్షల్లో రెపో రేటును యథాతథంగా కొనసాగించింది.

కార్పొరేట్ బోర్డుల్లో పెరిగిన 'మహిళా' ప్రాతినిధ్యం

న్యూఢిల్లీ: జనాభాలో అర్ధభాగానికి పైబడి తామే ఉన్నప్పటికీ వ్యాపార, పారిశ్రామిక విభాగాల్లో మాత్రం తమ పాత్ర పరిమితమేనన్నది పలువురు మహిళల ఫిర్యాదు. కానీ డెలాయిట్ గ్లోబల్ బోర్డ్‌రూమ్ ప్రోగ్రామ్ నిర్వహించిన సర్వే ప్రకారం కార్పొరేట్ బోర్డుల్లో మహిళా డైరెక్టర్ల సంఖ్య గత ఐదేళ్ల కాలంలో క్రమంగా పెరుగుతూ ఇప్పుడు 18.3 శాతానికి చేరింది. అయితే ప్రపంచ సగటు 23.3 శాతంతో పోల్చితే మాత్రం మన దేశంలో కార్పొరేట్ మహిళా డైరెక్టర్ల సంఖ్య ఇంకా తక్కువగానే ఉంది. 50 దేశాలకు చెందిన 18,000 కంపెనీల్లో ఈ సర్వే నిర్వహించారు. భారత్ నుంచి 400 కంపెనీలు వాటిలో ఉన్నాయి.

నివేదిక ముఖ్యాంశాలు...

- 2018 నాటికి మహిళా డైరెక్టర్ల సంఖ్య 13.8 శాతం కాగా 2021 నాటికి 17.1 శాతానికి, 2023 నాటికి 18.3 శాతానికి పెరిగింది.
- 2022 నుంచి మహిళా డైరెక్టర్ల సంఖ్య 3.6 శాతం పెరిగింది. దీని ప్రకారం చూస్తే 2038 నాటికి బోర్డుల్లో మహిళా డైరెక్టర్ల సంఖ్య పురుషులతో సమానం అవుతుంది. గతంలో ప్రకటించిన అంచనా 2045తో పోల్చితే ఏడు సంవత్సరాల ముందే ఈ గమ్యం సాధ్యమవుతుంది.
- 2018 సంవత్సరంతో పోల్చితే డైరెక్టర్ల బోర్డుకు చైర్‌పర్సన్‌గా వ్యవహరించే మహిళల సంఖ్య 2023 నాటికి 4.5 శాతం నుంచి 4.1 శాతానికి తగ్గింది. ఇదే కాలంలో సీఈఓలుగా సారథ్య బాధ్యతలు నిర్వహించే మహిళల సంఖ్య మాత్రం 3.4 శాతం నుంచి 5.1 శాతానికి పెరిగింది.
- రంగాలవారీగా ధోరణులు పరిశీలించినట్టయితే 21.3 శాతం మహిళా డైరెక్టర్లతో లైఫ్ సైన్సెస్ అండ్ హెల్త్‌కేర్ రంగం అగ్రస్థానంలో ఉంది. టెక్నాలజీ, మీడియా, టెలికాం (20.5 శాతం), కన్స్యూమర్ బిజినెస్ (19.7 శాతం), తయారీ (17.4 శాతం), ఆర్థిక సర్వీసులు (16.9 శాతం) తర్వాతి స్థానాల్లో టాప్ 5లో ఉన్నాయి.



మహిళా ఎంటర్‌ప్రెన్యూర్లకు నిధుల కటకట

ఆర్థిక స్వతంత్రం, సాధికారత కోసం చేస్తున్న పోరాటంలో భాగంగా భారతదేశంలో ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌లోకి ప్రవేశిస్తున్న మహిళల సంఖ్య పెరుగుతోంది. విభిన్న రంగాలకు చెందిన పరిశ్రమల్లో మహిళా ఎంటర్‌ప్రెన్యూర్ల సంఖ్య పెరుగుతున్నప్పటికీ విభిన్న అంశాల్లో వారు పలు సవాళ్లు ఎదుర్కొంటున్నారు. చక్కని నైపుణ్యాలు, నవ్య ఆలోచనా ధోరణులు ఉన్నప్పటికి ఇన్వెస్టర్ విశ్వాసం పొందడంలోను, నిధుల సమీకరణలోను వారు తీవ్ర సవాళ్లను ఎదుర్కొంటున్నారు. ప్రధానంగా నిధుల కల్పనలో లింగవివక్ష అధికంగా ఉన్నట్టు పలు సర్వేలు తేల్చాయి. సుమారు 62 శాతం మంది మహిళలు ఈ వివక్షను అనుభవిస్తున్నారు. ఈ వ్యత్యాసాన్ని పూడ్చి పెరుగుతున్న పోటీ వాతావరణంలో మహిళలు ఎంటర్‌ప్రెన్యూర్లుగా ప్రకాశించాలంటే మరిన్ని మద్దతు వ్యవస్థలను తీసుకురావలసిన అవసరం ఉన్నదని పలువురు అంటున్నారు. మహిళా నాయకత్వాన్ని అభివృద్ధి చేయడంపై అధిక మొత్తాల్లో ఇన్వెస్ట్ చేయడం అనేది నోటిమాటకే పరిమితం కాకూడదని, మహిళల ఉమ్మడి సామర్థ్యాలను వెలికి తీయడంలో కీలకమైన అడుగు కావాలని గ్రేట్ ప్లేసెస్ టు వర్క్ సీఈఓ యశస్విని రామస్వామి అన్నారు. మహిళలు ఇంటి సంరక్షణ బాధ్యతలతో పాటు వృత్తిపరమైన ఆకాంక్షలు నెరవేర్చుకునేందుకు మద్దతు అవసరమన్నారు.

రికార్డు స్థాయిలో 'సిప్' పెట్టుబడులు

రెండేళ్ల గరిష్ఠ స్థాయిలో ఈక్విటీ ఎంఎఫ్‌లు

న్యూఢిల్లీ: మ్యూచువల్ ఫండ్స్ (ఎంఎఫ్) పథకాల్లో పెట్టుబడుల వెల్లువ కొనసాగుతోంది. గత నెల (ఫిబ్రవరి) ఈ పథకాల్లో క్రమానుగత పెట్టుబడులు (సిప్) రికార్డు స్థాయిలో రూ.19,186 కోట్లకు చేరాయి. ఈ ఏడాది జనవరితో పోలిస్తే ఇది రూ.348 కోట్లు ఎక్కువ. ఇదే సమయంలో ఈక్విటీ ఎంఎఫ్‌ల పెట్టుబడులూ 23 నెలల గరిష్ఠ స్థాయి రూ.26,866 కోట్లుగా నమోదయ్యాయి. జనవరి నెలతో పోలిస్తే ఇది 23 శాతం ఎక్కువ. కొత్త ఫండ్స్, థిమాటిక్ ఫండ్స్‌లో పెట్టుబడులు పెరగడం ఇందుకు ప్రధాన కారణమని దేశంలోని మ్యూచువల్ ఫండ్స్ పరిశ్రమకు ప్రాతినిధ్యం వహించే యాంఫీ తెలిపింది. ఫిబ్రవరి నెల మొత్తం మీద ఎంఎఫ్ పరిశ్రమ రూ.1.2 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించింది. ఇందులో రూ.63,809 కోట్లు డెట్ ఫండ్స్ ద్వారా సమకూరితే, ఈక్విటీ ఫండ్స్ ద్వారా రూ.26,866 కోట్లు సమకూరాయి. హైబ్రిడ్ ఫండ్స్ ద్వారా మిగతా రూ..18,105 కోట్లు సమకూరాయి. దీంతో గత నెలాఖరు నాటికి ఎంఎఫ్‌ల నిర్వహణలోని పథకాల నికర పెట్టుబడుల విలువ రూ.54.54 లక్షల కోట్లకు చేరింది. జనవరితో పోలిస్తే ఇది రూ.1.8 లక్షల కోట్లు ఎక్కువ.

బ్యాంకింగ్ సిబ్బందికి ఏటా 17% వేతన పెంపు

ఐదు రోజుల పని దినాలు

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ బ్యాంకుల (పీఎస్‌బీ) సిబ్బంది కల నెరవేరనుంది. వారానికి ఐదు రోజుల పని దినాల కోసం వారు చేస్తున్న విజ్ఞప్తి ఫలించనుంది. జీతాల సవరణ కోసం ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ (ఐబీఏ), బ్యాంకింగ్ యూనియన్ల మధ్య జరిగిన చర్చల్లో ఈ మేరకు అంగీకారం కుదిరింది. వీరి జీతాలనూ ఏటా 17 శాతం చొప్పున పెంచేందుకూ ఐబీఏ అంగీకరించింది. ప్రభుత్వ ఆమోదం లభించిన వెంటనే ఈ నిర్ణయం అమల్లోకి రానుంది. 2022 నవంబరు నుంచి అమలయ్యే ఈ నిర్ణయం వల్ల, దాదాపు ఎనిమిది లక్షల మంది పీఎస్‌బీ సిబ్బందికి మేలు జరగనుంది. జీతాల సవరణతో పీఎస్‌బీలపై ఏటా రూ.8,284 కోట్ల అదనపు భారం పడుతుందని అంచనా. మెడికల్ సర్టిఫికెట్ లేకుండా మహిళా ఉద్యోగులు నెలకు ఒక సిక్ లీవ్ పెట్టుకునేందుకూ ఐబీఏ అంగీకరించింది.

ఇన్ఫీలో సుధా మూర్తి వాటా విలువ రూ.5,600 కోట్లు

కంపెనీలో ఆమె పేరిట 0.83 శాతం వాటా



న్యూఢిల్లీ: రాజ్యసభకు ఎంపికైన సుధా మూర్తి దేశీయ ఐటీ దిగ్గజ కంపెనీ ఇన్ఫోసిస్‌లో 0.83 శాతం వాటాకు సమానమైన 3.45 కోట్ల షేర్లను కలిగి ఉన్నారు. కంపెనీ షేరు ప్రస్తుత ధర ప్రకారం ఈ వాటా విలువ దాదాపు రూ.5,600 కోట్లు. ఇన్ఫోసిస్ సహ-వ్యవస్థాపకులు ఎన్ఆర్ నారాయణ మూర్తి భార్యే సుధా మూర్తి. బ్రిటన్ ప్రస్తుత ప్రధాని రుషి సునాక్‌కు అత్తగారు కూడా. పలు పుస్తకాల రచయిత, దాతృత్వమూర్తి అయిన 73 ఏళ్ల సుధా మూర్తి ప్రస్తుతం మూర్తి ట్రస్ట్‌కు చైర్‌పర్సన్‌గా ఉన్నారు. సుధా మూర్తికి 2006లో పద్మశ్రీ అవార్డు దక్కింది. ఈ ఏడాది కేంద్ర ప్రభుత్వం ఆమెకు పద్మ భూషణ్ పురస్కారాన్ని సైతం ప్రకటించింది. కాగా, ఇన్ఫోసిస్‌లో నారాయణ మూర్తి రూ.2,691 కోట్ల విలువైన 1.66 కోట్ల ఈక్విటీ షేర్లు కలిగి ఉన్నారు.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	65,730 ▲	60,250 ▲	79,000 ▲
ముంబై	64,955 ▲	59,499 ▲	72,265 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

8వ తేదీ		విజయవాడ	463
హైదరాబాద్	469	విశాఖపట్నం	475
9వ తేదీ		వరంగల్	471
చిత్తూరు	523		
గోదావరి	463	డజను గుడ్లు రూ.72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	107	గోదావరి	114
వరంగల్	107	విజయవాడ	114
కరీంనగర్	107	గుంటూరు	114
మహబూబ్‌నగర్	107	ఒంగోలు	114
కర్నూలు	107	చిత్తూరు	110
విశాఖపట్నం	113		

స్పోర్ట్స

వారెవా..దీప్తి



- ఆల్‌రౌండ్ షోతో అదుర్స్
- ఈ సీజన్‌లో తొలి హ్యాట్రిక్ నమోదు
- ఢిల్లీపై పరుగు తేడాతో యూపీ గెలుపు

సంక్షిప్త స్కోర్లు

యూపీ: 20 ఓవర్లలో 138/8 (దీప్తి 59, హీలీ 29, రాధా 2/16, టిటాస్ 2/23).

ఢిల్లీ: 19.5 ఓవర్లలో 137 ఆలౌట్ (లానింగ్ 60, దీప్తి 4/19, హ్యారిస్ 2/8, సైమా 2/13).

నేటి మ్యాచ్
ముంబై x గుజరాత్
రాత్రి 7.30 గం. నుంచి

న్యూఢిల్లీ: చావో రేవో తేల్చుకోవాల్సిన కీలక పోరులో యూపీ వారియర్స్ అదరగొట్టింది. మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)లో భాగంగా శుక్రవారం అత్యంత ఉత్కంఠగా సాగిన లోస్కోరింగ్ మ్యాచ్‌లో యూపీ ఒక్క పరుగు తేడాతో ఢిల్లీ క్యాపిటల్స్‌ను ఓడించి ప్లేఆఫ్స్ ఆశలు సజీవంగా ఉంచుకుంది. 139 పరుగుల స్వల్ప ఛేదనలో ఢిల్లీ 19.5 ఓవర్లలో 137 పరుగులకు ఆలౌటైంది. ఢిల్లీ జట్టులో కెప్టెన్ మెగ్ లానింగ్ (60) మినహా అంతా విఫలమయ్యారు. జెమీమా 17, షఫాలీ 15, క్యాప్సీ 15 రన్స్ చేశారు. యూపీ కట్టుదిట్టమైన బౌలింగ్ ధాటికి ఢిల్లీ చివరి రెండు ఓవర్లలో ఏకంగా ఆరు వికెట్లు సమర్పించుకుంది. 19వ ఓవర్‌లో దీప్తి 5 పరుగులే ఇచ్చి 3 వికెట్లు తీసింది ఇక, ఆఖరి ఓవర్ చివరి నాలుగు బంతుల్లో రెండు పరుగులు చేయాల్సిన దశలో ఢిల్లీ మిగతా మూడు వికెట్లు కోల్పోయి భారీ మూల్యం చెల్లించుకుంది. యూపీ బౌలర్లలో దీప్తి శర్మ (4/19) హ్యాట్రిక్ సహా నాలుగు వికెట్లు పడగొట్టగా.. హ్యారిస్, సైమా ఠాకూర్ చెరో 2 వికెట్లు తీశారు. అంతకుముందు యూపీ 20 ఓవర్లలో 8 వికెట్లకు 138 రన్స్ చేసింది. దీప్తి శర్మ (59) అర్ధ సెంచరీతో సత్తా చాటగా, కెప్టెన్ అలిసా హీలీ (29) ఫర్వాలేదనిపించింది. ఆల్‌రౌండ్ షోతో అలరించిన దీప్తి శర్మ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచింది. ఈ సీజన్‌లో హ్యాట్రిక్ తీసిన తొలి ప్లేయర్‌గా దీప్తి రికార్డుకెక్కింది. ఓవరాల్‌గా ఈ ఘనత సాధించిన రెండో ప్లేయర్ దీప్తి. గతేడాది ఇస్సీ వాంగ్ (ముంబై తరఫున) తొలి హ్యాట్రిక్ నమోదు చేసింది. ఇక ఈ టోర్నీలో అతి తక్కువ స్కోరును కాపాడుకున్న తొలి జట్టుగా యూపీ నిలిచింది.

సింధు ఇంటికి

- సాత్విక్ జోడీ సెమీస్‌కు
- లక్ష్యసేన్ కూడా

పారిస్: స్టార్ షట్లర్ పీవీ సింధుకు ఫ్రెంచ్ ఓపెన్‌లో చుక్కెదురైంది. క్వార్టర్‌ఫైనల్లో ఒలింపిక్ చాంపియన్ చెన్ యు ఫీ (చైనా)తో జరిగిన హోరాహోరీ పోరులో పరాజయం పాలైంది. శుక్రవారం దాదాపు గంటన్నరపైగా సాగిన మ్యాచ్‌లో సింధు 24-22, 17-21, 18-21తో రెండోసీడ్, డిఫెండింగ్ చాంప్ చెన్ యు ఫీకి తలొగ్గింది. ఇక, డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్/చిరాగ్ శెట్టి జోడీ సెమీఫైనల్ చేరింది. క్వార్టర్‌ఫైనల్లో సాత్విక్/చిరాగ్ 21-19, 21-13తో థాయ్‌లాండ్ ద్వయం సుపక్ జామ్‌కో/కిట్టినుపాంగ్‌ను చిత్తుచేసింది. ఫైనల్ బెర్త్ కోసం కొరియా జోడీ హ్యాక్/సియో సెంగ్‌తో అమీతుమీ తేల్చుకోనుంది. పురుషుల సింగిల్స్‌లో లక్ష్య సేన్ కూడా సెమీఫైనల్లో ప్రవేశించాడు. క్వార్టర్స్‌లో లక్ష్య సేన్ 19-21, 21-15, 21-13తో ప్రపంచ మాజీ విజేత లో కీన్ యే (సింగపూర్)పై గెలిచాడు.

హాజెల్‌వుడ్ 'పాంచ్'

న్యూజిలాండ్ 162 ఆలౌట్

క్రైస్ట్‌చర్చ్: ఆస్ట్రేలియాతో శుక్రవారం మొదలైన రెండో టెస్టులో టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన న్యూజిలాండ్.. పేసర్లు హాజెల్‌వుడ్ (5/31), స్టార్క్ (3/59) ధాటికి తొలి ఇన్నింగ్స్‌లో 162 పరుగులకే కుప్పకూలింది. ఓపెనర్ లాథమ్ (38) ఫర్వాలేదనిపించాడు. వందో టెస్టు ఆడుతున్న కేన్ విలియమ్సన్ (17) కూడా నిరాశపరిచాడు. 107 రన్స్‌కే 8 వికెట్లు కోల్పోయిన దశలో హెన్రీ (29), సౌథీ (26) ఆదుకోవడంతో జట్టు ఆ మాత్రం స్కోరైనా చేయగలిగింది. అయితే కివీస్‌ను తక్కువ స్కోరుకే అవుట్ చేశామన్న ఆనందం కంగారూలకు ఎంతోసేపు మిగల్లేదు. మొదటి ఇన్నింగ్స్ బరిలోకి దిగిన ఆసీస్ తొలిరోజు ఆట ముగిసేసరికి 124/4 స్కోరు చేసింది. లబుషేన్ (45), లియాన్ (1) క్రీజులో ఉన్నారు.

ప్రీక్వార్టర్స్‌లో నిషాంత్

బస్టో ఆర్సిజియో (ఇటలీ): ప్రపంచ ఒలింపిక్ బాక్సింగ్ క్వాలిఫయర్‌లో భారత బాక్సర్ నిషాంత్ దేవ్ ప్రీక్వార్టర్స్‌లోకి ప్రవేశించాడు. శుక్రవారం జరిగిన 71 కిలోల విభాగం రెండో రౌండ్‌లో నిషాంత్ 5-0తో మదీవ్ ఎస్కేర్ ఖాన్ (జార్జియా)ను చిత్తుగా ఓడించాడు. ప్రీక్వార్టర్స్ బౌట్ ఆదివారం జరగనుంది. ఇతర బౌట్లలో అంకుషిత బోరో (66 కి) 2-3తో సోన్వికో ఎమిలీ (ఫ్రాన్స్) చేతిలో, సంజీత్ (92 కి.) 0-5తో ఐబెక్ ఒరల్బె (కజకిస్థాన్) చేతిలో ఓడి తొలిరౌండ్లోనే వెనుదిరిగారు.

వినూత్నంగా ఒలింపిక్ వేడుకలు

పారిస్: ఒలింపిక్ క్రీడల చరిత్రలోనే తొలిసారిగా ఆరంభ వేడుకలను స్టేడియం బయట నిర్వహిస్తున్నారు. వచ్చే జూన్ 26న పారిస్ ఒలింపిక్స్ ఆరంభ వేడుకలను వినూత్నంగా పారిస్‌లోని సీన్ నదిపై గల ఆస్టర్‌లిజ్ వంతెనపై సూర్యాస్తమయం వేళ నిర్వహించనున్నారు. ఇందులో 10 వేల 500 మంది అథ్లెట్లు పాల్గొననున్నారు. వీరంతా నదిలో 160 నౌకలపై ఆరు కిలోమీటర్ల మేర ప్రయాణించి, పరేడ్ చేయనున్నారు. క్రీడల విస్తృతిని చాటాలనే ఉద్దేశంతో ఈ విధంగా బహిరంగ ప్రదేశంలో సహజ వెలుగుల మధ్య ఆరంభ వేడుకలను జరుపుతున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

ప్రజ్ఞానందకు నాలుగో స్థానం

ప్రాగ్ (చెక్ రిపబ్లిక్): ప్రాగ్ ఇంటర్నేషనల్ చెస్ టోర్నీని ప్రజ్ఞానంద నాలుగో స్థానంతో ముగించాడు. శుక్రవారం జరిగిన ఆఖరిదైన 9వ రౌండ్‌లో స్థానిక జీఎం డేవిడ్‌తో గేమ్‌ను ప్రజ్ఞానంద డ్రా చేసుకున్నాడు. అబ్దుసత్తోరోవ్ (ఉజ్బెకిస్థాన్) 6.5 పాయింట్లతో విజేతగా నిలవగా, నుయెన్ (చెక్ రిపబ్లిక్) 5 పాయింట్లతో రెండోస్థానంలో నిలిచాడు. పర్హామ్ (ఇరాన్), ప్రజ్ఞానంద 5 పాయింట్లతో నుయెన్‌తో సమంగా నిలిచినా, తక్కువ టైబ్రేక్ స్కోరుతో 3, 4 స్థానాలకు పరిమితమయ్యారు. గుకేష్, విదిత్ 7, 10 స్థానాల్లో నిలిచారు.

ధర్మశాలలో దంచేశారు

భారత్ తొలి ఇన్నింగ్స్ 473/8
ప్రస్తుత ఆధిక్యం 255



రోహిత్, గిల్ శతకాలు

దేవ్‌దత్, సర్ఫరాజ్ హాఫ్ సెంచరీలు

ఇంగ్లండ్‌తో ఐదో టెస్టు



ధర్మశాల: ఇంగ్లండ్‌తో జరుగుతున్న ఐదో టెస్టులో రెండో రోజు టీమిండియా 'టాప్'షోతో అలరించింది. ప్రత్యర్థి బౌలర్లను ఆటాడుకుంటూ భారత బ్యాటర్లు పరుగుల వరద పారించారు. శుభ్‌మన్ గిల్ (110), కెప్టెన్ రోహిత్ శర్మ (103) సెంచరీలతో సత్తా చాటుకున్నారు. ఆ తర్వాత అరంగేట్ర బ్యాటర్ దేవ్‌దత్ పడిక్కళ్ (65) తన రంజీ ఫామ్‌ను కొనసాగించగా.. సర్ఫరాజ్ (56) మరోసారి దూకుడు ప్రదర్శించాడు. ఇలా టాప్-5 ఆటగాళ్లంతా 50+ పరుగులతో ఇంగ్లండ్‌ను అల్లాడించారు. దీంతో శుక్రవారం ఆట ముగిసే సమయానికి భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 120 ఓవర్లలో 8 వికెట్లకు 473 పరుగుల భారీ స్కోరు సాధించింది. ప్రస్తుతం జట్టు 255 రన్స్ ఆధిక్యంలో కొనసాగుతోంది. అయితే క్రీజులో ఉన్న కుల్దీప్ (27 బ్యాటింగ్), బుమ్రా (19 బ్యాటింగ్) 108 బంతులను ఎదుర్కొని జట్టును ఆలౌట్ కాకుండా కాపాడారు. అలాగే తొమ్మిదో వికెట్‌కు అజేయంగా 45 పరుగులు జత చేయడం విశేషం. శనివారం తొలి సెషన్‌లో ఈ జోడీ ఎంతసేపు నిలుస్తుందనే దానిపై భారత్ ఆధిక్యం ఆధారపడి ఉంటుంది.

సెంచరీల జోరు: 135/1 ఓవర్‌నైట్ స్కోరుతో రెండో రోజును ఆరంభించగా.. రోహిత్, గిల్ మరో వికెట్ కోల్పోకుండా సెంచరీలతో సెషన్‌ను ముగించారు. అలాగే 46 పరుగుల ఆధిక్యం లభించింది. ఇక ఈ ఇద్దరినీ విడదీసేందుకు బౌలర్లు ఎంతగా ప్రయత్నించినా నిరాశే ఎదురైంది. బషీర్ ఓవర్లలో రోహిత్‌ను కట్టడి చేసేందుకు లెగ్ స్లిప్‌లో ఫీల్డింగ్ పెట్టగా.. ఉడ్ షార్ట్‌బాల్స్‌తో ప్రయత్నించాడు. అలాగే లెగ్ సైడ్‌లో ఆరుగురు ఫీల్డర్లను మోహరించినా ఇద్దరు బ్యాటర్లు ఇబ్బంది లేకుండా సెషన్‌లో 129 రన్స్ రాబట్టారు. రోహిత్ తొలిరోజే ఫిఫ్టీ పూర్తి చేయగా.. గిల్ 26 పరుగులతో రెండో రోజును ఆరంభించాడు. అండర్సన్ ఓవర్‌లో 6,4.. ఉడ్ ఓవర్‌లో 4,4తో జోరు కనబరుస్తూ వేగంగా ఆడాడు. దీంతో రోహిత్ సెంచరీ పూర్తయిన రెండో బంతికే గిల్ కూడా శతకం అందుకున్నాడు.

పడిక్కళ్, సర్ఫరాజ్ దూకుడు: టీ బ్రేక్ ఆరంభంలోనే వరుస ఓవర్లలో రోహిత్‌ను స్టోక్స్, గిల్‌ను అండర్సన్ క్లీన్ బౌల్డ్ చేశారు. దీంతో రెండో వికెట్‌కు 171 పరుగుల భారీ భాగస్వామ్యం ముగిసింది. అయితే అరంగేట్ర బ్యాటర్ దేవ్‌దత్, సర్ఫరాజ్ అంత సులువుగా లొంగలేదు. మూడో వికెట్‌కు 97 పరుగులు జోడించారు. ఫోర్‌తో టెస్టుల్లో పరుగుల ఖాతాను తెరిచిన పడిక్కళ్.. అండర్సన్ ఓవర్‌లో అయితే మూడు ఫోర్లతో ఆకట్టుకున్నాడు. అంతేకాకుండా తన తొలి 30 పరుగుల్లో 7 ఫోర్లు ఉండడం విశేషం. ఇక సర్ఫరాజ్ ఆరంభంలో నెమ్మదిగా ఆడి 30 బంతుల్లో 9 పరుగులే చేసినా.. హార్ట్‌లీ ఓవర్‌లో 2 ఫోర్లతో టచ్‌లోకి వచ్చాడు. పేసర్ ఉడ్‌ను కూడా వదల్లేదు. సులువుగా బౌండరీలు బాదేస్తూ మరో 25 బంతుల్లోనే తన ఫిఫ్టీని పూర్తి చేశాడు.

ఐదు వికెట్లు ఫట్: ఆఖరి సెషన్‌లో భారత తడబడి ఐదు వికెట్లను కోల్పోయింది. తొలి బంతికే సర్ఫరాజ్‌ను స్పిన్నర్ బషీర్ అవుట్ చేశాడు. ఆ తర్వాత సిక్సర్‌తో అర్ధసెంచరీ సాధించిన దేవ్‌దత్, జురెల్ (15)లను కూడా బషీర్ పెవిలియన్‌కు చేర్చాడు. మరోవైపు 102వ ఓవర్‌లో జడేజా (15), అశ్విన్ (0) వికెట్లను హార్ట్‌లీ పడగొట్టాడు. ఇలా ఒక్క పరుగు వ్యవధిలో భారత్ మూడు వికెట్లు కోల్పోగా అప్పటికి స్కోరు 428/8. ఇంకా రోజు ముగిసేందుకు 18 ఓవర్లతో పాటు చేతిలో రెండు వికెట్లే ఉండడంతో ఆలౌట్ ఖాయమే అనిపించింది. కానీ కుల్దీప్ సిసలైన బ్యాటర్‌గా క్రీజులో నిలవగా, అతడికి బుమ్రా సహకరిస్తున్నాడు. ఈ ఇద్దరూ ఏకాగ్రతతో ఆడి మరో వికెట్ కోల్పోకుండా రెండో రోజును ముగించారు.

1 ఇంగ్లండ్‌పై ఎక్కువ టెస్టు సెంచరీలు (4) సాధించిన భారత ఓపెనర్‌గా గవాస్కర్‌తో కలిసి టాప్‌లో ఉన్న రోహిత్.

3 భారత్ తరఫున అత్యధిక అంతర్జాతీయ సెంచరీలు (48) సాధించిన మూడో బ్యాటర్‌గా ద్రవిడ్ సరసన రోహిత్. సచిన్ (100), విరాట్ (80) ముందున్నారు. అలాగే వార్నర్ (49), సచిన్ (45) తర్వాత 43 శతకాలతో మూడో ఓపెనర్‌గా నిలిచాడు.


ఆ విషయం చెప్పకపోతేనే మంచిది

రెండో రోజు బ్యాటింగ్‌లో గిల్‌కు పేసర్ అండర్సన్ మధ్య చిన్నపాటి వాగ్వాదం జరిగింది. అతడి ఓవర్‌లో గిల్ భారీ సిక్సర్ బాదాక ఈ ఘటన చోటు చేసుకుంది. అయితే ఆ సమయంలో తమ ఇద్దరి మధ్య జరిగిన సంభాషణను వెల్లడించకుండా ఉంటేనే మంచిదని మ్యాచ్ ముగిశాక గిల్ తెలిపాడు. ఇక తన ఆటతీరు చూశాక తండ్రి లఖ్విందర్ సంతోషించి ఉంటాడన్నాడు.

4 ఒకే ఇన్నింగ్స్‌లో భారత టాప్-5 బ్యాటర్లు 50+ స్కోర్లు సాధించడం ఇది నాలుగోసారి. గతంలో ఆసీస్, కివీస్, శ్రీలంకపై ఈ ఫీట్ నమోదు చేశారు.

50 ఇంగ్లండ్ పేసర్ అండర్సన్‌కు టెస్టుల్లో ధర్మశాల 50వ వేదిక.

స్టోక్స్ మ్యాజిక్



సుమారు ఎనిమిది నెలల తర్వాత బంతి చేతపట్టిన ఇంగ్లండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్ తొలి ఓవర్‌లోనే అబ్బురపరిచాడు. రెండో రోజు తొలి సెషన్‌లో పేసర్లు, స్పిన్నర్లు అంతా తేలిపోవడంతో వారికి ఒక్క వికెట్ కూడా దక్కలేదు. ఇక తప్పదనుకున్న స్టోక్స్ రెండో సెషన్‌ను తనే ఆరంభించాడు. అయితే తాను వేసిన మొదటి బంతికే సెంచరీ మీదున్న రోహిత్‌ను బౌల్డ్ చేసి అందరినీ ఆశ్చర్యపరిచాడు. అతడు విసిరిన గుడ్‌లెంగ్త్ బాల్ రోహిత్‌ను ఏమార్చుతూ వికెట్‌ను ఎగరగొట్టింది. దీంతో ఈ మ్యాజిక్ బాల్‌కు రోహిత్ సైతం అవాక్కవుతూ పెవిలియన్ చేరాడు. అటు స్టోక్స్ సహచరులు కూడా నమ్మలేని విధంగా చూస్తూ అతడిని అభినందించారు.

స్కోరుబోర్డు

ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్: 218; భారత్ తొలి ఇన్నింగ్స్: జైస్వాల్ (స్టంప్) ఫోక్స్ (బి) బషీర్ 57; రోహిత్ (బి) స్టోక్స్ 103; గిల్ (బి) అండర్సన్ 110; దేవ్‌దత్ (బి) బషీర్ 65; సర్ఫరాజ్ (సి) రూట్ (బి) బషీర్ 56; జడేజా (ఎల్బీ) హార్ట్లీ 15; జురెల్ (సి) డకెట్ (బి) బషీర్ 15; అశ్విన్ (బి) హార్ట్లీ 0; కుల్దీప్ (బ్యాటింగ్) 27; బుమ్రా (బ్యాటింగ్) 19; ఎక్స్‌ట్రాలు: 6; మొత్తం: 120 ఓవర్లలో 473/8. వికెట్ల పతనం: 1-104, 2-275, 3-279, 4-376, 5-403, 6-427, 7-427, 8-428; బౌలింగ్: అండర్సన్ 14-1-59-1; ఉడ్ 15-1-89-0; హార్ట్లీ 39-3-126-2; బషీర్ 44-5-170-4; స్టోక్స్ 5-1-17-1; రూట్ 3-0-8-0.

మీ కలలకు.. మా రెక్కలు!

» ఆడబిడ్డలకు టీడీపీ ప్రత్యేక పథకం: చంద్రబాబు

అమరావతి, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): 'కలలు కనండి. సాకారం చేసుకోండి'.. అని అబ్దుల్ కలాం ఎప్పుడో పిలుపునిచ్చారు! 'ఉన్నత చదువులకు సంబంధించిన మీ కలలకు మేం రెక్కలు తొడుగుతాం. వాటిని సాకారం చేస్తాం' అని టీడీపీ భరోసా ఇస్తోంది. 'మహిళా దినోత్సవం' రోజున... శుక్రవారం యువతుల విద్యాభ్యాసానికి సంబంధించి టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు ఈ ప్రకటన చేశారు. ఈ పథకానికి 'కలలకు రెక్కలు' అనే పేరు పెట్టారు. శుక్రవారం చంద్రబాబు సతీమణి భువనేశ్వరి పత్తికొండ నియోజకవర్గంలో చేపట్టిన 'నిజం గెలవాలి' కార్యక్రమంలో ఈ పథకం బ్రోచర్‌ను విద్యార్థినులతో కలిసి ఆవిష్కరించారు. పేర్లు నమోదు చేసుకోవలసిన 'కలలకు రెక్కలు.కామ్' వెబ్‌సైట్‌ను కూడా ప్రారంభించారు. టీడీపీ-జనసేన సర్కారు అధికారంలోకి రాగానే 'కలలకు రెక్కలు' అనే కార్యక్రమాన్ని అమలు చేస్తారు.

ఏమిటీ స్కీమ్...

'కలలకు రెక్కలు' పథకం కింద ప్రొఫెషనల్ కోర్సులు నేర్చుకునే విద్యార్థినులకు ప్రభుత్వ గ్యారెంటీతో బ్యాంకు రుణాలు ఇప్పిస్తారు. బ్యాంకు నుంచి పొందే రుణాలకు వడ్డీ కూడా పూర్తిగా ప్రభుత్వమే చెల్లిస్తుంది. ఆసక్తి ఉన్న విద్యార్థినులు 'కలలకు రెక్కలు.కామ్' వెబ్‌సైట్‌లో ఇప్పుడే రిజిస్టర్ చేసుకోవాలని చంద్రబాబు శుక్రవారం 'ఎక్స్' వేదికగా సూచించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు. 'ఆర్థిక పరిస్థితులు అనుకూలించని కారణంగా మన ఆడబిడ్డలు ఇంటికే పరిమితం కాకూడదన్న ఆశయంతో 'కలలకు రెక్కలు' అనే పథకాన్ని మన ప్రభుత్వం వచ్చిన తర్వాత అమలు చేయబోతున్నాం. ఇంటర్మీడియట్ విద్యను పూర్తి చేసుకున్న ఆడబిడ్డలు పైచదువులు చదివేందుకు తీసుకునే రుణాలకు ప్రభుత్వమే పూచీకత్తుగా ఉంటుంది. కోర్సు కాలానికి రుణంపై వడ్డీ కూడా ప్రభుత్వమే భరిస్తుంది' అని పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలు వర్తించని, సాయం పొందే అర్హతలేని యువతులకు... ఫీజు రీఇంబర్స్‌మెంట్ వర్తించని ఉన్నత విద్య అభ్యసించాలనుకునే వారికి ఈ పథకం ద్వారా లబ్ధి చేకూరనుంది. దేశంలో ఎక్కడ, ఎలాంటి ఉన్నత విద్యను చదవాలనుకున్నా సాయం లభిస్తుంది.

ఒట్టి మాటలు చెప్పం!: పవన్

అమరావతి, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): 'నా అక్కలు, నా చెల్లెమ్మలు అంటూ నాలుక చివరి మాటలతో సరిపుచ్చం. ప్రతి ఆడపడుచుకు రక్షణ కల్పిస్తాం.. వారి సంక్షేమానికి కట్టుబడి ఉంటాం' అని జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. శుక్రవారం మహిళా దినోత్సవం సందర్భంగా రాష్ట్రంలో ఉన్న ప్రతి స్త్రీమూర్తికి ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు. నవతరం యువత తరచూ మల్టీ టాస్కింగ్ అంటూ ఉంటుందని.. మన ఇంట్లో అమ్మ, అక్క, చెల్లే కాదని, ఏ మహిళామణిని చూసినా బహుముఖ ప్రజ్ఞ అంటే ఏమిటో తెలుస్తుందన్నారు.

ఓటు చీలకూడదనే సీట్ల సర్దుబాటు

» టీడీపీ, జనసేన, బీజేపీ పొత్తు ఖాయం: అచ్చెన్న

టెక్కలి, మార్చి 8: 'రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలకూడదనే ఉద్దేశంతో ఇప్పటికే టీడీపీ, జనసేన కూటమి సీట్ల సర్దుబాటు చేసుకుంది. ఐదు కోట్ల మంది ప్రజలు, అధికార పార్టీ దోపిడీదారుల మధ్య ఈ ఎన్నిక జరగనుంది' అని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు అన్నారు. శుక్రవారం శ్రీకాకుళం జిల్లా టెక్కలి మండలం రావివలసలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ ఎన్నికల్లో వైసీపీకి బుద్ధి చెప్పేందుకు రాష్ట్ర ప్రజలు సిద్ధంగా ఉన్నారు. ఈ రాష్ట్రానికి పట్టిన శని జగన్‌రెడ్డి. ఐదేళ్ల పాలనలో ఐదు కోట్ల ఆంధ్రులు నరకయాతన పడ్డారు' అని అచ్చెన్న విమర్శించారు. 'మార్చి 17న చిలకలూరిపేటలో టీడీపీ-జనసేన భారీ బహిరంగ సభ నిర్వహించనుంది. ఆ సభకు రాష్ట్రంలోని అనేక ప్రాంతాల నుంచి ప్రజలను తరలించేందుకు ఆర్టీసీ బస్సులు అద్దెకు ఇవ్వండి' అని కోరుతూ టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు ఏపీఎస్ఆర్టీసీకి లేఖ రాశారు.

కాకినాడ రూరల్ సమన్వయకర్తగా పిల్లి

అమరావతి, మార్చి 8(ఆంధ్రజ్యోతి): టీడీపీ కాకినాడ రూరల్ సమన్వయకర్తగా పిల్లి సత్యనారాయణమూర్తిని నియమిస్తూ టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు ఒక ప్రకటన విడుదల చేశారు. సహ సమన్వయకర్తగా కటకంశెట్టి ప్రభాకర్‌ని, పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులుగా కురుపాంకు చెందిన దత్తి లక్ష్మణరావును, శింగనమలకు చెందిన రామలింగారెడ్డిని నియమించారు.

అభివృద్ధి, సంక్షేమంపై చర్చకు సిద్ధమా..?

» సమయం, స్థలం ఖరారు చెయ్.. జగన్‌కు లోకేశ్ సవాల్

» నేడు శంఖారావానికి విరామం



కదిరి సభలో లోకేశ్‌తో కరచాలనం చేసేందుకు పోటీపడుతున్న టీడీపీ కార్యకర్తలు

పుట్టపర్తి/అనంతపురం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): సీఎం జగన్ చెడ్డీ వేసుకున్నప్పుడే రాష్ట్రానికి అభివృద్ధి, సంక్షేమాన్ని పరిచయం చేసిన వ్యక్తి చంద్రబాబు అని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ ఉద్ఘాటించారు. ఐదేళ్లలో ఎవరూ చేయని సంక్షేమం, అభివృద్ధి చేశానని ప్రతి సభలో జగన్ డబ్బా కొంటుకున్నాడని ఎద్దేవాచేశారు. వీటిపై చర్చించడానికి తాను సిద్ధమని.. సమయం, స్థలం ఖరారు చేసి చెప్పాలని ముఖ్యమంత్రికి సవాల్ విసిరారు. విజయసాయిరెడ్డిని, సజ్జలను పంపిస్తానంటే కుదరదని.. ఆయనే రావాలని డిమాండ్ చేశారు. శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తి నియోజకవర్గం పరిధిలోని కొత్తచెరువు, కదిరి నియోజకవర్గ కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన శంఖారావం సభల్లో లోకేశ్ ప్రసంగించారు. 'దేశానికి సంక్షేమాన్ని పరిచయం చేసిన వ్యక్తి అన్న ఎన్టీఆర్. కిలో బియ్యం రూ.2కే ఇచ్చారు. ఆస్తిలో మహిళలకు సమాన హక్కు, డ్వాక్రా సంఘాలు, దీపం పథకం, మహిళలకు పసుపు-కుంకుమ, తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్.. ఇలా ఎన్నో సంక్షేమ పథకాలు అందించిన ఘనత చంద్రబాబుదే. ఉమ్మడి హైదరాబాద్ సహా రాష్ట్రానికి అనేక సంస్థలు, పరిశ్రమలను తీసుకొచ్చి దేశానికి అభివృద్ధిని పరిచయం చేసిందీ ఆయనే. 2014-19 నడుమ అనంతకు కియ, హీరో, హెచ్‌సీఎల్ లాంటి అనేక పరిశ్రమలు తీసుకొచ్చారు. వాటిని నాశనం చేసిన ఘనత జగన్‌కే దక్కుతుంది. ఈ ఐదేళ్లలో ఒక్క పరిశ్రమైనా తీసుకొచ్చాడా? ఆయనకు ఇష్టమైన చంచల్‌గూడ జైలును కూడా చంద్రబాబే అభివృద్ధి చేశారు. జగన్‌ను చూస్తే కోడికత్తి, బాబాయ్ గొడ్డలిపోటు గుర్తొస్తాయి. తల్లిని, చెల్లిని బయటకు నెట్టేసిన వ్యక్తి గుర్తుకొస్తాడు. సొంత చెల్లిపైనే అసభ్యకర పోస్టులు పెట్టించి, ఆమె కన్నీటికి కారణమయ్యాడు. తల్లికి, చెల్లికి న్యాయం చేయలేని జగన్.. ప్రజలకు ఏం మేలు చేస్తాడు' అని ప్రశ్నించారు. పాదయాత్ర సందర్భంగా తనను ప్రొఫెషనల్ కోర్సు చదువుకునేవారు కలిశారని.. అప్పుడే వారికి గుణాత్మక విద్య అందించాలని ఆలోచించామని చెప్పారు. అందుకు తగినట్లుగానే కలలకు రెక్కలు పేరుతో ప్రొఫెషనల్ కోర్సుల పథకాన్ని అమలు చేయాలని నిర్ణయించాం. మహిళలకు అన్ని రంగాల్లో సముచిత స్థానం కల్పించింది టీడీపీయే. వారు బాగా చదవాలి. వారికి అండగా అంటాం' అని హామీ ఇచ్చారు. మోసానికి ప్యాంటు, షర్టు వేస్తే.. జగన్ అచ్చం అలాగే ఉంటాడని దుయ్యబట్టారు. చెత్తపైనా పన్ను వేసిన సైకో సీఎంను ఇంటికి పంపించాలని ప్రజలకు పిలుపిచ్చారు. శుక్రవారం పుట్టపర్తి ప్రశాంతి నిలయంలోని సత్యసాయిబాబా మహాసమాధిని దర్శించుకున్న ఆయన.. మహాశివరాత్రిని పురస్కరించుకుని శంఖారావానికి శనివారం విరామం ప్రకటించారు. శుక్రవారం కదిరిలో సభ ముగించుకుని హైదరాబాద్ బయల్దేరి వెళ్లారని ఆ పార్టీ రాష్ట్ర మీడియా కో-ఆర్డినేటర్ బీవీ వెంకటరాముడు తెలిపారు. ఆదివారం అనంతపురం జిల్లా ఉరవకొండ నియోజకవర్గం నుంచి శంఖారావాన్ని పునఃప్రారంభిస్తారు.



హస్తిన నుంచే తమ్ముళ్లకు ఫోన్లు

» టీడీపీ నేతలకు చంద్రబాబు బుజ్జగింపు

» టికెట్లు ఇచ్చినవారికి సహకరించాలని వినతి

అమరావతి, మార్చి 8(ఆంధ్రజ్యోతి): హస్తినలో బీజేపీ అగ్రనేతలతో పొత్తు చర్చల్లో టీడీపీ అధినేత చంద్రబాబు తలమునకలుగా ఉన్నప్పటికీ.. విరామ సమయంలో ఇటు పార్టీ నేతలపైనా దృష్టి సారించారు. ముఖ్యంగా సీట్లు కోల్పోతున్న నాయకులకు అక్కడినుంచే ఫోన్లు చేసి బుజ్జగించారు. కొన్ని నియోజకవర్గాల్లో పోటీ వాతావరణం ఉండడంతో అక్కడ పార్టీ అధికారికంగా టికెట్ ఇచ్చినవారికి సహకరించాలని కోరారు. అలాగే జనసేనతో పొత్తులో అవకాశం కోల్పోయిన నియోజకవర్గ నేతలను కూడా ఆయన సముదాయించారు. పార్టీ నిర్ణయాన్ని గౌరవించి మిత్రపక్షం కోసం పనిచేయాలని విజ్ఞప్తి చేశారు. మొత్తం 19 నియోజకవర్గాల నేతలతో ఆయన మాట్లాడినట్లు టీడీపీ వర్గాలు తెలిపాయి. వీరిలో జనసేనకు కేటాయించిన 11స్థానాల నేతలు ఉన్నారు. ఉంగుటూరు, పిఠాపురం, పోలవరం (ఎస్టీ), నరసాపురం, తాడేపల్లిగూడెం, విశాఖ దక్షిణ, పాలకొండ (ఎస్టీ), అనంతపురం, తిరుపతి ఇన్‌చార్జులు గన్ని వీరాంజనేయులు, వర్మ, బొరగం శ్రీనివాస్, పొత్తూరి రామరాజు, వలవల బాబ్జీ, గండి బాబ్జీ, నిమ్మక జయకృష్ణ, వైకుంఠం ప్రభాకర్ చౌదరి, సుగుణమ్మ.. కాకినాడ రూరల్ సీనియర్ నేత పిల్లి సత్యనారాయణ మూర్తి, యలమంచిలి సీనియర్ నేతలు పప్పల చలపతిరావు, ప్రగడ నాగేశ్వరరావు తదితరులతో చంద్రబాబు మాట్లాడారు. ఈ నియోజకవర్గాలను పొత్తులో భాగంగా జనసేనకు ఇవ్వాల్సి వచ్చిందని, పరిస్థితిని అర్థం చేసుకుని సహకరించాలని కోరారు. అధికారంలోకి వచ్చాక వారికి ఇతరత్రా అవకాశాలు కల్పిస్తామని, పార్టీ శ్రేణులకు ఇబ్బంది రాకుండా చూసుకుంటామని హామీ ఇచ్చారు. టీడీపీ పోటీచేస్తున్న నియోజకవర్గాల్లోనూ కొందరు నేతలకు ఆయన ఫోన్‌చేశారు. ప్రకాశం జిల్లా యర్రగొండపాలెం(ఎస్సీ)లో ఎరిక్సన్‌బాబుకు టికెట్ ఇచ్చిన నేపథ్యంలో ఆయనకు సహకరించి గెలిపించాలని జడ్పీ మాజీ వైస్ చైర్మన్ మన్నె రవీంద్రబాబుకు విజ్ఞప్తి చేశారు. పార్వతీపురం(ఎస్సీ) టికెట్ పొందిన విజయ్‌తోపాటు ఆ నియోజకవర్గ ముఖ్య నేత జగదీశ్‌తోనూ చంద్రబాబు మాట్లాడారు. విజయ్‌ను గెలిపించడానికి కృషిచేయాలని జగదీశ్‌కు సూచించారు. అనంతపురం జిల్లా కల్యాణదుర్గంలో టికెట్ పొందిన సురేంద్రబాబుకు సహకరించాలని నియోజకవర్గ నేతలు హనుమంతరాయ చౌదరి, ఉమామహేశ్వరనాయుడులను కోరారు. నంద్యాల టికెట్ పొందిన మైనారిటీ నేత ఎన్ఎండీ ఫరూక్‌తో కలిసి పనిచేయాలని, విజయానికి సహకరించాలని మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డికి సూచించారు. చిత్తూరు మాజీ ఎమ్మెల్యేలు సీకే బాబు, ఏఎస్ మనోహర్‌లతో చంద్రబాబు విడివిడిగా మాట్లాడారు. అక్కడ పార్టీ అభ్యర్థి గురజాల జగన్మోహన్ విజయానికి కలిసికట్టుగా పనిచేయాలని కోరారు. కురుపాం (ఎస్టీ) నేత దత్తి లక్ష్మణరావుతో ఫోన్లో మాట్లాడి.. అక్కడి అభ్యర్థి జగదీశ్వరి విజయానికి కృషి చేయాలన్నారు. లక్ష్మణరావును పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

'బంగారు' బాటలో ముడుపుల మూటలు

» ఏపీలో నాయకులకు, తెలంగాణలో అధికారులకు.. లంచాలివ్వడంలో ఓ డిస్టిలరీ యాజమాన్యం కొత్తపుంత

హైదరాబాద్, మార్చి 8(ఆంధ్రజ్యోతి): అది ఒక మద్యం తయారీ కంపెనీ. ఏపీ, తెలంగాణలో ఎక్కువగా అమ్ముడయ్యే ఓ ప్రముఖ బ్రాండు మద్యాన్ని తయారుచేస్తుంటుంది. ఆ కంపెనీకి సంగారెడ్డిలో, మహారాష్ట్రలో తయారీప్లాంట్లు ఉన్నాయి. రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ మద్యం అమ్మకాల విషయంలో ప్రభుత్వాలదే గుత్తాధిపత్యం ఉన్న నేపథ్యంలో.. కంపెనీలన్నీ రాజకీయ నాయకత్వాలకు, కొన్నిచోట్ల అధికారులకు ముడుపులు.. అదీ నగదు రూపంలోనే ముట్టజెప్పాల్సి వస్తోంది. ఈ క్రమంలో సదరు డిస్టిలరీ యాజమాన్యం.. నాయకులకు, అధికారులకు లంచాలు ఇవ్వడంకోసం ఓ సరికొత్త అక్రమానికి తెరతీసింది! అందుకు ఆ సంస్థ ఎంచుకున్న మార్గం.. బంగారం దుకాణాలు. జ్యువెలరీ షాపులకు కమీషన్లను ఎర చూపి.. ఏడాదిలో రూ.340 కోట్ల మేర ముడుపులను డబ్బు రూపంలో నాయకులు, అధికారులకు సమర్పించుకుంది. ఈ ముడుపుల్లో ఎక్కువ భాగం ఏపీలోని ఒక 'బిగ్ షాట్'కు ముట్టినట్లు సమాచారం. తెలంగాణలోని ఇద్దరు కీలక అధికారులకు రూ.15 కోట్లకు పైగా అందినట్లు తెలిసింది. ఒక అధికారి భార్య ఆస్పత్రి పెట్టుకోవడానికి కూడా డబ్బును సర్దుబాటు చేసినట్లు తెలుస్తోంది. ఈ డిస్టిలరీ యాజమాన్యం నుంచి ఆమ్యామ్యాలు పుచ్చుకున్న ఆ 'లంచావతారాలు' ఎవరు? దీనికి ఇంకా లింకులున్నాయా? అనే కోణంలో కేంద్ర దర్యాప్తు బృందాలు కూపీ లాగుతున్నాయి. మద్యాన్ని తయారు చేసే ఆ డిస్టిలరీ.. రెండు తెలుగు రాష్ట్రాలకూ నెలకు 4లక్షల కేసుల(ఒక్కో కేసులో 12ఫుల్ బాటిళ్లు ఉంటాయి) మద్యాన్ని సరఫరా చేస్తుంటుంది. ఇందులో 3 లక్షల కేసులను ఏపీకి, లక్ష కేసులను తెలంగాణకు సరఫరా చేస్తోంది. తమ కంపెనీ సరుకును ప్రభుత్వాలు ఎక్కువ మొత్తంలో కొనేలా చేసేందుకు నాయకులు, అధికారులకు లంచాలు ఇస్తూ వస్తోంది. ముడుపుగా ఇవ్వాల్సిన నగదును సమకూర్చుకోవడానికి డిస్టిలరీ యాజమాన్యం కొన్ని జ్యువెలరీ షాపులతో కుమ్మక్కయింది. వారికి చెక్కులు ఇచ్చి.. బంగారాన్ని కొనుగోలు చేసినట్లు.. కొన్న బంగారాన్ని తమ డీలర్లకు నజరానాగా ఇచ్చినట్లు ఉత్తుత్తి రికార్డులను సృష్టించింది. కానీ వాస్తవంగా.. వారివద్ద ఎలాంటి నగలనూ కొనుగోలు చేయలేదు. నగల దుకాణాలవారు ఆ చెక్కులను బ్యాంకుల్లో వేసి.. వచ్చిన నగదును వచ్చినట్టే డిస్టిలరీ యాజమాన్యానికి అప్పగించారు. ఈ లావాదేవీలు చేసిపెట్టినందుకుగాను వారినుంచి 6% కమీషన్ పుచ్చుకున్నారు. ఈ దందాలో మద్యం కంపెనీకి హైదరాబాద్‌లోని నాలుగు జ్యువెలరీ షాపులు, ముంబైలోని కొన్ని షాపులు సహకరించినట్టు సమాచారం. ఏడాది వ్యవధిలో రూ.360 కోట్ల విలువైన లావాదేవీలు జరగ్గా అందులో దుకాణాల వారికి ఇచ్చిన కమీషన్ పోను దాదాపు రూ.340కోట్లు రాజకీయ నాయకులకు, అధికారులకే ముట్టజెప్పినట్లు తెలిసింది.

అమలాపురం ఎంపీ అభ్యర్థిగా రాపాక

» రాజోలు అసెంబ్లీ సీటు గొల్లపల్లికి

» కర్నూలు లోక్‌సభకు బీవై రామయ్య

» 3 పేర్లతో వైసీపీ 11వ జాబితా

» నేడు ఉత్తరాంధ్ర ఎమ్మెల్యేలతో జగన్ భేటీ

అమరావతి, మార్చి 8(ఆంధ్రజ్యోతి): ఇద్దరు లోక్‌సభ ఇన్‌చార్జులు, ఒక అసెంబ్లీ ఇన్‌చార్జి పేర్లతో వైసీపీ తన 11వ జాబితాను శుక్రవారం విడుదల చేసింది. రాజోలు అసెంబ్లీ స్థానంలో జనసేన తరఫున గెలిచి వైసీపీలో చేరిన ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావును అమలాపురం లోక్‌సభ ఇన్‌చార్జిగా ప్రకటించారు. రాజోలు స్థానానికి ఇటీవల టీడీపీ నుంచి వచ్చి చేరిన మాజీమంత్రి గొల్లపల్లి సూర్యారావును ఇన్‌చార్జిని చేశారు. కర్నూలు లోక్‌సభ ఇన్‌చార్జిగా మాజీ మేయర్ బీవై రామయ్య నియమితులయ్యారు. ఇక్కడ ఇంతకుముందు అభ్యర్థిగా ప్రకటించిన గుమ్మనూరు జయరాం మంత్రి పదవికి, వైసీపీకి రాజీనామా చేసి టీడీపీలో చేరిన సంగతి తెలిసిందే. కాగా.. ఉత్తరాంధ్ర జిల్లాల ఎమ్మెల్యేలతో సీఎం జగన్ శనివారం భేటీ కానున్నారు. ఆదివారం మేదరమెట్లలో జరిగే 'సిద్ధం' ఆఖరి బహిరంగ సభలో మొత్తం వైసీపీ తుది అభ్యర్థుల జాబితాను ఆయన ప్రకటిస్తారని ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో ఈ భేటీకి ప్రాధాన్యం ఏర్పడింది. ఇప్పటివరకు ఉత్తరాంధ్ర ఎమ్మెల్యేల అభ్యర్థిత్వాలపై ఆయన పూర్తిస్థాయి స్పష్టత ఇవ్వలేదు. కొందరు ముఖ్య నేతలకు టికెట్ ఇస్తున్నారో లేదో కూడా తేల్చలేదు. ముఖ్యంగా మంత్రులు ధర్మాన ప్రసాదరావు, గుడివాడ అమర్నాథ్, స్పీకర్ తమ్మినేని సీతారాం వంటి వారికి తిరిగి టికెట్ లభించడంపై అనుమానాలు నెలకొన్నాయి. శనివారం జగన్ స్పష్టత ఇచ్చే అవకాశం ఉందని వైసీపీ వర్గాలు చెబుతున్నాయి.

అద్దంలా తెలంగాణ.. అధ్వానంగా ఆంధ్రా..

(మొదటి పేజీ తరువాయి)

భద్రాచలం నుంచి పర్ణశాలకు వెళ్లే మార్గంలో ఏపీలోని అల్లూరి సీతారామరాజు జిల్లా యటపాక మండలంలో 9 కి.మీ. ప్రయాణించాలి. తెలంగాణ నుంచి ఏపీలోకి వచ్చి, మళ్లీ తెలంగాణలోకి వెళ్లాలి. జగన్ సర్కారు వచ్చాక ఏపీ పరిధిలోని రోడ్డుకు కనీసం మరమ్మతులు కూడా చేయకపోవడంతో దారుణంగా తయారైంది. ఈ మార్గంలో వెళ్లాలంటేనే వాహనదారులు హడలిపోతున్నారు. పలు రాష్ట్రాల నుంచి వచ్చే భక్తులు కార్లు, బస్సులు, వ్యాన్లలో భద్రాచలం నుంచి పర్ణశాలకు రాకపోకలు సాగిస్తుంటారు. నిత్యం ఈ రహదారిపై ప్రయాణిస్తుంటారు. తెలంగాణలో రోడ్డు జీబ్రాలైన్స్‌తో రాకపోకలకు సౌలభ్యంగా ఉంది. తెలంగాణ నుంచి ఆంధ్రాలోకి రాగానే వాహనదారులు వామ్మో అంటూ హడలిపోతున్నారు. రాత్రిపూట వాహనాలు గుంతల్లో పడి ప్రమాదాలకు గురవుతున్నాయి. రాష్ట్ర విభజనలో ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన భద్రాచలం మండలం యటపాక, పిచుకలపాడు, కన్నాయిగూడెం పంచాయతీలు ఏపీలోని అల్లూరి సీతారామరాజు జిల్లా పరిధిలోకి వెళ్లాయి. అలాగే భద్రాచలం-పర్ణశాల మార్గంలో రాజుపేట నుంచి తూరుబాక వరకు 9 కి.మీ. ఆర్అండ్‌బీ రహదారి ఆంధ్రాలోకి వెళ్లింది. తెలంగాణలో రోడ్డుకు ఆర్అండ్‌బీ అధికారులు మరమ్మతులు, బీటీ నిర్మాణ పనులు చేస్తున్నారు. ఆంధ్రాలోని రోడ్డుకు మరమ్మతుల గురించి పట్టించుకునేవారే లేరు. కల్వర్టులు కూడా దెబ్బతిన్నాయి. దీంతో ఈ మార్గంలో ప్రయాణించడానికి వాహనదారులు నరకం చూస్తున్నారు. ఆంధ్రా, తెలంగాణతో పాటు ఛత్తీస్‌గఢ్ నుంచి భక్తులు, పర్యాటకులు ఈ మార్గంలో ప్రయాణిస్తుంటారు. ఆంధ్రప్రదేశ్‌లో జగన్ సర్కారు ప్రభుత్వ ఆస్తులు తాకట్టు పెడుతూ, అడ్డగోలుగా అప్పులు చేస్తున్నా కనీసం రోడ్డు మరమ్మతు పనులు కూడా చేయించడం లేదు. - (ఖమ్మం-ఆంధ్రజ్యోతి)

నిర్వాసితులపై నిర్దయ!



వివరాలు	మొత్తం	పునరావసం కల్పించిన కుటుంబాలు	మిగిలినవి
తొలిదశలో తరలించాల్సిన నిర్వాసిత కుటుంబాలు	20946	12797	8149
మొత్తం పునరావాస కాలనీలు	75	26	49
తొలి దశలో భూసేకరణ చేయాల్సిన ఎకరాలు	68539	65333	3206
అవసరమైన నిధులు (తొలిదశలో)	7907	5587	2320

» పోలవరం ముంపు కుటుంబాలకు జగన్ మోసం

» పునరావాసం అందాల్సిన కుటుంబాలు 8,149

» ఐదేళ్లలో తరలించింది 1,120 కుటుంబాలనే!

అమరావతి, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి గోదావరికి వదిలేశారు. ఈ మాట గిట్టనివారో, విపక్షాలో అంటున్నది కాదు. పోలవరం ప్రాజెక్టు అథారిటీ తన నివేదికలో స్పష్టంగా ఇదే విషయం తేల్చిచెప్పింది. జగన్ అధికారంలోకి వచ్చాక పోలవరం నిర్వాసిత కుటుంబాల సమస్యను పూర్తిగా అటక ఎక్కించారు. తొలిదశలో...41.15 మీటర్ల కాంటూరు 115 టీఎంసీల నిల్వ సామర్థ్యం మేరకు... 20,946 నిర్వాసిత కుటుంబాలకు గాను, 12,797 కుటుంబాలను పునరావాస కాలనీలకు తరలించారు. ఇంతలో ప్రభుత్వం మారి వైసీపీ అధికారంలోకి వచ్చింది. అప్పటికి 8149 కుటుంబాలను తరలించాల్సి ఉండగా, గత ఐదేళ్లలో కేవలం 1120 కుటుంబాలకే పునరావాసం కల్పించారని 'పీపీఏ' తన నివేదికలో స్పష్టం చేసింది. వాస్తవానికి ప్రతిపక్షనేతగా ఉన్నప్పుడు.. నిర్వాసితులకు సహాయ పునరావాస కార్యక్రమాలను చేయకుండా .. ఎగువ, దిగువ కాఫర్‌డ్యామ్ పనులు చేపట్టేందుకు వీల్లేదంటూ జగన్ సెలవిచ్చారు. అధికారపగ్గాలు చేపట్టాక .. నిర్వాసితులకు పునరావాసం కల్పించకుండానే ఎగువ దిగువ కాఫర్ డ్యామ్‌ల ఎత్తు పెంచేవారు. పైగా .. గత ప్రభుత్వం నిర్మించిన కట్టడాలను సైతం తామే నిర్మించామంటూ జగన్ సర్కారు చెప్పుకొంటోంది.

పీపీఏ విడుదలచేసిన గణాంకాల ప్రకారం..

గడచిన ఏడాది ఏప్రిల్ నుంచి నేటిదాకా తొలిదశలోని 41.15 మీటర్ల కాంటూరు పరిధిలోని సహాయ పునరావాస కార్యక్రమాలను ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పూర్తిగా విస్మరించారు. నెలవారీగా పెట్టుకున్న లక్ష్యాలను ఏ ఒక్క నెల కూడా సాధించలేకపోయారు. 2013లో.. ఏప్రిల్‌లో 6999 కుటుంబాలను సురక్షిత ప్రాంతాలకు తరలించాల్సి ఉంటే .. ఒక్క కుటుంబాన్నీ కదల్చలేదు. మేలో 1,554 కుటుంబాలకుగాను కేవలం 872 కుటుంబాలనే ఖాళీ చేయించగలిగారు. జూన్‌లో 556 కుటుంబాలకుగాను 109 కుటుంబాలనే తరలించారు. జూలైలో 160 కుటుంబాల్లో ఒక్కదాన్నీ తరలించలేదు. ఆగస్టు నుంచి నవంబరు దాకా సహాయ పునరావాస కార్యక్రమాలను జగన్ సర్కారు అమలు చేయలేదు. డిసెంబరులో 4733 కుటుంబాలకుగాను 139 కుటుంబాలను మాత్రమే తరలించారు. ఇక...ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటిదాకా జగన్ సర్కారు నిర్వాసితులకు సహాయ పునరావాస కార్యక్రమాల అమలులో పూర్తి నిర్లక్ష్యం వహించింది. గత ఏడాది కాలంగా 8149 నిర్వాసిత కుటుంబాలకు గాను 1120 కుటుంబాలకు మాత్రమే తరలించినట్టు పీపీఏ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. నిర్వాసితుల కోసం 75 కాలనీలను నిర్మించాల్సి ఉంటే.. కేవలం 26 కాలనీలను మాత్రమే నిర్మించారు.

నేడే పొత్తు పొడుపు

(మొదటి పేజీ తరువాయి)

అరాచక పాలనకు అంతం పలకాలని మూడు పార్టీలు తీర్మానించుకున్నాయి. అక్షర క్రమంలోనే కాదు, అభివృద్ధిలోనూ ఆంధ్ర ప్రదేశ్ అగ్రస్థానంలో నిలిచేలా కృషి చేయాలని నిర్ణయించాయి.

ఇదీ సీట్ల లెక్క...

చంద్రబాబు, పవన్ కల్యాణ్ శుక్రవారం కూడా ఢిల్లీలోనే ఉండి బీజేపీ నేతలతో మంతనాలు జరిపారు. జనసేన-బీజేపీ కలిసి 8 లోక్‌సభ, 30 అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు విశ్వసనీయం గా తెలిసింది. మిగిలిన స్థానాల్లో తెలుగుదేశం అభ్యర్థులు బరిలో ఉంటారు. 8 ఎంపీ సీట్లలో 6, 30 అసెం బ్లీ సీట్లలో 6 నుంచి 8 బీజేపీకి కేటాయించేందుకు జనసేన సుముఖత వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. లోక్‌సభ ఎన్నికల్లో సొంతంగా 370 స్థానాల్లో, ఎన్డీయే కూటమి ద్వారా 400లకుపైగా సీట్లలో గెలవాలని బీజేపీ లక్ష్యంగా పెట్టుకుంది. దీంతోపాటు... ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి దేశవ్యాప్తంగా ఉన్న ఆదరణ రీత్యా తమకు గౌరవప్రదమైన స్థాయిలో ఎంపీ సీట్లు కేటాయించాలని బీజేపీ అగ్రనేతలు కోరినట్లు సమాచారం. దీంతో... ఉభయ కుశలోపరిలాగా తుది నిర్ణయం తీసుకున్నారు. శనివారం ఉదయం 11 గంటలకు చంద్రబాబు, పవన్ కల్యాణ్ కేంద్ర హోంమంత్రి అవిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు నడ్డాతో సమావేశమైన తర్వాత పొత్తుపై అధికారిక ప్రకటన వెలువడుతుందని బీజేపీ వర్గాలు తెలిపాయి. "మాకు కేటాయించిన సీట్లన్నీ గెలిపించుకుంటాం. రాష్ట్రంలో మా కూటమి అధికారంలోకి వచ్చేందుకు శాయ శక్తులా కృషి చేస్తాం" అని బీజేపీ నేతలు హామీ ఇచ్చినట్లు తెలిసింది. ప్రధాని నరేంద్రమోదీ ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికల సందర్భంగా కనీసం మూడు, నాలుగు సార్లు పర్యటించాలనుకున్నారని... ఈ సందర్భంగా రాష్ట్రాభివృద్ధికి అవసరమైన హామీలు ఇస్తారని కూడా బీజేపీ నేతలు చెప్పినట్లు తెలిసింది.

మీ బలం... మోదీ కరిష్మా!

"మాకు ఆంధ్రప్రదేశ్‌లో తగినంత ఓట్ల బలం లేదు. కానీ, ప్రధానమంత్రి నరేంద్రమోదీ పట్ల జనంలో చెప్పుకోదగిన ఆదరణ ఉంది. దీనికి మీరు తోడైతే బీజేపీ పట్ల రాష్ట్ర ప్రజల అభిమానం మరింత పెరుగుతుందని నమ్ముతున్నాం" అని బీజేపీ అగ్ర నేతలు చంద్రబాబుతో అన్నట్లు తెలిసింది. గత అయిదేళ్ల జగన్ పాలనలో అరాచకాలు కొనసాగాయని, రాష్ట్రం కొన్ని దశాబ్దాలు వెనుకబడిన విషయం తమ దృష్టిలో ఉందని, తమ సర్వే ప్రకారం 25 లోక్‌సభ సీట్లలో కనీసం 23 సీట్లు తెలుగుదేశం-జనసేన-బీజేపీ గెలుచుకుంటుందని తేలిందని వారు చెప్పినట్లు సమాచారం. ఆంధ్రప్రదేశ్‌లో జగన్ ఆర్థిక వ్యవస్థను ఛిన్నాభిన్నం చేస్తున్న తీరు, అప్పుల పాలు చేస్తున్న వైనం తమకు ఆందోళన కలిగిస్తోందని చెప్పారు. జగన్ తమకు మద్దతుగా నిలుస్తున్నప్పటికీ ఆయనను ప్రోత్సహించడం సరైందికాదని తాము భావిస్తున్నామని పేర్కొన్నట్లు తెలిసింది. ఈ పొత్తు కుదరకుండా చేసేందుకు జగన్ చేసిన ప్రయత్నాలు కూడా ఆయన పట్ల బీజేపీలో వ్యతిరేకత పెంచిందని తెలుస్తోంది. కాగా.. తనకు రాష్ట్రాభివృద్ధి తప్ప మరేమీ ముఖ్యం కాదని, అమరావతిని ప్రపంచ స్థాయి రాజధానిగా అభివృద్ధి చేయడం, నదుల అనుసంధానానికి వీలుగా పోలవరం వంటి బృహత్తర ప్రాజెక్టులను పూర్తి చేయడం, కేంద్రం సహకారంతో రాష్ట్రాన్ని పారిశ్రామికంగా, సాంకేతికంగా అభివృద్ధి చేయడం తనకు ప్రధానమని చంద్రబాబు బీజేపీ నేతలకు చెప్పినట్లు తెలిసింది.

ఇతర వర్గాల నుంచీ నివేదికలు..

ఏపీలో చంద్రబాబుతో స్నేహంపై ప్రముఖ సాంకేతిక నిపుణులు, సీనియర్ అధికారులు, సామాజికవేత్తల అభిప్రాయాలను కూడా బీజేపీ తెలుసుకున్నట్లు సమాచారం. "చంద్రబాబుకున్న విశ్వసనీయత, పేరు ప్రతిష్ఠల్లో వీస మాత్రం కూడా జగన్‌కు లేవు. జగన్ అరాచకవాది. మోదీ అభివృద్ధి అజెండాను మరింత ముందుకు తీసుకువెళ్లడంలో చంద్రబాబు సహకారం ఎంతో తోడ్పడుతుంది" అని అధికార వర్గాలు కూడా నివేదించినట్లు సమాచారం. డిజిటల్ ఎకానమీ సాధించేందుకు నీతీ ఆయోగ్‌కు చంద్రబాబు ఇచ్చిన నివేదికను కూడా వారు ప్రస్తావించినట్లు సమాచారం.

హరోంహర!

మహాశివరాత్రి ఉత్సవాలతో శైవక్షేత్రాలు కిటకిట

- కమనీయంగా ఆదిదంపతుల కల్యాణం
- శ్రీశైలం మల్లన్నకు మహారుద్రాభిషేకం, పాగాలంకరణ
- జనసంద్రమైన శ్రీగిరి, కోటప్పకొండ, పంచారామ క్షేత్రాలు

నంద్యాల, మార్చి 8(ఆంధ్రజ్యోతి): మహా శివరాత్రి ఘడియల్లో రాష్ట్ర వ్యాప్తంగా శైవక్షేత్రాలన్నీ కిటకిటలాడాయి. శ్రీశైలం, కోటప్పకొండతో పాటు, పంచారామ క్షేత్రాల్లో లింగరూపధరుడైన మహాశివుని దర్శించి భక్తులు పులకించిపోయారు. హరోం..హరా.. శంభో శివ శంకరా అంటూ శివనామస్మరణ చేశారు. శ్రీశైలంలో మల్లికార్జున, భ్రమరాంబికాదేవి కల్యాణ మహోత్సవం శుక్రవారం కన్నుల పండువగా జరిగింది. శ్రీగిరిలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు వేడుకగా జరిగాయి. రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా.. కర్ణాటక నుంచి వెల్లువలా తరలివచ్చిన భక్తజనంతో శ్రీగిరి క్షేత్రం జనసంద్రమైంది. శివరాత్రి సందర్భంగా శ్రీశైలం మల్లన్న, భ్రమరాంబికా దేవిలకు ఆలయ ప్రధాన అర్చకులు విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలు, పరిమళాలు వెదజల్లే పూలతో అలంకరించి పెళ్లి పీటలపై ఆసీనులను గావించారు. వేదపండితులు పెళ్లి మంత్రాల నడుమ ఆదిదంపతులు ఒకటయ్యారు. శివరాత్రి పర్వదినాన శైవ క్షేత్రాల్లో లింగోద్భవకాల మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, కల్యాణం నిర్వహిస్తారు. కానీ ఏ క్షేత్రంలోనూ లేని విధంగా శ్రీశైలంలో స్వామి అమ్మవార్లకు కల్యాణం సమయంలో మల్లికార్జునుడికి పాగాలంకరణ వేడుక నిర్వహిస్తారు. ఏటా మాదిరిగానే ఈ సంవత్సరం కూడా రాత్రి 10 గంటల నుంచి పాగాలంకరణ కార్యక్రమం మొదలైంది. బాపట్ల జిల్లా చీరాల మండలం హస్తినాపురం గ్రామానికి చెందిన చేనేత కార్మికుడు పృథ్వీ వెంకటేశ్వర్లు పాగాలంకరణ చేశారు. ఇతర ప్రాంతాల భక్తులు తీసుకువచ్చే పాగాలను కూడా స్వామికి అలంకరిస్తారు. పండితులు, ప్రధాన అర్చకులు ఓ వైపు శాస్త్రోక్తంగా జ్యోతిర్లింగ మల్లికార్జునుడికి లింగోద్భవ కార్యక్రమాన్ని చేపట్టగా, మరోవైపు వెంకటేశ్వర్లు పాగాలంకరణను మొదలుపెట్టాడు. ఆ సమయంలో స్వామి వారి భక్తుల శివనామస్మరణతో నల్లమల కొండలు మార్మోగాయి. అనంతరం స్వామి అమ్మవార్లకు కల్యాణోత్సవం నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా సంధ్యవేళ నిర్వహించిన ప్రభోత్సవం కన్నుల పండుగగా సాగింది. భక్తులు కోలాటం, నందికోలు సేవ, నృత్యాలతో ఉత్సవమూర్తుల ప్రభోత్సవానికి స్వాగతం పలికారు.

కిటకిటలాడిన కోటప్పకొండ

కోటప్పకొండ(నరసరావుపేట), మార్చి 8: పల్నాడు జిల్లాలోని ప్రముఖ శైవక్షేత్రం కోటప్పకొండ శ్రీత్రికోటేశ్వరస్వామి సన్నిధి భక్తులతో కిటకిటలాడింది. లక్షలాది మంది భక్తులు కోటయ్యస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. శుక్రవారం తెల్లవారుజామున స్వామికి అభిషేకాలు అనంతరం ప్రత్యేక అలంకరణ చేశారు. అర్ధరాత్రి స్వామికి లింగోద్భవ అభిషేకాలు వైభవంగా జరిగాయి. తిరునాళ్లకు రాష్ట్ర పండుగ హోదా కల్పించటంతో ప్రభుత్వం తరఫున త్రికోటేశ్వరస్వామివారికి నరసరావుపేట ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పట్టు వస్త్రాలు, వెండి ప్రభ సమర్పించారు. ప్రభల పండుగగా పేరొందిన కోటయ్య తిరునాళ్లలో 21 భారీ విద్యుత్ ప్రభలు కొలువు తీరాయి. భక్తుల శివనామ స్మరణ కొండ ప్రాంతం అంతా మారుమోగింది. సాయంత్రం నుంచి భక్తుల రద్దీ అధికమై అర్ధరాత్రి వరకు కొనసాగింది. మంత్రి అంబటి రాంబాబు, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు స్వామిని దర్శించుకున్నారు.

దుర్గమ్మకు మంగళగిరి చేనేత పట్టు వస్త్రాలు

మంగళగిరి, మార్చి 8: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా బెజవాడ కనకదుర్గ అమ్మవారికి శ్రీశివభక్త మార్కండేయ వంశీకులు శుక్రవారం పట్టు వస్త్రాలను సమర్పించారు. మంగళగిరిలో భక్త మార్కండేయ ట్రస్టు ఆధ్వర్యంలో చేనేత మగ్గాలపై వారం రోజులపాటు భక్తిశ్రద్ధలతో ఈ వస్త్రాలను ప్రత్యేకంగా తయారు చేయించారు. మహాశివరాత్రి పురస్కరించుకొని శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి వార్ల కల్యాణ మహోత్సవం సందర్భంగా ఆనవాయితీ ప్రకారం పట్టు వస్త్రాలు, పసుపు, కుంకుమ, గాజులు, విభూది, ఫల పుష్పాలతో కూడిన 11 రకాల సంప్రదాయ వెదురు పళ్లేలతో సమర్పించారు.



శ్రీశైలంలో సంధ్యవేళ కొనసాగుతున్న మల్లికార్జున స్వామి ప్రభోత్సవం, (ఇన్‌సెట్‌లో) నందివాహనసేవపై భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లు



విద్యుత్ వెలుగులతో తళుకులీనుతున్న కోటప్పకొండ ఆలయం

రేపటి నుంచి
గ్రానైట్ పరిశ్రమల మూత

జగన్ ప్రభుత్వ నిర్వాకంతో 50 కోట్లకు మునిగిపోయాం.. భూసర్వే రాళ్లు తయారుచేశాం.. ఇప్పటికి ఒక్కటీ కొనలేదు

- విద్యుత్ చార్జీలు పెంచేశారు
- రాయల్టీ తగ్గించినా అమలేదీ?
- ఇచ్చిన హామీలు నెరవేర్చండి
- సీఎంకు యజమానుల వినతి
- ఇదేబాటలో బల్లికురవ కూడా



మీడియాతో మాట్లాడుతున్న మార్టూరు గ్రానైట్ సంఘం అధ్యక్షుడు పత్తిపాటి సురేశ్, సభ్యులు

మార్టూరు, మార్చి 8: ఉమ్మడి ప్రకాశం జిల్లాలో గ్రానైట్ పరిశ్రమ జగన్ ప్రభుత్వ నిర్వాకంతో సంక్షోభంలో కూరుకుపోయింది. మార్కెట్ ప్రతికూలత, జగన్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడం, సమస్యల పరిష్కారానికి చొరవచూపకపోవడం యజమానులను కోలుకోలేని దెబ్బతీశాయి. ఈ నేపథ్యంలో పరిశ్రమలను మూసివేయాలని మార్టూరు గ్రానైట్ ఫ్యాక్టరీ యజమానుల సంఘం నిర్ణయించింది. దీంతో ఆదివారం నుంచి అసోసియేషన్ పరిధిలోని దాదాపు 200 గ్రానైట్ పరిశ్రమలు మూతపడనున్నాయి. శుక్రవారం మార్టూరులోని గ్రానైట్ పరిశ్రమల యజమానుల సంఘం అధ్యక్షుడు పత్తిపాటి సురేశ్, సంఘం సభ్యులు మీడియాతో మాట్లాడుతూ పరిశ్రమలను మూసివేయడానికి కారణాలను వివరించారు. కొన్నేళ్లుగా తాము సమస్యల ఊబిలో కూరుకుపోయామని పేర్కొన్నారు. తాము తాత్కాలికంగానైనా బయటపడతామన్న ఆశతో సుమారు రూ.50 కోట్ల విలువైన జగనన్న భూసర్వే హద్దు రాళ్లను గ్రానైట్ పరిశ్రమల్లో కటింగ్ చేశామని తెలిపారు. ప్రస్తుతం వాటిని ప్రభుత్వం తరఫున తీసుకునే నాథుడే కరువయ్యారని వాపోయారు. దీనికితోడు ప్రభుత్వం విద్యుత్ చార్జీ యూనిట్ ధర రూ.5.50 నుంచి ఏకంగా రూ.9కి పెంచిందన్నారు. జిల్లాల విభజన సమయంలో కొత్తగా ఏర్పడిన కొన్ని జిల్లాలకు రాయల్టీ ధరను ప్రభుత్వం తగ్గించిందని తెలిపారు. దీంతో మార్టూరు ప్రాంతంలోని పరిశ్రమలో ఒక బ్లేడుకు రాయల్టీ రూ.27 వేల నుంచి రూ.22 వేలకు తగ్గిస్తారని ఆశించామన్నారు. కానీ, ప్రభుత్వం పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇతర దేశాలకు ఎగుమతులు చేసే చీమకుర్తి గెలాక్సీ గ్రానైట్‌కు, మార్టూరులో మూడో రకం స్టీల్‌గ్రేకు ఒకేరకంగా రూ.27 వేలు మైనింగ్ రాయల్టీ వసూలు చేయడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. అంతేగాకుండా పరిశ్రమలు నిర్మించిన వారికి ప్రభుత్వం నుంచి రావలసిన పావలా వడ్డీ, పవర్ సబ్సిడీ, ఇతరత్రా రాయితీలు ఇంతవరకు పూర్తిగా అందలేదన్నారు. గతంలో కరోనా సమయంలో మూడు నెలలు విద్యుత్ సర్వీసు చార్జీలను తొలగిస్తామని చెప్పిన ప్రభుత్వం వాటి ఊసే మర్చిపోయిందన్నారు. ఇక మార్కెట్‌లో ధర లేకపోవడం, కొనుగోలుదారులు రాకపోవడం, కూలీల కొరత తదితర సమస్యలు తమను కోలుకోలేని దెబ్బతీశాయని చెప్పారు. ప్రభుత్వం తమ సమస్యల పట్ల సానుకూలంగా స్పందిస్తేనే గ్రానైట్ పరిశ్రమ మనుగడ సాగిస్తుందని యజమానులు అన్నారు. అప్పటివరకు పరిశ్రమలను మూసివేయడమే మార్గమని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. కాగా, బల్లికురవ మండల పరిధిలోని గ్రానైట్ పరిశ్రమలను కూడా ఈనెల 10 నుంచి మూసివేస్తున్నట్లు అక్కడి యజమానుల అసోసియేషన్ అధ్యక్షుడు చిట్టిపోతు మస్తానయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తమ ప్రాంతంలోని గ్రానైట్ పరిశ్రమ యజమానులతో చర్చించి ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు.

తనిఖీల దెబ్బ!

జగన్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చకపోగా గ్రానైట్ పరిశ్రమలపై ప్రభుత్వం పగబట్టినట్టు వ్యవహరిస్తోంది. ముఖ్యంగా టీడీపీ నేతల గ్రానైట్ క్వారీలు, ఫ్యాక్టరీలే టార్గెట్‌గా విజిలెన్స్ తనిఖీలకు సిద్ధమైనట్లు సమాచారం. ఈ క్రమంలో రాష్ట్రంలోని పలు జిల్లాల అధికారులతో ఒక్కో బృందంలో ఏడుగురు చొప్పున 2 బృందాలను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. ఈ నెల 11 నుంచి బాపట్ల జిల్లా పరిధిలోని బల్లికురవ, సంతమాగులూరు, మార్టూరు మండలాల్లోని గ్రానైట్ క్వారీలు, ఫ్యాక్టరీలను ఈ బృందాలు తనిఖీ చేయనున్నాయి. పరిశ్రమల మూసివేతకు ఇది కూడా కారణమని తెలుస్తోంది.

పతనావస్థలో ప్రజాస్వామ్యం

- ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేద్దాం
- ఓటు వేయాలని నిమ్మగడ్డ పిలుపు



నంద్యాలలో మాట్లాడుతున్న నిమ్మగడ్డ రమేశ్ కుమార్

నంద్యాల, మార్చి 8: రాష్ట్రంలో ప్రజాస్వామ్యం పతనావస్థలో ఉందని సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ఎన్నికల మాజీ కమిషనర్ నిమ్మగడ్డ రమేశ్ కుమార్ అన్నారు. సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ ఆధ్వర్యంలో 'ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేద్దాం - ఓటు వేద్దాం' రాష్ట్ర స్థాయి కళాజాత శుక్రవారం నంద్యాల జిల్లా కేంద్రంలోని రామకృష్ణ డిగ్రీ కళాశాల వివేకానంద ఆడిటోరియంలో జరిగింది. ఈ కార్యక్రమానికి అతిథిగా హాజరైన నిమ్మగడ్డ మాట్లాడుతూ.. 'రాజ్యాంగం, ప్రజాస్వామ్యం మన దేశ సంస్కృతికి, పౌర సమాజానికి ఆదర్శప్రాయం. కానీ రాష్ట్రంలో అలాంటి వాతావరణం మచ్చుకైనా కనబడటం లేదు. రాష్ట్ర రాజకీయాలలో విష సంస్కృతి తయారైంది. రానున్న ఎన్నికలు రాష్ట్రంలో యుద్ధ వాతావరణంలో జరగనున్నాయి. గతంలో తిరుపతి పార్లమెంట్ ఉప ఎన్నికల్లో జరిగిన పరిణామాలు రాజ్యాంగ విరుద్ధంగా జరిగాయి. ఒకే నియోజకవర్గంలో 35 వేల దొంగ ఓట్లు ఉంటే రాష్ట్ర ఎన్నికల యంత్రాంగం ఏం చేస్తోంది? ఒక అసెంబ్లీ స్థానంలోనే అన్ని దొంగ ఓట్లు ఉంటే రాష్ట్ర వ్యాప్తంగా ఎన్ని లక్షల దొంగ ఓట్లు నమోదు చేసి ఉంటారో ఊహించవచ్చు. దీనిపై ఎన్నికల యంత్రాంగం నిష్పక్షపాతంగా చర్యలు తీసుకోకపోవడం బాధాకరం. ప్రజాస్వామ్యంలో వలంటీర్ వ్యవస్థకు చట్టబద్ధత లేకున్నా ఓటర్ల వ్యక్తిగత విషయాలు చేపట్టడం రాజ్యాంగ విరుద్ధం. ఎన్నికల విధుల్లో వలంటీర్ వ్యవస్థ సేవలను వినియోగించవద్దని కోర్టు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినప్పటికీ ఎన్నికల అధికారి ఎందుకు స్పందించలేదు? కలెక్టర్లకు ఎందుకు ఆదేశించలేదు?' అని నిమ్మగడ్డ ప్రశ్నించారు. అనంతరం ప్రముఖ ప్రజా గాయకుడు మహమ్మద్ మియా ఓటర్లను చైతన్యపరిచే పాటలు పాడారు. కళాకారులు నృత్యాలు ప్రదర్శించారు. కార్యక్రమంలో సిటిజన్ ఫర్ డెమోక్రసీ సంయుక్త కార్యదర్శి వల్లంరెడ్డి లక్ష్మీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అద్దంకిలో పల్నాడు జిల్లా ఓట్లు!

- ఓటరు నమోదులో చిత్ర విచిత్రాలు
- ఎమ్మెల్యే రవికుమార్ ఫిర్యాదుతో గుట్టు రట్టు
- నివేదిక కోరిన రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి

అద్దంకి, మార్చి 8: రాష్ట్రంలో ఓట్ల నమోదులో చిత్ర విచిత్రాలు వెలుగు చూస్తున్నాయి. బాపట్ల జిల్లా అద్దంకి నియోజకవర్గంలో పల్నాడు జిల్లాకు చెందిన వారి ఓట్లు నమోదయ్యాయి. స్థానిక టీడీపీ ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారికి ఫిర్యాదు చేయడంతో ఈ వ్యవహారం రట్టయింది. అసలేం జరిగిందంటే.. వైసీపీ అద్దంకి నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా పల్నాడు జిల్లా పెదకూరపాడు నియోజకవర్గం దొడ్లేరుకు చెందిన పాణెం హనిమిరెడ్డిని గత డిసెంబరులో నియమించారు. ఈనేపథ్యంలో దొడ్లేరుకు చెందిన హనిమిరెడ్డి కుటుంబసభ్యులు, బంధువులకు చెందిన 19 మంది ఓట్లను నిబంధనలకు విరుద్ధంగా అద్దంకి నియోజకవర్గంలో ఓటర్లుగా చేర్పించారు. దీనిపైనే ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారికి ఫిర్యాదు చేశారు. దీనిపై మూడు రోజుల్లో నివేదిక అందజేయాలని స్థానిక అధికారులను ఎన్నికల ప్రధానాధికారి ఆదేశించారు. ఆమేరకు గతనెల 29వ తేదీన ఉత్తర్వులు అందాయి. కానీ ఇప్పటి వరకూ నివేదిక పంపలేదు. అందుకు కారణం ఏమిటని పలువురు టీడీపీ నేతలు.. రాజకీయ పార్టీలతో ఈసీ గురువారం జరిపిన సమావేశంలో ప్రశ్నించారు. ఆలస్యం చేస్తే మరోసారి ఎన్నికల ప్రధానాధికారి దృష్టికి తీసుకెళ్లడంతోపాటు కోర్టును కూడా ఆశ్రయించేందుకు టీడీపీ నేతలు సిద్ధమవుతున్నారు. ఓట్ల చేర్పులకు ప్రధాన మూలం అయిన ఆధార్‌కార్డు మార్పునకు ఇద్దరు అధికారులు బాధ్యులుగా ఉన్నట్లు తెలుస్తోంది. వెంటనే నివేదిక అందజేయాల్సి రావటంతో వారిలో వణుకు మొదలైనట్లు తెలుస్తోంది.

బాబ్బాబ్బాబు..

ఎమ్మెల్యే రవికుమార్‌ను సదరు ఇద్దరు అధికారులు చిలకలూరిపేట వెళ్లి కలిసినట్టు తెలుస్తోంది. ఎలాగైనా ఈ గండం నుంచి గట్టెక్కించాలని ప్రాధేయపడినట్టు సమాచారం. అన్ని విషయాల్లో చూసీచూడనట్టు వెళ్లే ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్.. ఈవిషయంలో మాత్రం ఒకింత కఠినంగానే వ్యవహరించినట్టు సమాచారం. 'ఉద్యోగాలు పోతాయని చెబుతున్నారు. అలాంటప్పుడు తప్పుచేసే ముందు ఆలోచించాలి కదా..' అని తనను కలిసిన వారితో ఆయన ఉన్నట్టు తెలిసింది. ఓట్ల నమోదులో గోల్‌మాల్‌పై స్వయంగా ఫోన్ చేసినా ఇదే అధికారులు అప్పట్లో నిర్లక్ష్యంగా సమాధానం చెప్పిన విషయాన్ని కూడా ఆయన గుర్తుచేసినట్టు సమాచారం. సరిగ్గా నివేదిక ఇవ్వాలని, మరోసారి తప్పు చేస్తే మరికొన్ని ఆధారాలతో మరోసారి ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్తానని, అవసరమైతే న్యాయస్థానాన్ని కూడా ఆశ్రయిస్తామని వారిని ఆయన హెచ్చరించినట్టు సమాచారం.

బీఎల్‌వోలపై సీరియస్

విషయం తెలుసుకున్న మిగిలిన అధికారులు...ప్రస్తుతం తమకు అందుతున్న ఫాంలు, సెల్ఫ్ ఫాంల విచారణలో అప్రమత్తంగా ఉండాలని భావిస్తున్నారని తెలుస్తోంది. అయితే ఇప్పటికే అందిన దరఖాస్తులపై విచారణ సక్రమంగా చేయనట్టు గుర్తించిన ఉన్నతాధికారులు....బీఎల్‌వోలపై సీరియస్ అయినట్టు సమాచారం. వైసీపీ శ్రేణుల ఒత్తిడికి తలొగ్గి చేసిన తప్పులు ఇప్పుడు, తమ మెడకే చుట్టుకునే పరిస్థితులు రావడంతో పలువురు అధికారుల్లో ఆందోళన మొదలైంది. తప్పుచేసిన అధికారులకు ఒకసారి శిక్షపడే విధంగా చేస్తే మిగిలిన వారు భయపడతారని, అలా కాకుండా ఉదాసీనంగా వ్యవహరిస్తే మరిన్ని అక్రమాలకు పాల్పడే అవకాశం ఉందని పలువురు టీడీపీ నేతలు అభిప్రాయపడుతున్నారు.

బాకా రాయుళ్లకే బదిలీలు!

- కొత్త పోస్టులు సృష్టించి మరీ భజన పరులకు అందలాలు
- గత సీఎస్ శర్మ కాదన్నారు
- ప్రస్తుత సీఎస్ చేసేశారు
- సజ్జల ఓఎస్డీకీ సానుకూల బదిలీ
- రాష్ట్రంలో అరాచక పోస్టింగులు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో ఉద్యోగుల బదిలీ వ్యవహారం రచ్చకెక్కుతోంది. తనకు భజన చేసేవారి బదిలీల విషయంలో కరుణ కురిపిస్తున్న సీఎం జగన్.. తమ పిల్లలు పొరుగు రాష్ట్రంలో ఉన్నారని, తాము ఇక్కడ మగ్గుతున్నామని.. తమను కూడా బదిలీ చేయాలని వేడుకుంటున్న వేతన జీవుల వేదనను ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. రాష్ట్రంలో పనిచేస్తున్న ఉద్యోగుల్లో దాదాపు 2,000 మందికి సంబంధించి వారి భార్య లేదా భర్త, పిల్లలు హైదరాబాద్‌లో ఉంటున్నారు. నిబంధనల ప్రకారం తమను తెలంగాణకు పంపమని దరఖాస్తులు పెట్టుకున్నారు. అంతేకాదు సీఎస్ కార్యాలయం చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు. అయినప్పటికీ జగన్ ప్రభుత్వం వారిని కనికరించడం లేదు.

చరిత్రలో మొదటిసారి

- దారా శ్రీను.. 2014లో యూపీఎస్సీ స్పెషలైజ్డ్ నోటిఫికేషన్ ద్వారా అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్‌గా కేంద్ర కార్మిక శాఖలో చేరారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక 2019, జూన్ 12న డిప్యూటేషన్‌పై అప్పటి వ్యవసాయ శాఖ మంత్రి కన్నబాబు దగ్గర ఓఎస్డీగా చేరారు. ప్రస్తుతం మంత్రి జోగి రమేశ్ దగ్గర ఓఎస్డీగా చేస్తున్నారు. కన్నబాబు దగ్గర ఓఎస్డీగా ఉన్నప్పుడే, తనను సెంట్రల్ సర్వీస్ నుంచి స్టేట్ సర్వీస్‌లోకి మార్చమని, ఇకపై అక్కడే కొనసాగుతానని కోరారు. ఈ మేరకు అనుమతి కోరుతూ అప్పటి సీఎస్ సమీర్‌శర్మకు ప్రతిపాదన పంపారు. దీనిపై సమీర్ శర్మ సీరియస్ అయ్యారు. సెంట్రల్ సర్వీస్ నుంచి స్టేట్ సర్వీస్‌లోకి తీసుకునేందుకు నిబంధనలు లేవన్నారు. ఒకవేళ దీన్ని ఆమోదిస్తే చరిత్రలో ఇలా జరిగిన మొదటి కేసు ఇదే అవుతుందని కూడా పేర్కొన్నారు. సదరు ప్రతిపాదనను తిరస్కరించారు. సమీర్ శర్మ రిటైర్ అయ్యారు. కన్నబాబు మాజీ అయ్యారు. ఇప్పుడు జోగి రమేశ్ ద్వారా సీఎం నుంచి సీఎస్ వరకు చక్రం తిప్పి ప్రస్తుత సీఎస్ జవహర్‌రెడ్డి హయాంలో ఈ ప్రతిపాదనను ఓకే చేయించుకున్నారు. ఒక సీఎస్ తిరస్కరించిన ప్రతిపాదనను యథాతథంగా మరో సీఎస్ ఆమోదించడం గమనార్హం. ఇప్పుడు ఆ ప్రతిపాదనను ఆగమేఘాలపై కేబినెట్ షార్ట్ సర్క్యులేషన్‌కి పంపారు. దీనికి సంబంధించి తాజాగా గురువారం(7వ తేదీ) జీవో విడుదలైంది. దారా శ్రీను కోసం కార్మిక శాఖలో అదనపు కమిషనర్ పోస్టును కొత్తగా క్రియేట్ చేశారు.

సజ్జల ఓఎస్డీపై కురిసిన కరుణ

- ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డికి ఓఎస్డీగా పనిచేస్తున్న దశరాథరామిరెడ్డిని తెలంగాణలోని జైళ్ల శాఖ నుంచి ఏపీలోని మున్సిపల్ శాఖలో కమిషనర్‌గా(సెలక్షన్ గ్రేడ్) నియమించారు. దశరథరామిరెడ్డి తెలంగాణ స్థానికత ఉన్న ఉద్యోగి. తెలంగాణ జైళ్ల శాఖలో సూపరింటెండెంట్‌గా ఉన్నారు. స్థానికత ఆధారంగా దశరాథరామిరెడ్డిని ఏపీ రీఆర్గనైజేషన్ కమిటీ తెలంగాణకు కేటాయించింది. కానీ, జగన్‌కి వీరవిధేయుడు, భజనపరుడు కావడంతో నిబంధనలను తుంగలో తొక్కి సజ్జలకు ఓఎస్డీగా నియమించారు. గత ఏడాది నవంబరు 23న జీవో 146 ద్వారా మునిసిపల్ కమిషనర్(సెలక్షన్ గ్రేడ్)గా నియమించారు.
- తెలంగాణ, ఏపీ ప్రభుత్వాల సీఎస్‌ల ఆధ్వర్యంలో కమిటీలు వేసి ఉద్యోగుల బదిలీ విషయంలో నిబంధనలు ఖరారు చేశారు. దీంతో సుమారు 2,000 మందికి పైగా ఉద్యోగులు ఏపీ నుంచి తెలంగాణకు వెళ్లడానికి దరఖాస్తులు పెట్టుకున్నారు. గతేడాది సీఎస్ సమీర్ శర్మ వీరందరినీ తెలంగాణకు పంపడానికి నిరభ్యంతర పత్రం కూడా ఇచ్చారు. కానీ, అది జరగలేదు. దీంతో, ఉద్యోగులంతా గంపగుత్తగా కాకుండా విడివిడిగా వారి కుటుంబసమస్యలు చెప్పుకొంటూ సీఎస్‌కి దరఖాస్తు చేసుకున్నారు. స్థానిక ఎమ్మెల్యేలు, మంత్రుల సిఫారసులు కూడా తెచ్చుకున్నారు. కానీ, 7 నెలల నుంచి ఈ దరఖాస్తులన్నీ సీఎస్ వద్దే పెండింగ్‌లో ఉన్నాయి. ఉత్తరాంధ్రకు చెందిన ఒక మంత్రి సీఎస్ జవహర్ రెడ్డిని ఉద్యోగుల తరఫున ఈ విషయం అడగ్గా, విడివిడి దరఖాస్తులు కూడా ఆమోదించబోనని చెప్పినట్టు తెలిసింది. కానీ, దశరథరామిరెడ్డికి మాత్రం ఈయనే పోస్టింగ్ ఇవ్వడం విశేషం. 2,000 మంది ఉద్యోగుల దరఖాస్తులు మాత్రం 7 నెలల నుంచి సీఎస్ వద్ద పడున్నాయి. పైగా తదుపరి కన్‌ఫర్డ్ ఐఏఎస్‌ల జాబితాలో తన పేరు ఉంటుందని దశరథరామిరెడ్డి ప్రచారం చేసుకోవడం గమనార్హం.

నీరజా రెడ్డికి రెడ్ కార్పెట్

- తెలంగాణలో ఎంప్లాయిమెంట్ జేడీగా నీరజారెడ్డి, ఏపీలోని ప్రోటోకాల్ శాఖ డిప్యూటీ సెక్రటరీ బాలసుబ్రహ్మణ్యం రెడ్డి సతీమణి. ఆమెను ఏపీకి తీసుకురావడానికి రెడ్‌కార్పెట్ పరిచారు. ఏపీ ఎంప్లాయ్‌మెంట్ శాఖలో కొత్త జేడీ పోస్టు సృష్టించి మరీ ఆమెను ఆహ్వానించారు. బాలసుబ్రహ్మణ్యం రెడ్డి జగన్ మనిషి అనే విషయం తెలిసిందే.
- గజ్జల పవన్‌కుమార్ రెడ్డి ఒక జిల్లా స్థాయి ఉద్యోగి. డివిజనల్ అకౌంట్స్ అధికారి. ఈయనను నేరుగా రాష్ట్ర సచివాలయంలోని రెవెన్యూ శాఖలో ఎస్‌వోగా నియమించారు. జిల్లా కేడర్ ఉద్యోగిని, రాష్ట్ర కేడర్‌లోకి తీసుకోవడం ప్రెసిడెన్షియల్ ఆర్డర్‌కి విరుద్ధం. అయితే, ఈయన సీఎంవో అధికారి ధనుంజయ్ రెడ్డికి బంధువు కావడం.. పెద్దల కనికరానికి కలిసి వచ్చింది.
- రాష్ట్రవ్యాప్తంగా వందల సంఖ్యలో ఒక శాఖ నుంచి ఇంకో శాఖకు కన్వర్షన్స్ జరిగాయి. ఉదాహరణకు, హెల్త్ అసిస్టెంట్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న ఉద్యోగిని మునిసిపల్ డిపార్ట్‌మెంట్‌లో అసిస్టెంట్ ఇంజనీర్‌గా తీసుకురావడం, జైళ్ల శాఖలో పనిచేసే ఉద్యోగిని మరో శాఖలోకి తరలించడం వంటివి చకచకా జరిగిపోయాయి. అయితే.. వీరంతా వైసీకి వీర విధేయులుగా గుర్తింపు తెచ్చుకోవడం గమనార్హం.

నడిరోడ్డుపై బోటు దహనం

- కాకినాడ జిల్లాలో మత్స్యకారుల భారీ ఆందోళన
- సముద్రంలో ఫార్మా పైప్‌లైన్లు తొలగించాలని డిమాండ్



కోనపాపపేటలో బోటును దహనం చేసి నిరసన తెలుపుతున్న మత్స్యకారులు

కోనపాపపేట(కొత్తపల్లి), మార్చి 8: కాకినాడ సెజ్‌లోని ఫార్మా కంపెనీల నుంచి వెలువడే వ్యర్థాలను విడుదల చేసేందుకు సముద్రంలో ఏర్పాటు చేసిన పైప్‌లైన్లను వెంటనే తొలగించాలని మత్స్యకారులు డిమాండ్ చేశారు. కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం పొన్నాడ శివారు కోనపాపపేటలో శుక్రవారం ఆందోళన చేపట్టారు. సమస్యను తక్షణం పరిష్కరించకుంటే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరిస్తూ నడిరోడ్డుపై బోటును దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. పలువురు మత్స్యకారులు ఒంటిపై పెట్రోలు పోసుకొని నిప్పు పెట్టుకొనేందుకు యత్నించారు. మత్స్యకార పెద్దలు వారిని అడ్డుకున్నారు. పైప్‌లైన్ల కప్లింగ్‌లకు చిక్కుకొని తమ వలలు పాడైపోతున్నాయని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యను పరిష్కరించే వరకు రోజూ నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు. పైప్‌లైన్లు తొలగించాలని మూడురోజులుగా ఆందోళనలు చేపడుతున్నా అధికార, ప్రతిపక్ష నాయకులు కనీసం స్పందించలేదని, వచ్చే ఎన్నికల్లో ఏ పార్టీకి ఓటు వేయబోమని మత్స్యకారులు హెచ్చరించారు. అనంతరం కోనపాపపేట మూడు రోడ్ల కూడలి, ప్రధాన రహదారిలో సిమెంటు బెంచీలు అడ్డంగా వేసి నిరసన తెలిపారు. దీంతో తుని- కాకినాడ బీచ్ రోడ్డులో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. కోనపాపపేట నడిరోడ్డులో దహనం చేసిన ఫైబర్ బోటు నుంచి వచ్చిన మంటలు, దట్టమైన పొగ గ్రామమంతా వ్యాపించాయి. కాగా, టీడీపీ పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి ఎస్వీఎస్ఎన్ వర్మ సాయంత్రం మత్స్యకారుల ఆందోళనకు మద్దతు తెలిపారు.

అలల వంతెన చెల్లాచెదురు..!

- మరో మూడు ముక్కలైన ఫ్లోటింగ్ బ్రిడ్జి

విశాఖపట్నం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): భారీ అంచనాలు, అంతకువించిన ప్రచారంతో వైసీపీ ప్రభుత్వం చేపట్టిన అలల వంతెన ముక్కలు ముక్కలుగా విడిపోయి చెల్లాచెదురైంది. విశాఖ నగరంలోని రామకృష్ణా బీచ్‌లో ఏర్పాటుచేసిన ఫ్లోటింగ్ బ్రిడ్జి ఇప్పటికే.. 100 మీటర్ల పొడవైన ముక్కగా, టి జంక్షన్ వ్యూ పాయింట్ మరో ముక్కగా సముద్రంలో తేలియాడుతున్న సంగతి తెలిసిందే. తాజాగా ఇది మరో మూడు ముక్కలైంది. అందులో రెండు ఒడ్డున ఇసుకలో, మరొకటి సముద్రంలో తేలియాడుతున్నాయి. టి జంక్షన్ వ్యూ పాయింట్‌తో కూడిన మరో ముక్క కూడా సముద్రంలో విడిగా దూరంగా ఉంది. విశాఖపట్నం మెట్రోపాలిటన్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ (వీఎంఆర్‌డీఏ) ఇప్పటివరకు చేపట్టిన ప్రాజెక్టుల్లో అత్యంత వివాదాస్పదమైంది ఇదే కావడం గమనార్హం. దీనికి ఎవరి నుంచీ అనుమతులు తీసుకోలేదు. తీరం లోతు, అలల తీవ్రత వంటి వాటిపై అధ్యయనం చేయకుండానే దీని నిర్మాణం పూర్తిచేశారు. తీరా ప్రాజెక్టును ప్రారంభించాక అది రెండు ముక్కలవడంతో మాక్ డ్రిల్స్ అంటూ డ్రామాలాడుతున్నారు. సముద్రంలో అలజడి తగ్గితే మళ్లీ అలలపై సయ్యాట మొదలుపెడతామని ప్రయోగాలు చేస్తూనే ఉన్నారు. ఎవరూ లేని సమయంలో ఆ ఫ్లోటింగ్ బ్రిడ్జిపై ఎవరైనా ఎక్కి సెల్ఫీ దిగాలని ప్రయత్నిస్తే సముద్రంలో పడిపోయే ప్రమాదం ఉంది. అలాంటిదేమైనా జరిగితే దానికి వీఎంఆర్‌డీఏ కమిషనర్ బాధ్యత వహిస్తారా..?, ఎటువంటి అనుమతులు లేకుండా ప్రాజెక్టు పెట్టారని కాంట్రాక్టర్‌పై నెపం నెడతారా..? అని పర్యాటకులు ప్రశ్నిస్తున్నారు. గత రెండు వారాల్లో ఒక్కరోజు కూడా స్థిరంగా లేని ఆ ఫ్లోటింగ్ బ్రిడ్జిని పట్టుకొని వేలాడుతున్న వీఎంఆర్‌డీఏ అధికారుల తీరును ప్రభుత్వ పెద్దలు కూడా ప్రశ్నించకపోవడం గమనార్హం.

'వందేభారత్' రైలులో సమస్య

- వేరే రైలులో ప్రయాణికుల తరలింపు

విశాఖపట్నం, మార్చి 8(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం-సికింద్రాబాద్ మధ్య నడిచే వందేభారత్ రైలులో శుక్రవారం సాంకేతిక లోపం తలెత్తింది. విశాఖలో ఉదయం 5.45 గంటలకు బయలుదేరి మధ్యాహ్నం 2.30 గంటలకు సికింద్రాబాద్‌కు చేరే రైలులోని 16 కోచ్‌ల్లో ఎనిమిదిట్లో శుక్రవారం ఏసీ పనిచేయలేదు. దీంతో సగం బోగీలతో పంపలేక దానిని ఆపేశారు. ఎల్‌హెచ్‌బీ కోచ్‌లతో వేరే రైలును ఉదయం 7.30 గంటలకు విశాఖ నుంచి పంపించారు. అందులో సుమారుగా వేయి మంది వరకు ప్రయాణికులు ఉన్నారు. వందేభారత్ గంటకు 130 కి.మీ.కు పైగా వేగంతో ప్రయాణిస్తుంది. ప్రయాణికులకు ఉదయం టిఫిన్, కాఫీ, మధ్యాహ్నం భోజనం కూడా సరఫరా చేస్తారు. ఇన్ని సదుపాయాలు ఉండడంతో ఆ రైలు టికెట్ ధర అధికం. అయితే శుక్రవారం ఆ రైలుకు సమస్య వచ్చి ఆపేయడం, వేరే రైలులో ప్రయాణికులను పంపడం వల్ల సౌకర్యాలలో లోపం ఏర్పడింది. దీంతో పలువురు ప్రయాణికులకు టికెట్ ధరలో 20 నుంచి 30 శాతం మొత్తం వెనక్కి ఇచ్చినట్టు రైల్వే వర్గాలు తెలిపాయి. విశాఖ నుంచి వెళ్లిన రైలే సికింద్రాబాద్ నుంచి తిరిగి మధ్యాహ్నం అటునుంచి బయలుదేరి రాత్రి 11.15 గంటలకు విశాఖపట్నం రావాలి. అయితే ప్రత్యామ్నాయంగా పంపిన రైలు ఆ వేగంతో సికింద్రాబాద్‌కు చేరకపోవడం వల్ల అటు నుంచి విశాఖ రావలసిన వారు ఇబ్బందిపడ్డారు.

విశాఖకు మరో వందేభారత్ రైలు

- 12న ప్రధాని చేతుల మీదుగా ప్రారంభం
- భువనేశ్వర్ లేదా ఖుర్దా నుంచి రాకపోకలు

విశాఖపట్నం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం ప్రయాణికులకు మరో వందేభారత్ రైలు అందుబాటులోకి రానుంది. తూర్పు కోస్తా రైల్వే జోన్‌లోని భువనేశ్వర్ లేదా ఖుర్దా రోడ్ నుంచి విశాఖపట్నం వరకూ ఈ రైలును నడపనున్నారు. దీని రంగు ప్రస్తుత వందేభారత్‌లకు భిన్నంగా.. తెలుపు-నీలం రంగు కాకుండా నలుపు-ఆరెంజ్ రంగులో ఉంది. ఈ రైలును శుక్రవారం ట్రయల్ రన్ నడిపారు. ఖుర్దా రోడ్డు నుంచి ఉదయం 10.30 గంటలకు విశాఖపట్నం వచ్చింది. గంట సేపు స్టేషన్‌లోనే ఉంచారు. ఇది ఏయే స్టేషన్ల మధ్య, ఏయే సమయాల్లో నడుస్తుందనే వివరాలపై స్పష్టత లేదని రైల్వే వర్గాలు తెలిపాయి. ఈ నెల 12న ప్రధాని నరేంద్రమోదీ ఆన్‌లైన్‌లో ప్రారంభిస్తారని వెల్లడించాయి.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

హర..హర.. మహాదేవ!

దుర్గగుడిలో మహాశివరాత్రి ఉత్సవ శోభ



ఇంద్రకీలాద్రిపై కోలాట నృత్యం చేస్తున్న కళాకారిణులు



ఆధ్యాత్మిక ప్రసంగం చేస్తున్న ప్రవచనకారుడు ధూళిపాళ రామకృష్ణ

వన్‌టౌన్, మార్చి 8: మహాశివరాత్రి సందర్భంగా దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉత్సవ శోభతో ఆధ్యాత్మిక సొబగులు వెదజల్లాయి. కృష్ణాజిలా కాటూరు గ్రామానికి చెందిన ఈశ్వర భక్త సమాజం భక్తి గీతాలాపన భక్తులను ఆకట్టుకుంది. విజయవాడకు చెందిన మణికర్ణిక కోలాట బృందం 20 మంది వివిధ కీర్తనలకు కోలాట ప్రదర్శన ఇచ్చింది. వాగ్దేవి కూచిపూడి నృత్యాలయం సప్పా శివ కుమార్ ఆధ్వర్యంలో 15 మంది కూచిపూడి నృత్యం ప్రదర్శించారు. వివిధ కీర్తనలకు చక్కటి హావభావాలను ప్రదర్శించి అలరించారు. ప్రవచకుడు ధూళిపాళ రామకృష్ణ శివ మహిమ వైభవం గురించి ఆధ్మాత్మిక ప్రసంగం చేశారు. దుర్గమ్మను శుక్రవారం మంత్రి కారుమూరి నాగేశ్వరరావు దంపతులు, కుటుంబ సభ్యులు దర్శించుకున్నారు. వారికి ఆలయ అధికారులు సాదర స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనం అనంతరం ఆయనకు ప్రసాదం, శేషవస్త్రం, ఆశీస్సులు అందించారు.



స్వామి దర్శనానికి క్యూలైన్లలో వెళుతున్న భక్తులు

నేడు కెనాల్‌రోడ్డులో రథోత్సవం

వన్‌టౌన్: కన్యకాపరమేశ్వరి అన్నసత్రం కమిటీ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం 5.30 గంటల నుంచి కెనాల్‌రోడ్డులో రథోత్సవం నిర్వహించనున్నారు. దుర్గామల్లేశ్వర దేవస్థానం నుంచి గంగ, పార్వతి, మల్లేశ్వరులు, పాతశివాలయం నుంచి భ్రమరాంబ మల్లేశ్వరులు భద్రకాళి వీరభద్రస్వామి, బుద్ధవారి గుడి నుంచి గంగ, పార్వతి, మల్లికార్జున స్వామి ఉత్సవమూర్తులను రథంలో ఊరేగిస్తారు. సీపీ కాంతిరాణా రథోత్సవాన్ని ప్రారంభిస్తారు. మేళతా ళాలు, మంత్రోచ్ఛ రణల మధ్య బలిహరణలు సమర్పించాక ఊరేగింపు బయలుదేరుతుంది.

దుర్గమ్మ దర్శనానికి వచ్చిన వృద్ధురాలి మృతి

వన్‌టౌన్: ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మ దర్శనానికి వచ్చిన శ్రీకాకుళం జిల్లా శ్రీకాకుళం పట్టణంలోని సానావారి వీధికి చెందిన 85 ఏళ్ల వృద్ధురాలు శుక్రవారం మృతిచెందింది. కుమారుడు వంశీకృష్ణ, కోడలు, మనుమలు, మనుమరాళ్లు పది మంది కుటుంబసభ్యులతో పాటు దుర్గమ్మను దర్శించుకోవడానికి ఆమె వచ్చారు. మహామండపం వద్ద చెప్పులస్టాండు వద్దకు వచ్చేసరికి ఒక్కసారిగా కుప్పకూలి పోయింది. వన్‌టౌన్ సీఐ ధనశేఖరెడ్డి 108లో ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందింది. మృతదేహాన్ని శ్రీకాకుళానికి తీసుకువెళ్లారు.



డీఆర్వో చంద్రశేఖర్‌కు వినతిపత్రవిస్తున్న టీడీపీ నాయకులు

పోలింగ్ కేంద్రాల్లో వైసీపీ రంగులు తొలగించండి

● డీఆర్వో చంద్రశేఖర్‌కు టీడీపీ నాయకుల వినతి

హనుమాన్‌జంక్షన్‌రూరల్, మార్చి 8: గన్నవరం నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న 306 పోలింగ్ కేంద్రాల్లో మెజారిటీ భవనాలు, ఎంపీపీ స్కూళ్లు, హైస్కూళ్లు, అంగన్వాడీ కేంద్రాలకు వైసీపీ రంగులు వేసి ఉన్నాయని వెంటనే వాటిని తొలగించాలని కృష్ణాజిల్లా రిటర్నింగ్ అధికారి గీతాంజలి శర్మకు రాసిన వినతిపత్రాన్ని జిల్లా రెవెన్యూ అధికారి చంద్ర శేఖర్‌కు గురువారం టీడీపీ నాయకులు అందజేశారు. మచిలీపట్నంలో ఎన్నికల అధికారుల ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన రాజకీయ పార్టీల వర్క్‌షాప్‌లో టీడీపీ గన్నవరం నియోజకవర్గ పోల్ మేనేజ్ మెంట్ కో-ఆర్డినేటర్ ఆళ్ల గోపాలకృష్ణ, టీడీపీ నియోజకవర్గ ప్రతినిధి తంగిరాల శ్రీనివాసరావు పాల్గొన్నారు. పోలింగ్ కేంద్రాల్లో రాజ కీయ పార్టీల గుర్తులు, బొమ్మలు ఉండకూడదని, కానీ గన్నవరం నియోజక వర్గంలోని మెజారిటీ పోలింగ్ కేంద్రాల్లో ముఖ్యమంత్రి జగ న్‌ను కీర్తిస్తూ చిత్రపటాలు, వైసీపీ రంగులతో ఉన్నాయని వారు పేర్కొన్నారు. వాటిని తొలగించాలని గన్నవరం టీడీపీ- జనసేన అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు ఇప్పటికే కలెక్టర్, సీఈవో, ఆర్వో, ఈఆర్వోలకు రాతపూర్వ కంగా తెలియజేసినా స్థానిక అధికారులు ఇంతరవరకూ స్పందించలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఓటర్లు నిర్భయంగా తమ ఓటు హక్కు వి నియోగించుకునేలా చూడాలని అధికారులకు ప్రత్యేకంగా విన్నవించారు. తమ వినతిపత్రాన్ని పరిశీలించిన జిల్లా రెవెన్యూ అధికారి సాను కూలంగా స్పందించారని, సమస్యపై త్వరలోనే కార్యాచరణ ప్రకటిస్తామని హామీ ఇచ్చారని ఆళ్ల తెలిపారు. బత్తిన దాసు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

13న 'ప్రధాన మంత్రి సు-రాజ్'

● లబ్ధిదారులతో వర్చువల్‌గా మాట్లాడనున్న పీఎం మోదీ

కృష్ణలంక, మార్చి 8: భారత ప్రభుత్వ సామాజిక న్యాయం, సాధికారిత మంత్రిత్వ శాఖ అధ్వర్యంలో కృష్ణాజిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ఈ నెల 13వ తేదీ సాయంత్రం 4 గంటలకు కేంద్ర పథకాలైన ఎన్ఎస్ఎఫ్ డీసీ/ ఎన్ఎస్‌కేఎఫ్‌డీసీ/ ఎన్‌బీసీఎఫ్‌డీసీ/ ఎన్ఎంఎఎస్‌టీఈ పథకాల లబ్ధిదారులతో ప్రధాన మంత్రి సు-రాజ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని కృష్ణాజిల్లా షెడ్యూల్ కులాల సేవా సహకార సంస్థ కార్యనిర్వాహక సంచాలకులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపిక చేసిన లబ్ధిదారులతో ముఖాముఖిగా మోదీ మాట్లాడతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో కృష్ణాజిల్లాలో నమస్తే పథకం కింద ఎంపికైన సఫాయి కర్మచారీలకు వ్యక్తిగత భద్రత కిట్లను(పీపీఈ కిట్లు) ఆయుష్మాన్ కార్డులను పంపిణీ చేస్తారని పేర్కొన్నారు.

ఆదమరిస్తే..జేబులు ఖాళీ

● జంక్షన్ బస్టాండ్‌లో జేబుదొంగలు

హనుమాన్‌జంక్షన్, మార్చి 8: జంక్షన్ ఆర్టీసీ బస్టాండ్‌లో జేబు దొంగల బెడద ఎక్కువైంది. ప్రయాణికులు ఆదమరిస్తే జేబులు ఖాళీ అవుతున్నాయి. గుర్తుతెలియని వ్యక్తులు చోరీలు చేయడంతో ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. గురువారం స్థానిక ఏపూరు గ్రామానికి గిరిబాబు విజయవాడ వెళ్లేందుకు బస్సు ఎక్కుతుండగా గుర్తుతెలియని వ్యక్తి షర్టు జేబులోని రూ.20వేలు విలువైన స్మార్ట్‌ఫోన్ అపహరించారు. బుధవారం నూజివీడుకు చెందిన ఆర్టీసీ ఉద్యోగి అక్కినపల్లి కష్టారావు బందరు బస్సు ఎక్కుతుండగాడగా జేబులోని సెల్‌ఫోన్‌ను చోరీ చేశారు. రోజూ సెల్‌ఫోన్లు, మహిళల చేతి బ్యాగుల్లోని విలువైన బంగారు ఆభరణాలు చోరీ అవుతూనే ఉన్నాయి. బస్టాండ్‌లో దొంగలముఠా సంచరిస్తూ ప్రయాణికులు ఆదమరిచి ఉన్న సమయంలో చేతివాటాన్ని ప్రదర్శిస్తోంది. దీంతో ప్రయాణికులు బస్టాండ్‌కు వెళ్లాలంటే భయపడుతున్నారు. పోలీస్ బందోబస్తు పెద్దగా లేకపోవడంతో దొంగలకు అవకాశంగా మారిందని ప్రయాణికులు వాపోతున్నారు. సీసీ కెమెరాలతో పాత నేరస్థుల కదలికలపై గట్టి నిఘా ఉంచాలని, విలువైన వస్తువులు, సామగ్రి, నగదు చోరీ కాకుండా చూడాలని పోలీసులను స్థానికులు, ప్రయాణికులు కోరుతున్నారు.

మోకాళ్ల నొప్పులకు ఆక్యుపంచర్ ఉత్తమ వైద్యం

● డాక్టర్ మాకాల సత్యనారాయణ

ధర్నాచౌక్, మార్చి 8: మోకాళ్ల నొప్పులకు ఆక్యుపంచర్ సైన్స్ ఉత్తమ వైద్యం అని యోగశక్తి సాధన సమితి వ్యవస్థాపకుడు డాక్టర్ మాకాల సత్యనారాయణ తెలిపారు. ఇండియన్ ఓం ఆక్యుపంక్చర్ కాలేజీలో మోకాళ్ల నొప్పులపై ఉచిత అవగాహన సదస్సు, చికిత్స కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. మోకాళ్ల నొప్పులకు యూబీ-40 అనే నాడీ కేంద్రం వద్ద ఒత్తిడి చేయడం ద్వారా నొప్పులను తగ్గించవచ్చన్నారు. అరుగుదల వచ్చిన ఎముకలను పునరుద్ధరించేందుకు మెడ వెనుక ఉన్న యూబీ-11 అనే నాడీ కేంద్రాన్ని ఒత్తిడి చేయాలన్నారు. మందులు అవసరం లేని భారత సమాజం కోసం ఈ చికిత్సను అందిస్తున్నామన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆస్వభారత్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ అలవాల రవి, బ్రీతింగ్ యోగ సాధకుడు విజయ్ సాయిరామ్, సుమతి పాల్గొన్నారు.

పేద మహిళకు ఆర్థిక సాయం



రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ జూబ్లీ హరిత ఆధ్వర్యంలో మహిళకు నగదును అందజేస్తున్న అజయ్‌కుమార్

ధర్నాచౌక్, మార్చి 8: ఏ ఆదరణ లేని వారిని ప్రభుత్వాలు ఆదుకోవాలని న్యాయస్థానాలు స్పష్టమైన ఆదేశాలిచ్చినా ప్రభుత్వాలు పాటించడం లేదని బార్ కౌన్సిల్ ఆఫ్ ది ఏపీ స్టేట్ సభ్యుడు చలసాని అజయ్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వాటర్‌ట్యాంక్ రోడ్డులో కూరగాయలు విక్రయిస్తూ జీవిస్తున్న మంగమ్మ అనే పేద మహిళకు రూ.11 వేల ఆర్థిక సాయాన్ని శుక్రవారం లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ జూబ్లీ హరిత ఆధ్వర్యంలో ఆయన అందజేశారు. క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు కోటా శ్రీనివాసరావు, ఫణి, ప్రముఖ యోగా గురువు అంకాల సత్యనారాయణ, కాకాని శ్రీనివాసరావు, రామకృష్ణ, రామయ్య, కామ్రేడ్, బెజవాడ బార్ కౌన్సిల్ సెక్రటరీ శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.





ఎఫ్‌ట్రానిక్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళా దినోత్సవంలో ఎస్పీ సరిత, ఐజీఎంసీ హాల్లో సత్కారం అందుకున్న మాస్టర్స్ మహిళా అథ్లెట్లు

మగువ..తెగువ

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

నగరంలో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని టీడీపీ, జనసేన నేతలు, పలు సంస్థల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వివిధ రంగాల్లో ప్రతిభ కనబర్చిన పలువురు మహిళలను ఘనంగా సత్కరించారు. కేక్‌లు కట్ చేశారు. మగువలు అన్ని రంగాల్లో తెగువ చూపి, ఉన్నతంగా ఎదుగుతున్నారని పలువురు వక్తలు ప్రశంసించారు.

విజయవాడ కల్చరల్, మార్చి 8: అన్ని రంగాల్లో మహిళల అభ్యున్నతితోనే సమాజాభివృద్ధి సాధ్యమవుతుందని ఎస్పీ కేజీవీ సరిత అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా నగరంలోని బృందావన్ కాలనీలోని ఎఫ్‌ట్రానిక్స్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన సెమినార్‌లో ఆమె ముఖ్య అతిథిగా మాట్లాడారు. ఎఫ్‌ట్రానిక్స్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ దాసరి రామకృష్ణ, ఎగ్జిక్యూటివ్ మేనేజర్ డి.ప్రశాంతి, పలువురు ఉద్యోగులు, ప్రముఖులు పాల్గొన్నారు.

మాస్టర్స్ మహిళా అథ్లెట్లకు సత్కారం

విజయవాడస్పోర్ట్సు: అంతరాత్జీయ మహిళా దినోత్సవం సందర్భంగా భీమ గోల్డ్ సంస్థ ఆధ్వర్యంలో ఐజీఎంసీలోని హాల్లో ఉమ్మడి కృష్ణా మహిళా మాస్టర్స్ అథ్లెట్లు 12 మందిని శుక్రవారం ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా వీఎంసీ క్రీడల చైర్మన్ పుప్పాల కుమారి, భీమా చైర్మన్ పాలంకి చక్రవర్తి, మాస్టర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కంది గంగాధరరావు, జీవీప్రసాదరావు పాల్గొన్నారు. ఏవీ సుబ్బలక్ష్మి, కె.గీతాంజలి, ఎం.అరుణ, ఎం.రూతమ్మ, మాధవీదేవి, మోహన్ లక్ష్మి, పి.చంద్రామణి, విజయశాంతి, సదీప్తి, కె.నాగమణి, ఎస్.విజయకుమారిని సత్కరించారు.

మహిళల హక్కులు కాలరాసిన వైసీపీ ప్రభుత్వం: రావి సౌజన్య



పటమటలంకలో మహిళా దినోత్సవంలో పాల్గొన్న రావి సౌజన్య

విజయవాడ, మార్చి 8(ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల పాలనలో వైసీపీ ప్రభుత్వం మహి ళల హక్కులను కాలరాసిందని, రాబోయే జనసేన, టీడీపీ ప్రభుత్వంలో మహిళా సాధికారత సాధ్యమవుతుందని జనసేన వీరమహిళ కృష్ణా, పెన్నా రీజనల్ కో-ఆర్డినేటర్ రావి సౌజన్య అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పటమటలంకలో శుక్రవారం నిర్వహించారు. మహిళల పేరుతో పథకాలు అమలు చేస్తున్నామని చెబుతున్న ప్రభుత్వం ప్రతిపక్షాల మహిళలపై సామాజిక మాధ్యమాల ద్వారా వ్యక్తిత్వ హననానికి పాల్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. రోజురోజుకు మహిళలపై వైసీపీ నేతల అకృత్యాలు పెరుగుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ప్రభుత్వాన్ని ఇంటికి పంపడానికి మహిళలు సిద్ధంగా ఉండాలని ఆమె పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వీర మహిళ విభాగ నేతలు అనిత, సుజాత, అపర్ణ, భవాని, రజని పాల్గొన్నారు. అనంతరం వారంతా సౌజన్యను ఘనంగా సత్కరించారు.



ప్రసాదంపాడులోని టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన మహిళా దినోత్సవంలో పాల్గొన్న యార్లగడ్డ వెంకట్రావు

మహిళా సాధికారత టీడీపీతోనే సాధ్యం: యార్లగడ్డ

గుణదల, మార్చి 8: మహిళా సాధికారత టీడీపీతోనే సాధ్యమని టీడీపీ-జనసేన కూటమి గన్నవరం అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకను ప్రసాదం పాడులోని టీడీపీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. యార్లగడ్డ వెంకట్రావు కేక్ కట్ చేసి, మహిళలను శాలువాలతో సత్కరించారు. రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా జిల్లాపరిషత్తుల్లో తొమ్మిది శాతం అధ్యక్ష పదవులను మహిళలకు రిజర్వు చేస్తూ నందమూరి తారక రామారావు చట్టం చేశారని తెలిపారు. అప్పటి నుంచే స్థానిక సంస్థల్లో మహిళలు కీలక పదవీ బాధ్యతలు చేపట్టగలిగారన్నారు. ఆస్తి హక్కు, ఉన్నత విద్యావకాశాల కల్పనకు మహిళల అభ్యున్నతికి టీడీపీ పని చేస్తుందని తెలిపారు. తొలి మహిళా యూనివర్సిటీ, ఉద్యోగ, ఉపాధి, రాజకీయ రంగాల్లో మహిళలకు రిజర్వేషన్లు, వినూత్న పథకాలను ఎన్టీఆర్ పాలనలో అమలులోకి తెచ్చారన్నారు. మహిళా సాధికారతకు టీడీపీ నిలువెత్తు రూపంగా నిలిస్తే వైసీపీ దానిని తూట్లు పొడుస్తోందని ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో మూల్పూరి సాయి కళ్యాణి, మేడేపల్లి రమ, పొదిలి లలిత, చిక్కవరపు నాగమణి, మండవ రమ్య కృష్ణ, బొమ్మసాని అరుణ, బుస్సే సరిత, దేవినేని సులోచన, గుడ్డేటి సుమతి, గుజ్జర్లపూడి అజిత, మల్లేశ్వరి, సుభాషిణి, శ్వేత, సాయి, గౌరి, సుకన్య తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ-జనసేన ప్రభుత్వంలో మహిళల కలలకు సాకారం



కేక్ కట్ చేస్తున్న మహిళా నాయకులు

విద్యాధరపురం: మహిళల అభ్యున్నతికి చంద్రబాబు మహిళల కలలకు సాకారం పేరిట పథకాన్ని ప్రకటించారని, టీడీపీ- జనసేన ప్రభుత్వం వస్తే ఈ పథకాన్ని అమలు చేస్తారని ఉమ్మడి కృష్ణా జిల్లా జడ్పీ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ తెలిపారు. ఆటోనగర్‌లోని టీడీపీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన మహిళా దినోత్సవ వేడుకల్లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జగన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. వైసీపీ నాయకులు అచ్చోసిన ఆంబోతుల్లా మహిళలపై విరుచుకుపడుతున్నారన్నారు. జగన్‌రెడ్డి ఇంటికి కూత వేటు దూరంలో మహిళ దారుణ హత్యకు గురైతే నాలుగేళ్లయినా నిందితులను పట్టుకోలేక పోయారన్నారు. వైసీపీ సోషల్‌మీడియాలో పోస్టులు మహిళలను కించపరచేలా ఉన్నాయన్నారు. షేక్ ఆషా, చెన్నుపాటి ఉషారాణిలతో కలిసి ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించి, ఆమె కేక్ కట్ చేశారు. తుపాకుల రమణమ్మ, మాదాల రాజ్యలక్ష్మి(చిన్న తల్లి), అమిర్నేని కరుణకుమారి, చెరుకూరి మాధవి, రాయి రంగమ్మ, మొవ్వ విజయ, బూదాల నందకుమారి, పితాని పద్మ, అంకెం ఇందిరాదేవి, పెద్ద సంఖ్యలో తెలుగు మహిళలు పాల్గొన్నారు.

ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహిస్తాం

● ఓటర్లంతా స్వేచ్ఛగా ఓటేయండి: సెంట్రల్ జోన్ ఏసీపీ భాస్కరరావు



ఎనికేపాడు నుంచి రామవరప్పాడు రింగ్‌రోడ్డు వరకు సాయుధ దళాలతో కవాతు నిర్వహిస్తున్న సెంట్రల్ జోన్ ఏసీపీ పి.భాస్కరరావు

గుణదల, మార్చి 8: ప్రశాంత వాతావరణంలో 2024 సార్వత్రిక ఎన్నికలు నిర్వహించడం తమ ప్రధాన బాధ్యత అని, ఓటర్లు స్వేచ్ఛగా ఓటేయాలని సెంట్రల్ జోన్ ఏసీపీ పి.భాస్కరరావు పిలుపునిచ్చారు. సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహిస్తాం.ప్రతి ఒక్కరూ ధైర్యంగా ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిస్తూ ఎనికేపాడు నుంచి రామవరప్పాడు రింగ్ రోడ్డు వరకు శుక్రవారం సాయంత్రం సాయుధ దళాలతో కవాతు నిర్వహించారు. చెడునడతగలవారు ఎన్నికల సమయంలో సంఘవిద్రోహ చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఏసీపీ హెచ్చరించారు. సస్పెక్ట్, రౌడీ షీట్ ఉన్నవారిపై ప్రత్యేక నిఘా పెట్టామని ఆయన తెలిపారు. ప్రజలను భయభ్రాంతులను గురిచేస్తే చట్టపరంగా శిక్షిస్తామని ఆయన హెచ్చరించారు. కవాతులో పటమట సీఐ మోహన్ రెడ్డి, ఎస్ఐలు వల్లి పద్మ, దుర్గాప్రసాద్, సీఆర్పీఎఫ్ దళాలు పాల్గొన్నాయి.

పెనమలూరు బరిలో ఫారూక్ షుబ్లీ



విజయవాడ, మార్చి 8(ఆంధ్రజ్యోతి): రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేయడానికి మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి సిద్ధమవుతోంది. ఈ సంఘానికి అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్న ఫారూక్ షుబ్లీ పెనమలూరు నియోజకవర్గం నుంచి పోటీ చేయడానికి రంగం సిద్ధం చేసుకుంటున్నారు. మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ఆయన ముస్లిం, దళిత, బలహీన వర్గాలకు జరుగుతున్న అన్యాయాలపై పోరాటం చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా పలు ఉద్యమాలు చేపట్టారు. షుబ్లీపై రాష్ట్రవ్యాప్తంగా పోలీసులు కేసులు నమోదు చేశారు. పెనమలూరు నియోజకవర్గంలో మైనారిటీలు ఎక్కువగా ఉన్నందున ఇక్కడి నుంచి పోటీ చేయాలని ఆయన భావిస్తున్నారు. ఏదైనా రాజకీయ పార్టీలో చేరి దాని గుర్తుపై పోటీ చేస్తారా, స్వతంత్రంగా బరిలోకి దిగుతారా అన్నది త్వరలో తెలియజేస్తానని షుబ్లీ చెప్పారు.



వీణా వాద్య కచేరీ చేస్తున్న విద్యార్థులు

భక్తిపారవశ్యంలో ముంచెత్తిన అఖండ నాదార్చన

విజయవాడ కల్చరల్, మార్చి 8: మహాశివరాత్రిని పురస్కరించుకుని స్వరఝరి సంస్థ ఆధ్వర్యంలో గవర్నర్‌పేటలోని సీతారామచంద్రమూర్తి దేవస్థానంలో శుక్రవారం సంగీత కళాకారులతో 12 గంటల పాటు నిర్వహించిన శివపార్వతుల అఖండ నాదార్చన ఆద్యంతం ప్రేక్షకులను భక్తి పారవశ్యంలో ముంచెత్తింది. నగరానికి చెందిన ప్రముఖ విద్వాంసులు కచేరీ చేశారు. పుటపర్తి ప్రాంతానికి చెందిన శ్రీ సాయిచరణ్ రాజు గాత్రకచేరీ, న్యూఢిల్లీకి చెందిన శారద ముష్టి హిందుస్థానీ రుద్రవీణ వాద్య సంగీతార్చన, ధవళ్‌మిస్త్రీ(న్యూఢిల్లీ) ప్రఖావజ్ కచేరీలు ప్రేక్షకులను మంత్రముగ్ధుల్ని చేశాయి. హిందుస్థానీ సంగీతంపై శారద ముష్టి రుద్రవీణపై అద్భుతమైన శివకీర్తనలు ఆలపించి నాదాలతో నాట్యం చేయించారు. మోదుమూడి సుధాకర్‌తో పాటు మరో 36 మంది విద్వాంసులు కచేరీలు చేశారు. కార్యక్రమాన్ని మోదుమూడి సుధాకర్ నిర్వహించారు.

సుబ్రహ్మణ్య మహతి సంగీత సమితి ఆధ్వర్యంలో..

సుబ్రహ్మణ్య మహతి సంగీత సమితి అధ్వర్యంలో సంస్థ కార్యాలయంలో మూడు గంటలపాటు సంగీత నాదార్చన నిర్వహించారు. మహతి సంగీత పీఠం విద్యార్థులు వి లిఖిత, వి.సాత్విక, కె.కార్తికేయచరణ్, కోట శాంకరి, ఎం.సాయిహర్షిణి, ఎన్. లక్ష్మీఉష, బి.లేహవర్ణ, మాధురి, మంత్రాల ప్రణవి, సౌశాపురపు, జయశ్రీ, అంబటిపూడి శివప్రియ, వై.కృష్ణవేణి, వడ్లమాని సాహితి, కొత్తపల్లి సౌందర్యలు తమ కచేరీలు వినిపించి అందరినీ అలరించారు.

నేడు లయోలాలో జిల్లాస్థాయి స్పోర్ట్స్ టోర్నీ

విజయవాడ స్పోర్ట్సు, మార్చి 8: హెచ్‌సీఎల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నగరంలోని ఆంధ్రా లయోలా కళాశాలలో శనివారం 13 క్రీడా ఈవెంట్లలో జిల్లాస్థాయి స్పోర్ట్సు టోర్నీ నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ సీఈవో కె.అజయ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. జెడ్పీ, మున్సిపల్, ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులు ఈ పోటీలకు అర్హులని ఆయన పేర్కొన్నారు. ఈ క్రీడా ఈవెంట్లలో ప్రతిభ కనపర్చిన వారిని జూన్‌లో బెంగళూరులో నిర్వహించే సౌత్ ఇండియా హెచ్‌సీఎల్ టోర్నీకి పంపుతామని ఆయన తెలిపారు.

11, 12 తేదీల్లో జాతీయ సదస్సు

భారతీనగర్, మార్చి 8: పరిశ్రమల్లో అభివృద్ధిని వివరించడానికి ఆంధ్రా లయోలా కళాశాలలో లాజిస్టిక్స్ అండ్ రిటైల్ ఆపరేషన్స్ విభాగం ఆధ్వర్యంలో సర్జింగ్ ట్రెండ్స్ అనే అంశంపై ఎంబీఏ విద్యార్థులకు ఈనెల 11, 12 తేదీల్లో జాతీయ సెమినార్ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ పి.కిషోర్ తెలిపారు. సెమినార్ హాల్‌లో శుక్రవారం సెమినార్ పోస్టర్‌ను ఆయన విడుదల చేశారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న నందమూరి వసుంధర, నారా బ్రాహ్మణి

మన సంస్కృతీ సంప్రదాయాలు గొప్పవి: బ్రహ్మణి

● ఆకట్టుకున్న త్రికాయ నృత్య ప్రదర్శనలు

మంగళగిరి సిటీ, మార్చి 8: భారతీయ సంస్కృతీసంప్రదాయాలు ఎంతో గొప్పవని, వీటిని భావితరాలకు అందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ సతీమణి బ్రాహ్మణి అన్నారు. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా పరంపర ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి మంగళగిరి శ్రీలక్ష్మీ నృసింహస్వామి దేవస్థానం తూర్పు రాజగోపురం వద్ద నృత్య ప్రదర్శనలు నిర్వహించారు. తొలుత నందమూరి బాలకృష్ణ సతీమణి వసుంధర దేవి, బ్రాహ్మణి జ్యోతి ప్రజ్వలన చేసి నృత్య ప్రదర్శనలను ప్రారంభించారు. త్రికాయ నృత్యశాల ఆధ్వర్యంలో ప్రదర్శించిన పలు నృత్యాలు వీక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ప్రదర్శనల అనంతరం బ్రాహ్మణి మాట్లాడుతూ మహిళా దినోత్సవం, మహాశివరాత్రి ఒకేరోజు రావడం ఎంతో సంతోషకరమన్నారు. మంగళగిరి నియోజకవర్గ ప్రజలకు మహాశివరాత్రి, మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం త్రికాయ నృత్యశాల బృందానికి జ్ఞాపికను అందజేసి అభినందించారు.

మూడు బైకులు ఢీ

- ఐదేళ్ల బాలుడు సహా నలుగురు మృతి
- ఐదుగురికి తీవ్ర గాయాలు...
- శివరాత్రి జాతరకు వెళ్లి వస్తుండగా అరకులోయ వద్ద ఘటన

అరకులోయ, మార్చి 8: అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులోయ మండలం నందివలస వద్ద శుక్రవారం రాత్రి 10.30 గంటల సమయంలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో నలుగురు మృతి చెందారు. మరో ఐదుగురు అరకులోయ ప్రాంతీయ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. మహా శివరాత్రి సందర్భంగా అరకులోయ-లోతేరు రహదారిలోని నందివలస గ్రామంలో శుక్రవారం రాత్రి జాతర జరుగుతోంది. ఆ జాతరకు వెళ్లి వస్తున్న రెండు బైక్‌లను అరకులోయ నుంచి వెళుతున్న బైక్ దమ్మగుడి సమీపంలో ఢీకొంది. మూడు బైక్‌లపై ఉన్న వారిలో నలుగురు మృతి చెందారు. వీరిలో ఐదేళ్ల బాలుడు ఉన్నాడు. మృతులు చినలబుడు గ్రామానికి చెందిన బురిడి హరి (22), అమలకాంత్ (15), లోతేరు పంచాయతీ మొంజగుడ గ్రామానికి చెందిన త్రినాథ్ (32), భార్గవ్ (5)గా గుర్తించారు. ఇదే ప్రమాదంలో మరో ఐదుగురు గాయపడ్డారు. క్షతగాత్రులను అరకులోయ ఆస్పత్రికి తరలించారు. వారిలో తీవ్ర గాయాలైన కొంతలి మోహన్‌రావు (35), గుబాయి సింహాద్రి (25)లను విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించారు. చినలబుడుకు చెందిన కిల్లో పరుశురామ్, సుజిత్‌కుమార్, ఆర్.డుంబ్రిగుడకు చెందిన కిల్లో సంతోష్‌కు స్థానికంగా వైద్య సేవలు అందిస్తున్నారు.

మహిళా ద్రోహి జగన్

- సొంత చెల్లెలి పుట్టుకపై కూడా తప్పుడు ప్రచారమా..?: యనమల

అమరావతి, మార్చి 8(ఆంధ్రజ్యోతి): వంచన, నమ్మక ద్రోహంతో మహిళా ద్రోహిగా జగన్ చరిత్రలో నిలిచిపోతారని శాసనమండలి ప్రతిపక్ష నేత యనమల రామకృష్ణుడు ఒక ప్రకటనలో ఆరోపించారు. జగన్ చేసిన పాపాలు నేడు శాపాలుగా మారి జగన్ మెడచుట్టూ బిగుసుకుంటున్నాయన్నారు. రక్తం పంచుకుని పుట్టిన చెల్లెళ్లే జగన్ నేరాలు, ఘోరాలు గురించి చెబుతున్నారన్నారు. ఆయన సీఎంగా అనర్హుడని వాళ్లే అంటున్నారని తెలిపారు. జగన్ 420 అని వైఎస్ షర్మిల చేసిన వ్యాఖ్యలు ఆయన నిజస్వరూపాన్ని బట్టబయలు చేస్తున్నాయని పేర్కొన్నారు. ఆయన వ్యవహరిస్తున్న తీరుతో మహిళా లోకం సిగ్గుతో తలదించుకోవాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ఆఖరికి సొంత చెల్లి పుట్టుక మీద కూడా తప్పుడు ప్రచారం చేయిస్తున్న జగన్ లాంటి అన్న ఏ చెల్లికి ఉండకూడదేమోనని యనమల అన్నారు.

టీడీపీ-జనసేన సర్కార్‌లోనే మహిళలకు రక్షణ: నన్నపనేని రాజకుమారి

అమరావతి, మార్చి 8(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో కొరవడిన మహిళా రక్షణను తిరిగి పునరుద్ధరించేది టీడీపీ-జనసేన ప్రభుత్వమేనని మహిళా కమిషన్ మాజీ చైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి తెలిపారు. టీడీపీ జాతీయ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆమె ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మహిళా దినోత్సం నాడు రాష్ట్రంలో ఎక్కడా మచ్చుకైనా కనిపించని మహిళా సంక్షేమం గురించి మాట్లాడాల్సి రావడం కించిత్ బాధగా ఉందన్నారు. జగన్ హయాంలో మహిళలు, చిన్నారులపై జరుగుతున్న దాడులు, వేధింపులు, హత్యలు, అత్యాచారాలకు అడ్డూఆపూ లేకుండా పోయిందన్నారు. మహాశక్తి పేరుతో అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళలకు సరికొత్త పథకాలు అందించాలని చంద్రబాబు నిర్ణయించారని తెలిపారు. భువనేశ్వరి జీవితం ప్రతి మహిళకు ఆదర్శమని, గృహిణిగా, తల్లిగా, వ్యాపారవేత్తగా, తల్లిదండ్రుల్ని కోల్పోయిన ఎందరో బిడ్డలకు మరో తల్లిగా ఆమె పోషిస్తున్న బహుముఖ పాత్ర నిజంగా ప్రశంసనీయమని రాజకుమారి అన్నారు.

శివరాత్రి ఉత్సవాల నిర్వహణలో జగన్ సర్కార్ వైఫల్యం: బుచ్చి రాంప్రసాద్

అమరావతి, మార్చి 8(ఆంధ్రజ్యోతి): శివరాత్రి పర్వదినాన శివాలయాల్లో జరిగే ఉత్సవాల నిర్వహణలో జగన్ సర్కార్ ఘోరంగా విఫలమైందని టీడీపీ బ్రాహ్మణ సాధికార సమితి కన్వీనర్ బుచ్చి రాంప్రసాద్ ఆరోపించారు. శుక్రవారం టీడీపీ జాతీయ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... గతంలో దసరా ఉత్సవాల ఏర్పాట్లలో కూడా విఫలమై దుర్గమ్మ దర్శనానికి వచ్చిన భక్తుల్ని తీవ్ర ఇక్కట్లకు గురి చేశారన్నారు. ఇప్పుడు అమరావతి అమరేశ్వరస్వామి దర్శనానికి వచ్చిన భక్తులకు తాగునీరు, నీడ కోసం షామియానాలు కూడా వేయకపోవడం నిజంగా విచారకరమన్నారు.


'విజన్ విశాఖ' నేతల కోసమేనా?

- అభివృద్ధి అంశాలను విస్మరించి ఆకాశహర్మ్యాలా?
- ఐకానిక్‌లతో రియల్టర్లు, భూకబ్జాదారులకే లాభం
- ఆస్తి పన్నులు పెరిగి సామాన్యులు చితికిపోతారు
- సీఎంకు రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఈఏఎస్ శర్మ లేఖ

విశాఖపట్నం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): ఇటీవల 'విజన్ విశాఖ' పేరుతో ప్రకటించిన ప్రణాళిక ప్రజల కోసమా?, ప్రభుత్వాన్ని నడిపే నేతల కోసమా?...అంటూ రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఈఏఎస్ శర్మ శుక్రవారం సీఎం జగన్‌కు లేఖ రాశారు. ఆ ప్రణాళిక, అందులోని హంగులతో కూడిన అంశాలను పరిశీలిస్తే ప్రజల సమస్యలపై అవగాహన లేని ప్రైవేటు కన్సల్టెంట్‌తో తయారు చేయించిన డాక్యుమెంటులా ఉందని విమర్శించారు. ఆ కన్సల్టెంట్‌కు భారీగానే ముట్టజెప్పి ఉంటారని, దానికి బదులు ఆ నిధులతో విశాఖ ప్రజల అభిప్రాయాలు తీసుకొని, వారి సమస్యల పరిష్కారానికి దీర్ఘకాలిక ప్రణాళిక తయారుచేసి ఉంటే బాగుండేదని పేర్కొన్నారు. విశాఖపట్నం అభివృద్ధి చెందాలంటే ముఖ్యమైన మూడు అంశాలు (వ్యవసాయం, పాడి పరిశ్రమ, తీర ప్రాంతంలో సంప్రదాయ మత్స్య పరిశ్రమ)పై దృష్టి పెట్టాల్సి ఉందని, వాటిని విస్మరించి విజన్‌లో ఆకాశ హర్మ్యాలు నిర్మించడం విడ్డూరంగా ఉందన్నారు. విశాఖలో ఏడు లక్షల మంది మురికివాడల ప్రజలు ఉన్నారని, వారికి కనీస వసతులు కల్పించాలనే ప్రయత్నం విజన్‌లో ఎక్కడా కనిపించలేదని పేర్కొన్నారు. తీర ప్రాంతాన్ని పరిశ్రమలతో కాలుష్యమయం చేస్తున్నారని, మత్స్యకారులకు జీవనోపాధి కరవవుతోందని ఆక్షేపించారు. ఇండస్ట్రియల్ కారిడార్ ముసుగులో మత్స్యకారులను నిర్వాసితులను చేస్తున్నారని ఆరోపించారు. విశాఖ పరిసరాల్లో పాడి పరిశ్రమపై ఆధారపడి లక్షలాది కుటుంబాలు బతుకుతున్నాయని, వారిని కూడా పట్టించుకోలేదన్నారు. విశాఖను అత్యంత కాలుష్య నగరాల్లో ఒకటిగా కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి గుర్తించిందని, దానికి పరిష్కారం ఏమీ చూపించలేదన్నారు. విశాఖలో ఐకానిక్ భవనాలు నిర్మిస్తే రియల్ ఎస్టేట్ రంగం, భూకబ్జాదారులకు మాత్రమే లాభం కలుగుతుందని, ఆస్తిపన్నులు పెరిగిపోయి సామాన్యులు చితికిపోతారని ఆందోళన వ్యక్తంచేశారు. విశాఖ ప్రజల అభిప్రాయాలు తీసుకోకుండా, ప్రకృతి వనరులను నాశనం చేస్తూ, అధికార పార్టీ నేతలకు మేలు చేసేలా రూపొందించిన ప్రణాళికను అమలు చేయడం తగదని శర్మ హితవు పలికారు.

రాజకీయ 'ప్రసాదం'

- గుంటూరులో మంత్రి రజని పేరిట పంపిణీ



మంత్రి రజిని పేరిట పంపిణీ చేసిన ప్రసాదం

గుంటూరు సిటీ, మార్చి 8: వైసీపీ నేతల ప్రచార పిచ్చి మామూలుగా లేదు. చివరకు దేవాలయాలను, పండుగలను కూడా వదలడం లేదు. శుక్రవారం మహాశివరాత్రి సందర్భంగా వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని గుంటూరులోని అన్ని శివాలయాల్లో ప్రసాదం పంపిణీకి తెరతీశారు. ప్రసాదం తెచ్చిన ప్లాస్టిక్ డబ్బాలపై తన పేరును, వైసీపీ జెండా రంగును ముద్రించారు. ప్రసాదం తీసుకున్న భక్తులు డబ్బాలపై ఉన్న పేర్లు, రంగులు చూసి ముక్కున వేలేసుకున్నారు. కాగా శివరాత్రిని పురస్కరించుకుని గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలోని ప్రజల ఫోన్లకు మంత్రి రజిని పండుగ శుభాకాంక్షలతో సందేశాన్ని పంపించారు. వయసును బట్టి 'మీ చెల్లి, మీ అక్కను' అని సంబోధిస్తూ సందేశాలు పంపించారు.

ఆ రైలుకు మహిళా సిబ్బందే సారథులు!

విశాఖపట్నం, మార్చి 8: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శుక్రవారం విశాఖపట్నం నుంచి భవానీపట్న పాసింజర్ రైలును (08504) పూర్తిగా మహిళా సిబ్బందితో నడిపించారు. స్టేషన్ మేనేజర్ ఎ.అరుణశ్రీ నాయకత్వంలో లోకో పైలట్‌గా ఝాన్సీరాణి, కో-పైలట్‌గా సాధనకుమారి, రైలు మేనేజర్‌గా (గార్డు) కె.శ్రీరమ్య విధులు నిర్వహించారు. ఈ రైలుకు సంబంధించిన అన్ని బోగీల నిర్వహణను డిపోలో మహిళా సిబ్బంది చేపట్టడం విశేషం. పాసింజరు రైలు నడిపిన మహిళా సిబ్బందిని వాల్తేరు రైల్వే మహిళా సంక్షేమ సంఘం అధ్యక్షురాలు మంజుశ్రీ ప్రసాద్ తన కార్యవర్గ సభ్యులతో కలిసి సన్మానించారు.



మహిళా సిబ్బందితో వాల్తేరు రైల్వే మహిళా సంక్షేమ సంఘు సభ్యులు

సర్కారీ వంచన

రాష్ట్రంలో యథేచ్ఛగా అక్రమ ఇసుక తవ్వకాలు.. రీచ్ అనుమతులు, ఈసీలు లేకుండానే

- చట్ట ఉల్లంఘనలు, పర్యావరణ విధ్వంసం
- కేంద్ర నివేదికతో అక్రమాల గుట్టురట్టు
- నిబంధనలకు విరుద్ధంగా కాంట్రాక్టు సంస్థలు
- తప్పుడు దారిలో పరుగెత్తిస్తున్న జగన్ సర్కారు
- తమ్ముడిని ముందుపెట్టి ఇసుక దందా

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ప్రభుత్వం ప్రజలకు జవాబుదారీగా ఉండాలి. అక్రమాలకు పాల్పడే అధికారులు, కంపెనీలు, కాంట్రాక్టు సంస్థలపై చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ఉంది. అలాంటిది సర్కారే.. కోర్టులు, వ్యవస్థలు, ప్రజల కళ్లుగప్పి కాంట్రాక్టర్లతో అడ్డగోలు పనులు, పర్యావరణ విధ్వంసం చేయిస్తే..? జగన్ సర్కారు ఇలాంటి దగానే చేస్తోంది. జగన్ ప్రభుత్వ అక్రమాలను కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వశాఖ (ఎంఓఈఎఫ్) రట్టుచేసింది. ఇసుక తవ్వకాల్లో అక్రమాలు, చట్ట ఉల్లంఘనలు, పర్యావరణ విధ్వంసాన్ని కోర్టు ముందుంచింది. దీంతో దిక్కుతోచక న్యాయపరీక్షను ఎదుర్కొనేందుకు జగన్ ప్రభుత్వం దొడ్డిదారులు వెతుక్కుంటోంది. రాష్ట్రంలో ఇసుక అక్రమాలపై ఎన్జీటీ, హైకోర్టులో వేర్వేరు ప్రజాప్రయోజన వాజ్యాలపై విచారణలు సాగుతున్నాయి. గుంటూరుకు చెందిన నాగేంద్రకుమార్ 2021లోనే జేపీ వెంచర్స్ నేతృత్వంలో కృష్ణా, గుంటూరు జిల్లాల్లో జరుగుతున్న ఇసుక అక్రమాలు, పర్యావరణ విధ్వంసంపై కేసు వేశారు. ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన జీవీఎస్ఎస్ ప్రసాద్, మరో ఐదుగురు కలిసి హైకోర్టులో గత ఏడాది ఏప్రిల్‌లో పిల్ దాఖలు చేశారు. ఏకకాలంలో రెండు చోట్ల విచారణలు, పరిశీలనలు జరిగాయి. గనుల చట్టాలను అమలు చేస్తూ పర్యావరణ పరిరక్షణలో నోడల్ ఏజెన్సీగా వ్యవహరించాల్సిన గనుల శాఖ జగన్ గుప్పిట్లోకి వెళ్లిపోయింది. దీంతో ఇసుక తవ్వకాల్లో అక్రమాలను బయటపెట్టేందుకు ఎంఓఈఎఫ్‌ను ఎన్జీటీ రంగంలోకి దింపి క్షేత్రస్థాయి పరిశీలనలు చేయించింది. ఎంఓఈఎఫ్ నేతృత్వంలోని జాయింట్ కమిటీ ఇటీవలే ఎన్జీటీకి నివేదిక ఇచ్చింది. ఇసుక తవ్వకాల్లో అక్రమాలు, పర్యావరణ విధ్వంసం గురించి నివేదికలో ప్రస్తావించింది. నివేదికలోని ముఖ్యమైన అంశాలు.



అడ్డగోలుగా తవ్వకాలు

కేంద్ర గనులు, అటవీ, పర్యావరణ చట్టాలను ఉల్లంఘించి కృష్ణా, గుంటూరుతో పాటు ఇతర జిల్లాల్లో అక్రమ మైనింగ్ జరుగుతోంది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో గోదావరి నదిలో కూడా అడ్డగోలు ఇసుక దందా నడుస్తోంది.

అనుమతులు లేకుండానే..

ఎక్కడైనా మైనింగ్ చేయాలంటే ముందుగా రీచ్ అనుమతులు ఉండాలి. ఆ రీచ్‌ల్లో ఇసుక తవ్వకాలు చేయాలంటే పర్యావరణ అనుమతులు(ఈసీ) ఉండాలి. రాష్ట్రస్థాయిలో రాష్ట్ర పర్యావరణ ప్రభావ అంచనా సంస్థ (సియా) ఈసీలు ఇస్తుంది. ఏపీఎండీసీ సొంతంగా మైనింగ్ చేపట్టాలన్నా దానికి రీచ్ అనుమతులు, ఈసీలు తప్పనిసరి. కానీ గత ఏడాది డిసెంబరు నుంచి రాష్ట్రంలో జరుగుతున్న బీ2 కేటగిరీ ఇసుక తవ్వకాలకు సంబంధించి అనేక రీచ్‌లకు రీచ్ అనుమతులు తీసుకోలేదు. పర్యావరణ అనుమతులు కూడా తీసుకోలేదు. జీసీకేసీ, ప్రతిమ సంస్థలకు ఇసుక టెండర్లు ఇచ్చిన విషయంలో హైకోర్టులో కేసు దాఖలయినప్పుడు కొత్తగా బీ2 కేటగిరీలో పర్యావరణ అనుమతులు తీసుకున్నాకే ఇసుక మైనింగ్ జరిగేలా చూస్తామని ప్రభుత్వం, గనుల శాఖలు కోర్టుకు నివేదించాయి. కానీ ఈ హామీ ఆచరణలో అమలు కాలేదు. ఈసీలు లేకుండా, ఎవరి అనుమతి లేకుండా ఆ రెండు సంస్థలు భారీ యంత్రాలతో మైనింగ్ చేస్తున్నాయి. గనుల చట్టాల అమలు, పర్యావరణ పరిరక్షణ విషయంలో గనుల శాఖ నోడల్ ఏజెన్సీగా ఉంటుంది. ఈ శాఖ అక్రమ మైనింగ్‌ను అరికట్టాలి. కానీ ఆ శాఖ నుంచి కాంట్రాక్టు తీసుకున్న కంపెనీలే దర్జాగా అక్రమ మైనింగ్ చేస్తూ పర్యావరణాన్ని గుల్ల చేస్తుండటం చాలా తీవ్రమైన అంశం.

చర్యలు ఏవీ?

2023 నవంబరు నాటికి జేపీ వెంచర్స్‌కు బీ2 కేటగిరీలో ఈసీలు లేకున్నా సగటున రెండున్నర టన్నుల బకెట్ ఉన్న జేసీబీలు, ఇతర యంత్రాలతో మైనింగ్ చేసింది. దీన్ని నోడల్ ఏజెన్సీ నిలువరించలేకపోయింది. 2023 డిసెంబరు నుంచి జీసీకేసీ ప్రాజెక్ట్స్, ప్రతిమ సంస్థలు కూడా ఈసీలు, రీచ్ అనుమతులు లేకున్నా మైనింగ్ చేస్తున్నాయి. ఇది అక్రమం. నోడల్ ఏజెన్సీగా ఉన్న గనుల శాఖ ఎందుకు చట్టపరమైన చర్యలు తీసుకోలేకపోయిందో అంతుచిక్కని విషయం. అక్రమ తవ్వకాలతో పర్యావరణం దెబ్బతిన్నది. కనీసం పర్యావరణ పరిరక్షణ ప్లాన్లు లేకుండానే రోజుకు ఒక్కో రీచ్‌లో 2 వేల టన్నుల ఇసుకను తవ్వి తరలించారు. రీచ్‌ల్లో 24 గంటల పాటు ఏకధాటిగా తవ్వకాలు చేస్తున్నారు.

తమ్ముడి కోసం రాష్ట్రం బలి

రాష్ట్రంలో ఇసుక తవ్వకాలు పేరుకే ప్రైవేటు సంస్థలు చేస్తున్నాయి. కానీ తెరవెనుక ముఖ్యమంత్రి సోదరుడే వ్యాపారం చేస్తున్నారన్న విమర్శలు న్నాయి. ఈ ధైర్యంతోనే ప్రతిమ, జీసీకేసీ సంస్థలు ఎలాంటి రీచ్ , పర్యావరణ అనుమతులు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తవ్వకాలు చేస్తున్నాయన్న ఆరోపణలున్నాయి. ఈ కారణంగానే గనుల శాఖ, సియా, కాలుష్య నియంత్రణ మండలి అక్రమాల వైపు కన్నెత్తిచూడటం లేదని అధికారవర్గాల్లో చర్చ సాగుతోంది.

'ఉక్కు' అధికారులకు జీతాలేవీ?!

- ఎప్పుడు ఇస్తారో కూడా స్పష్టత లేదు
- నల్ల బ్యాడ్జీలతో అధికారుల నిరసన
- సెయిల్‌లో విలీనం చేయాలని డిమాండ్



నిరసన తెలుపుతున్న స్టీల్ ప్లాంట్ అధికారులు

విశాఖపట్నం, మార్చి 8(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం స్టీల్‌ప్లాంటు పరిస్థితి నానాటికీ తీసికట్టుగా మారుతోంది. జిందాల్ స్టీల్ సాయంతో మూడో బ్లాస్ట్ ఫర్నేసులో ఉత్పత్తి ప్రారంభించినా ఉద్యోగులకు జీతాలు మాత్రం సమయానికి ఇవ్వడం గగనంగా మారింది. ప్రతినెలా 30, 31 తేదీల్లోనే జీతాలు ఇవ్వడం ఆనవాయితీ. కానీ ఆర్థిక సమస్యలతో ఇటీవల ఆలస్యమవుతోంది. ఈ నెల 8వ తేదీ దాటినా అధికారులకు ఇంకా జీతాలు ఇవ్వనేలేదు. ఎప్పుడు ఇస్తారో కూడా స్పష్టంగా చెప్పడం లేదు. ప్లాంటులో కార్మికులకు, ఉద్యోగులకు నెలకు చెరో రూ.43 కోట్ల వరకు జీతాలకు అవసరం. కార్మికులకు జీతాలు సకాలంలో ఇవ్వకపోతే ఆందోళన చేస్తారని ఏదో తిప్పలు పడి వారికి సర్దుబాటు చేస్తున్నారు. అదే అధికార వర్గాలైతే ఆందోళనలు, ధర్నాలు చేయకూడదు కాబట్టి, నోరెత్తరని వారికి కాసింత ఆలస్యంగా ఇస్తున్నారు. ప్లాంటు పరిస్థితి బాగా లేనందున వారు కూడా సర్దుకుపోతున్నారు. అయితే ఈ నెలలో ఇప్పటి వరకూ అధికారులు ఎవరికీ జీతాలు ఇవ్వలేదు. శని, ఆదివారాలు సెలవులు. ఇక 11వ తేదీ సోమవారం కూడా ఇస్తారో లేదో తెలియదు. ఒకటో తేదీ రాగానే చెల్లించాల్సిన బకాయిలు అనేకం ఉంటాయని, జీతాలు ఆలస్యం చేస్తే ఎలాగంటూ అధికార వర్గాలు శుక్రవారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశాయి. తక్షణమే జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశాయి.

టౌన్‌షిప్‌లో యూనిట్ విద్యుత్‌కు రూ.8

ఉక్కు టౌన్‌షిప్‌ల్లో నివాసం ఉండే వారికి విద్యుత్ చార్జీలు చాలా స్వల్పం. యూనిట్‌కు 50 పైసలు మాత్రమే తీసుకుంటారు. దేశంలోని అన్ని ప్లాంట్లలో అలాగే ఉంది. ఇక్కడ కూడా ఆరు నెలల క్రితం వరకూ అలాగే ఉండేది. ఇప్పుడు ఆర్థిక స్థితి బాగా లేదని యూనిట్‌కు రూ.8 చొప్పున వసూలు చేస్తున్నారు. దాంతో భారీగా విద్యుత్ బిల్లులు వస్తున్నాయి. విశాఖ స్టీల్‌ప్లాంటుకు పెద్ద పేరుందని వేరే ప్లాంట్లలో ఉద్యోగాలు వచ్చినా వెళ్లకుండా ఇక్కడ చేరామని, ఇప్పుడు జీతాలు ఇవ్వలేని దుస్థితికి చేర్చారని ఉద్యోగులు వాపోతున్నారు. తక్షణమే విశాఖ స్టీల్‌ప్లాంటును సెయిల్‌లో విలీనం చేసి ఆదుకోవాలని అధికారులు డిమాండ్ చేశారు.

వేయి స్తంభాల గుడికి సంపూర్ణ రూపం!

కల్యాణ మండపం పునర్నిర్మాణం



హనుమకొండ, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): వేయి స్తంభాల గుడి కల్యాణ మండపం పునరుద్ధరణ ఓ అద్భుత ఘట్టమని.. కల్యాణ మండపం పునర్నిర్మాణంతో గుడికి సంపూర్ణ రూపం వచ్చిందని కేంద్ర సాంస్కృతిక వ్యవహారాలు, పర్యాటక శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. ఎన్నో వ్యయప్రయాసాలకోర్చి, ఓర్పునేర్పుతో పునర్నిర్మించిన కల్యాణ మండపాన్ని మహాశివరాత్రి పర్వదినాన ప్రారంభించినందున.. దీనిని ఆ పరమశివుడికే అంకితమిస్తున్నామని చెప్పారు. సుప్రసిద్ధ ప్రాచీన కట్టడాలను గత పాలకులు పట్టించుకోలేదని, ఫలితంగా అవి తీవ్ర నిర్లక్ష్యానికి గురై క్రమంగా శిథిలావస్థకు చేరుకున్నాయన్నారు. హనుమకొండలోని చారిత్రక వేయి స్తంభాలగుడి ఆవరణలో రూ.15 కోట్ల వ్యయంతో పునర్నిర్మించిన కాకతీయుల నాటి కల్యాణ మండపాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. అంతకుముందు గుడి ఆవరణలో యాగశాలలో శాంతిపూజలో మహాచండీ యాగం పూర్ణాహుతిలో పాల్గొన్నారు. రుద్రేశ్వర స్వామివారికి రుద్రాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. ఒక చిన్న కల్యాణ మండపాన్ని తిరిగి నిర్మించడానికి పంతొమ్మిదేళ్లు పట్టిందని, ఆ కాలంలో అనేక దేవాలయాలు, కోటలు, అనేక ఇతర కట్టడాలను కట్టడానికి ఇంకెన్ని సంవత్సరాలు పట్టి ఉండొచ్చునని ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

గంటం దొర వారసుడు బోడి దొర కన్నుమూత



గాం బోడిదొర (ఫైల్ ఫొటో)

కొయ్యూరు, మార్చి 8: స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు ప్రధాన అనుచరుడైన గాం గంటందొర వారసుడు గాం బోడిదొర (82) శుక్రవారం రాత్రి ఎనిమిది గంటలకు కన్నుమూశారు. కుటుంబీకులు అందజేసిన వివరాల ప్రకారం...అల్లూరి జిల్లా కొయ్యూరు మండలం నడింపాలెం పంచాయతీ లంకవీధి గ్రామంలో నివాసముంటున్న బోడిదొర రాత్రి ఏడున్నర గంటల సమయంలో అస్వస్థతకు గురయ్యారు. ఆస్పత్రికి తరలించేలోగానే తుది శ్వాస విడిచారు. గత నెలలో ఒకసారి అనారోగ్యానికి గురైన బోడిదొర సుమారు 20 రోజులపాటు విశాఖపట్నం కేజీహెచ్‌లో వైద్య సేవలు పొందారు. కోలుకోవడంతో వారం రోజుల క్రితం ఇంటికి వచ్చారు. అప్పటినుంచి బాగానే ఉన్న ఆయన శుక్రవారం ఒక్కసారిగా అస్వస్థతకు గురై తుదిశ్వాస విడిచారు.

మీజిల్స్, రుబెల్లాలను ఎదుర్కొన్నందుకు భారత్‌కు ప్రతిష్ఠాత్మక అవార్డు

న్యూఢిల్లీ, మార్చి 8: అంటువ్యాధులను ఎదుర్కోవడానికి భారత్ చేస్తున్న అవిశ్రాంత కృషికి గుర్తింపు దక్కింది. ప్రతిష్ఠాత్మక మీజిల్స్, రుబెల్లా చాంపియన్‌షిప్ అవార్డు లభించింది. మార్చి6న వాషింగ్టన్ డీసీలోని అమెరికన్ రెడ్ క్రాస్ హెడ్‌క్వార్టర్స్‌లో మీజిల్స్ అండ్ రుబెల్లా పార్ట్‌నర్‌షిప్ ఈ అవార్డును అందజేసినట్టు కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ శుక్రవారం తెలిపింది. ఈ అవార్డును కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ తరఫున వాషింగ్టన్ డీసీలోని భారత రాయబార కార్యాలయం డిప్యూటీ చీఫ్ ఆఫ్ మిషన్ శ్రీప్రియా రంగనాథన్ అందుకున్నారు. ఈ అవార్డు దేశంలోని ఆరోగ్య కార్యకర్తలు, ఆరోగ్య సంరక్షణ నిపుణులు, విధానకర్తలు, కమ్యూనిటీల అంకిత భావం, కృషికి నిదర్శనమని ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ ప్రయత్నాల వల్ల గత పన్నెండు నెలల కాలంలో 50 జిల్లాల్లో ఎలాంటి మీజిల్స్ (తట్టు)కేసులు, 226 జిల్లాల్లో రుబెల్లా కేసులు నమోదు కాలేదని తెలిపింది. మీజిల్స్, రుబెల్లాలను వ్యాక్సిన్‌తో నిరోధించవచ్చు. దేశం నుంచి ఈ రెండింటినీ పారద్రోలేందుకు భారత ప్రభుత్వం కృషి చేస్తోంది.

92 ఏళ్ల వయసులో ఐదో పెళ్లికి సిద్ధమై..

- అమెరికా దిగ్గజ వ్యాపారవేత్త రూపర్ట్ మర్డోక్ ప్రణాళిక
- జూన్‌లో గాళ్‌ఫ్రెండ్ ఎలీనా జుకోవాతో పెళ్లి ప్రమాణాలు

న్యూయార్క్, మార్చి 8: తొంభై రెండేళ్ల వయసులో పెళ్లి ఆలోచన వస్తే? రూపర్ట్ మర్డోక్ అనే వ్యాపారవేత్తకు వచ్చింది. సెంచరీ వయసుకు కేవలం ఎనిమిదేళ్ల దూరంలో ఉన్న ఆస్ట్రేలియన్-అమెరికన్ ఐదో పెళ్లికి సిద్ధమయ్యారు. ఇప్పటికే నలుగురు భార్యలకు విడాకులిచ్చిన ఈ పెద్దమనిషి, వచ్చే జూన్‌లో తన గాళ్‌ఫ్రెండ్ ఎలీనా జుకోవాను మనువాడనున్నారు. ఆమెతో ఇప్పటికే ఆయనకు వివాహనిశ్చితార్థం జరిగింది. ఓవరాల్‌గా అతడికి ఇది ఆరో వివాహనిశ్చితార్థం. దంత వైద్యురాలిగా పనిచేసి రేడియో ప్రయోక్తగా మారిన లెస్లీ స్మిత్ అనే మహిళతో మర్డోక్‌కు నిరుడు ఎంగేజ్‌మెంట్ జరిగింది. ఆ తర్వాత నెలకే రద్దు చేసుకోవడంతో వీరి బంధం పెళ్లి దాకా వెళ్లలేదు. తాజాగా మర్డోక్ మనువాడనున్న ఎలీనా వయసు 67. మర్డోక్ కన్నా పాతికేళ్ల చిన్నదైన ఈమె మాలిక్యులర్ బయాలజిస్ట్‌గా చేసి రిటైర్ అయ్యారు. రష్యా నుంచి అమెరికా వచ్చి స్థిరపడ్డారు. ఎలీనాకు ఇది రెండో వివాహం. మర్డోక్‌కు నలుగురు భార్యల ద్వారా ఆరుగురు సంతానం కలిగారు. మొదటి భార్య, ఆస్ట్రేలియాకు చెందిన పాట్రిసియా బూకర్‌కు మర్డోక్ 1960లో విడాకులిచ్చారు. తర్వాత అన్నా తొరెవ్ అనే న్యూస్ రిపోర్టర్‌ను రెండో పెళ్లి చేసుకొని, 30 ఏళ్ల తర్వాత విడాకులు తీసుకున్నారు. 1999లో వెండి డెంగ్ అనే మహిళను మూడో పెళ్లి చేసుకొని 2013లో ఆమెతోనూ విడిపోయారు. తర్వాత జెర్రీ హాల్ అనే మోడల్‌ను పెళ్లాడి, కొంతకాలానికి ఆమెకూ విడాకులిచ్చారు.

రాహుల్ వయనాడ్ నుంచే

- 39 మంది లోక్‌సభ అభ్యర్థులతో కాంగ్రెస్ తొలి జాబితా
- ఛత్తీస్‌గఢ్ మాజీ సీఎం బఘేల్, శశి థరూర్, కేసీలకు చోటు
- తెలంగాణ నుంచి నలుగురి పేర్లు ఖరారు
- 11న రెండో జాబితా ప్రకటన?



న్యూఢిల్లీ/హైదరాబాద్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): వచ్చే లోక్‌సభ ఎన్నికలకు అభ్యర్థుల ప్రకటనను కాంగ్రెస్ కూడా ప్రారంభించింది. వివిధ రాష్ట్రాల్లో 39 స్థానాలకు పోటీచేసే పార్టీ అభ్యర్థులతో శుక్రవారం తొలి జాబితాను విడుదల చేసింది. అగ్రనేత రాహుల్‌గాంధీ మరోసారి కేరళలోని వయనాడ్ నుంచే బరిలోకి దిగనున్నారు. ఆ రాష్ట్రంలోని మొత్తం సిటింగ్ అభ్యర్థులకు తిరిగి టికెట్ ఇవ్వాలని కాంగ్రెస్ ఎన్నికల కమిటీ (సీఈసీ) నిర్ణయించింది. తొలి జాబితాలో ఉన్న ప్రముఖుల్లో ఛత్తీస్‌గఢ్ మాజీ ముఖ్యమంత్రి భూపేశ్ బఘేల్ (రాజ్‌నంద్‌గావ్) ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ (అలపుళ), శశిథరూర్ (తిరువనంతపురం) ఉన్నారు. మొత్తంగా ఛత్తీస్‌గఢ్ నుంచి 5 స్థానాలకు, కర్ణాటకలో 7 స్థానాలు, కేరళలో 16, తెలంగాణలో నాలుగు, మేఘాలయలో రెండు, నాగాలాండ్, సిక్కిం, లక్షదీవులు, త్రిపురల్లో ఒక్కో స్థానానికి అభ్యర్థులను కాంగ్రెస్ ప్రకటించింది. తెలంగాణలోని మొత్తం 17 లోక్‌సభ స్థానాలకుగాను నాలుగు చోట్ల అభ్యర్థులను ఖరారుచేసింది. మహబూబ్‌నగర్‌కు మాజీ ఎమ్మెల్యే వంశీచంద్‌రెడ్డి, నల్లగొండలో సీనియర్ నేత కుందూరు జానారెడ్డి పెద్ద కుమారుడు రఘువీర్‌రెడ్డి, జహీరాబాద్ నుంచి మాజీ ఎంపీ సురేశ్ షెట్కార్, మహబూబాబాద్ నుంచి కేంద్ర మాజీ మంత్రి బలరాంనాయక్‌కు టికెట్లు ఖరారు చేసింది. వాస్తవానికి గురువారం జరిగిన సీఈసీ సమావేశంలో తెలంగాణలోని తొమ్మిది స్థానాల్లో అభ్యర్థులపై స్పష్టత వచ్చినా.. సామాజిక సమతుల్యతను దృష్టిలో పెట్టుకుని విడతల వారీగా పేర్లు వెల్లడించాలని అధిష్ఠానం భావించింది. ఈ మేరకే తొలి జాబితాలో నాలుగు సీట్లలో మాత్రమే అభ్యర్థులను ప్రకటించింది. వీరిలో.. వంశీచంద్‌రెడ్డి విద్యార్థి దశ నుంచీ కాంగ్రెస్‌లోనే కొనసాగుతున్నారు. ప్రస్తుతం సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడి స్థాయి వరకు ఎదిగారు. ఆయన అభ్యర్థిత్వాన్ని ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించగా.. నియోజకవర్గంలో ఆయన ప్రచారం చేసుకుంటున్నారు. ఇక కుందూరు రఘువీర్‌రెడ్డి కూడా విద్యార్థి దశ నుంచీ కాంగ్రెస్‌లో ఉన్నారు. షెట్కార్ జహీరాబాద్ లోక్‌సభ స్థానానికి గతంలోనూ ప్రాతినిధ్యం వహించారు. బలరాం నాయక్ కూడా సైతం గతంలోనూ మహబూబాబాద్ నుంచి గెలిచి కేంద్ర మంత్రిగానూ వ్యవహరించారు.

నకిలీ పోలీస్ ఘరానా మోసం

- రైల్వేలో ఉద్యోగాల పేరిట రూ.కోట్లు వసూలు
- హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ అదుపులో నిందితుడు



పోలీస్ డ్రెస్‌లో రమేశ్‌కుమార్, శ్రావణి

పెందుర్తి(విశాఖపట్నం), మార్చి 8: రైల్వేలో ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ రూ.కోట్లు వసూలుచేసిన నకిలీ ఎస్ఐను, అతడి స్నేహితురాలిని విశాఖ పోలీసులు అరెస్టు చేసినట్టు తెలిసింది. శ్రీకాకుళం జిల్లా మెళియాపుట్టి మండలం శేఖరపురాని కి చెందిన హనుమంతు రమేశ్‌కుమార్(39), అదే ప్రాంతానికి చెంది న సరితకు 2012లో వివాహమైం ది. వీరికి పాప, బాబు ఉన్నారు. వరంగల్‌లో సీఆర్పీఎఫ్ కానిస్టేబుల్‌గా పోస్టింగ్ అని చెప్పి శ్రీకాకు ళం జిల్లా పలాస మండలం కాశీబుగ్గలో కాపురం పెట్టాడు. ఆరు నె లలకోసారి ఇంటికి వచ్చి కొద్దిరోజు లు ఉండి వెళుతుండేవాడు. ఈ క్రమంలో తనకు మణిపూర్, జమ్మూ కశ్మీర్.. పలు ప్రాంతాలకు బదిలీ అయ్యిందని భార్య సరితకు చెబుతుండేవాడు. పిల్లల చదువుల కోసం సరిత కాశీబుగ్గ నుంచి రెండేళ్ల క్రితం పెందుర్తిలో ఇంటిని అద్దెకు తీసుకుంది. పెందుర్తి రాకపోకలు సాగిం చే క్రమంలో స్థానికులతో రమేశ్‌కుమార్ పరిచయం పెంచుకున్నాడు. విశాఖలో టూ టౌన్ ఎస్ఐగా పనిచేస్తున్నానని నమ్మించాడు. అతని ఇంటి ఎదురుగా పెయింటింగ్ పనులు చేసే దుంపల కృష్ణారావు కుమారుడికి పోలీసు శాఖలో ఉద్యోగం వేయిస్తానని నమ్మబలికాడు. ఆ తరువాత తన భార్య సరిత మేనమామ సికింద్రాబాద్ రైల్వేలో డీఆర్ఎంగా పనిచేసి రిటైర్ అవుతున్నారని రైల్వేలో ఉద్యోగాలు సెట్ చేసుకోవచ్చునని చెప్పాడు. పోలీసు ఉద్యోగాల్లో లా అండ్ ఆర్డర్ సమస్య ఉంటుందని, రైల్వేలో ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించాడు. రూ.8 లక్షలు ఖర్చవుతుందని చెప్పాడు. ఇది నిజమేనని నమ్మి దుంపల కృష్ణారావుతో పాటు అతని బంధువులు మరో 12 మంది దఫదఫాలుగా సుమారు రూ.కోటి దాకా ముట్టజెప్పారు. రైల్వేలో ఉద్యోగాల కోసం ఎంపికయ్యారని నకిలీ పత్రాలు, ఫేక్ మెయిల్స్ పంపాడు. ఎంతకీ ఉద్యోగాలు రాకపోవడంతో అనుమానం వచ్చి నిలదీయడంతో రైల్వే ఉద్యోగ నియామక పరీక్ష ఉందని అందరినీ విజయవాడ రమ్మన్నాడు. అక్కడ గల ఓ లాడ్జిలో శ్రావణి అనే యువతిని పరిచయం చేసి ఆమె రైల్వే డీఆర్ఎం పీఏ అని చెప్పాడు. లాడ్జిలోనే పరీక్ష కండక్ట్ చేశారు. అపాయింట్‌మెంట్ లెటర్లు ఇచ్చేశాడు. ఆ 12 మం ది దగ్గర మిగిలిన మొత్తాన్ని వసూలుచేశాడు. అనంతరం వారందరినీ ఓరోజు సికింద్రాబాద్ రమ్మని అక్కడ గల ఓ హోటల్‌లో ఉంచాడు. అనుమానం వచ్చి వారంతా సికింద్రాబాద్ రైల్వే డీఆర్ఎం కార్యాలయానికి వెళ్లి ఆ అపాయింట్‌మెంట్ పత్రాలు చూపించగా నకిలీవని తేల్చారు. బాధితుల్లో కొంత మంది సీపీని ఆశ్రయించడంతో టాస్క్‌ఫోర్సు బృందాలు హైదరాబాద్‌లో రమేశ్‌కుమార్‌ను, శ్రావణిని అదుపులోకి తీసుకున్నాయి.

NOTHING మార్కెట్లోకి బడ్స్, నెక్‌బ్యాండ్



నథింగ్ ఇటీవల సీఎంఎఫ్ బడ్స్, నెక్‌బ్యాండ్ ప్రొ ఇయర్ ఫోన్స్‌ని విడుదల చేసింది. బడ్స్‌లో నాలుగు హెచ్‌డీ మైక్రో ఫోన్స్, క్లియర్ వాయిస్ టెక్నాలజీ, అడ్వాన్స్‌డ్ విండ్ నాయిస్ రిడక్షన్ అల్గోరిథమ్, 12.4 ఎంఎం బయో ఫైబర్ డ్రైవర్, అల్ట్రా బాస్ టెక్నాలజీ 2.0 ఉన్నాయి. సౌండ్ క్వాలిటీ బాగుంది. సింగిల్ చార్జింగ్‌తో ఎనిమిది గంటల సేపు ప్లేబ్యాక్ ఉంటుంది. ముప్పయ్ అయిదున్నర గంటల సేపు వరకు పెంచుకోవచ్చు. పది నిమిషాల ఫాస్ట్ చార్జింగ్‌తో ఆరున్నర గంటలసేపు వినికిడి సమయాన్ని అందుకోవచ్చు. మూడు స్టయిలిష్ రంగులు - డార్క్‌గ్రే, లైట్ గ్రే, ఆరంజ్ రంగుల్లో ఈ బడ్స్ లభిస్తాయి. నెక్‌బ్యాండ్ విషయానికి వస్తే హైబ్రిడ్ ఏఎన్‌సీ టెక్నాలజీ, 50 డెసిబల్స్ మేరకు నాయిస్ క్యాన్సిలేషన్ వంటి ఫీచర్స్ ఉన్నాయి. 13.6ఎంఎం కాంపోజిట్ డయాఫ్రమ్ డ్రైవర్, అల్ట్రా బాస్ టెక్నాలజీ 2.0, ఐపీ55 వాటర్ రేటింగ్ ఉన్నాయి. సింగిల్ చార్జింగ్‌తో 37 గంటల సేపు ప్లేబ్యాక్ ఉంటుంది. పదినిమిషాల చార్జింగ్‌తో 18 గంటల సేపు బ్యాటరీ లైఫ్ ఉంటుంది. అలాగే ఈ రెండూ నథింగ్ యాప్‌ను ఉపయోగించుకుంటాయి. బడ్స్‌ని రూ.2,499కి రిటైలర్స్ నుంచి పొందవచ్చు. ఆరంభ ధరగా రూ.2,299కే అందిస్తున్నారు. సీఎంఎఫ్ నెక్‌బ్యాండ్‌ను రూ.2,299కి పొందవచ్చు. ఇది కూడా ఆరంభ ధరగా రూ.200 తగ్గించారు. ఈ రెండూ ఈ నెల 11 నుంచి వినియోగదారులకు అందుబాటులోకి వస్తాయి.

ప్రొడక్ట్

realme కొత్త స్మార్ట్ ఫోన్లు ఇవే



రియల్‌మి రెండు స్మార్ట్ ఫోన్లను ఇండియాలో విడుదల చేసింది. రియల్‌మి 12ప్రొ+ 5జీ ఒకటి కాగా రెండో రియల్‌మి 12ప్రొ 5జీ. ట్రిపుల్ రేర్ కెమెరాలు కలిగి ఉన్న ఈ రెండూ రియల్‌మి యూఐ 5.0 కస్టమ్ స్కిన్‌పై రన్ అవుతాయి. మొదటిది మీడియాటెక్ డైమెన్సిటీ 7050 5జి చిప్‌సెట్, రెండోదైన వనిల్లా రియల్‌మి 6100 +5జీ ఎస్ఓసీ ఫీచర్లు కలిగి ఉన్నాయి. అలాగే మొదటిది 6.67 ఇంచీల ఫుల్ హెచ్‌డీ, 1080 x 2400 పిక్సెల్, అమోల్డ్ డిస్‌ప్లే, 120హెచ్‌జడ్ రిఫ్రెష్ రేటు కలిగి ఉంది. రెండోదైన వనిల్లా 6.72 ఇంచీల ఫుల్ హెచ్‌డీ 1080 x 2400 పిక్సెల్, ఎల్‌సీడీ డిస్‌ప్లే, 120హెచ్‌జెడ్ రిఫ్రెష్ రేటు ఉన్నాయి. రెంటికీ 5,000ఎంఏహెచ్ బ్యాటరీలు, సూపర్‌వూక్ ఫాస్ట్ చార్జింగ్ సపోర్ట్ కలిగి ఉన్నాయి. డైనమిక్ ర్యామ్ టెక్నాలజీ ఉంది. దీంతో ఉపయోగించిన ఇంటర్నల్ స్టోరేజీలో ర్యామ్ అదనంగా కలుస్తుంది. రియల్‌మి 12 ప్రొ+5జీ బేస్ ధర రూ.20,999. రెండోది రూ.16,999. కొన్ని ఆఫర్లు కూడా ఉన్నాయి.



ఒకే నంబర్, రెండు ఫోన్లపై వాట్సాప్ అకౌంట్!

ఒకే వాట్సాప్‌ను మొబైల్/టాప్‌టాప్/డెస్క్‌టాప్ వంటి వేర్వేరు డివైజ్‌లపై ఓపెన్ చేసుకోవడం తెలిసిందే. అలాగే, ఒకే ఫోన్‌లో రెండు వేర్వేరు వాట్సాప్‌లు ఉపయోగించుకోవడమూ పాత విషయమే. ఇప్పుడు ఒకే నంబర్ అయినప్పటికీ రెండు స్మార్ట్‌ఫోన్లపై ఏకకాలంలో వాట్సాప్ వినియోగం తాజా వెసులుబాటు. వాట్సాప్‌నకు చెందిన లింక్డ్ డివైజెస్ ఫీచర్ - వేర్వేరు డివైజ్‌లపై ఒకే నంబర్ ఉన్నప్పటికీ కలుపుతుంది. నిజానికి ఈ ఫీచర్‌తో



అదనంగా నాలుగు డివైజ్‌లపై పని చేసుకోవచ్చు. డెస్క్‌టాప్ లేదా ఆండ్రాయిడ్ టాబ్లెట్స్‌పై ఇప్పటివరకు అందుబాటులో ఉన్న మాదిరిగా ఇది కూడా ఉంటుంది. ప్రైమరీ ఫోన్‌పై లాగౌట్ చేయకుండానే రెండో ఫోన్‌పై కూడా వాట్సాప్‌ను ఉపయోగించుకోవచ్చు. ఎలాంటి ఇబ్బంది ఉండదు. ఈ ఫీచర్ ఆండ్రాయిడ్, ఐఓఎస్ డివైజ్‌లు రెంటిలోనూ ఉంది. దీనికోసం..

- ప్రైమరీ డివైజ్‌లో వాట్సాప్ సెటప్ ఉండటమే కాదు ఉపయోగిస్తూ ఉండాలి.
- రెండో ఫోన్‌లో వాట్సాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవాలి.
- సెటప్ ప్రక్రియలో భాగంగా రైట్ కార్నర్‌లో ఉన్న త్రీడాట్స్‌ను టాప్ చేయాలి. ప్రాంప్ట్ కాగానే ఫోన్ నంబర్‌ని ఎంటర్ చేయాలి.
- లింక్ డివైజ్ ఆప్షన్‌ని ఎంచుకోవాలి.
- మెయిన్ ఫోన్‌లోని లింక్డ్ డివైజ్ ఆప్షన్‌ని యాక్సెస్‌లోకి తెచ్చుకోవాలి. రెండో ఫోన్‌లో డిస్‌ప్లే అయిన క్యూఆర్ కోడ్‌ని స్కాన్ చేసుకోవాలి.
- ఒకసారి కనెక్ట్ అయితే చాలు రెంటిలోనూ వాట్సాప్‌ను ఒకేసారి ఉపయోగించుకోవచ్చు.

నార్మల్ - బిజినెస్ అకౌంట్ తేడా ఇదే



వాట్సాప్ మెసేజింగ్ సేవలను 2009 నుంచి అందిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా బిలియన్ల మంది యూజర్లు దీనికి ఉన్నారు. ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకుంటూ యూజర్లను ఆకట్టుకుంటోంది. ఇది రెగ్యులర్ వెర్షన్ పర్సనల్ కమ్యూనికేషన్‌కు ఉపయోగపడుతోంది.

వ్యాపార సంస్థలకు ఉద్దేశించినది బిజినెస్ అకౌంట్స్. కస్టమర్లతో సంబంధాలు నెలకొల్పుకొనేందుకు బిజినెస్ అకౌంట్ పనికొస్తోంది. అలాగే కమ్యూనికేషన్ సొల్యూషన్స్‌కు సూట్ అవుతుంది. కస్టమర్స్‌తో సంబంధాలకు తోడు రెవెన్యూ పెంపు, కస్టమర్ బేస్ పెంపు ఈ అకౌంట్ల లక్ష్యాలుగా ఉంటాయి. ఎక్కువ మందికి చేరిక, అందుకున్న అయిదు నిమిషాల్లోపే అటువైపు వ్యక్తి తెరిచి చూడటం, ప్రొఫెషనల్ ఫీచర్స్ కారణంగా బిజినెస్ సంస్థలు వాట్సాప్‌ను తమ కమ్యూనికేషన్‌కు వేదికగా ఉపయోగిస్తున్నాయి.

బ్రాండింగ్ స్టోర్లు, ఆటోమేటెడ్ మెసేజింగ్ తదితరాలతో ఇక్కడ కస్టమర్ ఎక్స్‌పీరియెన్స్ సైతం పెరుగుతుంది. ఎండ్ టు ఎండ్ ఎన్‌క్రిప్షన్‌తో అటు సంస్థ ఇటు కస్టమర్ ప్రయోజనాల పరిరక్షణ సులభం. రియల్‌టైమ్ కమ్యూనికేషన్ అదనం. అన్నింటికీ మించి ఫ్రీ యాప్. సంభాషణ ప్రాతిపదికగా ఉంటుంది. ఇంప్రెషన్స్ బట్టి బిజినెస్ అకౌంట్స్‌లో ప్రైసింగ్ ఉంటుంది. మొత్తమ్మీద ప్రయోజనాల ప్రాతిపదిక రెంటిలో ఏది అవసరమన్నది ఎంపిక చేసుకోవాలి.

కాల్ ప్రైవసీ సెట్టింగ్ ఇలా



ఎక్స్(ట్విటర్) తన సామర్థ్యాలను పెంచుకుంటోంది. ఆ క్రమంలో ఆడియో, వీడియో కాల్స్‌కు ఎక్స్ అనుమతిచ్చింది. నాన్-వెరిఫైడ్, నాన్-పేయింగ్ వ్యక్తులు కూడా దీన్ని ఉపయోగించుకోవచ్చు. అదే సమయంలో కాల్ ప్రైవసీ సెట్టింగ్స్‌కూ వెసులుబాటు కల్పించింది. దీనికోసం ఫోన్ నంబర్ కూడా అవసరం లేదు. ఈ మార్పులతో ఎక్స్‌ను 'ఎవ్విరిథింగ్ యాప్'గా మారుస్తున్నట్టు ఈ సందర్భంలో ఎక్స్ అధికారికంగా తెలిపింది. ఆడియో, వీడియో కాల్స్ కోసం ముఖ్యంగా....

- ఎక్స్‌లో డైరెక్ట్ మెసేజెస్ ట్యాబ్‌ను ముందు కనుగొనాలి.
- కాల్ చేయాలని అనుకుంటున్న వ్యక్తిని ఎంచుకోవాలి. కాల్‌కు సంబంధించి అతనికి ఉన్న అర్హతలను చెక్ చేసుకోవాలి.
- టాప్‌లో రైట్ కార్నర్‌లో ఉన్న ఫోన్ ఐకాన్‌ని టాప్ చేయాలి. కాల్ కోసం ఇనీషియేట్ చేయాలి.
- ఈ కాల్‌కు ముందు అవతలి వ్యక్తి నుంచి ముందుస్తు అనుమతి అవసరం కావచ్చు. అందుకు మెసేజ్ చేసుకోవాల్సి రావచ్చు. కొందరు పర్మిషన్ తీసుకుని మరీ కాల్ చేయాల్సి రావడమే ఇందుకు కారణం.

కాల్ ప్రైవసీ సెట్టింగ్

డిఫాల్ట్ కాల్స్‌పై కొందరు ఎక్స్ యూజర్లు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఐపీ చిరునామా, లొకేషన్ ఇతరులకు తెలియవచ్చన్నది వారి ఆందోళన. ఈ సమస్యకు పరిష్కారంగా ప్రైవసీ సెట్టింగ్స్‌ను అనుమతించింది. అందుకుగాను...

- డివైజ్‌లో ఎక్స్ యాప్‌ని ఓపెన్ చేయాలి.
- సైడ్‌బార్ మెనూ కోసం టాప్ లెఫ్ట్ కార్నర్‌లో ఉన్న ప్రొఫైల్ ఐకాన్‌పై క్లిక్ చేయాలి.
- సెట్టింగ్స్ అండ్ సపోర్ట్‌ని ఎంపిక చేసుకోవాలి.
- సెట్టింగ్స్ అండ్ ప్రైవసీ ఆప్షన్‌ని ఎంచుకోవాలి.
- ఆపై ప్రైవసీ అండ్ సేఫ్టీ ఎక్కడ ఉందో చూడాలి.
- డైరెక్ట్ మెసేజెస్‌పై టాప్ చేయడం ద్వారా కాల్ సెట్టింగ్స్‌పై యాక్సెస్ పొందాలి.
- ఆడియో అండ్ వీడియో కాల్ సెట్టింగ్స్ వరకు వెళ్ళాలి.
- కాల్ రిసెప్షన్ పూర్తిగా వద్దు అనుకుంటే టర్నాఫ్ చేసేందుకు స్విచ్‌ని టోగెల్ చేయాలి.
- అలా కాదనుకుంటే కొందరు వ్యక్తులు, గ్రూపులకు మాత్రమే కాల్ రిసెప్షన్‌ను కస్టమైజ్ చేయాలి.
- ఎన్‌హ్యాన్స్‌డ్ కాల్ ప్రైవసీని ఎనేబుల్ చేసుకుంటే ఐపీ చిరునామాను దాచిపెట్టి ఉంచవచ్చు. ఇలా ఒక్కో స్టెప్‌తో కాల్ ప్రైవసీని పొందవచ్చు.



ఏఐతో వాల్ పేపర్స్

గూగుల్ క్రోమ్ తన బ్రౌజర్‌ను ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ)తో ఇంటిగ్రేట్ చేసింది. అది వాల్‌పేపర్స్ జనరేట్ చేసేందుకు ఉపయోగపడుతుంది. దాంతో హోమ్‌స్క్రీన్‌ను అద్భుతంగా మలుచుకోవచ్చు. ఇంతకుమునుపు ఈ వెసులుబాటు పిక్సెల్ 8 యూజర్లకు మాత్రమే ఉంది. ఈ ఏడాది జనవరి నుంచి క్రోమ్ బ్రౌజర్‌లోకి వచ్చింది. వెబ్ యూజర్లకు తోడు కస్టమైజేషన్‌కు అవకాశం ఉంది. దీంతో ఇకపై క్రోమ్ యూజర్లు తమ హోమ్ పేజీ డిజైన్‌ను కస్టమైజ్ చేసుకోవచ్చు. అందుకోసం టెక్స్ట్ టు ఇమేజ్ డిఫ్యూజన్‌ను ఉపయోగిస్తుంది. దీనికోసం

- మొదట ఎడిట్ బటన్‌ను టాబ్ చేయాలి.
- చేంజ్ థీమ్ టాబ్‌ని టాప్ చేయాలి. క్రియేటివ్ విత్ ఏఐపై క్లిక్ చేయాలి.
- డ్రాప్‌డౌన్ మెనూ నుంచి అభిరుచి మేరకు సబ్జెక్ట్, స్టయిల్‌ను పిక్ చేసుకోవాలి.
- కాంబినేషన్ల ఎంపిక తరవాత క్రియేట్‌పై టాప్ చేయాలి
- క్రోమ్ వాల్‌పేపర్ ఎంపిక కోసం నాలుగైదు ఆప్షన్స్ వస్తాయి. అలా వాల్‌పేపర్‌ను పొందవచ్చు.

2024 సైబర్ థ్రెట్స్ ఇవే!



సాంకేతికత ఎప్పటికప్పుడు కొత్త పుంతలు తొక్కుతోంది. మనిషి జీవితాన్ని మరింత సౌకర్యవంతంగా ఉంచేందుకు అది తోడ్పడుతోంది. వెలుగు - చీకటి అన్నట్టు ఆ మంచిని పొంచే ప్రమాదం చొచ్చుకువచ్చి మనిషిని ఆర్థికంగా అతలాకుతలం చేస్తోంది. అదే సైబర్ థ్రెట్. 2024లో ఈ కింది మార్గాల్లో యూజర్లకు థ్రెట్ వచ్చే అవకాశం ఉందని సైబర్ నిపుణులు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. వివిధ రూపాల్లో వచ్చే ఈ మాల్వేర్ - నెటిజెన్లను కబళిస్తోంది. వ్యక్తిగత సమాచారం నుంచి మనీ వరకు సర్వం తస్కరిస్తోంది. స్కామ్ స్వరూపం తెలిస్తే, అప్రమత్తంగా ఉండేందుకు వీలవుతుంది. దరిమిలా ఈ ఏడాది సైబర్ థ్రెట్ ఏ రూపంలో ముంచుకొస్తోందో ముందు చూద్దాం.

- ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) విస్తరణతో వస్తున్న ప్రమాదం డీప్ ఫేక్. ఈ టెక్నాలజీ ఉపయోగించి కన్విన్స్ చేసే వాయిస్, వీడియో, ఇమేజ్ కంటెంట్‌కు రూపకల్పన జరుగుతుంది. ఈ ప్రక్రియతో వాస్తవానికి, ఫేక్‌కు మధ్య ఉండే గీత చెరిగిపోతుంది. ఈ మోసపూరిత చర్యల నివారణకు అప్రమత్తంగా ఉండటం ఒక్కటే పరిష్కారం. వివరాలు తెలియకుండా పర్సనల్ సమాచారాన్ని షేర్ చేసుకోకూడదు. మాయకు గురవుతున్నామా లేదా అన్నది ఒకటికి పదిసార్లు చెక్ చేసుకుంటే తప్ప పర్సనల్ సమాచారాన్ని షేర్ చేసుకోరాదు.
- సోషల్ మీడియాను కూడా సైబర్ క్రిమినల్స్ దుర్వినియోగపరుస్తున్నారు. సెలబ్రిటీలు, ప్రభావపూరిత వ్యక్తుల పేర్లను వాడుకుంటారు. ముఖ్యంగా ఆన్‌లైన్ కమ్యూనిటీస్‌లో ఉన్నప్పుడు చాలా జాగ్రత్తగా ఉండటం మంచిది.
- ఫేక్ కంటెంట్ లేదంటే యువత, కుటుంబ సభ్యులకు హానిచేసే రీతిలో సైబర్ బెదిరింపులు ఉంటాయి.
- విరాళాల పేరిట మోసాలు మరొక ఎత్తు. ఏదోలా మోసంతో వ్యక్తులపై దాడి ఈ రూపంలో జరుగుతుంది. ఉదారతతో విరాళం ఇవ్వాలనుకుంటే లింకుల ద్వారా జొరబాటు ఇందులో ఉంటుంది.
- సరికొత్త మాల్వేర్ వేరియంట్స్ మరో ప్రధాన సమస్య. ఆర్థిక, వ్యక్తిగత డేటా సేకరణ - తద్వారా తస్కరణ, బెదిరింపులు ఇందులో ఉంటాయి. అనేకానేక ఎత్తుగడలు ఇందులో భాగం.
- ఒలింపిక్ ఎత్తుగడలు. ఈవెంట్లపై వ్యక్తులకు ఆసక్తులు ఇందులో లక్ష్యం. సదరు ఈవెంట్‌కు టికెట్ల కొనుగోలు నుంచి, ప్రయాణం, ప్రమోషనల్ కార్యకలాపాల్లో భాగంగా జరిగే స్కాములు అన్నీ ఇందులోకి వస్తాయి.



చాట్ జీపీటీలో కొత్త వెసులుబాటు

బధిరులు ఇక వినొచ్చు


ఏఐ పవర్డ్ చాట్ జీపీటీ బధిరులకు శుభవార్త చెప్పింది. ప్రత్యేకించి వారికోసం 'రీడ్ అలౌడ్' ఫీచర్‌ను జతచేసింది. దీంతో రాసిన మెసేజ్‌లను పైకి బిగ్గరగా వినిపిస్తుంది. వాయిస్ చాట్ ఫీచర్‌లో ఇదో కొత్త ఫంక్షనాలిటీ. ఏఐ మోడల్స్‌కు చెందిన మల్టీమోడల్ కేపబిలిటీస్‌ను దీనికోసం చాట్‌జీపీటీ ఉపయోగించుకుంటోంది. చాట్‌బోట్ ఆండ్రాయిడ్ యాప్ వెర్షన్‌కు హోమ్-స్క్రీన్ విడ్జెట్ లభ్యం కానుందని కూడా మునుపటి రిపోర్టులు వెల్లడించాయి. ఐఓఎస్ లేదంటే ఆండ్రాయిడ్ డివైజ్‌లో ఇందుకోసం మెసేజ్‌ను టాప్, హోల్డ్ చేయాలి. ఆపై రీడ్ అలౌడ్‌ని టాప్ చేయాలి. మెసేజ్ కింద రీడ్ అలౌడ్ బటన్ ఉంటుంది. దీన్ని ఇప్పుడు విడుదల చేస్తున్నారు. చాట్‌జీపీటీ ఆండ్రాయిడ్, ఐఓఎస్ యాప్‌లకు తోడు వెబ్ క్లయింట్‌లో రీడ్ అలౌడ్ అందుబాటులో ఉంది. ఇంగ్లీష్ సహా 37 భాషల్లో ఈ సౌలభ్యం అందుబాటులో ఉంటుంది. వాయిస్ చాట్ ఫీచర్ మాదిరిగా ఉంటుంది. అలాగే ఉపయోగించుకున్నప్పుడు సంభాషణ పూర్తయ్యేవరకు టెక్స్ట్‌ని చూడలేం. అంటే వినడం, మాట్లాడటానికే ఇక్కడ అవకాశం ఉంటుంది. అంటే ఈ ఫీచర్ ప్రకారం కమ్యూనికేషన్ విధానం టెక్స్ట్‌లోనే ఉంటుంది. వాటి నుంచి యూజర్ అవసరమైనది తీసుకుని వినాలి. స్క్రీన్ చూడలేని వారు, అంధులు దీన్ని ఉపయోగించుకోవచ్చు.

మెసేజ్‌లనూ ఎడిట్ చేయవచ్చు



ఇన్‌స్టాగ్రామ్‌లో పంపిన డైరెక్ట్ మెసేజ్‌లను యూజర్ 15 నిమిషాలకు లోపు ఎడిట్ చేసుకునే సౌలభ్యం ఉంది. అందుకు అవసరమైన అప్డేట్‌ను ఇన్‌స్టాగ్రామ్ ఇప్పటికే విడుదల చేసింది. దీనికి తోడు మరికొన్ని ఫీచర్లను కూడా తీసుకువచ్చింది. ఎడిట్ యువర్ మెసేజ్, పిన్‌చాట్స్ టు టాప్ ఆఫ్ ఇన్‌బాక్స్, టోగెల్ రీడ్ రిసీట్స్ ఇన్ డైరెక్ట్ మెసేజెస్, సేవ్ యువర్ ఫేవరైట్ స్టిక్కర్స్ అండ్ అప్‌గ్రేడ్ యువర్ రిప్లయ్స్, పర్సనలైజ్ యువర్ చాట్స్ విత్ మోర్ థీమ్స్ వంటివి ఉన్నాయి. మెసేజెస్ విషయానికి వస్తే, ప్రెస్ ఆపై హోల్డ్ తదుపరి ఎడిట్‌పై టాప్ చేస్తే సరిపోతుంది. సెండర్‌కు పంపిన తరవాత 15 నిమిషాలకు మించని వ్యవధి లోపు ఈ పనిచేసుకోవచ్చు. పొరపాట్లు ఏవైనా ఉంటే సరిదిద్దుకుని మెసేజ్‌ని అప్డేట్ చేయవచ్చు. రైట్ చాట్ విండోని వెతుక్కునే బదులు ఇకపై త్వరగా యాక్సెస్ చేసుకునే వెసులుబాటును ఇన్‌స్టాగ్రామ్ కల్పించింది. చదివిన మెసేజ్ కనిపించకుంటే రీడ్ రిసీట్స్ లేదా కొన్నిచాట్స్‌ను టోగెల్ చేయడం ద్వారా దాగి ఉన్న లేదా అప్పటికే చదివిన మెసేజ్ లభ్యమవుతుంది. డైరెక్ట్ మెసేజ్‌లకు ఫేవరైట్ స్టిక్కర్లను కలపవచ్చు. అంతేకాదు స్టిక్కర్లు, జీఐఎఫ్‌లు, వీడియోలు, ఫొటోలు, వాయిస్ మెసేజ్‌లు కూడా ఒక మెసేజ్‌కు సమాధానం ఇచ్చేటప్పుడు దొరుకుతాయి.

రీల్స్‌కు బెస్ట్ ట్రిక్స్



సామాజిక మాధ్యమాల్లో రీల్స్‌కు ఉన్న ఆదరణ తెలిసిందే. అయితే ఇన్‌స్టాగ్రామ్‌లో రీల్స్ మెరుగ్గా ఉండేందుకు, మరింతమందిని ఆకట్టుకునేందుకు కొన్నిట్రిక్స్ లేదా టిప్స్ ఇలా ఉన్నాయి.

- కామెంట్లకు రీల్స్‌తో స్పందించడం తెలిసిందే. దీని కోసం ముందు కామెంట్‌ను పట్టుకోవాలి. తదుపరి రిప్లయ్‌ని టాప్ చేయాలి. రీల్ ఆప్షన్‌ను సెలెక్ట్ చేసుకోవాలి. అక్కడ రెస్పాన్స్‌ను క్రియేట్ చేసి దాన్ని రీల్‌గా విడుదల చేయాలి.
- స్టోరీ హైలైట్స్‌ను రీల్స్‌గా మార్చుకోవడం మరొకటి. యూజర్ మొదట ప్రొఫైల్ దగ్గరకు వెళ్ళాలి. 'సేవ్' హైలైట్స్‌ను టాప్ చేయాలి. సెలెక్ట్‌ను ఎంపిక చేయాలి. రీల్ ఎడిటింగ్ ఆరంభించాలి.
- పాటలతో లైబ్రరీ ఇంకొకటి. సౌండ్ ట్రాక్స్‌తో సొంత కంటెంట్‌ను రూపొందించుకోవడం అన్నమాట. అందుకు అభిలషిస్తున్న ఆడియో ఉన్న రీల్‌ను ఓపెన్ చేయాలి. అడుగున ఉన్న ఆడియో లేబుల్‌ను సెలెక్ట్ చేసుకోవాలి. తదుపరి ఉపయోగానికి వీలుగా స్టోర్ చేసుకునేందుకు సేవ్ ఐకాన్‌ని టాప్ చేస్తే సరిపోతుంది.
- పాటకు ఆటో-సింక్ ఇమేజెస్. రీల్స్‌లో ఇదో ఫీచర్. మీడియా, మ్యూజిక్ సింక్రనైజేషన్ సాఫీగా సాగేందుకు వీలుకలిగిస్తుంది. ఇందుకు రీల్స్ క్రియేషన్ విండోని తెరిచి, మీడియాను సెలెక్ట్ చేసుకోవాలి. ఆడియోను ఎంచుకోవాలి. సింక్రనైజేషన్ పూర్తయ్యేవరకు వేచి ఉండాలి. అదయ్యాక పబ్లిషింగ్ ప్రాసెస్‌తో ప్రొసీడ్ అవ్వాలి.
- రీల్ టెంప్లేట్స్. ప్రీడిజైన్డ్ టెంప్లేట్స్‌తో రీల్స్‌ను చాలా వేగంగా బంధించడం అన్నమాట. న్యూపోస్టు కోసం ప్లస్‌ని టాప్ చేయాలి. రీల్స్ ఆప్షన్‌ను సెలెక్ట్ చేసుకోవాలి. టెంప్లేట్స్‌ను ఎంపిక చేసుకుని అవసరానుగుణంగా క్లిప్స్‌ని జతచేయాలి. ప్రొడక్ట్‌తో సంతృప్తి చెందితే, సేవ్ చేసుకోవాలి.
- జీఐఎఫ్‌తో సమాధానాలు. దీనికోసం సమాధానం ఇవ్వాలని అనుకుంటున్న కామెంట్‌కు రిప్లయ్‌పై క్లిక్ చేయాలి. స్టిక్కర్‌ని టాప్ చేయాలి. జీఐఎఫ్‌ని ఎంచుకోవాలి. దాన్ని కలిపి పబ్లిష్ చేయాలి.



- వాయిస్ ఇన్‌కార్పొరేషన్. ఎడిటింగ్ మెనూలోనే వాయిస్ ఓవర్స్‌ని కలపడం ఇక్కడ ఉంటుంది. రీల్ క్లిప్‌ను రికార్డ్ చేసిన తరవాత నెక్స్ట్‌ను ఎంచుకోవాలి. ఇది ఎడిట్ వీడియో పక్కన ఉంటుంది. వాయిస్ ఓవర్‌ను సెలెక్ట్ చేసుకుని కామెంట్రీని రికార్డు చేయాలి. రీల్‌కు వాయిస్ ఓవర్‌ను కలిపేందుకు డన్‌ని టాప్ చేయాలి.
- లిప్ సింకింగ్ ఇంకొకటి. దీనికి ధ్వని వేగాన్ని, మ్యూజిక్‌తో సింక్ చేయాల్సి ఉంటుంది. రీల్ ఎడిటర్‌ను యాక్సెస్ చేసుకుని యూజర్ తన క్లిప్‌లోకి మ్యూజిక్‌ను ఇన్‌కార్పొరేట్ చేసుకోవాలి. వేగం తగ్గిన మ్యూజిక్ కోసం 3ఎక్స్ వరకు సౌండ్ స్పీడ్‌ను సెట్ చేసుకోవాలి. అడ్జస్ట్ చేసిన ఆ స్పీడ్‌తో రీల్‌ను రికార్డ్ చేసుకోవాలి.
- క్యాప్షన్ జత చేయడం. చేసిన రీల్‌కు ఒక క్యాప్షన్ ఉండాలి. దీనికోసం ఇన్‌స్టాగ్రామ్‌కు చెందిన క్యాప్షన్ టూల్స్‌ను ఉపయోగించాలి. మాన్యువల్‌గా క్యాప్షన్‌ను ఎడిటింగ్ సమయంలో జతచేయాలి. క్యాప్షనింగ్‌కు మూడో పార్టీ యాప్‌ను ఉపయోగించుకోవాలి.
- రీల్స్‌ను అరేంజ్ చేయడంలో వ్యూహం అవసరం. రీల్స్ చేయడం ఒక ఎత్తు. వాటిని అప్‌లోడ్ చేయడం మరొక ఎత్తు. ఇందుకు ఒక వ్యూహాన్ని సన్నద్ధం చేసుకోవాలి. ఎప్పుడు ఏ రీల్ రిలీజ్ చేయాలన్న ప్లాన్ ఒకటి పక్కాగా ఉండాలి.
- అట్రాక్షన్ కోసం కవర్ ఇమేజ్ ఇంకొకటి. రీల్స్ రూపొందిస్తోంది పూర్తిగా వీక్షకుల కోసం అన్న విషయం తెలిసిందే. అప్పీలింగ్ థంబ్ నెయిల్స్‌తో అందంగా, కనిపించగానే చూసేలా చేయడమే ఈ కవర్ ఇమేజ్ ఉద్దేశం.

ఈ ట్రిక్స్ ఉపయోగించుకుంటే రీల్స్‌కు ఆదరణ మరింత పెరుగుతుంది అని చెప్పవచ్చు.

ఏపీఆర్‌డీసీ సెట్ నోటిఫికేషన్

గుంటూరులోని ఏపీ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ(ఏపీఆర్‌ఈఐఎస్)- ఏపీ రెసిడెన్షియల్ డిగ్రీ కాలేజ్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్(ఏపీఆర్‌డీసీ సెట్) 2024 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఈ పరీక్షలో సాధించిన మెరిట్ ప్రకారం పల్నాడు జిల్లా - నాగార్జునాసాగర్‌లోని ఏపీ రెసిడెన్షియల్ డిగ్రీ కాలేజీలో డిగ్రీ మొదటి ఏడాది ప్రవేశాలు కల్పిస్తారు. ఈ కాలేజీని బాలురకు మాత్రమే ఉద్దేశించారు. ఆంగ్ల మాధ్యమంలో బోధన ఉంటుంది. ట్యూషన్ ఫీజు ఉండదు. ఉచిత భోజన, వసతి సౌకర్యాలు కల్పిస్తారు. అకడమిక్ యాక్టివిటీస్‌తోపాటు క్రీడలకు ప్రాధాన్యమిస్తారు. విద్యార్థులకు అవసరమైన ల్యాబొరేటరీలు, లైబ్రరీలు, డిజిటల్ క్లాసెస్, రీడింగ్ రూమ్‌లు, ప్లే గ్రౌండ్‌లు అందుబాటులో ఉంటాయి. 15 నుంచి 20 మంది విద్యార్థులను ఒక గ్రూప్‌గా చేసి వారి సంరక్షణ కోసం ఒక లెక్చరర్‌ను లోకో-పేరెంట్‌గా నియమిస్తారు.

సీట్ల వివరాలు

- బీఏ(హిస్టరీ, ఎకనామిక్స్, పొలిటికల్ సైన్స్)లో 40 సీట్లు, బీకాంలో 40 సీట్లు, బీఎస్సీ(మేథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ)లో 36 సీట్లు, బీఎస్సీ(మేథ్స్, స్టాటిస్టిక్స్, కంప్యూటర్ సైన్స్)లో 36 సీట్లు చొప్పున మొత్తం 152 సీట్లు ఉన్నాయి.
- ఆంధ్ర, రాయలసీమ ప్రాంతాలకు 65:35 నిష్పత్తిలో సీట్లు కేటాయిస్తారు.

అర్హత: ఆంధ్రప్రదేశ్‌కు చెందిన బాలురు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి. ప్రస్తుతం ఇంటర్/తత్సమాన పరీక్ష రాసిన/రాసే అభ్యర్థులు అర్హులు. బీఏ ప్రోగ్రామ్‌నకు ఇంటర్‌లో ఏ గ్రూప్ వారైనా అప్లయ్ చేసుకోవచ్చు. బీకాం ప్రోగ్రామ్‌నకు హెచ్ఈసీ మినహా అన్ని గ్రూప్‌లవారూ అర్హులే. బీఎస్సీ(ఎంపీసీ)కి ఎంపీసీ గ్రూప్ అభ్యర్థులు; బీఎస్సీ(మేథ్స్, స్టాటిస్టిక్స్ కంప్యూటర్ సైన్స్) ప్రోగ్రామ్‌నకు ఎంపీసీ, ఎంఈసీ అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి.

ఏపీఆర్‌డీసీ సెట్ 2024

ఇది ఆబ్జెక్టివ్ టెస్ట్. ఇందులో మొత్తం 150 మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు ఇస్తారు. మొదటి 30 ప్రశ్నలు ఇంగ్లీష్ సబ్జెక్ట్ నుంచి ఉంటాయి. తరవాతి 120 ప్రశ్నలు గ్రూప్ సబ్జెక్టులకు సంబంధించి ఉంటాయి. ప్రశ్నలన్నీ ఇంటర్ స్థాయిలోనే ఇస్తారు. అభ్యర్థులు సమాధానాలను బ్లూ/బ్లాక్ పెన్‌తో ఓఎంఆర్ పత్రం మీద గుర్తించాలి. ప్రశ్నకు ఒక మార్కు చొప్పున మొత్తం మార్కులు 150. నెగెటివ్ మార్కులు లేవు. ప్రశ్నపత్రాన్ని ఇంగ్లీష్, తెలుగు మాధ్యమాల్లో ఇస్తారు. పరీక్ష సమయం రెండున్నర గంటలు. మోడల్ పేపర్ల కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.

- **దరఖాస్తు ఫీజు:** రూ.300
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 31
- **హాల్‌టికెట్స్ డౌన్‌లోడింగ్:** ఏప్రిల్ 17 నుంచి
- **ఏపీఆర్‌డీసీ సెట్ తేదీ:** ఏప్రిల్ 25
- **మెరిట్ లిస్ట్ విడుదల:** మే 14
- **మొదటి కౌన్సెలింగ్:** మే 23
- **రెండో కౌన్సెలింగ్:** మే 31
- **మూడో కౌన్సెలింగ్:** జూన్ 7
- **వెబ్‌సైట్:** https:aprs.apcfss.in



విజయవాడలోని స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్(ఎస్‌పీఏవీ)- పీజీ ప్రోగ్రామ్‌లలో డైరెక్ట్ అడ్మిషన్స్‌కు నోటిఫికేషన్ విడుదల చేసింది. ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఆర్కిటెక్చర్ అండ్ ప్లానింగ్ విభాగాల్లో 12 రెగ్యులర్ సీట్లు; డిజైన్ విభాగంలో 13 రెగ్యులర్ సీట్లు, 12 సెల్ఫ్ ఫైనాన్స్ సీట్లు ఉన్నాయి.

'ప్లానింగ్'లో పీజీ

ఆర్కిటెక్చర్: ఈ విభాగంలో మాస్టర్ ఆఫ్ ఆర్కిటెక్చర్, మాస్టర్ ఆఫ్ బిల్డింగ్ ఇంజనీరింగ్ అండ్ మేనేజ్‌మెంట్, మాస్టర్ ఆఫ్ అర్బన్ డిజైన్, మాస్టర్ ఆఫ్ డిజైన్ ప్రోగ్రామ్‌లు ఉన్నాయి. మాస్టర్ ఆఫ్ ఆర్కిటెక్చర్ ప్రోగ్రామ్‌లో సస్టయినబుల్ ఆర్కిటెక్చర్, ల్యాండ్ స్కేప్ ఆర్కిటెక్చర్, ఆర్కిటెక్చరల్ కన్జర్వేషన్ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి.

అర్హత: మాస్టర్ ఆఫ్ ఆర్కిటెక్చర్, మాస్టర్ ఆఫ్ అర్బన్ డిజైన్, మాస్టర్ ఆఫ్ డిజైన్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి బ్యాచిలర్స్ డిగ్రీ ఇన్ ఆర్కిటెక్చర్ పూర్తిచేసి ఉండాలి. మాస్టర్ ఆఫ్ బిల్డింగ్ ఇంజనీరింగ్ అండ్ మేనేజ్‌మెంట్‌కు(బీఈ/బీటెక్)(సివిల్ ఇంజనీరింగ్/బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ టెక్నాలజీ/కన్‌స్ట్రక్షన్ ఇంజనీరింగ్ అండ్ మేనేజ్‌మెంట్/కన్‌స్ట్రక్షన్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్) ఉత్తీర్ణులై ఉండాలి. మాస్టర్ ఆఫ్ డిజైన్ ప్రోగ్రామ్‌కు బ్యాచిలర్స్ డిగ్రీ(ఇంజనీరింగ్/ప్లానింగ్) ఉత్తీర్ణతతోపాటు సీడ్ వ్యాలిడ్ స్కోర్, ఏడాది అనుభవం ఉన్నవారు; బ్యాచిలర్స్ డిగ్రీ(ఫైన్ ఆర్ట్స్/డిజైన్) ఉత్తీర్ణతతోపాటు సీడ్ వ్యాలిడ్ స్కోర్, రెండేళ్ల అనుభవం ఉన్నవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు.

ప్లానింగ్: ఈ విభాగంలో మాస్టర్ ఆఫ్ ప్లానింగ్ ప్రోగ్రామ్ ఉంది. ఇందులో ఎన్విరాన్‌మెంటల్ ప్లానింగ్ అండ్ మేనేజ్‌మెంట్, అర్బన్ అండ్ రీజనల్ ప్లానింగ్, ట్రాన్స్‌పోర్ట్ ప్లానింగ్ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి బ్యాచిలర్స్ డిగ్రీ(ప్లానింగ్/ఆర్కిటెక్చర్) లేదా (బీఈ/బీటెక్)(సివిల్ ఇంజనీరింగ్/ప్లానింగ్) ఉత్తీర్ణులై ఉండాలి. ఎన్విరాన్‌మెంటల్ ప్లానింగ్, అర్బన్ అండ్ రీజనల్ ప్లానింగ్ స్పెషలైజేషన్‌లకు మాస్టర్స్ డిగ్రీ(జాగ్రఫీ/ఎకనామిక్స్/సోషియాలజీ) పూర్తిచేసిన అభ్యర్థులు; ట్రాన్స్‌పోర్ట్ ప్లానింగ్ స్పెషలైజేషన్‌కు మాస్టర్స్ డిగ్రీ(ఎకనామిక్స్/స్టాటిస్టిక్స్/ఆపరేషన్స్ రీసెర్చ్) ఉత్తీర్ణులు కూడా అప్లయ్ చేసుకోవచ్చు.

అడ్మిషన్ ప్రక్రియ: అకడమిక్ ప్రతిభ ఆధారంగా అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేస్తారు. వీరికి ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్ నిర్వహిస్తారు. సంస్థ నిర్ణయం మేరకు ఇందులో అర్హత పొందినవారికి సంబంధించి స్టేట్‌మెంట్ ఆఫ్ పర్పస్ పరిశీలన, పోర్ట్‌ఫోలియో అసెస్‌మెంట్, ఇంటర్వ్యూలు నిర్వహించి అడ్మిషన్స్ ఇస్తారు.


- **వెయిటేజీ:** స్టేట్‌మెంట్ ఆఫ్ పర్పస్‌కు 10 మార్కులు, పోర్ట్‌ఫోలియో/అకడమిక్ వర్క్స్‌కు 30 మార్కులు, ఇంటర్వ్యూకి 60 మార్కుల వెయిటేజీ ఉంటుంది.

ముఖ్య సమాచారం

- డిగ్రీ స్థాయిలో ప్రథమ శ్రేణి మార్కులు తప్పనిసరి. చివరి సంవత్సరం చదువుతున్నవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. నాలుగేళ్ల డిగ్రీ అభ్యర్థులు ఆరో సెమిస్టర్ వరకు, మూడేళ్ల డిగ్రీ అభ్యర్థులు నాలుగో సెమిస్టర్ వరకు, అయిదేళ్ల ఇంటిగ్రేటెడ్ డిగ్రీ చదువుతున్నవారు ఎనిమిదో సెమిస్టర్ వరకు, రెండేళ్ల పీజీ అభ్యర్థులు రెండో సెమిస్టర్ వరకు సాధించిన మార్కులు సబ్మిట్ చేయాలి.
- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.2,000; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1,000
- **ఆఫ్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 5
- **అభ్యర్థుల ప్రొవిజనల్ లిస్ట్ విడుదల:** ఏప్రిల్ 16
- **ఎంట్రెన్స్ టెస్ట్, ఇంటర్వ్యూలు:** ఏప్రిల్ 25, 26
- **ఎంపికైన అభ్యర్థుల జాబితా విడుదల:** మే 9
- **మిగిలిన సీట్ల కేటాయింపులు:** మే 15
- **ప్రోగ్రామ్‌లు ప్రారంభం:** ఆగస్టు 5 నుంచి
- **చిరునామా:** రిజిస్ట్రార్, స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్, సర్వే నెం. 4/4, ఐటీఐ రోడ్, విజయవాడ-520008
- **వెబ్‌సైట్:** www.spav.ac.in

సీసీఎంబీలో పీహెచ్‌డీ

హైదరాబాద్-హబ్సిగూడలో సీఎస్ఐఆర్ నిర్వహిస్తున్న సెంటర్ ఫర్ సెల్యులార్ అండ్ మాలిక్యులార్ బయాలజీ (సీసీఎంబీ)- పీహెచ్‌డీ 2024 ఆగస్టు సెషన్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. మోడ్రన్ బయాలజీలో పరిశోధనలు చేయాలనుకొనేవారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చు. ఆన్‌లైన్ టెస్ట్, ఇంటర్వ్యూ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.



విభాగాలు: సెల్ బయాలజీ, మాలిక్యులార్ బయాలజీ, జెనెటిక్స్, జినోమిక్స్, డెవలప్‌మెంటల్ బయాలజీ, ప్లాంట్ మాలిక్యులార్ బయాలజీ, కన్జర్వేషన్ బయాలజీ, ఎకాలజీ, ప్రొటీన్ స్ట్రక్చర్ అండ్ ఫంక్షన్, బయాలజీ ఆఫ్ మాక్రోమాలిక్యూల్స్, బయాలజీ ఆఫ్ ఇన్ఫెక్షన్, ఇమ్యూనాలజీ, ఎపిజెనెటిక్స్, క్రోమాటిన్ బయాలజీ, బయోఇన్ఫర్మాటిక్స్.

అర్హత: సైన్స్ విభాగాల్లో ఏదేని మాస్టర్స్ డిగ్రీ పూర్తి చేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు. జనరల్, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు కనీసం 55 శాతం మార్కులు తప్పనిసరి. దివ్యాంగులు, ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 50 శాతం మార్కులు చాలు. యూజీసీ/సీఎస్ఐఆర్/డీబీటీ/డీఎస్‌టీ/ఐసీఎంఆర్/డీబీటీ-బీఈటీ/ఇన్‌స్పయిర్/ఆర్‌జీఎన్‌ఎఫ్ నుంచి జేఆర్‌ఎఫ్/ఎస్ఆర్‌ఎఫ్ అర్హత పొంది ఉండాలి. పీహెచ్‌డీ పూర్తయ్యే వరకూ ఫెలోషిప్ వ్యాలిడిటీ ఉండాలి.

ఎంపిక: ఆన్‌లైన్ దరఖాస్తులు పరిశీలించి స్ర్కీనింగ్ చేసిన అభ్యర్థులను కంప్యూటర్ బేస్డ్/రిమోట్ ప్రొక్టోర్డ్ ఆన్‌లైన్ టెస్ట్‌కు పిలుస్తారు. ఇందులో అర్హత పొందినవారికి పర్సనల్ ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులకు అడ్మిషన్స్ ఇస్తారు. సీఎస్ఐఆర్/యూజీసీ నెట్ లెక్చరర్‌షిప్ అర్హత మాత్రమే ఉన్న వారిని ఇంటర్వ్యూకి అనుమతించరు.

ముఖ్య సమాచారం

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 31
- **ఆన్‌లైన్ టెస్ట్ తేదీ:** ఏప్రిల్ 22
- **ఇంటర్వ్యూ సెంటర్:** హైదరాబాద్
- **వెబ్‌సైట్:** ccmb.res.in

రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్‌లో ఎస్ఐ, కానిస్టేబుల్స్

రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్(ఆర్‌పీఎఫ్)/రైల్వే ప్రొటెక్షన్ స్పెషల్ ఫోర్స్(ఆర్‌పీఎస్ఎఫ్)లో ఎస్ఐ, కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు నోటిఫికేషన్‌ను విడుదల చేసింది.

ఆర్ఆర్‌బీ రీజియన్లు: అహ్మదాబాద్, అజ్మీర్, బెంగళూరు, భోపాల్, భువనేశ్వర్, బిలాస్‌పూర్, చండీగఢ్, చెన్నై, గువాహటి, జమ్ము అండ్ శ్రీనగర్, కోల్‌కతా, మాల్దా, ముంబై, ముజఫర్‌పూర్, పట్నా, ప్రయాగ్‌రాజ్, రాంచీ, సికింద్రాబాద్, సిలిగురి, తిరువనంతపురం, గోరఖ్‌పూర్.



1. కానిస్టేబుల్: 4,208 పోస్టులు
2. సబ్ ఇన్‌స్పెక్టర్: 452 పోస్టులు

అర్హత: కానిస్టేబుల్ పోస్టులకు పదో తరగతి, ఎస్ఐ ఉద్యోగాలకు డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు నిర్దిష్ట శారీరక ప్రమాణాలు కలిగి ఉండాలి. రీజియన్ల వారీ ఖాళీలు, విద్యార్హత, రాత పరీక్ష, సిలబస్ తదితర పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తారు. సంక్షిప్త ఉద్యోగ ప్రకటనను ఎంప్లాయ్‌మెంట్ న్యూస్(మార్చి 2-8)లో చూడవచ్చు.

వయోపరిమితి: 2024 జూలై 1 నాటికి కానిస్టేబుల్ పోస్టులకు18-28 ఏళ్ల మధ్య; ఎస్ఐ పోస్టులకు 20-28 ఏళ్ల మధ్య ఉండాలి.

ప్రారంభ వేతనం: నెలకు ఎస్ఐ పోస్టులకు రూ.35,400; కానిస్టేబుల్ పోస్టులకు రూ.21,700

ఎంపిక ప్రక్రియ: రాత పరీక్ష(కంప్యూటర్ బేస్డ్ టెస్ట్), ఫిజికల్ ఎఫిషియెన్సీ టెస్ట్, ఫిజికల్ మెజర్‌మెంట్ టెస్ట్, మెడికల్ స్టాండర్డ్ టెస్ట్, సర్టిఫికెట్ వెరిఫికేషన్ తదితరాల ఆధారంగా ఎంపిక చేస్తారు.

దరఖాస్తు ఫీజు: ఎస్సీ, ఎస్టీ, మాజీ సైనికోద్యోగులు, మహిళలు, ట్రాన్స్‌జెండర్, మైనారిటీ, ఈబీసీ అభ్యర్థులకు రూ.250. ఇతరులకు రూ.500.

ఆన్‌లైన్ దరఖాస్తులు ప్రారంభం: ఏప్రిల్ 15

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: మే 14

వెబ్‌సైట్: https://rpf.indianrailways.gov.in/RPF/

ఈఎస్ఐ సంస్థల్లో నర్సింగ్ ఆఫీసర్లు

మొత్తం ఖాళీలు: 1930

కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖకు చెందిన ఎంప్లాయిస్ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్‌లో శాశ్వత ప్రాతిపదికన నర్సింగ్ ఆఫీసర్ల భర్తీకి యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యూపీఎస్సీ) దరఖాస్తులు కోరుతోంది.

పోస్టు: నర్సింగ్ ఆఫీసర్

అర్హతలు: బీఎస్సీ(ఆనర్స్) నర్సింగ్/బీఎస్సీ నర్సింగ్/పోస్ట్ బేసిక్ బీఎస్సీ నర్సింగ్ ఉత్తీర్ణతతో పాటు స్టేట్ నర్సింగ్ కౌన్సిల్‌లో నర్సు లేదా నర్సు, మిడ్‌వైఫ్‌గా రిజిస్టరై ఉండాలి. లేదా డిప్లొమా(జనరల్ నర్సింగ్ మిడ్-వైఫరీ) ఉత్తీర్ణతతో పాటు స్టేట్ నర్సింగ్ కౌన్సిల్‌లో నర్సు లేదా నర్సు, మిడ్‌వైఫ్‌గా రిజిస్టరై ఉండాలి.

వయోపరిమితి: 2024 మార్చి 27 నాటికి అన్‌రిజర్వ్‌డ్/ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 30 ఏళ్లు; ఓబీసీ అభ్యర్థులకు 33 ఏళ్లు; ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు 35 ఏళ్లు; దివ్యాంగ అభ్యర్థులకు 40 సంవత్సరాలు మించకూడదు.

దరఖాస్తు రుసుము: రూ.25. మహిళలు/ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగ అభ్యర్థులకు ఫీజు చెల్లింపు నుంచి మినహాయింపు ఉంటుంది.

ఎంపిక ప్రక్రియ: రాత పరీక్ష, సర్టిఫికెట్ వెరిఫికేషన్, మెడికల్ టెస్ట్ తదితరాల ఆధారంగా ఎంపిక చేస్తారు.

తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు: అనంతపురం, హైదరాబాద్, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం, వరంగల్

దరఖాస్తుకు చివరి తేదీ: మార్చి 27

రిక్రూట్‌మెంట్ టెస్ట్ తేదీ: జూలై 7

వెబ్‌సైట్: https://upsc.gov.in/

జాబ్ కార్నర్

ఈఎస్ఐసీలో సీనియర్ రెసిడెంట్‌లు

ఎంప్లాయిస్ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్, న్యూఢిల్లీ.... తాత్కాలిక ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.

మొత్తం ఖాళీలు: 45

విభాగాలు: హెమటాలజీ, పాథాలజీ, సర్జికల్ అంకాలజీ, రేడియాలజీ, మెడిసిన్, అనస్థీషియా, సర్జరీ, పీడియాట్రిక్స్, పీడియాట్రిక్ సర్జరీ, ఆబ్స్టేట్రిక్స్ అండ్ గైనకాలజీ, బయోకెమిస్ట్రీ, బ్లడ్ బ్యాంక్, ఈఎన్‌టీ, ప్లాస్టిక్ సర్జరీ, మైక్రోబయాలజీ, నెఫ్రాలజీ, స్కిన్, కార్డియాలజీ.

అర్హత: ఏదైనా గుర్తింపు పొందిన యూనివర్సిటీలో ఎంబీబీఎస్, పీజీ డిగ్రీ, డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి.

వయోపరిమితి: 45 సంవత్సరాలు మించరాదు

వేతనం: నెలకు రూ.30,000

ఇంటర్వ్యూ తేదీలు: మార్చి 11, 12

వెబ్‌సైట్: www.esic.gov.in/recruit-ments#

సెంట్రల్ టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్

కేంద్ర ప్రభుత్వం పరిధిలోని పాఠశాలల ఉపాధ్యాయ నియామకాల్లో అర్హతకు ఉద్దేశించిన సెంట్రల్ టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్(సీటెట్) జూలై - 2024 నోటిఫికేషన్ వెలువడింది. ఈ పరీక్షను సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్(సీబీఎస్ఈ) నిర్వహిస్తుంది.

పరీక్ష విధానం: పరీక్షలో రెండు పేపర్లు ఉంటాయి. మొదటి పేపర్ ఒకటి నుంచి ఐదు తరగతులకు బోధించేవారికి, రెండో పేపర్ ఆరు నుంచి తొమ్మిదో తరగతులు బోధించే వారికి నిర్వహిస్తారు. సీటెట్ స్కోరు లైఫ్ లాంగ్ వ్యాలిడిటీ కలిగి ఉంటుంది. ఈ పరీక్షను 20 భాషలలో నిర్వహిస్తారు.

అర్హతలు: ఇంటర్, డిగ్రీ, డీఈఎల్ఈడీ/డీఈడీ(ప్రత్యేక విద్య), బీఈడీ, బీఈడీ(ప్రత్యేక విద్య), బీఈఎల్ఈడీ/బీఎస్సీఈడీ/బీఏఈడీ/బీఎస్సీఈడీ ఉత్తీర్ణులై ఉండాలి.

దరఖాస్తు రుసుము: జనరల్/ఓబీసీ కేటగిరీలకు రూ.1000(పేపర్ 1 లేదా 2 మాత్రమే), రూ.1200(పేపర్ 1 అండ్ 2 రెండూ). ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగులకు రూ.500(పేపర్ 1లేదా 2 మాత్రమే), రూ.600(పేపర్ 1 అండ్ 2 రెండూ).

తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు: గుంటూరు, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం, హైదరాబాద్. వరంగల్.

దరఖాస్తుకు చివరి తేదీ: ఏప్రిల్ 2

ఓఎమ్మార్ ఆధారిత పరీక్ష తేదీ: జూలై 7

వెబ్‌సైట్: https://ctet.nic.in/

ఎన్ఐడీలో టెక్నికల్ అసిస్టెంట్‌లు

అహ్మదాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్... డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

ఖాళీలు: 5

1. డిజైన్ అసిస్టెంట్: 1 పోస్టు
2. టెక్నికల్ అసిస్టెంట్: 2 పోస్టులు
3. సీనియర్ అసిస్టెంట్‌లు: 2 పోస్టులు

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

వయోపరిమితి: డిజైన్ అసిస్టెంట్, టెక్నికల్ అసిస్టెంట్‌లకు 30 ఏళ్లు; సీనియర్ అసిస్టెంట్‌కు 35 ఏళ్లు మించకూడదు.

దరఖాస్తులకు చివరి తేదీ: మార్చి 11

వెబ్‌సైట్: www.nid.edu/home

లిటిల్స్



మీకు తెలుసా?


- తల, ముక్కు, తోక భాగంలో మాత్రమే నల్లగా ఉండి మిగతా అంతా తెల్లగా ఉండే ఈ పక్షిని 'సాక్రెడ్ ఐబిస్' అంటారు. మన దగ్గర ఉండే కొంగ జాతికి చెందిన పక్షి ఇది.
- 68 సెం.మీ పొడవు ఉండే ఈ పక్షి బరువు ఒకటిన్నర కేజీ దాకా ఉంటుంది.
- దక్షిణాఫ్రికా, అంగోలా, బోట్స్‌వానా, బురిండి, కేమెరూన్, సెంట్రల్ ఆఫ్రికా.. లాంటి దేశాల్లో ఇవి ఉంటాయి.
- దక్షిణాఫ్రికా నుంచి జాంబియా వరకూ 1500 కి.మీ. ప్రయాణిస్తాయి. మైగ్రేట్ అవ్వటానికి ఇష్టపడతాయి.
- పచ్చికబయళ్లలో ఉండటానికి ఇష్టపడతాయి. ముఖ్యంగా నీళ్ల ఉండే చోటనే ఉంటాయి. గుంపులుగా ఉంటాయి. ఒక్కో గుంపులో పాతిక పక్షులు ఉంటాయి.
- ఐదు గుడ్ల వరకూ పెడతాయి. పొదిగే కాలం మూడు వారాల నుంచి నాలుగు వారాల వరకూ ఉంటుంది.
- 1817 సంవత్సరంలో దీని ఆనవాళ్ల కనుగొన్నారు. ప్రాంతాన్ని బట్టి ఈ జాతుల రంగుల్లో మార్పు వస్తాయి.
- పురుగులు, చిన్న కప్పలు, చిన్న చేపలను తిని బతుకుతాయి. ఇవి కేవలం నీళ్ల ఉండే ప్రాంతాల్లోని చెట్ల పైకొమ్మల్లో మాత్రమే నివసిస్తాయి.
- మనుషులు, గద్దలతో వీటికి ప్రమాదముంది. గుడ్లు పెట్టే కాలంలో 500 జతల నుంచి 20 వేల జతల వరకూ వీటి గుంపు ఉంటుంది.
- వీటి జీవనకాలం 20 సంవత్సరాలు.



సరైన నీడ ఏది?



7 తేడాలను గుర్తించండి



దారి కనుక్కోండి



		3					4	
	7			3	2		6	
9						2		3
	8			1	4	3		
			9		8			
		9	3	7			2	
1		2						4
	6		1	9			7	
	9					8		

డైలీ సుడోకు - 250

సుడోకు - 249 సమాధానం

3	2	1	6	4	5	9	8	7
4	8	9	2	1	7	3	5	6
7	6	5	8	9	3	1	4	2
2	4	7	1	3	9	5	6	8
5	9	8	4	2	6	7	1	3
6	1	3	7	5	8	4	2	9
9	5	2	3	6	1	8	7	4
8	3	4	5	7	2	6	9	1
1	7	6	9	8	4	2	3	5

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.